

రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ
తెలంగాణ, హైదరాబాదు.






విద్యార్థుల వికాసానికి ప్రభుత్వ కానుక

# సింగిడి -2
# తెలుగు వాచకం
## పదో తరగతి
(ప్రథమ భాష)

J1H6D8




తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రచురణ, హైదరాబాదు


విద్యార్థుల వికాసానికి ప్రభుత్వ కానుక


SCERT, TELANGANA

## క్యూఆర్ (QR) కోడ్‌ను వినియోగించే విధానం

- ఈ పాఠ్య పుస్తకంలో ఇలాంటి క్యూఆర్ కోడ్‌లను పొందుపరిచారు.
- ఈ క్యూఆర్ కోడ్‌లను ఉపయోగించడం ద్వారా మీరు పాఠాలకు చెందిన ఆసక్తికరమైన ఆడియో, వీడియోల ద్వారా అదనపు సమాచారాన్ని మీవద్దగల మొబైల్, ట్యాబ్లెట్ లేదా కంప్యూటర్ల ద్వారా వీక్షించవచ్చు.

| సోపానం | వివరణ |
|---|---|
| **ఎ)** | **క్యూఆర్ కోడ్‌లో అనుసంధానించిన విషయాలను ఆండ్రాయిడ్ మొబైల్ లేదా ట్యాబ్లెట్‌లో వీక్షించుటకు :** |
| 1 | మీ యొక్క మొబైల్ / ట్యాబ్లెట్‌లోని **Play Store** పైన క్లిక్ చేయండి. |
| 2 | సెర్చ్‌బార్‌లో **DIKSHA** ను టైప్ చేయండి. |
| 3 |   తెరపైన ఇలా కనిపిస్తుంది. |
| 4 | **INSTALL** పైన క్లిక్ చేయండి. |
| 5 | విజయవంతంగా INSTALL చేసిన తరవాత యాప్‌ను తెరవడానికి **OPEN** పైన క్లిక్ చేయండి. |
| 6 | **'తెలుగు'**ను ఎంపికచేసుకొని క్లిక్ చేయండి. |
| 7 | **'కొనసాగించడానికి'** క్లిక్ చేయండి. |
| 8 | **విద్యార్థి / ఉపాధ్యాయులు** రెండింటిలో మీకు చెందిన దానిని ఎంపిక చేసుకోండి. |
| 9 | కుడివైపున ఉన్న క్యూఆర్ కోడ్ చిహ్నం C9Y8A6 స్కానర్‌ను క్లిక్ చేయండి. తరువాత మీ పాఠ్యపుస్తకంలో ముద్రించిన క్యూఆర్ కోడ్ C9Y8A6 ను స్కాన్ చేయండి. (లేదా) సెర్చ్ బార్ నందు ( ) **క్యూఆర్ కోడ్** కింద ముద్రించిన కోడ్‌ను టైపు చేయండి. |
| 10 | క్యూఆర్ కోడ్‌లో అనుసంధానించిన విషయాలు కనిపిస్తాయి. |
| 11 | కావలసిన విషయాలను వీక్షించుటకు లింక్‌పై క్లిక్ చేయండి. |
| **బి)** | **క్యూఆర్ కోడ్‌లో అనుసంధానించిన విషయాలను కంప్యూటర్‌లో వీక్షించుటకు -** |
| 1 | **https://diksha.gov.in/telangana** అను లింక్‌ను ఓపెన్ చేయండి. |
| 2 | **Explore DIKSHA-TELANGANA** పైన క్లిక్ చేయండి. |
| 3 | పాఠ్యపుస్తకంలో ఇచ్చిన క్యూఆర్ కోడ్ కింద ఉన్న కోడ్‌ను టైపు చేయండి. |
| 4 | ఈ కోడ్‌కు అనుసంధానించిన విషయాలు కనిపిస్తాయి. |
| 5 | కావలసిన విషయాలను వీక్షించుటకు లింక్‌పై క్లిక్ చేయండి. |




SCERT, TELANGANA

# సింగిడి - 2

## తెలుగు వాచకం (ప్రథమభాష)

## పదో తరగతి

SCERT, TELANGANA



"నా తెలంగాణ కోటి రత్నాల వీణ"

తెలంగాణ ప్రభుత్వ ప్రచురణ, హైదరాబాద్

విద్యవల్ల ఎదగాలి
వినయంతో మెలగాలి

చట్టాలను గౌరవించాలి
హక్కులను పొందాలి

© Government of Telangana, Hyderabad

*First Published 2015*
*New Impressions 2016, 2017, 2018, 2019, 2020, 2021, 2022, 2023*

**All rights reserved**

No part of this publication may be reproduced, stored in a retrieval system, or transmitted, in any form or by any means without the prior permission in writing of the publisher, nor be otherwise circulated in any form of binding or cover other than that in which it is published and without a similar condition including this condition being imposed on the subsequent purchaser.

The copy right holder of this book is the Director of School Education, Hyderabad, Telangana.

This Book has been printed on 90 G.S.M. Maplitho
Title Page 250 G.S.M. White Art Card

**విద్యార్థుల వికాసానికి ప్రభుత్వ కానుక 2023-24**

*Printed in India*
at the Telangana Govt.Text Book Press,
Mint Compound, Hyderabad,
Telangana.

SCERT TELANGANA

# ముందుమాట

2014 జూన్ 2వ తేదీన తెలంగాణరాష్ట్రం ఆవిర్భవించింది. తెలంగాణరాష్ట్రం ఏర్పడిన సందర్భంగా మన రాష్ట్రప్రభుత్వం తెలంగాణ సంస్కృతి, సాహిత్యం, చరిత్రను తెలిపే విధంగా పాఠాలు ఉండాలని నిర్ణయించింది. ఇందుకోసం కవులు, రచయితలు, భాషావేత్తలు, క్షేత్రస్థాయి విషయనిపుణులతో ఒక కమిటీని నియమించింది. కమిటీ సభ్యులు ప్రస్తుతం అమలులో ఉన్న తెలుగు పాఠ్యపుస్తకాలను పరిశీలించి తెలంగాణసాహిత్యం, సంస్కృతి ప్రతిబింబించేలా పాఠ్యపుస్తకాలను రూపొందించారు.

భాషావాచకాల ద్వారా విద్యార్థి తమ స్థానిక సంస్కృతి, సాహిత్య విశేషాలను, చారిత్రక వైభవాలను తెలుసుకోగలగాలి. దాంతోపాటు ఆలోచించడం, విమర్శనాత్మక విశ్లేషణ, స్పష్టమైన భావవ్యక్తీకరణ సామర్థ్యాలు పెంపొందించుకోగలగాలి. నిరంతరం సాహిత్యపఠనం ద్వారా జ్ఞానపరిధిని విస్తృతపరచుకుంటూ ఉన్నత వ్యక్తిత్వాన్ని, విశిష్ట వైఖరులను సంతరించుకోవాలి. దీనికి అనుగుణంగా ఈ పదోతరగతి ప్రథమభాషకు తెలుగువాచకాన్ని రూపొందించారు. దీని ద్వారా పిల్లల్లో అవగాహన చేసుకొని ప్రతిస్పందించే సామర్థ్యాలు, స్వీయరచనా శక్తితోపాటు తెలంగాణా భాషాభిమానం, సామాజిక స్పృహ, మానవతా విలువలు, మానవ సంబంధాలు, త్యాగగుణం, తెలంగాణ వీరుల ప్రాశస్త్యం తెలిపే పాఠ్యాంశాలను ప్రాచీన ఆధునిక, సాహిత్యాల నుండి ఎంపిక చేశారు. తెలంగాణ పల్లె జీవనచిత్రణ, పర్యావరణ విలువలు, తెలంగాణ చారిత్రక కట్టడాల వైశిష్ట్యం, సాంస్కృతిక వైభవం, తెలంగాణీయుల స్ఫూర్తిదాయక సామాజికసేవా దృక్పథం, మానవస్వభావ వైచిత్రి, నైతిక విలువలు, తెలంగాణ ఆవిర్భావ భావోద్వేగాలు, మొదలైన ఇతివృత్తాల ఆధారంగా పాఠ్యాంశాలను ఎంపిక చేశారు. పాఠ్యాంశాలు ప్రాచీన, ఆధునిక పద్యం, కథానిక, ఆత్మకథ, జీవితచరిత్ర, వచనకవిత, సంపాదకీయవ్యాసం, గజల్, ముందుమాట మొదలైన ప్రక్రియల్లో ఉన్నాయి. విస్తార పఠనానికై భారతీయ ఇతిహాసమైన రామాయణాన్ని ఉపవాచకంగా పెట్టారు. ఇది భారతీయ సంస్కృతి, విలువలు పెంపొందించడానికి, ఇతిహాసాలపట్ల అభిరుచి కలిగించడానికి తోడ్పడుతుంది.

ప్రతి పాఠంలో సామర్థ్యాల సాధనకనుగుణంగా **'ఇవి చేయండి'** శీర్షికతో అభ్యాసాలున్నాయి. ఆలోచించడం, స్పందించడం, అభిప్రాయాలు చెప్పడం, బహుకోణాల్లో విశ్లేషించడం, విభిన్న కోణాల్లో ఆలోచించడం, సకారణంగా వివరించడం, అన్వయించడం, సృజనాత్మకంగా, ప్రశంసాత్మకంగా వ్యక్తీకరించడం వీటి స్వభావం. పిల్లలు పాఠ్యపుస్తక పరిధిని దాటి నేర్చుకోవడానికి వీలుగా ప్రాజెక్టుపనుల వంటివి చేర్చారు. ఇవి స్వయం అధ్యయనాన్ని, అదనపు పరామర్శ గ్రంథాలను సంప్రదించడాన్ని ప్రోత్సహించేలా ఉన్నాయి.

ఉపాధ్యాయులు సోపానక్రమం ప్రకారం పాఠాన్ని బోధించడానికి వీలుగా పాఠంలోని విషయాలను అమర్చారు. భాషోపాధ్యాయులు పాఠంలోని విషయాన్ని నేరుగా బోధించకుండా పాఠ్యాంశం ముందున్న అంశాలతో ప్రారంభించాలి. తర్వాత పాఠ్యాంశాన్ని చర్చలు, ప్రతిచర్చల ద్వారా అవగాహన కల్పించాలి. ఆలోచింపజేసే ప్రశ్నలు అడగాలి. అభ్యాసాలపై సాధన చేయించాలి. పాఠ్యాంశంలోని జాతీయాలు, పదబంధాలు, ముఖ్యమైన సందేశాత్మక వాక్యాలు, సంఘటనల గురించి లోతైన చర్చద్వారా అవగాహన, విమర్శనాత్మక దృక్పథాన్ని పెంపొందించాలి. భాషాసామర్థ్యాల సాధనలో పాఠ్యపుస్తకం ఉపాధ్యాయుడికి ఒక సహాయకారి మాత్రమే.

పాఠ్యపుస్తకంలోని భావనలను స్పష్టంగా, నిర్దిష్టంగా, ప్రభావవంతంగా అర్థం చేసుకోవడానికి వీలుగా ఈ పుస్తకాన్ని క్యు.ఆర్. (క్విక్ రెస్పాన్స్) కోడ్‌లతో చేర్చి బలోపేతం చేయడం జరిగింది.

తెలంగాణ రాష్ట్రంలో వచ్చిన తొలి వాచకం ఇది. పాఠ్యపుస్తకాల రూపకల్పనకోసం ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు ఇచ్చి ప్రోత్సహించిన తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి గౌరవనీయులు **శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖరరావు** గారికి, విద్యాశాఖ పూర్వపు మంత్రులు **శ్రీ జి. జగదీశ్ రెడ్డి** గారికి, **శ్రీ కడియం శ్రీహరి** గారికి, ప్రస్తుత విద్యాశాఖా మంత్రి **శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి** గారికి, పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి **శ్రీమతి రంజీవ్ ఆర్. ఆచార్య** గారికి, పాఠశాల విద్యాశాఖ పూర్వపు సంచాలకులు **శ్రీ ఎమ్. జగదీశ్వర్** గారికి, ప్రస్తుత సంచాలకులు **శ్రీ టి.చిరంజీవులు** గారికి, ప్రభుత్వ సలహాదారు **డా॥ కె.వి.రమణాచారి** గారికి ప్రత్యేక ధన్యవాదాలు. ఈ వాచక రూపకల్పనలో పాల్గొన్న కమిటీ సభ్యులు, సంపాదక మండలి సభ్యులు, విషయ నిపుణులు, ఉపాధ్యాయులు, చిత్రకారులకు ధన్యవాదాలు. ఈ వాచకాన్ని మరింత అందంగా ఆకర్షణీయంగా రూపొందించడానికి సాంకేతిక సహకారమందించిన, టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్ బృందం, హైదరాబాద్ వారికి, **శ్రీ రమేష్ ఖడే,** కమ్యునికేషన్ ఆఫీసర్, సిఇటిఇ, టిస్, ముంబయి గార్లకు మరియు రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ వారిచే గుర్తించబడిన డిజైనర్లకు మా ప్రత్యేక ధన్యవాదములు. ఈ వాచకం పిల్లల్లో భాషాభిరుచి, సాహిత్యాభిలాష, భాషాసామర్థ్యాలను పెంపొందించి ఉత్తమ వైఖరులు కల్గిన వ్యక్తులుగా ఎదగడానికి తోడ్పడుతుందని ఆశిస్తున్నాం.

తేది : 05-12-2022
స్థలం : హైదరాబాద్.

**సంచాలకులు**
రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ, తెలంగాణ, హైదరాబాద్.

SCERT TELANGANA

# వందేమాతరం

– బంకించంద్ర ఛటర్జీ

వందేమాతరం, వందేమాతరం
సుజలాం సుఫలాం మలయజ శీతలాం
సస్యశ్యామలాం మాతరం; వందేమాతరం
శుభ్రజ్యోత్స్నా పులకిత యామినీం
ఫుల్ల కుసుమిత ద్రుమదళ శోభినీం
సుహాసినీం సుమధుర భాషిణీం
సుఖదాం వరదాం మాతరం వందేమాతరం.

# జాతీయ గీతం

– రవీంద్రనాథ్ ఠాగూర్

జనగణమన అధినాయక జయహే !
భారత భాగ్య విధాతా !
పంజాబ సింధ్ గుజరాత మరాఠా,
ద్రావిడ ఉత్కళ వంగా !
వింధ్య హిమాచల యమునా గంగా,
ఉచ్ఛల జలధి తరంగా !
తవ శుభనామే జాగే !
తవ శుభ ఆశిష మాగే !
గాహే తవ జయ గాథా !
జనగణ మంగళదాయక జయహే !
భారత భాగ్య విధాతా !
జయహే ! జయహే ! జయహే !
జయ జయ జయ జయహే !

# ప్రతిజ్ఞ

– పైడిమర్రి వేంకట సుబ్బారావు

భారతదేశం నా మాతృభూమి.
భారతీయులందరూ నా సహోదరులు.
నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను.
సుసంపన్నమైన, బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం.
దీనికి అర్హత పొందడానికి సర్వదా నేను కృషి చేస్తాను.
నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్ని గౌరవిస్తాను.
ప్రతివారితోను మర్యాదగా నడుచుకొంటాను.
జంతువులపట్ల దయతో ఉంటాను.
నా దేశంపట్ల, నా ప్రజలపట్ల, సేవానిరతి కలిగి ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను.
వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలం.

SCERT, TELANGANA

# 10వ తరగతి - విషయసూచిక

## పాఠ్యాంశాలు


| క్ర.సం. | పాఠం పేరు | కవి/రచయిత | ఇతివృత్తం | ప్రక్రియ | మాసం | పుట |
|---|---|---|---|---|---|---|
| 1. | దానశీలము | బమ్మెర పోతన | దానగుణం | పురాణం (ప్రాచీన పద్యం) | జూన్ | 2 |
| ★2. | ఎవరి భాష వాళ్ళకు వినసొంపు | డా॥ సామల సదాశివ | భాషాభిమానం | భాషావ్యాసం | జూలై | 13 |
| 3. | వీర తెలంగాణ | డా॥ దాశరథి కృష్ణమాచార్య | తెలంగాణ వీరుల ప్రాశస్త్యం | ఆధునిక పద్యం | జూలై | 26 |
| 4. | కొత్తబాట | డా॥ పాకాల యశోదారెడ్డి | సామాజిక చైతన్యం | కథానిక | ఆగష్టు | 36 |
| ★5. | నగరగీతం | అలిశెట్టి ప్రభాకర్ | సామాజిక స్పృహ | వచన కవిత | ఆగష్టు | 47 |
| 6. | భాగ్యోదయం | కృష్ణస్వామి ముదిరాజ్ | స్ఫూర్తి, సంఘసేవ | జీవిత చరిత్ర | సెప్టెంబరు | 56 |
| 7. | శతక మధురిమ | శతక కవులు | నైతిక, ఆధ్యాత్మిక విలువలు | శతకం | అక్టోబరు | 66 |
| 8. | లక్ష్యసిద్ధి | | తెలంగాణ ఆవిర్భావం | సంపాదకీయ వ్యాసం | నవంబరు | 77 |
| ★9. | జీవనభాష్యం | డా॥ సి.నారాయణ రెడ్డి | మానవీయ విలువలు | గజల్ | నవంబరు | 87 |
| ★10. | గోలకొండ పట్టణము | ఆదిరాజు వీరభద్రరావు | తెలంగాణ సంస్కృతి, వైభవం | చారిత్రక వ్యాసం | డిసెంబరు | 95 |
| 11. | భిక్ష | శ్రీనాథుడు | మానవస్వభావం | కావ్యం (ప్రాచీన పద్యం) | డిసెంబరు | 109 |
| 12. | భూమిక | గూడూరి సీతారాం | పఠనాభిలాష | పీఠిక | జనవరి | 120 |

**ఉపవాచకం : రామాయణం** 132

(జూలై – ఆగష్టు : బాలకాండం, అయోధ్యాకాండం, సెప్టెంబరు – అక్టోబరు : అరణ్యకాండం, కిష్కింధాకాండం, నవంబరు – డిసెంబరు : సుందరకాండం, యుద్ధకాండం.)

**పదవిజ్ఞానం** 166


**గమనిక :** 1. పాఠంలో ❖ పువ్వు గుర్తుగల పద్యాలు కంఠస్థం చేయాలి.
2. విషయసూచికలో ★ గుర్తుగల పాఠాలను కాంపోజిట్ కోర్సువారు చదువాల్సిన అవసరంలేదు.

SCERT TELANGANA

1

# దానశీలము

- బమ్మెర పోతన

K5U2I9

## చదువండి - ఆలోచించి చెప్పండి

కర్ణుని పూజామందిరంలో సూర్యుడు ప్రత్యక్షమై కర్ణునితో ఇట్లా అన్నాడు.

సూర్యుడు : పుత్రా! కర్ణా! బ్రాహ్మణ వేషంలో వచ్చి ఇంద్రుడు నీ కవచకుండలాలను దానంగా అడుగుతాడు. వాటిని దానం చేస్తే నీ ప్రాణానికే ముప్పు వస్తుంది నాయనా. జాగ్రత్త!

కర్ణుడు : తండ్రీ! ఇంద్రుడంతటివాడు రూపం మార్చుకొని "దేహి" అని నాదగ్గరకు వస్తే ఎట్లా కాదంటాను. ఈ శరీరం శాశ్వతం కాదు. ఎటువంటి ఆపద వచ్చినా సరే. నేను కాదనను. నాపై మీకున్న వాత్సల్యానికి సంతోషిస్తా. కాని నన్ను వారించకండి.

## ప్రశ్నలు

*1. సూర్యుడు కర్ణుని దానం చేయకుండా ఆపడానికి గల కారణమేమిటి?*

*2. కర్ణుని మాటలను బట్టి మీకేమర్థమైంది?*

*3. ప్రాణానికి ముప్పని తెలిసినా కర్ణుడు ఎందుకు దానం చేశాడు?*

*4. ఇటువంటి దానవీరులు ఇంకెవరైనా ఉన్నారా? ఎవరు?*

## పాఠం నేపథ్యం / ఉద్దేశం

*విరోచనుని కుమారుడైన బలి అసుర చక్రవర్తి. ప్రహ్లాదుని మనుమడు. ఇతడు తన శక్తిసామర్థ్యాలతో స్వర్గలోకాన్ని ఆక్రమించాడు. ఇతని పరిపాలనలో కొందరు దేవతలు స్వర్గాన్ని వదిలిపోగా మిగిలినవారు విపక్షకు గురైనారు. ఈ విషయాన్ని వారు మహావిష్ణువుతో చెప్పుకోగా తాను వామనునిగా జన్మించి దేవతల కష్టాలు తీరుస్తానని అభయమిచ్చాడు.*

*ఆ తర్వాత కొంతకాలానికి మహావిష్ణువు వామనావతారం ఎత్తినాడు. బలి నర్మదానదీ తీరంలో యాగం చేస్తుండగా వామనుడు వెళ్ళి తనకు మూడడుగుల నేల కావాలని కోరగా తాను ఇస్తానని బలి మాట యిచ్చాడు. రాక్షసగురువైన శుక్రాచార్యుడు వామనుని మాటల్లో ఏదో మోసం ఉందని గ్రహించాడు. బలిచక్రవర్తిని దానం ఇవ్వవద్దని అన్నాడు.*

*ఇచ్చిన మాటకు కట్టుబడే తత్త్వాన్ని, దానం చేయడంలోని గొప్పదనాన్ని తెలియజేయడమే ఈ పాఠం ఉద్దేశం.*

SCERT, TELANGANA

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠ్యభాగం పురాణ ప్రక్రియకు చెందినది. పురాణం అంటే పాతదైననూ కొత్తగా భాసించేది. పురాణాలు 18. వీటిని సంస్కృతంలో వ్యాసుడు రాశాడు. ఇందులో భాగవత పురాణం ఒకటి. భాగవతాన్ని పోతన తెలుగులోకి అనువదించాడు. ప్రస్తుత పాఠ్యభాగం శ్రీమహాభాగవతం అష్టమ స్కంధంలోని 'వామన చరిత్ర' లోనిది.

## కవి పరిచయం



(ఊహాచిత్రం)
క్రీ.శ. 15వ శతాబ్దం

పోతన జనగామ జిల్లా బమ్మెర గ్రామ నివాసి. తల్లి లక్కమాంబ, తండ్రి కేసన. పోతన సహజపండితుడని ప్రసిద్ధి.

మానవమాత్రులైన రాజులకు తనగ్రంథాన్ని అంకితం చెయ్యనని, భగవంతుడిచ్చిన కవితాకళను భగవంతునికే అంకితం చేస్తానని చెప్పి తన భాగవత పురాణాన్ని శ్రీరామచంద్రునికే అంకితం చేశాడు.

శబ్దాలంకారాల సొగసుతో భక్తిరస ప్రధానంగా ఇతని రచన సాగుతుంది. పండిత పామర జనరంజకంగా రాయడం పోతన ప్రత్యేకత. ప్రహ్లాదచరిత్ర, గజేంద్రమోక్షం, రుక్మిణీకల్యాణం మున్నగు ఘట్టాలలోని పద్యాలు ప్రతి తెలుగువాడికి కంఠతా వస్తాయి. పోతన రచనాశైలి, మధురభక్తి తరువాత కవులకు ఒరవడిగా నిల్చాయి. వీరభద్ర విజయం, భోగినీ దండకం, నారాయణ శతకం ఇతని ఇతర రచనలు.

SCERT, TELANGANA

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకొండి.

**ప్రవేశిక**

*ఇచ్చిన మాట తప్పకపోవటం, తాను సంపాదించిన దానిలో శక్తిమేరకు దానం చేయడం, తన యింటికి వచ్చిన అతిథి, అభ్యాగతులను ఆదరించటం అనేవి మానవులకు ఉండవలసిన మహిత గుణాలు.*

*మన పురాణాలలో, చరిత్రలో ఇటువంటి మహనీయుల కథలు ఎన్నెన్నో ఉన్నాయి. వాటిని చదివి మనం స్ఫూర్తి పొందవలసిన అవసరం ఉన్నది.*

*ప్రస్తుత పాఠంలో బలిచక్రవర్తి తాను ఇచ్చినమాటకు కట్టువడి తన గురువు వారించినా హెచ్చరిస్తున్నా 'వామనుని' కోరికమేరకు దానం చేస్తాడు.*

*ఆ అద్భుత సన్నివేశాన్ని పోతన రమణీయశైలిలో ఆస్వాదిద్దాం.*

SCERT, TELANGANA

## I

❖మ. కులమున్ రాజ్యముఁ దేజమున్ నిలుపు మీ కుబ్జుండు విశ్వంభరుం
డలఁతిం బోఁడు త్రివిక్రమస్ఫురణవాఁడై నిండు బ్రహ్మాండముం
గలఁడే మాన్ప నొకండు? నా పలుకు లాకర్ణింపు కర్ణంబులన్
వలదీ దానము గీనముం; బనుపుమా వర్ణిన్ వదాన్యోత్తమా ! 1

వ. అని యిట్లు హితంబు పలుకుచున్న కులాచార్యునకు క్షణమాత్ర నిమీలిత లోచనుండయి యశస్వి యిట్లనియె.

సీ. నిజమానతిచ్చితి నీవు మహాత్మక!
మహిని గృహస్థధర్మంబు నిదియ
యర్థంబుఁ గామంబు యశమును వృత్తియు
నెయ్యది ప్రార్థింప నిత్తు ననియు
నర్థలోభంబున నర్థిఁ బొమ్మనుటెట్లు?
పలికి లేదనుకంటెఁ బాప మెద్ది
'యెట్టి దుష్కర్ముని నే భరించెదఁ గాని
సత్యహీనుని మోవఁజాల' ననుచుఁ
తే. బలుకదే తొల్లి భూదేవి బ్రహ్మతోడ
సమరమున నుండి తిరుగకఁ జచ్చుకంటెఁ
బలికి బొంకక నిజమునఁ బరఁగు కంటెఁ
మానధనులకు భద్రంబు మఱియుఁ గలదె 2


**ఆలోచించండి-చెప్పండి**


- *శుక్రుడు బలిచక్రవర్తితో "వలదీ దానము గీనమున్" అని ఎందుకు హెచ్చరించాడో ఊహించండి.*
- *'మానధనులు' ఎట్లా ఉంటారని మీరు భావిస్తున్నారు?*
- *'కీర్తిని సంపాదించడమే గొప్ప'దని'చెప్పిన బలిచక్రవర్తి మాటలను మీరు ఏ విధంగా సమర్థిస్తారు?*


క. ధాత్రిని హలికునకును సు
క్షేత్రము బీజములు నొకటఁ జేకుఱు భంగిం
జిత్రముగ దాత కీవియుఁ
బాత్రము సమకూరునట్టి భాగ్యము గలదే ! 3

## II

❖శా. కారే రాజులు? రాజ్యముల్ గలుగవే? గర్వోన్నతిం బొందరే?
వారేరీ సిరి మూట గట్టుకొని పోవంజాలిరే? భూమిపైఁ
బేరైనం గలదే? శిబిప్రముఖులుం బ్రీతిన్ యశఃకాములై
యీరే కోర్కులు? వారలన్ మఱచిరే యిక్కాలమున్ భార్గవా! 4

క. ఉడుగని క్రతువుల వ్రతములఁ
బొడగనఁ జననట్టి పొడవు పొడవునఁ గుఱుచై
యడిగెడి నఁట; ననుబోఁటికి
నిడరాదె మహానుభావ ! యిష్టార్థంబుల్ 5

❖మ. నిరయంబైన, నిబంధమైన, ధరణీ నిర్మూలనంబైన, దు
ర్మరణం బైనఁ గులాంతమైన నిజమున్ రానిమ్ము; కానిమ్ము పో;
హరుఁడైనన్, హరియైన, నీరజభవుం డభ్యాగతుండైన నౌఁ;
దిరుగన్ నేరదు నాదు జిహ్వ; వినుమా! ధీవర్య! వేయేటికిన్? 6



### ఆలోచించండి-చెప్పండి

- "తిరుగన్ నేరదు నాదు జిహ్వ" అన్నాడు కవి. దీనిని బట్టి మీకేం తెలిసింది?
- ఎదుటివారు అడిగిన దానిని ఇవ్వడంలో ఎటువంటి తృప్తి ఉంటుంది? మీ అనుభవాలు చెప్పండి?
- 'పొడవు పొడవున గుఱుచై' అని కవి ఎవరిని ఉద్దేశించి, ఎందుకట్లా అని ఉంటాడు?

SCERT TELANGANA

SCERT, TELANGANA

## III

ఆ. బ్రదుకవచ్చుఁగాక బహుబంధనములైన
వచ్చుఁగాక లేమి వచ్చుఁగాక
జీవధనములైనఁ జెడుఁగాక పడుఁగాక
మాట దిరుగలేరు మానధనులు. 7

వ. అయ్యవసరమున

ఆ. దనుజలోకనాథు దయిత వింధ్యావళి
రాజవదన మదమరాళ గమన
వటుని కాళ్లు గడుగ వర హేమఘటమున
జలముఁ దెచ్చె భర్త సన్న యెఱిగి. 8

వ. అయ్యవసరంబునఁ గపటవటునకు నద్దానవేంద్రుం డిట్లనియె.

క. రమ్మా! మాణవకోత్తమ!
లెమ్మా! నీ వాంఛితంబు లే దన కిత్తుం
దెమ్మా! యడుగుల నిటు రా
నిమ్మా! కడుగంగవలయు నేఁటికిఁ దడయన్? 9

క. సురలోక సముద్ధరణము
నిరత శ్రీకరుణ మఖిల నిగమాంతాలం
కరణము భవసంహరణము
హరిచరణము నీటఁ గడిగె నసురోత్తముఁడున్. 10

వ. ఇట్లు ధరణీసుర దక్షిణ చరణ ప్రక్షాళనంబు సేసి వామపాదంబు గడిగి తత్పావన జలంబు శిరంబునం జల్లుకొని వార్చి దేశ కాలాది పరిగణనంబు సేసి.

శా. 'విప్రాయ ప్రకటవ్రతాయ భవతే విష్ణుస్వరూపాయ వే
ద ప్రామాణ్యవిదే త్రిపాదధరణీం దాస్యామి' యంచుం గ్రియా
క్షి ప్రుండై దనుజేశ్వరుండు వడుగుం జేసాఁచి పూజించి 'బ్ర
హ్మ ప్రీత'మ్మని ధారవోసె భువనం బాశ్చర్యముం బొందఁగన్. 11

క. బలి చేసిన దానమునకు
నలినాక్షుఁడు నిఖిలభూత నాయకుఁ డగుటం
గలకల మని దశ దిక్కులు
బళి బళియని పొగడె భూత పంచకమనఘా! 12



**ఆలోచించండి-చెప్పండి**



- 'మాట దిరుగలేరు మానధనులు' అన్న మాటను మీరు సమర్థిస్తారా? ఎందుకు?
- బలిచేసిన దానాన్ని దిక్కులు పొగిడినవని కవి చెప్పిన దానినిబట్టి మీరేమి గ్రహించారు?

## తాత్పర్యాలు

1) దాతల్లో గొప్పవాడా! ఓ బలిచక్రవర్తీ! నీ కులాన్నీ, రాజ్యాన్నీ, పరాక్రమాన్నీ నిలుపుకో. ఈ పొట్టివాడు విష్ణువు. కొంచెం మాత్రమే తీసుకొని పోయేవాడు కాడు. మూడడుగులతో మూడులోకాలను కొలిచే త్రివిక్రమ రూపాన్ని పొందుతాడు. బ్రహ్మాండమంతా నిండిపోతాడు. ఎవరైనా అతడిని ఆపగలరా? నా మాట విను. దానం వద్దు గీనం వద్దు. ఈ బ్రహ్మచారిని (వామనుడిని) పంపించు.

వ. అని ఈ విధంగా తన వంశగురువైన శుక్రాచార్యుడు తన మేలుకోరి చెప్తుతుండగా క్షణకాలం కన్నులు మూసుకొని కీర్తిమంతుడైన బలి ఇట్లన్నాడు.

2) ఓ మహాత్మా! నీవు చెప్పింది నిజమే. లోకంలో గృహస్థుల ధర్మం కూడా ఇదే. అర్థం, కామం, కీర్తి, జీవనాధారం – వీటిలో ఏది అడిగినా ఇస్తానని చెప్పాను. ఇప్పుడు ధనంపై దురాశతో లేదని చెప్పి తిప్పి పంపించలేను. ఇచ్చిన మాట తప్పుటకన్నా పాపం లేదు. పూర్వం భూదేవి "ఎటువంటి చెడ్డపని చేసిన వానినైనా భరిస్తాను కాని ఆడిన మాట తప్పినవానిని మాత్రం మోయలేను" అని బ్రహ్మతో చెప్పింది కదా! యుద్ధంలో వెనుదిరుగకుండా వీరమరణం పొందడమూ మాటకు కట్టుబడి సత్యంతో బ్రతకడమూ మానధనులైనవాళ్ళకు మేలైన మార్గాలు.

3) రైతులకు మంచి నేల, మంచి విత్తనాలు దొరకటం అరుదు. అట్లే దాతకు తగినంత ధనము, దానిని గ్రహించటానికి ఉత్తముడైన వ్యక్తి దొరికే అదృష్టం అరుదే కదా!

4) ఆచార్యా! పూర్వం రాజులు ఉన్నారు. వారికి రాజ్యాలు ఉన్నాయి. వారు ఎంతో అహంకారంతో విర్రవీగారు. కాని వారెవరూ ఈ సంపదలను మూటగట్టుకొని పోలేదు. ప్రపంచంలో వారి పేర్లు కూడా మిగులలేదు. శిబిచక్రవర్తి వంటివారు కీర్తికోసం సంతోషంగా అడిగినవారి కోరికలు తీర్చలేదా? వారిని ఈనాటికీ లోకం మరువలేదు కదా!

5) మహానుభావా! ఎడతెగని యజ్ఞాలు, పుణ్యకార్యాలు ఎన్ని చేసినా విష్ణువును చూడడం సాధ్యంకాదు. అటువంటి గొప్పవాడు చిన్నవానిగా మారి అడుగుతున్నాడు. అతడు కోరిన దానిని ఇవ్వడంకంటే నా వంటి వానికి ఇంకేం కావాలి?

6) ఓ పండితోత్తమా! నాకు నరకం దాపురించినా సరే, బంధనం ప్రాప్తమైనా మంచిదే. ఈ భూమండలం అదృశ్యమైనా, నాకు దుర్మరణం వచ్చినా సరే. నా వంశం అంతా నశించినా సరే. ఏమైనా కానీ, ఏదైనా రానీ! ఎందుకు ఇన్ని మాటలు. వచ్చినవాడు శివుడు, విష్ణువు, బ్రహ్మ ఎవరైనా సరే. నా నాలుక వెనుదిరుగదు. (ఆడిన మాట తప్పను).

7) బాగా బ్రతికినా ఎన్ని కష్టాలకు గురియైనా పేదరికం వచ్చినా ప్రాణానికీ ధనానికీ చేటు వచ్చినా చివరికి మరణమే సంభవించినా సరే, అభిమానధనులు మాట తప్పలేరు.

SCERT, TELANGANA

8) అని ఈ విధంగా బలిచక్రవర్తి మాట్లాడుతుండగా చంద్రబింబం వంటి ముఖమూ మత్తిల్లిన రాజహంస వంటి నడక కలిగిన అతని ఇల్లాలు వింధ్యావళి భర్త యొక్క సైగను గమనించింది. ఆ బ్రహ్మచారి కాళ్ళు కడిగి దానం చేయటానికై శ్రేష్ఠమైన బంగారు కలశంతో నీళ్ళు తెచ్చింది.

వ॥ అప్పుడు వామనునితో బలి చక్రవర్తి ఇట్లా అన్నాడు.

9) ఓ ఉత్తమ బ్రహ్మచారీ! లేవయ్యా! ఇటు రావయ్యా! నీవు అడిగింది లేదనకుండా ఇస్తా. నీ పాదాలు కడుగనివ్వు. ఇంకా ఆలస్యం దేనికి?

10) వామనుడైన విష్ణువు కుడి పాదాన్ని బలి చక్రవర్తి కడిగాడు. ఆ పాదం దేవతలను కష్టాలనుండి కాపాడేది. కలకాలమూ మేలు కలిగించేది. అన్ని ఉపనిషత్తులకూ అలంకారమైంది. భవ బంధాలను పోగొట్టి మోక్షాన్ని సమకూర్చేది. అదేవిధంగా ఆ చక్రవర్తి వామనుని ఎడమ పాదాన్ని కూడా కడిగాడు.

వ॥ పవిత్రమైన ఆ జలాలను నెత్తిపై చల్లుకున్నాడు. ఆచమనం చేశాడు. దేశ, కాల పూర్వకమైన 'సంకల్పాన్ని' చెప్పాడు.

11) బలిచక్రవర్తి చేతులు చాచి వామనుని పూజించాడు. "బ్రాహ్మణుడవూ ప్రసిద్ధమైన వ్రతము కలవాడవూ విష్ణు స్వరూపుడవూ వేద ప్రమాణంచే తెలుసుకోదగినవాడవయిన నీకు మూడడుగుల నేల దానం చేస్తున్నా" నని పలికి "పరమాత్మునకు ప్రీతి కలుగుగాక" అంటూ వెనువెంటనే చేతిలో నీటిని ధారవోశాడు. అది చూసి లోకం ఆశ్చర్యపడింది.

12) ఓ పరీక్షిన్మహారాజా! అన్ని భూతాలకూ విష్ణువు అధిపతి. ఆయనకు బలిచక్రవర్తి దానమియ్యగానే పది దిక్కులూ, పంచభూతాలూ "బళి బళి" అని పొగిడాయి.

N4Z9P8

## ఇవి చేయండి

### I అవగాహన - ప్రతిస్పందన

1. **దానాలన్నీ వేటికవే గొప్పవి. అయితే నేటి కాలంలో రక్తదానం, మరణానంతరం అవయవదానం వంటివి చేస్తున్నారు కదా! వాటి యొక్క ప్రాధాన్యాన్ని చర్చించండి.**

2. **పువ్వు గుర్తుగల పద్యాలను భావస్ఫోరకంగా చదువండి.**

3. **ఒకటో పద్యానికి ఇక్కడ ప్రతిపదార్థం ఉంది. ఇదే విధంగా నాలుగు, ఆరు సంఖ్యగల పద్యాలకు ప్రతిపదార్థాలు రాయండి.**

| | | |
|---|---|---|
| వదాన్య + ఉత్తమా! | = | దాతల్లో శ్రేష్ఠుడా! (ఓ బలిచక్రవర్తీ!) |
| కులమున్ | = | (మీ) వంశాన్ని |

SCERT TELANGANA

| | | |
|---|---|---|
| రాజ్యమున్ | = | (మీ) రాజ్యాన్ని |
| తేజమున్ | = | తేజస్సును |
| నిలుపుము | = | కాపాడుము. |
| ఈ కుబ్జుండు | = | ఈ పొట్టివాడు (వామనుడు) |
| విశ్వంభరుండు | = | విశ్వమును భరింపగల్గు వాడు (విష్ణుమూర్తే) |
| అలంతిన్ + పోడు | = | ఇంత తక్కువతో పోడు. |
| త్రివిక్రమ స్ఫురణవాఁడు + ఐ | = | త్రివిక్రముడంతటి వాడై (మూడు లోకములను ఆక్రమించగలవాడై) |
| బ్రహ్మాండమున్ | = | ఈ బ్రహ్మాండం అంతటినీ |
| నిండున్ | = | వ్యాపిస్తాడు. |
| ఒకండు | = | మరొకడు |
| మాన్పన్ + కలడే | = | తప్పింపగలుగుతాడా! |
| నా | = | నాయొక్క |
| పలుకులు | = | మాటలు |
| కర్ణంబులన్ | = | చెవులతో |
| ఆకర్ణింపు | = | విను |
| దానము గీనమున్ | = | దానం గీనం వంటివి |
| వలదు | = | వద్దు |
| వర్ణిన్ | = | (ఈ) బ్రహ్మచారిని |
| పనుపుమా! | = | పంపించవయ్యా! |

## II వ్యక్తీకరణ - సృజనాత్మకత

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) 'ఈ కుబ్జుండు అలంతింబోడు' అని శుక్రాచార్యుడు చెప్పడంలో అతని ఉద్దేశమేమై ఉంటుంది? దానితో మీరు ఏకీభవిస్తారా?

ఆ) హాలికునికి కావలసిన వసతి సౌకర్యాలు ఏవిధంగా ఉంటే అతడు తృప్తి జెందుతాడు?

ఇ) 'సిరి మూట గట్టుకొని పోవం జాలిరే'? అనడంలో బలిచక్రవర్తి ఆంతర్యమేమై ఉంటుంది?

ఈ) 'ఆడినమాట తప్పగూడదు' - ఎందుకు?

SCERT, TELANGANA

2. **కింది ప్రశ్నలకు పది వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) నేటి సమాజానికి దానగుణంగల వ్యక్తుల అవసరమేమిటో వివరించండి.

( లేదా )

ఆ) పాఠ్యభాగ సారాంశాన్ని సొంతమాటల్లో రాయండి.

3. **కింది అంశాన్ని గురించి సృజనాత్మకంగా ప్రశంసిస్తూ రాయండి.**

అ) ఆడినమాట తప్పకపోవడం, దానగుణం కలిగి ఉండడం అనే విషయాలపై నినాదాలు, సూక్తులు రాయండి.

## III భాషాంశాలు

### పదజాలం

1. **కింది పదాలను ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి.**

అ) పలికి లేదనుట　　ఆ) కులుచగుట　　ఇ) చేతులొగ్గు

2. **కింది పదాలకు వ్యుత్పత్త్యర్థాలు రాయండి.**

అ) నీరజభవుడు　　ఆ) త్రివిక్రముడు

3. **కింది వాక్యాలలో గీతలు గీసిన పదానికి సరిపోయే అర్థాన్నిచ్చే మరిన్ని పదాలు రాయండి.**

అ) జలములతో నిండిన చెఱువులు మిక్కిలి హాయినీ, ఆనందాన్నీ కలిగిస్తాయి.

____________ ____________ ____________

ఆ) జీవచ్ఛవం కావటంకన్నా యశఃకాయుడు కావడం మిన్న.

____________ ____________ ____________

4. **కిందివాటిలో ప్రకృతి పదాలకు వికృతి పదాలు, వికృతి పదాలకు ప్రకృతి పదాలు రాయండి.**

అ) సిరి　　ఆ) విష్ణువు

ఇ) ధర్మము　　ఈ) బ్రహ్మ

5. **కింది పదాలకు నానార్థాలు రాయండి.**

అ) కులము　　ఆ) క్షేత్రము

ఇ) హరి　　ఈ) చిత్రము

SCERT, TELANGANA

## వ్యాకరణాంశాలు

**1. కింది వాక్యాలలో సంధి పదాలను గుర్తించి, వాటిని విడదీసి సంధిపేరు రాయండి.**

ఉదా : రమణి నాట్యాన్ని అత్యద్భుతంగా ప్రదర్శించింది.

అత్యద్భుతం = అతి + అద్భుతం = యణాదేశసంధి

అ) గర్వోన్నతి వల్ల ఆత్మీయులు దూరం అవుతారు.

__________ + __________ = __________ = __________

ఆ) అభ్యాగతులకు దానం చేయడం మంచిది.

__________ + __________ = __________ = __________

ఇ) రంతిదేవుడు వదాన్యోత్తముడు.

__________ + __________ = __________ = __________

ఈ) అణ్వాయుధాలు మానవులకు హాని కలిగిస్తాయి.

__________ + __________ = __________ = __________

**2. కింది సమాస పదాలకు విగ్రహవాక్యాలు రాసి సమాసాలు గుర్తించండి.**

అ) జీవధనములు = ________________, __________

ఆ) మూడడుగులు = ________________, __________

ఇ) దశదిక్కులు = ________________, __________

ఈ) భూతప్రేతములు = ________________, __________

**3. కింది పద్య పాదాలను గణవిభజన చేసి, ఏ పద్యాలకు సంబంధించినవో నిర్ణయించండి. లక్షణాలను రాయండి.**

అ) తెలగాణమ్మున గడ్డిపోచయును సంధించెన్ కృపాణమ్ము! రా

ఆ) అనయము దోషమే పరులయందు కనుంగొని పల్కునట్టి యా

### త్రిక సంధి

*** కింది పదాలను గమనించండి.**

అ) అచ్చోటు → ఆ + చోటు

ఆ) ఇవ్విధము → ఈ + విధము

ఇ) ఎక్కాలము → ఏ + కాలము

పై పదాలలో పూర్వపదాల్లో ఆ, ఈ, ఏ లు ఉన్నాయి.

ఇవి సర్వనామాలు.

ఈ త్రికముమీద ఉన్న అసంయుక్త హల్లు ద్విత్వంగా మారుతుంది.

**ఆ, ఈ, ఏ లను 'త్రికం' అంటారు.**

SCERT TELANGANA

ఆ + చోటు → ఆ + చ్చోటు;

ఈ + విధము → ఈ + వ్విధము;

ఏ + కాలము → ఏ + క్కాలము

ఇలా ద్విత్వం (ద్విరుక్తం)పైన ఉన్న దీర్ఘాచ్చు హ్రస్వంగా మారుతుంది.

ఆ + చ్చోటు → అచ్చోటు;

ఈ + వ్విధము → ఇవ్విధము;

ఏ + క్కాలము → ఎక్కాలము

**త్రికం మీది అసంయుక్త హల్లునకు ద్విత్వం బహుళమౌతుంది.**

**బహుళం : ఒక వ్యాకరణ కార్యం నిత్యంగారావడం, రాకపోవడం, వికల్పంగారావడం, అన్యకార్యం రావడం - ఇట్లా నాలుగు విధాలుగా జరిగితే 'బహుళం' అంటారు.**

**ద్విరుక్తమైన హల్లు పరమైనప్పుడు ఆచ్ఛికమైన దీర్ఘం హ్రస్వమౌతుంది.**

**ఆచ్ఛికం : అచ్చ తెలుగు పదం**

## ప్రాజెక్టు పని

- ఆయా సందర్భాలలో వివిధ మతాలవారు చేసే దానధర్మాలను తెలుసుకొండి. పట్టిక రాయండి. నివేదిక రాసి ప్రదర్శించండి.

| మతం | సందర్భం | దానం |
|---|---|---|
| | | |

**సూక్తి**

**తన ఆకలిని సహించుకునే తపోధనుడి శక్తికన్నా,**
**ఇతరుల ఆకలి తీర్చే దానశీలి శక్తి మిన్న!**

SCERT, TELANGANA

# 2 ఎవరి భాష వాళ్ళకు వినసొంపు

– డా॥ సామల సదాశివ

P6K2Z2

## చదువండి – ఆలోచించి చెప్పండి

*తెలంగాణ భాషంతా 'తౌరక్యాంధ్ర'మని ఎవడో అన్నడు. అంత అగ్వకున్నదా తెలంగాణభాష? ఇక సహించవద్దు. అందుకనే నేను గిట్లనే మాట్లాడ్త, గిట్లనేరాస్త అని జిద్దుకు రాయాలె. జిద్దేంది అసలు మన యాసల్నే మన బతుకున్నది. నీ భాషల్నే నీ బతుకున్నది. నీ యాసల్నే నీ సంస్కృతున్నది. ఆ యాసలున్న పలుకుబళ్ళల్లనే తెలంగాణ జీవితం ఉన్నది. కమస్కం నీ భాషల్నన్న నువ్వు రాసే ధైర్నం జేయి. మనం పోగొట్టుకుంటున్న మన బతుకును బతికించుకోవాలె. దానికి, బాస చాన ముఖ్యమయింది. ఎవని యాసల, ఎవని భాషల వాడు రాయాలె. తెలుస్తదా అన్నది లేనే లేదు. మన కవులను, రచయితలను మనం గుర్తించి గౌరవించుకోవాలె. ఇట్లరాస్తే అవతలోనికి తెలుస్తదా అని ముందర్నే మనమనుకునుడు, మనను మనం తక్కువ చేసుకున్నట్లె. ఈ బానిస భావన పోవాలె. నేనెన్నోసార్లు చెప్పిన. భాష రెండు తీర్లు – ఒకటి బడిపలుకుల భాష, రెండోది పలుకుబడుల భాష. పలుకుబడుల భాషగావాలె.*

**– కాళోజీ నారాయణరావు**

## ప్రశ్నలు

*1. పై పేరాలోని మాటలు ఎవరన్నారు?*

*2. ఇట్లా ఎందుకు అని ఉంటాడు?*

*3. ఎవరి భాషలో వాళ్ళు మాట్లాడడం, రాయడం అంటే ఏమిటి?*

*4. ఎవరి భాష వాళ్ళకు ఎట్లా అనిపిస్తుంది?*

## పాఠం ఉద్దేశం

*ఒక భాషలోని నుడికారపుసొంపు, పలుకుబడులు, జాతీయాలవల్ల భాష ఎంతో పరిపూర్ణంగా, సౌందర్యవంతంగా విలసిల్లుతుందో చెబుతూ, ఇతర భాషల్లో గొప్పతనాన్ని కూడా బేరీజువేస్తూ తెలుగు భాష గొప్పతనాన్ని, ప్రాంతీయ భాషలోని సొగసును తెలియజేయడమే ఈ పాఠం ప్రధానోద్దేశం.*

SCERT, TELANGANA

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం వ్యాసప్రక్రియకు చెందినది. ఏదైనా ఒక అంశాన్ని గురించి సంగ్రహంగా, ఆకట్టుకునేటట్లు వివరించేది వ్యాసం. సూటిగా, స్పష్టంగా, నిర్దిష్టంగా, సులభంగా అర్థమయ్యే విధంగా ఉండటం వ్యాసం లక్షణం.

ప్రస్తుత పాఠ్యభాగం డా॥ సామల సదాశివ తన స్వీయ అనుభూతులతో రాసిన 'యాది' అనే వ్యాస సంపుటిలోనిది.

## రచయిత పరిచయం



**11-05-1928**
**07-08-2012**

డా॥ సామల సదాశివ కుంరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో భాగమైన దహెగామ్ మండలం తెనుగుపల్లెలో జన్మించాడు. సంస్కృతం, హిందీ, ఆంగ్లం, ఉర్దూ, ఫార్సీ, మరాఠీ భాషల్లో ఈయన పండితుడు. ఉర్దూ, ఫార్సీ, హిందీ, మరాఠీ కవుల రచయితల సాహిత్యాన్ని ఈయన తెలుగులోకి అనువాదం చేశాడు.

ఉర్దూ సాహిత్య చరిత్ర, అమ్జద్‌రుబాయీలు, మలయమారుతాలు, యాది, సంగీత శిఖరాలు మొదలైనవి ఇతని రచనలు. 'అమ్జద్ రుబాయీలు' అనువాదానికి *1964*లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే ఉత్తమ అనువాద రచనా పురస్కారం, 'స్వరలయలు' గ్రంథానికి *2011*లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. కాకతీయ, తెలుగు విశ్వవిద్యాలయాలు గౌరవడాక్టరేట్‌తో సత్కరించాయి. సదాశివను హిందుస్థానీ – కర్ణాటక సంగీతానికి సాంస్కృతిక వారధిగా విద్వాంసులు గుర్తించారు. సహృదయ విమర్శకుడైన ఇతని రచనల్లో భాష సహజ సుందరంగా, సరళంగా ముచ్చట్ల రూపంలో మనసుకు హత్తుకు పోయేటట్లు ఉంటుంది.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకొండి.

SCERT, TELANGANA

**ప్రవేశిక**

*సంస్కృతాంధ్ర భాషల్లో, కావ్యవ్యాకరణ శాస్త్రాల్లో ఉద్దండ పండితుడు; 'ఆంధ్రబిల్హణ' బిరుదాంచితుడూ అయిన కప్పగంతుల లక్ష్మణ శాస్త్రి – "వారీ! రామచంద్రా ! ఇగపటు" అన్నాడు.*

*గుడిపూజారి – "మొదలు మీ కండ్లకు నీళ్ళు పెట్టుకోండి" అని ఆశ్చర్యపరచాడు.*

*"మసీదు మెట్లమీద కూర్చొని ఫకీర్లు, బిచ్చగాళ్ళు, బిచ్చగత్తెలు మాట్లాడుకునే మాటలు శ్రద్ధగా విని ప్రజల పలుకుబడిని, జాతీయాలను నేర్చుకున్నాను" అన్నాడు భేషజం లేకుండా ప్రముఖ కవి మీర్ తఖీమీర్.*

*ఈ అనుభవాలన్నీ ప్రముఖ సాహితీవేత్త సామల సదాశివ 'యాది' లోనివి. ఇటువంటి మరెన్నో ఆశ్చర్యకర సంఘటనల గురించి తెలుసుకోవాలంటే ఈ పాఠం చదువవలసిందే!*


SCERT, TELANGANA

## I

"తాతా ! ఇగపటు నీ పాను, జర్దా డబ్బీ" అని నా నాలుగేళ్ల మనుమరాలు లావణ్య నా చేతికిచ్చింది. ఆమె కంటే రెండేళ్లు పెద్ద మనుమరాలు కావ్య సెలవుల్లో అమ్మమ్మ గారింట వున్నది. హైదరాబాద్‌లో వుండే నా ఇద్దరు మనుమరాళ్లు హిందీ మాట్లాడతారు. వాళ్లకు తెలుగురాదు. అంటే కొన్ని తెలుగు మాటలు హిందీలోంచి అనువదించుకొని మాట్లాడతారు గాని తెలుగువాళ్ల పలుకుబడి, నుడికారము వాళ్లకు తెలియదు. నాకవసరమైన వస్తువులన్నీ తెచ్చి ఇచ్చే లావణ్యే నాకిపుడు తోడు. నాలుగేళ్లు పూర్తిగా నిండని లావణ్య "ఇగపటు" అనగానే ఆమెకు ఈ ప్రాంతపు తీయని తెలుగు పట్టువడ్డందుకు అబ్బురపడ్డాను. ఆనందించాను. "తాతగారండీ! ఇదిగోనండీ మీ పాను" అన్నా మంచి తెలుగే. అయితే ఏ ప్రాంతపు వాళ్ల తెలుగు ఆ ప్రాంతపు వాళ్లకు ఇంకా మంచిగా వుంటుంది. కొన్నాళ్ల క్రిందటి ఒక ముచ్చట యాదికి వచ్చింది.

ప్రాకృత, సంస్కృత, ఆంధ్రభాషల్లో పండితులైన తిరుమల రామచంద్రగారు కొంతకాలం ఆంధ్రప్రభ వారపత్రికలో చివరిపేజీ రాసేవారు. దానిపేరు హైదరాబాద్ నోట్‌బుక్. ఏ పత్రికకయినా చివరి పేజీయే అందం. కరంజియా నిర్వహించే బ్లిట్జ్ పత్రికలో కె.కె.అబ్బాస్ రాసే చివరిపేజీ కోసమే కొందరాపత్రికను కొనేవాళ్లని ఆ తరం వాళ్లకు తెలుసు. ఒకవారం హైదరాబాదు నోటుబుక్కులో తమ బాల్యమిత్రులైన కప్పగంతుల లక్ష్మణశాస్త్రి గారిని స్మరించుకున్నారు. శాస్త్రిగారు తిరుపతికి వెళ్లివచ్చినారట. అక్కడ నుంచి తెచ్చిన ఒక లడ్డూను తమ మిత్రులైన రామచంద్ర గారికిచ్చినారట. ఇస్తూ వారన్నమాటను వారి భాషలోనే రాసినారు రామచంద్రగారు. అదే మొదటి వాక్యం. "వారీ రామచంద్రా! ఇగపటు తిరుపతి లడ్డూ." మా లావణ్య వాక్యం వినగానే రామచంద్రగారు రాసిన వాక్యం యాదికి తగలటం సహజమే. "వారీ రామచంద్రా! ఇగపటు...." అన్న కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగారు సంస్కృతాంధ్ర భాషల్లో, కావ్య వ్యాకరణ శాస్త్రాల్లో ఉద్దండ పండితులు. సంస్కృతంలో బిల్హణ మహాకవి రాసిన విక్రమాంకదేవ చరిత్రమనే ప్రౌఢకావ్యాన్ని తెలుగులో ఇంకా ప్రౌఢంగా అనువదించినారు.

అది చాలా పెద్ద పుస్తకం. దాన్ని వారు తమ జీవిత కాలంలో మొత్తం అచ్చువేసినట్లు లేరు. అక్కడక్కడ కొన్ని అచ్చయిన పద్యాలు కనిపిస్తాయి. బిల్హణ మహాకవిదే అయిన కర్ణసుందరి అనే నాటకాన్ని అనువదించి ప్రచురించుకున్నారు. వారి విక్రమాంకదేవ చరిత్ర అచ్చుకాకున్నా రాత ప్రతి మీదనే చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు మొదలుకొని ఆనాటి మహాపండితుల ప్రశంసాపూర్వకాలయిన అభిప్రాయాలు నేను చదివినాను. వారు ఆంధ్ర బిల్హణ బిరుదాంచితులు. నేను వారి దగ్గర శిష్యరికం చేయలేదు కాని ఒక్కొక్కప్పుడు వారి సన్నిధానంలో కూర్చుండి, తరచుగా జాబులు రాస్తూ వారి ద్వారా అనేక సాహిత్య విషయాలు తెలుసుకున్నాను. కాబట్టి వారు నా గురుస్థానీయులు. అంతటివారు 'వారీ రామచంద్రా!' అని సంబోధించటం 'ఇగపటు' అనటం వింతగా అనిపిస్తుంది కదా! అది వారికి పసందైన ప్రాంతీయ భాష. ఇక్కడొక చిన్న ముచ్చట యాది చేసుకుంటున్నాను. ఈ నడుమ వ్యాస పూర్ణిమ సందర్భాన బాసర సరస్వతీ క్షేత్రంలో ఎందరో వ్యాసవాఙ్మయం మీద అధికారమున్న పండితులు, పౌరాణికులు ప్రసంగించారు. ఒకనాటి వ్యాసభారతం మీది ప్రసంగం ఉస్మానియా యూనివర్సిటీ నుంచి సంస్కృతం ప్రొఫెసర్‌గా ఉద్యోగ విరమణ చేసి విశ్రాంత జీవితం గడుపుతున్న కె.కమలగారు చేసినారు. ఆమెను చూస్తూ వుంటే, వాగ్ధాటి వింటూ వుంటే ఎవరో యాదికి వచ్చినారు. మధ్యాహ్న భోజన సమయంలో ఆమెను పరిచయం చేసుకున్నాను. ఆమె కప్పగంతుల లక్ష్మణశాస్త్రి గారి కుమార్తె. మా గురు పుత్రిక, నమస్కరించినాను. లక్ష్మణశాస్త్రి గారు మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తి సంస్థానానికి చెందినవారు.




SCERT, TELANGANA

**ఆలోచించండి-చెప్పండి**

- "ఏ ప్రాంతపు వాళ్ల తెలుగు ఆ ప్రాంతపు వాళ్లకు ఇంకా మంచిగా వుంటుంది." సమర్థించండి.
- రచయిత కొందరు పండితులను గురుస్థానీయులని చెప్పాడు. గురువులనగానే వాళ్ళలో ఏయే ప్రత్యేకతలుండాలని మీరు ఆశిస్తున్నారో తెలుపండి.
- "పసందైన ప్రాంతీయ భాష" – దీనిని ఎట్లా అర్థం చేసుకున్నారో వివరించండి.

నిజాం కాలంలో సమాచార, పౌర సంబంధాల శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉద్యోగంలో చేరి, చివరికి స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆఫీసులో డిప్యూటీ డైరెక్టర్ ఫర్ ఓరియంటల్ లాంగ్వేజెస్ పదవిలో ఉద్యోగ విరమణ చేసినారు.

## II

మహబూబ్‌నగర్ వాళ్ల భాష తెలుగుతనం కలిగి వుంటుంది. సురవరం ప్రతాపరెడ్డి గారిదికూడా మహబూబ్‌నగర్ జిల్లానే. వారి రాతలోనూ, మాటలోనూ మహబూబ్‌నగర్ జిల్లా ప్రాంతీయత కనిపించేది. రెడ్డిగారి స్వగ్రామం నీళ్లులేని ఇటిక్యాలపాడు. ఒకప్పుడు నిజాం రాజ్యంలోని రాయచూర్ జిల్లాకు చెందినదే. భాషాప్రయుక్త రాష్ట్రాలేర్పడినప్పుడు రాయచూర్ జిల్లాలో కొంతభాగం కర్ణాటకలో చేరిపోయింది. కొంతభాగం మహబూబ్‌నగర్ జిల్లాలో కలిసిపోయింది. ఇటిక్యాలపాడు, అలంపూర్ నేడు మహబూబ్‌నగర్‌లో వున్నా ఒకప్పుడు రాయచూర్ జిల్లాలోనివే.. అలంపూర్ బ్రహ్మేశ్వరాలయాన్ని పునరుద్ధరించే కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్న గడియారం రామకృష్ణ శర్మగారు మంచి పండితులు. పరిశోధకులు, పత్రికా నిర్వాహకులు. హైదరాబాదులో ఆంధ్ర సారస్వత పరిషత్తు యేర్పడటానికి కారకులైన కొందరు ముఖ్యుల్లో గడియారం వారొకరు. వారూ నాకు అనేక విషయాలు తెలియజేసినారు కాబట్టి నాకు గురుస్థానీయులే.

నల్గొండ జిల్లా తెలుగుగూడా సొంపయినదే. మహబూబ్‌నగర్, నల్గొండజిల్లాలకు చెందిన ఎందరో కవులు, కథకులు, పత్రికా విలేకరులు హైదరాబాదులో వున్నారు. యాభైఏళ్ల కిందటివరకు నల్గొండలోని ఏదో ఆశ్రమంలో, అంబటిపూడి వెంకటరత్నం గారనే కవి వుండేవారు. 'వత్సలుడు' మొదలైన రమ్యమైన కావ్యాలు ఎన్నో రాసినారు వారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్మాతల్లో కొందరు వారి శిష్యులు. పరిషత్తు నిర్వహించే పరీక్షల్లో అంబటిపూడి వారి ఏదో కావ్యం, కప్పగంతుల వారి సంక్షిప్త వ్యాకరణం సిలబసులో వుండేవి. నేను వారి గ్రంథాలు చదివినాను గాని వారి పరిచయం పొందలేదు. వారు కూడా వేలూరి వారి శిష్యులే. వేలూరి వారి ఏకలవ్య శిష్యున్నయి నేను ఏమి నేర్చుకున్నానో (కొండూరి వీర రాఘవాచార్యులు కూడ వేలూరి వారి ఏకలవ్య శిష్యులే) ఇప్పుడంతగా గుర్తులేదు గాని, ఇదిగో, ఈ మాత్రం రాయగలుగుతున్నాను.

**ఆలోచించండి-చెప్పండి**

- "వారి రాతలోను, మాటలోను ప్రాంతీయత కనిపించేది" దీని గురించి చర్చించండి.
- 'ఏకలవ్యశిష్యు'డనే పదంలోని అంతరార్థాన్ని వివరించండి.
- "పలుకుబడి, నుడికారం, జాతీయాలు ఒక భాషకు అలంకారాలవంటివి" ఈ అభిప్రాయాన్ని సమర్థిస్తూ మాట్లాడండి.

తెలుగులోను, ఉర్దూలోను ఎందరెందరి దగ్గర ఏమేమి నేర్చుకున్నానో అదంతా రాయాలంటే ఒక పుస్తకమవుతుంది. ఇక్కడ నేను రాస్తున్నది ప్రాంతీయ భాష పలుకుబడి గురించి. పలుకుబడి, నుడికారం, జాతీయాలు అనే వాటికి ఉర్దూలో చాలా ప్రాముఖ్యం వున్నది. వాటిని రోజ్‌మర్రా, మొహావిరా అంటారు. ఉర్దూ మొహావిరాల గురించి తర్వాత రాస్తాను. అది రాయందే ఈ ముచ్చట్లు ముగియవు. వరంగల్లు తెలుగును టక్సాలీ తెలుగు అనవచ్చు. ఢిల్లీ ఉర్దూను టక్సాలీ ఉర్దూ అంటారు. టక్సాలా అంటే టంకసాల. టంకసాలలో తయారయే నాణేలకే విలువ. ఇతరులెవరైనా తయారుచేస్తే అవి నకిలీ నాణేలు. అవి చెలామణిలో లేవు. పైగా ప్రభుత్వం జప్తు చేస్తుంది.

SCERT TELANGANA

# III

## ఆడవాళ్లనోట అసలైన భాష

మా వూరిలో పూజలు చేయించే మరాఠీ పురోహితుడు "మొదలు మీ కండ్లకు నీళ్లు పెట్టుకోండి" అంటాడు. "అయ్యా! అట్లనవద్దు. శుభమా అంటూ పూజ చేస్తుంటే కళ్లకు నీళ్లు పెట్టుకోవటమేమిటి? ఈ సందర్భాన మేం అర్థం చేసుకుంటాంగాని ఇంకో సందర్భంలో దీని అర్థం వేరే అవుతుంది. తెలుగులో ఎట్లా అనాలో తెలియని మీరు ఇటువంటి తెలుగులో ఎందుకు చెప్తారు? మాకూ మరాఠీ వచ్చుకదా మరాఠీలో చెప్పండి" అంటాను. కాని అతడు వినడు. మధ్యలో 'కు' షష్ఠి చేరుస్తాడు. అది కొంతనయమే. "కళ్లనీళ్లు పెట్టుకోండి" అనడు. ఇది టంకసాల బయట తయారయిన నకిలీ నాణెం. వరంగల్లులో కూరగాయలమ్మే స్త్రీల మాటల్లోనూ ఎక్కడో ఒక అచ్చమయిన తెలుగు నుడి వినిపిస్తుంది. ఏ ప్రాంతంలోనైనా అసలైన భాష ఆడవాళ్ల నోటనే వినగలం. ఉర్దూ మాట్లాడే ముస్లిమ్ స్త్రీలు, ఇల్లు దాటి వెళ్లనివాళ్లు – రాజమహల్లలో వుండే బేగముల భాష శుద్ధమైందని అప్పటి విద్వాంసుల అభిప్రాయం. అందుకే పొల్యూట్ కాని ఉర్దూను 'బేగమాతీజుబాన్' 'మహెల్లాతీ జుబాన్' అనేవాళ్లు. మా చిన్నతనంలో ఆగా సాహెబ్ అనే ఉర్దూ ప్రొఫెసర్ నిజామ్ కాలేజిలో పనిచేసేవారు. అతని పేరు ఆగా హైదర్‌హుసేన్ అనుకుంటాను. అనుకుంటానే కాని గట్టిగా అనలేను. అతడు గంటలు గంటలు దిల్లీ బేగమాతీ జుబాన్‌లో ప్రసంగించేవాడు.

వరంగల్లు తెలుగు గురించి మాట్లాడుతున్నాను గదా. ఒక సంవత్సరం పెద్ద కాళోజీ వర్ధంతి సభలో పాల్గొన్నాను. సాధారణంగా కాళోజీ యింట జరిగే వర్ధంతి, జయంతి సభల్లో పాల్గొనేవాన్ని. నాకు పిలుపువచ్చేది. లేదా, నేనే వెళ్లేవాన్ని, ఆ సభల్లో చిన్నపాటి కవి సమ్మేళనం, చిన్నపాటి ఉర్దూ ముషాయిరా. కొన్ని ప్రసంగాలు జరిగేవి. తర్వాత అక్కడి ఇద్దరో ముగ్గురో గాయకులు (మీరాసంగీత్ సభ) వాద్యాల మీద షాద్ గజల్లు వినిపించేవారు. పెద్ద కాళోజీ ఉర్దూకవి. కలం పేరు షాద్. నేను వెళ్లేటప్పటికి సాహితీ మిత్రమండలి కవులు తమ కవితలు వినిపిస్తున్నారు. ఆ సాహిత్య సభకు రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ అధ్యక్షులై వున్నారు. వారెవరో నాకు తెలియదు. అక్కడ అందరు తెలుగు విద్వాంసులుండగా, అందరు యూనివర్సిటీ ఆచార్యులుండగా ఒక రిటైర్డ్ రెవెన్యూ ఆఫీసర్ అధ్యక్షత వహించటమేమిటి? అనుకున్నాను. కాళోజీలకు అప్పుడేమో అనుకున్నాను. రెవెన్యూ వాళ్లకు తెలుగు సాహిత్య సభల్లో అధ్యక్షత వహించే అర్హత లేదనుకునేవాన్నికాను. ఉత్తమ కవితలూ, కథలూ రాసిన రెవెన్యూ, పోలీస్ శాఖల ఆఫీసర్లను ఈ యాది శీర్షిక కిందే ప్రస్తావించి వున్నాను. నేను ప్రస్తావించని వాళ్లనేకులు. అందుకే.. కవి సమ్మేళనం తర్వాత అధ్యక్షులవారు లేచి మాట్లాడినారు. అచ్చమైన వరంగల్లు ప్రాంతీయ తెలుగులో సంస్కృత పదాలనంతగా ఆశ్రయించకుండా, ఇంగ్లీషు, ఉర్దూ పదాల జోలికంతగా వెళ్లకుండా తమ మనసులోని భావాలను వెల్లడించినారు. తర్వాత నన్ను మాట్లాడమన్నారు. "అధ్యక్షులవారి కల్తీలేని తెలుగు విన్న తర్వాత తెలుగులో మాట్లాడే సాహసం చేయలేను. ఉర్దూలో మాట్లాడతాను"



### ఆలోచించండి-చెప్పండి



- "మొదలు మీకళ్లకు నీళ్లు పెట్టుకోండి" అని మరాఠీ పురోహితుడు అన్నాడు గదా! మీ నిత్యజీవితంలోని ఇట్లాంటి సంఘటనలను వివరించండి.
- "ఏ ప్రాంతంలోనైన అసలైన భాష ఆడవాళ్ల నోటనే వినగలం" దీన్ని సమర్థిస్తూ చర్చించండి.
- కవిసమ్మేళనం అంటే మీకు తెలుసా? ఎపుడైనా కవి సమ్మేళన సభలో పాల్గొన్నారా? మీ అనుభవాన్ని తెలుపండి.

SCERT, TELANGANA

అని మాట్లాడే నాలుగు మాటలు ఉర్దూలోనే మాట్లాడినాను. అధ్యక్షులవారిలాగే కల్తీలేని వరంగల్లు తెలుగు మాట్లాడే ఆచార్యులు కొందరున్నారక్కడ. ఇతరులూ వున్నారు. వార్త పత్రికలో కొన్నాళ్లు ఉర్దూ కవుల గురించి రాసినాను. ఇప్పుడు యాది రాస్తున్నాను. ఆ కాలం నుంచి నా రచనలు చదువుతున్న గుంటూరు విద్వాంసులు, అడ్వొకేట్ ఉప్పులూరి గోపాలకృష్ణ శర్మ గారు నా వ్యాసాలు బాగున్నాయని జాబులు రాస్తున్నారు. తరచుగా, "మీ వ్యాసాల్లో తెలంగాణా ప్రాంతీయ భాష కనిపిస్తూ వున్నది. మీరు ఆ ప్రాంతంవారేనా? మా ప్రాంతానికెప్పుడూ రాలేదా?" అని ప్రశ్నిస్తూ వుంటారు. వారు ఏ ఉద్దేశంతో అట్లా ప్రశ్నిస్తారో తెలియదుగాని అది నా ప్రశంసగానే భావిస్తాను. తెలంగాణాలోనే వుంటూ ఆంధ్రప్రాంతం వాళ్లు గూడా చదివేట్లు రాస్తున్నానంటే విశేషమే కదా.

## IV

ఇంతకాలం తెలంగాణా సీమోల్లంఘనం చేసి తిరుపతి వెంకన్నను గూడ చూడకపోతిని. గత మార్చిలో మాత్రం కారా మాష్టారుగారి ఆజ్ఞను తిరస్కరించలేక మూడు రోజుల కోసం విశాఖకు, శ్రీకాకుళానికి వెళ్లి వచ్చినాను. అక్కడి ప్రాంతీయ తెలుగు అందం వేరే. గద్య పద్య సాహిత్యం ప్రచారంలో వున్నంతకాలం ఎక్కడి తెలుగైనా ఒక్కటే. వ్యావహారిక భాష వ్యాప్తిలోకి వచ్చిన తర్వాతనే ఈ ప్రాంతీయ భాషలూ – మాండలిక భాషలూ. నేనూ ఒకప్పుడు పుస్తకాలూ, వ్యాసాలూ గ్రాంథిక భాషలో రాసినవాన్నే. అవిప్పుడు నాకే రుచించవు. గ్రాంథిక భాష రాసే కాలంలోనూ పిల్లలకు తెలుగు చెప్పే పంతులును కనుక వ్యావహారిక వాదులతోనే గొంతు కలిపేవాన్ని. ఉర్దూ, మరాఠీ పిల్లలు తమ యింట్లో మాట్లాడే భాషనే బళ్లో చదువుతుంటే, తెలుగు పిల్లలు ఇంట్లో మాట్లాడే భాష వేరు. బళ్లో చదివే భాష వేరు. ఘోరమనిపించేది. ఈ వ్యావహారికం వచ్చిన తర్వాత తెలుగు పిల్లలు కూడా మరాఠీ, ఉర్దూ పిల్లల్లాగా ఇళ్లలో మాట్లాడే భాషనే బళ్లలో చదువుతున్నారు. అయితే, మాండలిక భేదాలటుంచి, ప్రాంతీయ భేదాలను సరిచేసుకోలేకపోతున్నాం, సరిచేసుకోవాలంటే తొలగించటమూ కాదు. దిద్దుకోవటమూ కాదు. అన్ని ప్రాంతాల పలుకుబళ్లను ఇప్పుడు తెలుగనుకుంటున్న భాషలో కలుపుకోవటం. ప్రాంతీయ భాష ప్రజల వ్యవహారంలో వున్నది. ఇందులో పండితుల, రాజకీయ నాయకుల ప్రమేయం లేదు. ఈ నడుమ ఏదో టి.వి.ఛానల్లో "తెలుగులోనే రాయండి. తెలుగే మాట్లాడండి" అని చెప్పటం జరుగుతున్నది. ఇది విన్నప్పుడల్లా నేను రెండు ప్రశ్నలు వేసుకుంటాను. "ఏ తెలుగు? ఎక్కడి తెలుగు" అని.

ఉర్దూ సాహిత్యంలో పండితుల ఫారసీ సమాసాలకంటే, ప్రజల పలుకుబడికే ప్రాధాన్యమని రాసినాను కదా. ఉర్దూ కవుల్లో అగ్రగణ్యుడైన కవి మీర్ తఖీమీర్. అతని కవిత గంభీర భావ భరితమైనా, భాష ప్రజల పలుకుబడిలోంచి వచ్చిన సహజ సుందరమైనది. ఎవరో అతన్నడిగినారట "ఉస్తాద్! ఫారసీ, అరబీ, ఉర్దూ భాషల్లో సాటిలేని పండితులు గదా మీరు. ఢిల్లీ ప్రజల పలుకుబడిని ఎట్లా పట్టుకున్నారు?" అని. "శుక్రవారం శుక్రవారం దిల్లీ జామె మసీదు మెట్ల మీద కూర్చుంటాను. ఆ మెట్ల మీదనే అటూయిటూ వరుసగా ఫకీర్లు, బిచ్చగాళ్లు, బిచ్చగత్తెలు కూర్చుండి ఏవేవో మాట్లాడుకుంటారు. అవన్నీ శ్రద్ధగా వింటాను. నమాజు చదవటానికి ఎందరో వస్తుంటారు, పోతుంటారు. మాట్లాడుకుంటారు. అవి వింటాను. అలా ప్రజల పలుకుబడిని, జాతీయాలను నేర్చుకున్నాను. నాది ప్రజా కవిత కదా" అన్నాడట మహాకవి మీర్ తఖీమీర్. ఒక షేర్ గూడ రాసినాడు;

**గో మెరే షేర్ హైఁ ఖవాస్ పసంద్**
**పర్ మెరీ గుఫ్తగూ అవామ్ సేహై**



SCERT, TELANGANA

ఖాస్ – ఆమ్ అనే రెండు మాటలున్నాయి. ఖాస్ అంటే ప్రత్యేకమైనది. (స్పెషల్) దాని బహువచనం ఖవాస్. అంటే విద్వత్తులోనో, సంపదలోనో, హోదాలోనో ప్రత్యేకమైనవాళ్లు. ఆమ్ అంటే సామాన్యం. ఆవామ్ అంటే బహువచనంలో సామాన్య ప్రజలు (కామన్ పీపుల్). కవి ఏమంటున్నాడంటే, "నా కవితను ప్రత్యేక వ్యక్తులు పసంద్ చేస్తున్నారు కాని నేను మాట్లాడుతున్నది మాత్రం సామాన్య ప్రజలతోనే" అని.



**ఆలోచించండి–చెప్పండి**



- "నా కవితను ప్రత్యేక వ్యక్తులు పసందు చేస్తున్నారు. కాని నేను మాట్లాడుతున్నది మాత్రం సామాన్య ప్రజలతోనే" అని రచయిత అనడంలో ఆంతర్యమేమిటి?
- "పిల్లలు ఇంట్లో మాట్లాడే భాషవేరు. బళ్లో చదివే భాషవేరు." అనడం నిజమా? కాదా? కారణాలు చర్చించండి.
- ప్రాంతీయ భాషా భేదాలను ఎట్లా సరిచేసుకోవాలి? మాట్లాడండి?

G3W9H5

# ఇవి చేయండి

## I అవగాహన – ప్రతిస్పందన

**1. కింది అంశాన్ని గూర్చి మాట్లాడండి.**

అ) "తెలుగు భాష గొప్పతనం" గురించి మాట్లాడండి. ఐతే ఒక్క ఆంగ్లపదం కానీ, హిందీ, ఉర్దూ... ఇలా ఇతర భాషాపదాలు వాడకుండా మాట్లాడాలి. ప్రయత్నం చేయండి. ఎవరు బాగా మాట్లాడుతారో చూద్దాం.

**2. కింది గద్యాన్ని చదువండి. ప్రశ్నలకు సరైన జవాబును గుర్తించండి.**

గో మెరే షేర్ హైం ఖవాస్ పసంద్
పర్ మెరీ గుఫ్తగూ అవామ్ సేహై

ఖాస్ – ఆమ్ అనే రెండు మాటలున్నాయి. ఖాస్ అంటే ప్రత్యేకమైనది. (స్పెషల్) దాని బహువచనం ఖవాస్. అంటే విద్వత్తులోనో, సంపదలోనో, హోదాలోనో ప్రత్యేకమైనవాళ్లు. ఆమ్ అంటే సామాన్యం. ఆవామ్ అంటే బహువచనంలో సామాన్య ప్రజలు (కామన్ పీపుల్). కవి ఏమంటున్నాడంటే, "నా కవితను ప్రత్యేక వ్యక్తులు పసంద్ చేస్తున్నారు కాని నేను మాట్లాడుతున్నది మాత్రం సామాన్య ప్రజలతోనే" అని.

**ప్రశ్నలు :**

అ) 'ఖాస్' అనే ఉర్దూ పదానికి అర్థం. ______________ (      )

ఎ) కవిత  బి) ప్రత్యేకమైన  సి) సాధారణమైన  డి) సామాన్యం

ఆ) సామాన్య ప్రజలను ఉర్దూలో ఏమంటారు? (      )

ఎ) అవామ్  బి) ఆమ్  సి) ఖాస్  డి) ఖవాస్

SCERT TELANGANA

ఇ) నా కవితను ప్రత్యేక వ్యక్తులు పసంద్ జేస్తున్నారు. కింద గీత గీసిన పదానికి సమానార్థక ఉర్దూపదం. ( )

ఎ) సంబంద్ బి) అవామ్ సి) ఖవాస్ డి) పసంద్

ఈ) పై కవితలో కవి ఎవరి భాషను ఉపయోగించాడు? ( )

ఎ) గ్రాంథికభాష బి) ఉర్దూభాష సి) ప్రజలభాష డి) ఏవీకాదు.

**3. కింది గద్యాన్ని చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.**

ఉర్దూ మనదేశీయుల ఉమ్మడి భాష. కాని ఏదో ఒక కులానికో, మతానికో చెందిన భాష కాదన్నారు ప్రొఫెసర్ రఫియా సుల్తానా. ఆ తరం వాళ్లందరూ అట్లాగే అనుకున్నారు. ఇప్పటికీ ఉన్న ఆ తరం వాళ్లు అట్లాగే అనుకుంటున్నారు. అందుకే నా ముచ్చట్లలో ఉర్దూతో మాకు గల సంబంధాన్ని యాది చేసుకుంటున్నాను.

మా చదువు ఉర్దూ మీడియంలో జరిగింది. హెడ్మాస్టర్ అన్వరుద్దీన్ సాహెబు. ఉర్దూ చెప్పే మౌల్వీ సాహెబులు ఇద్దరో, ముగ్గురో ఉండేవాళ్లు. అయితే, పై తరగతిలో చదివే మాకు రామనాథరావుసార్ ఉర్దూ చెప్పేవారు. వారు మంథెన బ్రాహ్మణులు. ఎఫ్.ఎ.(ఇంటర్మీడియట్) చదివిన ఆ సారుకు తెలుగు, సంస్కృతం, మరాఠీ, ఇంగ్లీషు భాషల్లో మంచి పాండిత్యం వుండేదనేవాళ్లు. ఉర్దూలో ఏదో పెద్ద పరీక్ష పాసయినారు. వారు పెద్ద తరగతికి ఉర్దూ చెప్తుంటే ఉర్దూ డిగ్రీలు గల మోల్వీ - సాహెబులెవరూ అభ్యంతరం లేవదీయలేదు. పైగా తమకు సరిగా అర్థం కుదరని ఉర్దూ షేర్ల తాత్పర్యం మా ముందరే రామనాథరావుసార్‌తో చెప్పించుకునేవాళ్లు.

**ప్రశ్నలు :**

అ) రఫియా సుల్తానా తరంవాళ్ళు ఏమని అనుకున్నారు?

ఆ) రచయిత తన ముచ్చట్లలో ఏ భాషా సంబంధాన్ని యాది చేసుకున్నాడు?

ఇ) రామనాథరావుసార్ ఎక్కడివారు? ఏ విషయాన్ని బోధించేవారు?

ఈ) మౌల్వీలు రామనాథరావుసార్‌ను ఏ విషయమై సంప్రదించేవాళ్లు?

## II వ్యక్తీకరణ – సృజనాత్మకత

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) మనుమరాలి మాటలు విని తాతయ్య ఎందుకు అబ్బురపడ్డాడు?

ఆ) కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగారిని రచయిత గురుస్థానీయులుగ ఎందుకు భావించారో వివరించండి.

ఇ) "అందరు యూనివర్సిటీ ఆచార్యులుండగా ఒక రిటైర్డ్ రెవిన్యూ ఆఫీసర్ అధ్యక్షత వహించడమేమిటి?" అని రచయిత అనుకోవడంలో ఉద్దేశమేమై ఉంటుంది?

ఈ) రచయిత రచనా శైలిని ప్రశంసిస్తూ రాయండి.

SCERT, TELANGANA

**2. కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి.**

అ) ఈ పాఠం ద్వారా సామల సదాశివ గురించి మీకేమర్థమయిందో రాయండి.

**3. కింది అంశాన్ని గురించి సృజనాత్మకంగా / ప్రశంసిస్తూ రాయండి.**

అ) మీ ప్రాథమిక విద్యాభ్యాస జీవితంలో మీరు మరచిపోలేని జ్ఞాపకాలను ఒక వ్యాసంగా రాయండి.

( లేదా )

ఆ) మీ పరిసరాల్లో జరిగిన ఏదైనా సంఘటనను వాడుకభాషలో సంభాషణగా రాయండి.

## III భాషాంశాలు

### పదజాలం

**1. కింది పదాలను సొంతవాక్యాలలో ప్రయోగించండి.**

ఉదా: యాదిచేసుకొను =

నేను, నా స్నేహితుడు చిన్నప్పటి సంగతులు యాదిచేసుకొని బాగా నవ్వుకున్నాం.

అ) పసందు =

___

ఆ) రమ్యం =

___

ఇ) క్షేత్రం =

___

**2. కింది పదాలకు నానార్థాలు రాయండి**

అ) కవి : ______, ______, ______

ఆ) క్షేత్రం : ______, ______, ______

**3. కింది పర్యాయపదాలకు పాఠం ఆధారంగా సరియైన పదాన్ని రాయండి.**

అ) ఇల్లు, గృహం ______

ఆ) పొగడ్త, స్తోత్రం ______

SCERT, TELANGANA

**4. కింది వాక్యాలలో గీత గీసిన పదాలకు ప్రకృతి, వికృతులను రాయండి.**

అ) మీ వ్యాసాల్లో తెలంగాణ ప్రాంతీయ <u>భాష</u> కనిపిస్తూ ఉన్నది. ______________

ఆ) నాది ప్రజా <u>కవిత</u> కద ! ______________

ఇ) మా అమ్మమ్మ రోజూ <u>కత</u> చెప్పుతుంది. ______________

ఈ) కూరగాయలు అమ్మే <u>ఇంతి</u> మాటల్లో తెలుగు నుడి కనిపిస్తుంది. ______________

**5. కింది వ్యుత్పత్తులకు పదాలను రాయండి.**

అ) అజ్ఞానమనెడు అంధకారాన్ని తొలగించువాడు : ________________________________

ఆ) భాషింపబడునది : ________________________________

## వ్యాకరణాంశాలు

**1. కింది వాక్యాలను సామాన్య వాక్యాలుగా మార్చండి.**

అ) తిరుమల రామచంద్రగారు సంస్కృత, ఆంధ్రభాషలలో పండితుడు.

ఆ) నేనొకప్పుడు పుస్తకాలు, వ్యాసాలు గ్రాంథిక భాషలో రాసేవాడిని.

ఇ) ఇంట్లో మాట్లాడే భాష, బడిలో చదివే భాష వేరువేరు.

**2. కింది వాక్యాలను సంయుక్త వాక్యాలుగా మార్చండి.**

అ) తెలుగువాళ్ళ పలుకుబడి, నుడికారాలు పల్లె ప్రజల భాషలో దొరుకుతాయి. వాటిని మనం భద్రపరుచుకోవడం లేదు.

ఆ) నల్గొండ జిల్లాలో ఎందరో కవులు ఉన్నారు. నల్గొండ జిల్లాలో కథకులూ ఉన్నారు. నల్గొండ జిల్లాలో పత్రికా విలేఖరులు ఉన్నారు.

ఇ) నమాజు చదవడానికి ఎందరో వస్తుంటారు. నమాజు చదివి ఎందరో పోతుంటారు.

**3. కింది వాక్యాలను సంశ్లిష్ట వాక్యాలుగా మార్చండి.**

అ) అంబటిపూడి వెంకటరత్నం కావ్యం రాశాడు. అంబటిపూడి వెంకటరత్నం అచ్చువేయించాడు.

ఆ) గడియారం రామకృష్ణశర్మ మంచి పాండిత్యం సంపాదించాడు. గడియారం రామకృష్ణశర్మ అనేక సన్మానాలు పొందాడు.

ఇ) కప్పగంతుల లక్ష్మణశాస్త్రి కర్ణసుందరి నాటకాన్ని అనువదించాడు. కర్ణసుందరి నాటకాన్ని ప్రచురించాడు.

SCERT, TELANGANA

## రుగాగమ సంధి

✱ **ఈ కింది పదాలను గమనించి విడదీయండి.**

అ) పేదరాలు

ఆ) బీదరాలు

ఇ) బాలింతరాలు

పై పదాలను విడదీస్తే ఎట్లా ఉంటాయో గమనిద్దాం. ఎట్లా మారాయో పరిశీలిద్దాం.

అ) పేద + ఆలు → పేదరాలు

ఆ) బీద + ఆలు → బీదరాలు

ఇ) బాలింత + ఆలు → బాలింతరాలు

పేద + ఆలు → పేద + ర్ + ఆలు → పేదరాలు

బీద + ఆలు → బీద + ర్ + ఆలు → బీదరాలు

బాలింత + ఆలు → బాలింత + ర్ + ఆలు → బాలింతరాలు

- **పై మూడు సందర్భాలలో పర పదం 'ఆలు'**
- **పేద, బీద, బాలింత పదాలకు 'ఆలు' పరమైంది.**
- **పేద, బీద, బాలింత మొదలైన శబ్దాలను 'పేదాదులు' అంటారు.**
- **పేదాదిపదాలకు 'ఆలు' అనే పదం కలిసినప్పుడు 'ర్' అనే అక్షరం అదనంగా వచ్చింది.**
- **'ర్' అనేది అదనంగా రావడాన్ని 'రుగాగమం' అంటారు.**
- **దీన్నే ఇట్లా కూడా చెప్పవచ్చు**

**పేదాది శబ్దాలకు 'ఆలు' శబ్దం పరమైనప్పుడు రుగాగమమవుతుంది.**

**ఒక వర్ణం మిత్రుడివలె అదనంగా చేరడమే 'ఆగమం'.**

- **పైన చెప్పిన మూడు పదాలలో పూర్వపదం విశేషణం, ఉత్తరపదం విశేష్యం (నామవాచకం) ఇలా విశేషణ విశేష్యాలతో కూడిన పదాన్ని కర్మధారయమంటారు.**

- **కర్మధారయమందు పేదాది శబ్దాలకు 'ఆలు' శబ్దం పరమైతే రుగాగమమవుతుంది.**

**పై పద్ధతి ప్రకారం కింది పదాలను విడదీసి గమనించండి. విశ్లేషించండి.**

అ) ముద్దరాలు ________________ + ________________

ఆ) జవరాలు ________________ + ________________

ఇ) మనుమరాలు ________________ + ________________

ఈ) కొమరాలు ________________ + ________________



SCERT, TELANGANA

పైన చెప్పిన పేదాది పదాలు తెలుగుపదాలు. ఇప్పుడు సంస్కృతానికి సమానమైన (తత్సమ) పదాలకు ఆలు శబ్దం పరమైతే ఏం జరుగుతుందో పరిశీలిద్దాం.

గుణవంత + ఆలు → గుణవంతురాలు

బుద్ధిమంత + ఆలు → బుద్ధిమంతురాలు

శ్రీమంత + ఆలు → శ్రీమంతురాలు

ఈ సందర్భాలలో కూడా 'ర్' వస్తుంది. కానీ స్వల్పమైన తేడా వచ్చింది గమనించారా? అదేమిటో పరిశీలిద్దాం!

గుణవంత + ఆలు → గుణవంత + ఉ+ ఆలు → గుణవంతు + ఆలు → గుణవంతు + ర్ + ఆలు
→ గుణవంతురాలు

శ్రీమంత + ఆలు → శ్రీమంత + ఉ+ ఆలు → శ్రీమంతు + ఆలు → శ్రీమంతు + ర్ + ఆలు
→ శ్రీమంతురాలు

అలాగే

బుద్ధిమంత + ఆలు → బుద్ధిమంత + ఉ+ ఆలు → బుద్ధిమంతు + ఆలు → బుద్ధిమంతు + ర్ + ఆలు
→ బుద్ధిమంతురాలు

పై మూడుచోట్ల తత్సమపదాలకు 'ఆలు' కలిస్తే మొదటిపదం చివర ఉన్న అచ్చు 'అ'కారానికి బదులు 'ఉ' కారము వచ్చి తరువాత రుగాగమయింది. దీన్ని ఇట్లా చెప్పవచ్చు.

- **కర్మధారయమందు తత్సమ శబ్దములకు 'ఆలు' శబ్దము పరమైనప్పుడు పూర్వపదం చివరఉన్న 'అకారానికి' ఉకారము వచ్చి రుగాగమం అయింది.**

## ప్రాజెక్టు పని

- గాంధీజీ 'సత్యశోధన', సామల సదాశివ 'యాది', కాళోజి 'నాగొడవ,' దాశరథి రంగాచార్య 'జీవనయానం', గడియారం రామకృష్ణ శర్మ 'శతపత్రము' మొదలగు వాటిలో వారివారి జ్ఞాపకాలు, అనుభవాలు గ్రంథస్థమై ఉన్నాయి. వీటిలో ఏదైనా ఒక గ్రంథాన్ని సేకరించి అందులోని విషయాలను చదువండి. వాటిలో మీకు నచ్చిన ఒక సంఘటనను పేర్కొంటూ ఎందుకు నచ్చిందో తెలుపుతూ నివేదిక రాయండి.

**సూక్తి**

**ఆత్మలను పలికించేదే అసలైన భాష**
**ఆ విలువ కరువైపోతే అది కంఠశోష.**

**– డా॥సి.నారాయణ రెడ్డి**

SCERT, TELANGANA

# 3 వీరతెలంగాణ

**- డా॥ దాశరథి కృష్ణమాచార్య**

D4R2B6

## చదువండి - ఆలోచించి చెప్పండి

*తెలుగు గుండెల బిగువు*
*తెలిపింది తెలగాణ*
*తెలుగు జోదుల తెగువ*
*చూపించి తెలగాణ*

*దేశానికే ముందు నిల్చిందిరా తెలగాణ*
*దేశానికే పేరు తెచ్చిందిరా!*

*పరాన్నభుక్కులకు*
*పక్కలో బల్లెమై*
*దేశద్రోహుల కింక*
*తావులేదని చాటి*

*ఢంకా బజాయించెరా తెలగాణ*
*దౌర్జన్య మెదిరించెరా!*

*జయభేరి మోగించెరా తెలగాణ*
*జయము రైతుల కందెరా!*

***(కొత్తపల్లి రంగారావు - తెలంగాణ పోరాట పాటలు)***

## ప్రశ్నలు

1. *ఈ గేయాన్ని రాసిందెవరు?*
2. *ఈ గేయం దేని గురించి తెలియజేస్తున్నది?*
3. *ఈ గేయాన్ని ఎందుకు రాసి ఉంటాడు?*
4. *ఇట్లా తెలంగాణ గురించి రాసిన కవులు, రచయితలు ఎవరు? ఎందుకు రచనలు చేసి ఉంటారు?*

## పాఠం నేపథ్యం / ఉద్దేశం

తెలంగాణ వీరుల పురిటిగడ్డ. ఎందరో యోధులు తెలంగాణ విముక్తి కోసం తుదిశ్వాస వరకు పోరాడారు. దుర్మార్గులైన రజాకార్ల అరాచకత్వాన్ని ఎదిరించిన రణక్షేత్రం తెలంగాణ. అటువంటి నేల అస్తిత్వ పరిరక్షణ కోసం తెలంగాణ ప్రజాసమూహం తమదైన పద్ధతుల్లో ధిక్కారస్వరం వినిపించింది. ఆయుధం ధరించి పోరాడినవారు కొందరైతే అక్షరాయుధంతో పోరాడినవారు మరికొందరు. సాహితీయోధుడు డా॥ దాశరథి కృష్ణమాచార్య - ప్రత్యక్షంగా పోరాటంలో మమైకమౌతూనే తెలంగాణ ధైర్యసాహసాలను పద్యాలలో ప్రశంసించాడు.

వీరుల త్యాగాలను స్మరించడం, తెలంగాణ తల్లి ఔన్నత్యాన్ని కీర్తించడం, స్వస్థానాభిమానాన్ని ప్రేరేపించడమే ఈ పాఠ్యభాగ ఉద్దేశం.

SCERT, TELANGANA

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం పద్య ప్రక్రియకు చెందినది. చారిత్రక అంశాలను వస్తువుగా తీసుకొని రాసిన పద్యాలివి. డా॥ దాశరథి కృష్ణమాచార్య రచించిన "దాశరథి సాహిత్యం" ఒకటవ సంపుటి 'రుద్రవీణ' లోనిది.

## కవి పరిచయం



**22-7-1925**
**05-11-1987**

డా॥ దాశరథి కృష్ణమాచార్య మహబూబాబాద్ జిల్లాలోని చిన్నగూడూరులో జన్మించాడు. నాటి పాలకులపై ప్రజావ్యతిరేక పోరాటాల్లో ఆచరణాత్మక వైఖరితో ప్రజలను చైతన్యవంతం చేసిన ఉద్యమకవి. 'నా గీతావళి ఎంత దూరము ప్రయాణంబౌనొ అందాక ఈ భూగోళంబునకగ్గి పెట్టెద' నన్నాడు. నిజాంకు వ్యతిరేకంగా పద్యాలను జైలుగోడలమీద రాసిన ధీరుడు. అగ్నిధార, రుద్రవీణ, మహాంధ్రోదయం, పునర్నవం, కవితాపుష్పకం, తిమిరంతో సమరం, అమృతాభిషేకం, ఆలోచనాలోచనాలు మొదలైన కవితా సంపుటాలను, నవమి (నాటికలు) యాత్రాస్మృతి (స్వీయచరిత్ర) వంటి పలు గ్రంథాలను రచించి, సినీ గేయకవిగా ఆణిముత్యాలవంటి పాటలు రాసి సినిమాపాటకు సాహిత్య గౌరవాన్ని తీసుకవచ్చిన మహాకవి.

తెలుగులో గజల్ ప్రక్రియకు ప్రాణంపోసిన దాశరథి 1961లో గాలిబ్ గజళ్ళను అనువదించాడు. ప్రసిద్ధ ఉర్దూకవుల కవిత్వాన్ని అనువదించి విమర్శకుల ప్రశంసలను పొందాడు. తెలుగు సాహిత్యానికి చేసిన సేవకుగాను ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు (1967) కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు (1974) అందుకున్నాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చివరి ఆస్థానకవి. ఆవేశానికి అక్షరాన్ని తొడిగి అభ్యుదయ పథాన తన కవిత్వాన్ని నడుపుతూనే సున్నితమైన భావుకతతోనూ, ప్రాచీన పద్యశైలితోనూ ప్రజల హృదయాలను ఆకట్టుకున్న సమన్వయ ప్రతిభాశీల ప్రజాకవి.


SCERT TELANGANA

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకోండి.

## ప్రవేశిక

**సముద్రం ఉప్పొంగుతుండగా చూసేవారు అరుదుగా ఉంటారు. సముద్రం చెలియలికట్ట దాటడం ఎవరూ ఊహించలేరు. కాని తెలంగాణ నేల ఈ అరుదైన పరిణామాలను, అద్భుతాలను ప్రపంచానికి చూపెట్టింది. తెలంగాణ నేలమీద జరిగిన నిజాం విముక్తి ఉద్యమంలో తెలంగాణ ప్రజలు సముద్రంలో అలల మాదిరిగా ఉవ్వెత్తున ఉప్పొంగి ఎగిశారు. ఆ హోరును, తెలంగాణ వీరుల తిరుగుబాటు జోరును, మహోన్నత త్యాగాల తీరును దాశరథి పద్యాల్లో విని ఉత్తేజితులం కావడానికి... ఈ పాఠంలోకి పయనిద్దాం...**



## I

ఉ. ఓ తెలగాణ! నీ పెదవులొత్తిన శంఖ మహారవమ్మ్మలీ
భూతలమెల్ల నొక్కమొగి బొబ్బలు పెట్టినయట్లు తోచె, ఓ
హో! తెలవార్చివేసినవి ఒక్కొక దిక్కు నవోదయార్క రుక్
ప్రీత జలేజ సూన తరలీకృత దేవనదీతరంగముల్ 1

శా. తల్లీ! నీ ప్రతిభా విశేషములు భూతప్రేత హస్తమ్ములన్
డుల్లెన్ కొన్ని తరాలదాక! ఇపుడడ్డుల్ వోయె; సౌదామనీ
వల్లీ ఫుల్లవిభావళుల్ బ్రతుకుత్రోవల్‌జూపు కాలమ్ములున్
మళ్ళెన్! స్వచ్ఛతరోజ్జ్వల ప్రథమ సంధ్యాభానువేతెంచెడిన్ 2

### ఆలోచించండి-చెప్పండి

- ఈ భూమండలమంతా ఎందుకు ప్రతిధ్వనించింది?
- బ్రతుకుతోవ చూపే కాలం రావడం అంటే ఏమిటి?

SCERT, TELANGANA

## II

❖ఉ. నీ యొడిలోన పెంచితివి నిండుగ కోటి తెలుంగు కుర్రలన్!
ప్రాయము వచ్చినంతనె కృపాణములిచ్చితి, యుద్ధమాడి వా
జ్జేయ భుజాబలమ్ము దరిసింప జగమ్ము, నవాబుతో సవాల్
చేయుమటంటి; వీ తెలుగు రేగడిలో జిగి మెండు మాతరో! 3

❖మ. తెలగాణమ్మున గడ్డిపోచయును సంధించెన్ కృపాణమ్ము! రా
జలలాముం డనువాని పీచమడచన్ సాగించె యుద్ధమ్ము! భీ
తిలిపోయెన్ జగమెల్ల యేమియగునో తెల్యంగరాకన్! దిశాం
చలముల్ శక్రధనుఃపరంపరలతో సయ్యాటలాడెన్ దివిన్ 4

ఉ. నాలుగు వైపులన్ జలధి నాల్కలు సాచుచు కూరుచుండె! క
ల్లోలము రేపినారు భువిలో! నలుదిక్కుల గండికొట్టి సం
ద్రాలకు దారినిచ్చిరి! ధరాతలమెల్ల స్వతంత్ర వారి ధా
రాలులితమ్ము కాదొడగె, రాజు రివాజులు బూజు పట్టగన్ 5




**ఆలోచించండి–చెప్పండి**

- "తెలంగాణ నేలలో ఎంత బలం ఉన్నదో కదా!" అని కవి ఎందుకన్నాడు?
- 'గడ్డిపోచకూడా కత్తివలె మారడం' అంటే ఏమిటి?
- నవోదయం రావడమంటే మీరేమని అనుకుంటున్నారు?

## III

❖మ. తెలగాణా! భవదీయ పుత్రకులలో తీంద్రించు వైప్లవ్య సం
చలనమ్మూరక పోవలేదు! వసుధా చక్రమ్ము సారించి ఉ
జ్జ్వల వైభాతిక భానునిన్ పిలిచి దేశంబంతటన్ కాంతి వా
ర్ధులు నిండించిరి, వీరు వీరులు పరార్థుల్ తెల్గుజోదుల్ బళా! 6

మ. మతపైశాచి వికార దంష్ట్రికలతో మా భూమి లంఘించి మా
కుతుకల్ గోసెడి వేళ గూడ, యెటు దిక్కున్ తోచకున్నప్పుడున్
బ్రతుకే దుర్భరమైన యప్పుడును ఆంధ్రత్వమ్ము పోనాడ లే
దు, తుదిన్ గెల్చితిమమ్మ యుద్ధమున రుద్రుల్ మెచ్చనాంధ్రాంబికా! 7

సీ. కాకతీయుల కంచు గంట మ్రోగిననాడు
కరకు రాజులకు తత్తరలు పుట్టె
వీర రుద్రమదేవి విక్రమించిన నాడు
తెలుగు జెండాలు నర్తించె మింట
కాపయ్య నాయకుండేపు సూపిన నాడు
పరరాజులకు గుండె పట్టుకొనియె
చాళుక్య పశ్చిమాశా పాలనమ్మున
కళ్యాణ ఘంటలు గణగణమనె




**ఆలోచించండి–చెప్పండి**

- తెలంగాణ వీరుల ప్రత్యేకత ఏమిటి?
- బ్రతుకు ఎప్పుడు దుర్భరం అవుతుంది?
- ఆకాశాన జెండాలు రెపరెపలాడటం దేనికి సంకేతం?

తే.గీ. నాడు నేడును తెలగాణ మోడలేదు
శత్రువుల దొంగదాడికి; శ్రావణాభ్ర
మటుల గంభీర గర్జాట్టహాసమలర
నా తెలంగాణ పోవుచున్నది పథాన 8

SCERT TELANGANA

## తాత్పర్యాలు

1) ఓ తెలంగాణమా! నీ పెదవులతో ఊదిన శంఖధ్వనులు ఈ భూమండల మంతా ఒక్కమారుగా బొబ్బలు పెట్టినట్లుగా ప్రతిధ్వనించాయి. ఆహా! ఉదయించిన సూర్యుని కిరణాలచేత ప్రీతిపొందిన పద్మాలతో చలించిన ఆకాశగంగాతరంగాలు అన్ని దిక్కులను తెలవారేటట్లు చేశాయి.

2) అమ్మా తెలంగాణమా! నీ గొప్పతనపు విశేషాలు కొన్ని తరాల వరకు దుర్మార్గుల చేతులలో చిక్కుకొన్నాయి. ఇప్పుడు అడ్డంకులు తొలిగాయి. విచ్చుకున్న మెరుపు తీగల కాంతి రేఖలు బతుకుతోవ చూపే కాలం వచ్చింది. స్వచ్ఛమైన కాంతిమంతమైన సూర్యుడు ఉదయించాడు.

3) అమ్మా! కోటిమంది తెలుగు పిల్లలను నీ ఒడిలో పెంచావు. వారికి వయసురాగానే చేతులకు కత్తులనిచ్చి, వజ్ర సమానమైన భుజపరాక్రమాలను లోకం చూసేటట్లు నిజాంరాజుతో తలపడమన్నావు. ఈ తెలుగు నేలలో ఎంత బలం ఉన్నదో కదా!

4) ఈ తెలంగాణలో గడ్డిపోచకూడా కత్తిబట్టి ఎదిరించింది. తాను గొప్పరాజునని అనుకొనేవాని గర్వాన్ని అణచేటట్లుగా యుద్ధం సాగించింది. ఏమి జరుగుతుందో తెలియక జగమంతా భయపడిపోయింది. దిగంతాలన్నీ ఆకాశంలో ఇంద్రధనుస్సుల వరుసలతో సయ్యాటలాడాయి.

5) తెలంగాణా స్వాతంత్ర్య పోరాటం సముద్రం మాదిరిగా ఉప్పొంగుతున్నది. నాల్గువైపుల నుండి సముద్రానికి గండికొట్టి తెలంగాణ నేలనంతా స్వాతంత్ర్యపు నీటితో తడుపుతున్నారు. ఉద్రిక్తత కలిగించిన నవాబుల ఆజ్ఞలకు కాలం చెల్లిపోయింది.

6) అమ్మా తెలంగాణా! నీ పిల్లలలో ప్రకాశించే విప్లవాత్మకమైన కదలిక ఊరికే పోలేదు. వీరు భూమండలాన్నంతా సవరించి ఉజ్జ్వలమైన కాంతిమంతమైన సూర్యుడిని పిలిచి దేశమంతా కొత్త కాంతి సముద్రాలు నింపారు. వీరంతా వీరులు, పరోపకారులు కూడా.

7) అమ్మా! మతం అనే పిశాచి తన క్రూరమైన కోరలతో మా నేలను ఆక్రమించి మా గొంతులు కోస్తున్నప్పుడు, ఏ దిక్కూ తోచనప్పుడు, బ్రతకడమే భారమైనప్పుడు కూడా తెలుగుదనాన్ని కోల్పోలేదు. రుద్రులు మెచ్చేటట్లు యుద్ధం చేసి చివరకు విజయాన్ని సాధించాం.

8) కాకతీయ రాజుల కంచుగంట మ్రోగినప్పుడు దుర్మార్గులైన శత్రురాజులు కలవరపడ్డారు. రుద్రమదేవి పరాక్రమించినప్పుడు తెలుగు జెండాలు ఆకాశాన రెపరెపలాడాయి. కాపయ్య నాయకుడు తన విజృంభణం చూపినప్పుడు శత్రురాజులకు గుండెలు ఆగిపోయాయి. చాళుక్య రాజులు పశ్చిమ దిక్కున పరిపాలన చేసేటప్పుడు మంగళకరమైన జయధ్వనులు మోగాయి. నాటి నుండి నేటి వరకు శత్రువుల దొంగ దెబ్బలకు తెలంగాణం ఓడిపోలేదు. శ్రావణ మాసంలోని మేఘం మాదిరిగా గంభీరమైన గర్జనలు అలరారుతుండగా నా తెలంగాణం ముందుకు సాగుతూనే ఉన్నది.

SCERT, TELANGANA

M1F1P5

# ఇవి చేయండి

## I అవగాహన - ప్రతిస్పందన

**1. కింది అంశాలను గూర్చి చర్చించండి.**

అ) 'వీర తెలంగాణ' అనే పాఠం పేరు వినగానే మీకు ఎటువంటి అనుభూతి కలిగింది? దాశరథి తెలంగాణను వీర తెలంగాణ అనడాన్ని తగిన ఉదాహరణలతో సమర్థించండి.

**2. కింది అపరిచిత కవితను చదువండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.**

తోటమాలి బలిదానం చేస్తేనే
పువ్వులు పరిమళాల నీనగలవు
మానవుడు కలవాలి మానవుణ్ణి
తిడితే ఏం లాభం కనిపించని దేవుణ్ణి
ఆకాశానికి శోభ చందమామ
మిణుగురుతో విద్యుత్కాంతులు ప్రసరించవు
మారాలి నేటి నాటువ్యక్తి
కాకుంటే లే దెన్నటికి విముక్తి
మానవునికి మానవుడే ధ్యేయం
మానవత్వమే మానవజాతికి శ్రేయం
చరిత్రలు మన ఉనికికి కావు ప్రమాణం
ధరిత్రిని వెనక్కి నెట్టి చేయాలి ప్రయాణం

**(కవిరాజ మూర్తి)**

**ప్రశ్నలు :**

అ) పూలు ఎప్పుడు తమ పరిమళాలను వెదజల్లగల్గుతాయి?

ఆ) ఎవరిని తిట్టగూడదు?

ఇ) ఎవరు మారాలి? ఎందుకు మారాలి?

ఈ) మానవుడు ఏవిధంగా ప్రయాణం చేయాలి?

ఉ) పై కవితకు శీర్షిక నిర్ణయించండి.

ఊ) పై కవితను రాసింది ఎవరు?

SCERT, TELANGANA

**3. రెండో పద్యానికి ప్రతిపదార్థం కింద ఉంది. ఇదే విధంగా 3, 4, 6 సంఖ్యగల పద్యాలకు ప్రతిపదార్థాలు రాయండి.**

| | | |
|---|---|---|
| తల్లీ | = | అమ్మా! |
| నీ | = | నీ యొక్క |
| ప్రతిభావిశేషములు | = | ప్రజ్ఞా విశేషాలు |
| కొన్ని తరాలదాక | = | కొన్ని తరాల వరకు |
| భూతప్రేత | = | చెడు శక్తుల (భూతప్రేతాల) |
| హస్తమ్ములన్ | = | చేతులలో |
| డుల్లెన్ | = | పడిపోయినవి (చిక్కుకున్నవి). |
| ఇపుడు | = | ఇప్పుడు |
| అడ్డుల్ + పోయెన్ | = | అడ్డంకులు తొలగిపోయాయి. |
| సౌదామనీవల్లీ | = | మెరుపుతీగల |
| ఫుల్ల | = | విచ్చుకున్న |
| విభా+ఆవళుల్ | = | కాంతులవరుసలు |
| బ్రతుకుత్రోవల్ | = | బ్రతుకు దారులను |
| చూపు | = | చూపే |
| కాలమ్ములున్ | = | సమయములు |
| మళ్ళెన్ | = | తిరిగివచ్చినవి (అదిగో). |
| స్వచ్ఛతర | = | అత్యంత స్వచ్ఛమైన |
| ఉజ్జ్వల | = | ప్రకాశవంతమైన |
| ప్రథమ సంధ్యా | = | తొలి పొద్దు |
| భానువు | = | సూర్యుడు |
| ఏతెంచెడిన్ | = | వస్తున్నాడు (ఉదయిస్తున్నాడు). |

SCERT, TELANGANA

## II వ్యక్తీకరణ - సృజనాత్మకత

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాలలో జవాబులు రాయండి.**

అ) "తెలంగాణ గొప్పతనపు విశేషాలు కొన్ని తరాలవరకు దుర్మార్గుల చేతిలో చిక్కుకొన్నాయి" అన్న కవి మాటలను మీరెట్లా సమర్థిస్తారు?

ఆ) "తెలగాణమ్మున గడ్డిపోచయును సంధించెన్ కృపాణమ్ము' అని దాశరథి ఎందుకన్నాడు?

ఇ) తెలంగాణాలో సంధ్యాభానువు మొదటిసారి ఉదయించాడని కవి ఎందుకన్నాడు?

**2. కింది ప్రశ్నకు పది వాక్యాలలో జవాబు రాయండి.**

అ) వీర తెలంగాణ పాఠ్యభాగ సారాంశాన్ని సొంతమాటల్లో రాయండి.

**3. కింది అంశాన్ని గురించి సృజనాత్మకంగా / ప్రశంసిస్తూ రాయండి.**

అ) 'తెలంగాణ తల్లి' తన గొప్పదనాన్ని వివరిస్తున్నట్లుగా ఏకపాత్రాభినయం రాసి ప్రదర్శించండి. లేదా ఆత్మకథ రాయండి.

## III భాషాంశాలు

### పదజాలం

**1. కింది వాక్యాలు చదువండి. గీతగీసిన పదాల అర్థాలనుపయోగించి సొంతవాక్యాలు రాయండి.**

అ) గాలికి ఊగుతున్న పువ్వులు చిగురుటాకులతో సయ్యాటలాడుతున్నాయి.

ఆ) స్వాతంత్ర్యోద్యమం బ్రిటిష్ వారి గుండెల్లో కల్లోలం రేపింది.

ఇ) వీరులెప్పుడూ ప్రాణాలను అర్పించడానికి వెనుకాడరు.

ఈ) దిక్కు తోచనప్పుడు అయోమయంలో పడుతాం.

**2. కింది పదాలకు నానార్థాలు రాయండి.**

అ) ఉదయము : ______________ ______________

ఆ) ఆశ : ______________ ______________

ఇ) అభ్రము : ______________ ______________

**3. కింది వాక్యాల్లో గీత గీసిన పదాలకు పర్యాయపదాలు రాయండి.**

అ) మురళీరవము మానసిక ఆహ్లాదాన్నిస్తుంది.

______________ ______________

ఆ) రుద్రమదేవి కృపాణముతో శత్రువులను చెండాడింది.

______________ ______________

SCERT, TELANGANA

ఇ) జలధి అనేక జీవరాశులకు నిలయం.

_______________ _______________

ఈ) జాతీయ జెండాను గౌరవించాలి.

_______________ _______________

ఉ) హనుమంతుడు సముద్రాన్ని లంఘించాడు.

_______________ _______________

## వ్యాకరణాంశాలు

**1. కింది పదాలను విడదీసి రాసి సంధి పేరు రాయండి.**

అ) జగమెల్ల = ________ + ________ = ________

ఆ) సయ్యాటలాడెన్ = ________ + ________ = ________

ఇ) దారినిచ్చిరి = ________ + ________ = ________

ఈ) ధరాతలమెల్ల = ________ + ________ = ________

ఉ) దిశాంచలము = ________ + ________ = ________

ఊ) శ్రావణాభ్రము = ________ + ________ = ________

ఋ) మేనత్త = ________ + ________ = ________

**2. కింది పదాలకు విగ్రహవాక్యాలు రాసి సమాసం పేరు రాయండి.**

అ) కాకతీయుల కంచుగంట = ________________, ________

ఆ) కల్యాణ ఘంటలు = ________________, ________

ఇ) బ్రతుకు త్రోవ = ________________, ________

ఈ) మహారవము = ________________, ________

ఉ) వికారదంష్ట్రలు = ________________, ________

ఊ) కాంతివార్ధులు = ________________, ________

ఋ) తెలంగాణ రాష్ట్రం = ________________, ________

ౠ) మతపిశాచి = ________________, ________

SCERT, TELANGANA

## ఛేకానుప్రాసాలంకారము

✻ **ఈ వాక్యాన్ని పరిశీలించండి.**

నీటిలో పడిన తేలు తేలుతదా!

ఈ వాక్యంలో తేలు, తేలు అనే పదాలకు అర్థాలు వేరు వేరుగా ఉన్నాయి. ఆ పదాలు వెంటవెంటనే ప్రయోగించబడ్డాయి. హల్లుల జంట అర్థభేదంతో వెంటవెంటనే వాడబడితే దానిని **'ఛేకానుప్రాసాలంకారం'** అంటారు.

మరికొన్ని వాక్యాలు చూడండి. సమన్వయం చేయండి.

**హల్లుల జంట అర్థభేదంతో అవ్యవధానంగా వస్తే ఛేకానుప్రాసం.**

అ) అరటితొక్క తొక్కరాదు.

ఆ) నిప్పులో పడితే కాలు కాలుతుంది.

ఇ) తమ్మునికి చెప్పు! చెప్పు తెగిపోకుండా నడువుమని.

✻ **ఇట్లాంటివి పాఠంలో వెతకండి. కొన్ని సొంతంగా తయారుచేయండి.**

### ప్రాజెక్టు పని

♦ తెలంగాణా పోరాట నేపథ్యంలో వచ్చిన ఏవైనా రెండు మూడు పాటలు సేకరించండి. వాటిని పాడి వినిపించండి.

(లేదా)

దాశరథి రాసిన ఏదైనా ఒక పుస్తకం / పాట / కవిత చదువండి. దాని ఆధారంగా నివేదిక రాసి చదివి వినిపించండి.

### మీకు తెలుసా?

**దాశరథి 1952లో డా॥ సి.నారాయణ రెడ్డి, వట్టికోట ఆళ్వారు స్వామి, డా॥ బిరుదురాజు రామరాజు మొదలగువారితో కలిసి తెలంగాణా రచయితల సంఘాన్ని స్థాపించాడు. ఈయన వట్టికోట ఆళ్వారుస్వామితో కలిసి నిజామాబాద్‌లో జైలు శిక్ష అనుభవించాడు. తెలంగాణ ఉద్యమ కావ్యాలలోకెల్ల అగ్రగణ్యమైనది దాశరథి 'అగ్నిధార'. ఇది పీడిత ప్రజల మనోభావాలకు ప్రతీక. 'అగ్నిధార'ను నిజామాబాద్‌లో జైలు సహవాసి వట్టికోట ఆళ్వారుస్వామికి అంకితమిచ్చాడు. అట్లే 'రుద్రవీణ' అనే కవితాసంపుటిని తెలంగాణ ప్రజానీకానికి అంకితమిచ్చాడు.**

**సూక్తి**

**సంకల్పమే సకల విజయాలకు మూలం**
**సాధించాలనే తపనే విజయంవైపు వేసే తొలి అడుగు**

SCERT, TELANGANA

# 4 కొత్తబాట

**- డా॥ పాకాల యశోదారెడ్డి**

F9W3L3

## చదువండి - ఆలోచించి చెప్పండి

మార్కెట్‌కు వెళ్ళే మార్గం పక్కన ఇళ్ళున్నాయి. వాటిలో కొన్ని గట్టి ఇటుకలతో నిర్మింపబడ్డాయి. గోడలకు వెల్లవేసి ఉన్నది. వసారా గోడలపై ఆకర్షణీయమైన పూలు చిత్రించబడి ఉన్నాయి. మరికొన్ని ఇళ్ళు మట్టితో నిర్మింపబడ్డాయి. ఆ ఇళ్ళకు చిరిగిన తాటియాకుల కప్పు ఉన్నది. చిన్న, పెద్ద, ఇళ్ళలోను, పేదల, ధనికుల ఇళ్ళలోను, అన్ని ఇళ్ళలోను ప్రవేశద్వారం ప్రక్క కుండీలో తులసిమొక్క ఉన్నది. పసిపిల్లలు, ఊరకుక్కలతోపాటు దుమ్ములో ఆడుతున్నారు. స్త్రీలు బియ్యం కడుగుతూ, ఆ కడిగిన నీటిని సందులో పోస్తున్నారు.

## ప్రశ్నలు

*1. పై పేరాలో దేనిని గురించి ఉన్నది?*

*2. ఇటువంటి వాతావరణం ఎక్కడ ఉంటుంది?*

*3. మీరు చూసిన పల్లె గురించి మాట్లాడండి.*

*4. పల్లెల్లో నాటితో పోలిస్తే నేడు ఏయే మార్పులు చోటుచేసుకున్నాయి?*

## పాఠం ఉద్దేశం

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వేగంగా చోటుచేసుకున్న మార్పులు, క్రమానుసారంగా రాబోయే కొత్త మార్పులు, ఊహించని పరిణామాలు, పర్యవసానాలు, స్థానిక ఆధిపత్యశక్తుల మీద సామాన్యుడి కొత్త విజయాలను సంకేతాత్మకంగా చిత్రిస్తుంది కథ.

ప్రాంతీయ, భాషాపరమైన దృక్పథంలో తెలంగాణ అస్తిత్వచైతన్యానికి నిదర్శనంగా నిలబడి కొత్తబాటలో నడిచిన కథను పరిచయం చేయడమే ఈ పాఠం ఉద్దేశం.

SCERT, TELANGANA

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం కథానిక ప్రక్రియకు చెందినది. రెండు తరాలకు సంబంధించిన వివరాలు, తరాలమధ్య కాలానుగుణంగా వచ్చిన మార్పులు మొదలైన విషయాలను డా॥ పి.యశోదారెడ్డి తమ 'కొత్తబాట'లో తెలియపరిచింది. నేషనల్ బుక్‌ట్రస్ట్ ప్రచురించిన 'యశోదారెడ్డి ఉత్తమ కథలు' గ్రంథం లోనిది ఈ పాఠ్యభాగం.

## రచయిత్రి పరిచయం



8-8-1929
7-10-2007

డాక్టర్ పాకాల యశోదారెడ్డి నాగర్‌కర్నూల్ జిల్లాలో భాగమైన బిజినేపల్లి గ్రామంలో జన్మించింది. 'తెలుగులో హరివంశాలు' అనే అంశంపై పరిశోధనచేసి డాక్టరేట్ పట్టాపొందింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు ప్రొఫెసర్‌గా పనిచేసింది. రాష్ట్ర అధికారభాషా సంఘానికి అధ్యక్షులుగా పనిచేసిన తొలి మహిళ. ఆంధ్ర సాహిత్య వికాసము, పారిజాతాపహరణ పర్యాలోచనము, ఎర్రాప్రెగడ, కథాచరిత్ర వంటి పరిశోధనా గ్రంథాలను, మావూరి ముచ్చట్లు, ఎచ్చమ్మకథలు, ధర్మశాల వంటి కథా సంపుటాలను, పరిశోధనాపటిమగల వ్యాసాలనెన్నో రాసింది. వీరి రేడియో ధారావాహిక కార్యక్రమం 'మహాలక్ష్మి ముచ్చట్లు' ఎంతో ప్రజాదరణ పొందింది. తెలంగాణ భాషా సౌందర్యాన్ని తెలపడానికి కథను శక్తిమంతమైన సాధనంగా మలచుకున్నది. నాటి తెలంగాణ సామాజిక, సాంస్కృతిక జనజీవన వైవిధ్యాన్ని తెలుసుకోవడానికి ఆనవాళ్ళు ఈమె కథలు.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకొండి.

SCERT, TELANGANA

### ప్రవేశిక

*ఈ 'కొత్తబాట' గురించి డా॥ పి.యశోదారెడ్డి మాట్లాడుతూ "ఈ కథ తెలంగాణ మాండలికంలో వ్రాయబడింది. అక్కాతమ్ముళ్ళిద్దరూ బస్సుదిగి అక్కడి నుండి ఎద్దుల బండిలో వాళ్ళ ఊరి వరకు ప్రయాణం చేసిన రెండు గంటల్లో రెండు తరాలకు జరిగిన ఘర్షణ, సాధించిన విజయాలు సప్రమాణంగా ప్రదర్శింపబడ్డాయి. ఈ సంభాషణలో ఎన్నో సాంఘిక దురాచారాలు తడమబడ్డాయి. భాష తెలంగాణ మాండలికాన్ని జీర్ణించుకొని, ఆ జాతీయాన్ని, జీవనరీతిని, నుడికారాన్ని ప్రదర్శిస్తుం"దని చెప్పింది. ఆ కొత్తబాటలో మనం నడక మొదలు పెడుదాం.*

## I

"నేను రాన్రా తమ్ముడు! అది తరాల నాటి బాట. ఎప్పుడేసిందో ఏం కతనో? ఈ వానలకూ వొరదలకు ఏర్లు పొంగంగ అది ఎన్ని కయ్యలు గొట్టిందో? ఎన్ని గండ్లు వడ్డదో? కూసుంటే నడుములిర్గె, నడిస్తె కాళ్ళు బెణికెనంట వొర్రెలల్ల వొంపులల్ల వడి ఆ బాట పొంటి వడినడ్వ నాశాతగాదు తంద్రి." అంట ఎంత జెప్పినగని వాని సెవ్వు మీద పేను వార్తెనా? నా మాట యింటెనా? వాని పట్టు ఇడిస్తెనా?

తుమ్మబంక అంటుకున్నట్లు ఎంటవడి "కాదక్కా! మనూరికో కొత్త బాటేసినం, నీవు చూసి మెచ్చిందాక గాదు" అంట ఒకటే పట్టు, మొండిపట్టు, జనిగెపట్టు, ఇదెక్కడి సొద? వీడెక్కడి నక్షత్రకుడురా? నాయినా! అంట పయనమై బండెక్కి బయలుదేర్న. తోవపొంటి ఊకున్నాడా? లేదు, ఉల్లాసం బట్టలేక ఒకటే చెప్పుక పోతుండడు. వసదాగిన పిట్టోలె.

"అక్కా! ఇది ఈగ కాలం కాదె! పూలకాలం, ఎన్నెల మాసం, తియ్యటి తీపుల దినం, ఏమనుకున్నవో? ఎక్కడ జూసిన కమ్మటి వాసన, ఇన సొంపైన రొద, పండాకు రాలంగ అడవి అంత పసరాకు పోషాకులు తొడ్గి సోకులు పోతుండది. ఆ మోదుగు వనం జూడు! పెయి అంతపుల్కరిచ్చినట్లు మొగ్గదొడిగి, ఎర్రగపూసి, కొత్తబాటకు మంగళార్తులు పడ్తున్న ముత్తైదలోలె సాళ్ళు సాళ్ళుగ నిలవడ్డవి. ఆ పొంటె ఉన్న మద్దుల జరవార జూడు! ఎంత ఎత్తుకు ఎదిగినవో? కొటారి కొమ్మల్లల్ల తేనెతెట్టెలన్ని పిక్కటిల్లంగ తేనెలు ఎట్ల నింపుకొన్నవో? ఏందే? అక్కా! ఉల్కవు? పల్కవు?

అదో! అక్కడి దిక్కు జెరనా చెవువారిచ్చి ఇను, ఎడవాసిన ఎదలను ఏకంజేయ పేరు పెట్టి పిలుస్తున్నట్లు ఆ కోయిలకూతలు! అక్కా! అదో! ఆ కండ్లపడేదే చింతలతోపు, చింతలింకా చిగురుకోలేదు. గున్నమావిళ్ళు జూడు! పొన్నకాయలసోంటి ఆడపిల్లలు సింగారించుకున్నట్లు కానొస్తుండవి. యాపలు ఇప్పుడిపుడె మొగ్గలు ఇచ్చుకుంటుండవి.

అదో! సూడు! మాటలల్లనే మనూరి పొలిమేర రానెవచ్చె. ఎదురుకోళ్ళ నాడు మొగపెండ్లి సుట్టాలకు మర్యాదలుజేయ గుంపు గట్టినట్లు గుబుర్గ వెరిగిన ఈ వాయిలు పొదలు జూడు! అక్కా! బాట పక్కల పొంటి ముసలి మాన్లన్ని గూలంగ ఎదిగి వస్తున్న కొత్త చెట్లను జూడమ్మా!

ఈ సూపుతోటే కొంచెం అటుదిక్కు నీ కన్నువారజేయి, ఆ చెర్వుజూడు! ఇప్పుడు నిండుగ నీల సముద్రమోలె నీరు మోస్తుండది. ఈ చెర్వుకు ఆయకట్ట కట్టిన పుణ్యాన అందరికీ ఆదెరువైంది".

అవును నిజంగనె! ఏకసిస్తుగ పాదరసం వొల్కవోసినట్లు ఈ చెర్వు ఎన్నెలకు మెరుస్తుండది. గని, ఇల్లలుకంగనె పండుగైతాది? ఈ పాయకుంటల కెల్శి పెద్ద కొఱ్ఱమాన్లు చెంగు చెంగున దుంకుకుంట ఎగిరి సన్న చాపలను గుట్కు గుట్కు మనుకుంట సుడిగుండాలను లేప్తనే ఉండవి. గవిన్ల గుడ్డెలుగులు చెదల పుట్టలను గోళ్ళగీకి పుట్టకు పుట్ట పెరుగుల గెట్టెలను మెక్కింది జాలక, చెట్ల శికెలకు ఎగవాకి జెంటి తేనెలు ఆపూటం జుఱ్ఱుకొన్నది సాలక, ఆ పూట కల్లుకు గట్టిన ఈతలొట్టి కోసం ఈడ్కి ఆడ్కి కాళ్ళు గాలిన పిల్లులోలె ఆసువోస్తనే ఉండవి. అని, మనసుల అనుకుంట, ఆ గుడ్డెల్గులను జూసే కంటిని అట్ల మీదిమీదికి సారిచ్చేట్యాళ్ళకు గట్టుమీద జారుడు బండల ఎన్క అల్గుదుంకె కాడ, చిర్తగండు ఆ కాదు, ఆడిదే! అప్పుడే ఈనిందే ఏమో? కండ్లు గానక పొట్టాపతికి గాంఱ్ఱుగాంఱ్ఱు మనుకుంట తన పొట్టన పుట్టిన తన కూనల్నే నముల్క మింగ జూస్తుండది. ఆ పక్కనే గొఱ్ఱెపోతును అమాతం మందు గుడిగెలు మింగినట్లు మింగిన తాసుపాము సీకెర చెట్టుకు తీగోలె సుట్టుకున్నది. తిన్నది అరుగని పూడువాము గురిగింజలోలె గుడ్లు మిట్కుమిట్కున మిట్కరిచ్చుకుంట సుట్టకుదురోలె సుట్టుకొని 'అతీ గతీ' ఎరుగకుండ వద్దది. ఆడాడ నక్కలు పొంచుకొని అదునుగాస్తున్న పాలిపెర గండ్లవద్దనె ఉండది.


**ఆలోచించండి-చెప్పండి**

- "సెవ్వు మీద పేను వార్తైనా?' అంటే మీకేమి అర్థమైంది?
- మీరు ఎప్పుడైనా ఎక్కడికైనా నడుచుకుంటూ పోతారా? పోయేటప్పుడు ఏమేం గమనిస్తారో చెప్పండి?
- మీ ఊరి పొలిమేరల్లో ప్రకృతి ఎట్లా ఉంటుందో చెప్పండి?

## II

మరి! మా తిక్క సన్నాసి కొత్త బాటేసినం, కొత్తదారి, కొత్తమలుపు అంట పదం బాడ్తండేంది? ఇదంత నాకు దెల్సిన బాటనె! ఎన్నేండ్ల నుంచో తొక్కుడు వద్ద బాట! ఇందుట్ల కొత్త యాడుండది? అంట అనుకున్నగని, నా మనసు నాకు బుద్ధి చెప్తుతున్నట్లనిపిచ్చింది.

అయిన గాకున్నగని మరీ, ఇంత కరుగనితనం, ఉండగూడదు. పురాగ ఎలుతురుకు దడిగట్టినట్లు ఒక్క పచ్చరం బర్వగూడదు. యాదాన్ని మెచ్చకుండ మరి అంటె మరి, రొమ్మున ఎముకలు లెక్కబెద్తనంటె ఎట్ల? రొండు కండ్లు దెర్సి నిదానంగ లోతులు వాటిచ్చి సూడాలె, యాది కనుమరుగైన, మరుగున పడి తప్పినట్లె గద! నాకు ఎన్నటి నుండో ఎరుకున్న బాటైతే మట్కు బాగైందా? లేదా? బాట నడిసె కాలుకు రొంపి అంటుకోకుంటె కూసున్న కాడికి వచ్చి కాళ్ళకు రొచ్చు,





SCERT, TELANGANA

తాక్తదా? తగుల్తదా? ఎంత చెడ్డగని, ఎంత బాగ బతికిన గని ఇంకోని ఆసరతోటి, మంది బుజాలెక్కి నడువకుండ పయినం సాగితె సాలు మనకు కావలసింది, మనం జూడవలసిందల్ల, ఒగడు తన కాళ్ళమీద తాను నిలవడ్డడా? లేదా? అనేది.

ఊర చెరువు దాటినం, మత్తడి దాటినం, మోతెబరి రైతుల పసుల కొట్టాలు గాన్రావట్టినవి, ఈ కొట్టాల్ల గడ్డివాములన్ని ఇగి చెదరకుండ కుదురుగ మట్టసంగ ఉండవి. ఇంటిమొకం బట్టిన ఎడ్లు లగేస్తుండవి. మా ఊరి ఎల్లమ్మ గుడి వొచ్చింది. ఆమె పసుపు బండార్లతోటి చెక్కు చెదరకుండ ఉండది. పూజారి కిష్టమాచార్ల ఇల్లు దాటినం.

ఆ కండ్ల వడేదే! గోపాల్రాయని భవంతి బంగుల. ఈడ్కి బండి జేరింది అంటే సూపుకు గోడ గట్టినట్లే. ఇందాక మరిసింది యాదికి వచ్చినట్లు మురిపాల వస్తువును గవుసెన్ల దాసినట్లు, ఎవరికంట్ల పడకుండ ఈ త్యాప గూడ మా తమ్మయ్య నొగల మీదికెళ్ళి చెంగున దుంకి కచ్రానికి ఎర్రపర్దాలు సింగారిస్తడనుకొని నా పాపెట్ల సెదిరిన ఎంటికలు సక్కన దిద్దుకొని కొంగు నిండుగ సవరిచ్చుకున్న, అసొంటి దాపరికపు పనులు యావి జరుగలేదు. అంతకొస్తె ఆడ పర్దాలు ఉన్న ఉనికి గూడ కండ్లపడలేదు. నా ప్రాణానికి కొత్తగ ఊపిరి పీల్చుకున్నట్లనిపిచ్చింది.

పెండ్లి సూపుల నాడు పిలగాణోళ్ళు పెండ్లి పిల్లను గోటికొన నుండి శికెళ్ళ జూసినట్లు నేను మా ఊరిని జూడవట్టిన. నా కంటి ఎదురుంగనె రచ్చకట్ట. కందెరుగని మణుసులోలె మా రచ్చకట్ట రాగి చెట్టు రొండు ఒకదాన్నిడ్సి ఇంగోటి ఉండదన్నట్లు ఒకదానికోటి తోడంట దీటుగ నిలవడ్డవి. అదేం సిత్రమొ? గని ఈసారి సూడు సూడు మంట మా రచ్చకట్ట కింద అన్ని చెప్పులె కుప్పలైనవి. ఎప్పటి తీర్గ! ముచ్చెలకన్న కిందై వోరగ గూసుండె మణుసులు మట్కు కాన్రాలేదు. ఇదేం ముంచుకొచ్చె మా ఊరికి? ఇది కలనా? మాయనా? అంట నిదానిచ్చి చూసెట్యాళ్ళకు వాళ్ళల్ల ఒగరో ఇద్దరో రచ్చమీద కూసున్నట్లు గానొచ్చిన్రు. నా కండ్లను నాకే నమ్మబుద్ధిగాలేదు. రొండు జేతుల బాగ నల్సుకొని మళ్ళ జూసిన గూడ అదే నిలుకడై నిలవడి నిజం అని తోసింది. ఓ రచ్చబండ! ఓ రాగిచెట్టు! ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు ఏరుతార్లు ఎచ్చు తచ్చులు మాని తోటి మనిషికి సమానంగ తావును, నీడను పంచి ఇచ్చే యోగం, బుద్ధి మీకు దక్కింది! అని మెచ్చుకుంట సంబురాన ముందుకు సాగిన.



**ఆలోచించండి-చెప్పండి**



- *"తన కాళ్ళ మీద తను నిలబడటం" అంటే ఏమిటి? చర్చించండి.*
- *నాటి నేటి ఆచార వ్యవహారాల్లో తేడాలు ఉన్నాయా? ఏమిటవి?*
- *మీ ఊర్లో రచ్చబండ/గ్రామ సచివాలయం ఉన్నదా? అక్కడ ఎవరెవరు ఏయే విషయాల గురించి మాట్లాడుతారు?*

## III

బండి సాగిపోతనే ఉండది. ఇంగ, గోపాల్రాయని బంగ్ల ఎంటనే అయిన బామ్మర్ది రంగరాయని రెండంతస్తుల గచ్చు బవంతి, ఊరంతటికి కులపెద్దనంట నెత్తి ఎత్తుకోని నిలవడ్డట్లు గానొచ్చింది. మరి? ఎన్నడు లేంది ఆ భవంతి బంకులేమొ దిగూళ్ళల్ల దీపాలు ఎలుగుత లేవు, నేను జూస్తున్నది పొద్దు మాపు పూటనేగని, ప్రమిదలన్ని చమురు నిండుకోంగ దుమ్ము కొట్లాడుతుండవి. ఇల్లంత పాడు గొట్లాడినట్లు, కళదప్పి 'దో' అంటుండది. ఎందుకో? అంట అనుమాన పడ్తుండంగనె మావోడు పెద్దపులిని ప్రాణంతోటి పగ్గాన ఏసిన కుశాలు తోటి.

"అక్కా! ఇన్నాళ్ళకు మనూరికి వట్టిన 'మిత్తి దొర్సాని' అదే పెద్ద మారెమ్మ పేరు లేకుండ ఊడ్సుక పోయింది. మన ఊరోళ్ళంత ఇప్పుడిప్పుడె తెలివి దెల్సి మిత్తి పూజ మీదనె మిద్దెలు మోపి శ్రీమంతుడైన రంగరాయని మీద మళ్ళెవడి అయినకె పంగనామం బెట్టిన్రు. దాంతోటి అయిన దిమ్మదిరిగి చెప్పుకుంటె సిగ్గువాయె, మూసుకుంటె ప్రాణం బాయెనంట ఇర్కుటాన

SCERT TELANGANA

వడి కుడ్తిల పడ్డ ఎల్కతీర్గ తండ్లాడిన గని ఉపాయం దోసక పెండ్లాం పిల్లల దీస్కొని సుట్టాల మార్గం అంట రంగాపురం జేరిండు."

ఈ రంగరాయుడు చిన్న సన్నోడుగాడే! ఈ పసికారు రొండెర్గక నివురు గమ్మిన కొరివి తోటి నెత్తి గోక్కుంట లేరు గదా! ఏమో? మనుసు ఉట్టి ఊగినట్లు ఊగింది.

బండి మా పాలొండ్ల ఇండ్లకాడికెళ్ళి సాగుతుండది. ఇప్పుడు మా బావ పోలీసుపటేలు పాపిరెడ్డికి సాగువాటు సరిగలేదంట సూచాయగ ఇన్న. మరి ఆయినేం పచ్చపూస గన్కనా? రంగరాయనికి కుడి ఎడ్మ అంతె! సేరుకు సవశేరు 'ఉద్ది'. ఊళ్ళ ఒకణ్ణి ఎక్కిచ్చి ఒగణ్ణి దించి ఇద్దర్ని ఎదుగనీయకుండ ఎప్పటి శిగలు అప్పుడె గత్తరిచ్చె విద్దెలు ఈ అయ్యలకు పొత్తిళ్ళనాడె అబ్బుకొచ్చినవి. అవును గని, అనుమంతరాయుడు? ఆయిని నోట్ల, నాలికె సింగోటం? వీళ్ళు మరి? అనుకుంటున్న మాటను పసిగట్టినట్లు నా తమ్ముడు.

"అక్కా! ఆ కుటిలవాజి అనుమంతరాయుడు, కద్పుల ఇసం నాల్కెన తీపి తోటి నగుకుంట గొర్రె దాటుమంది గొంతులకు ఉరులు దగిలిస్తుంటె నక్కతంతుల సింగోటం ఉన్నది లేంది దప్తరంల ఎక్కిస్తుండె. ఇంగ ఇప్పుడు కండ్లు దెర్సిన జనం వాళ్ళ కన్న రొండాకులు ఎక్కువ జదివినట్లు ఆ తంత్రాలన్ని పురుట్లనె పుట్కుమనిపిస్తుండరు. లేకుంటె ఏందట? ఎన్నాళ్ళంట వీళ్ళ చెప్పుకింద తేళ్ళ తీర్గ అణిగి మణిగి ఉంటరు? సన్నకారు మంది అంత ఇప్పుడు అయిందానికి కానిదానికి కయ్యాలకు దిగి కుస్తిపట్లు పట్టి నెత్తురు కండ్ల జూస్కొని పంచాయితిల పడి ఆ పంచాయితిదార్లకు అప్పు సప్పు జేసి దండుగలు గట్టుకం లేదు. ఏ వాడన పంచాయితి ఆ వాడనె తీర్పులు జరుగుతుండవి. అక్కా! ఇన్నాళ్ళ తీరుగ అద్దమ్మ రాత్రిర్లు దొంగతనాలు లేవు, సేండ్ల దోపిండ్లు లేవు, పరిక్కంపలు లేవు, లాగుల తొండలు లేవు, ముంతపొగలు లేవు, ఈపు ముద్దెర్లు లేవు, బండ బర్వులు లేవు, అడుక్కు తిండ్లు లేవు".

**ఆలోచించండి-చెప్పండి**

- 'కద్పుల ఇసం నాల్కెన తీపి' అంటే మీరేం అర్థం చేసుకున్నారు?
- పంచాయితీలు చెప్పడం అంటే ఏమిటి? పంచాయితీలను ఎట్లా జరుపుతారు?
- "కళదప్పిన ఇల్లు" ఎట్లా ఉంటుంది?


## IV

బండి మా ఇంటిదిక్కు మూలమల్పు దిరిగింది. ఆడ మా పెదమామ ఇంటిపొంటి ఉన్న గరిసెల ఇండ్లల్ల దీపాలు ఎలిగినట్లు నలుగురు మణుసులు మెసిల్నట్లు జళకళ గలగల సప్పుడు ఇనిపిచ్చింది. ఇదేందిరా? అన్నట్లు మా తమ్మిణి దిక్కుజూసిన, ఎంటనె మా హాజిర్ జవాబు ఎక్కళ్ళేని ఉల్లాసం తోటి బుజాన ఏసుకున్న దస్తు రుమాలు జాడిచ్చి దులుపుకుంట "అక్కా! ఇది మన మ్యాన పల్లకీ లుండె పాత పొత్తులిల్లు, జనం మెదులక బండ జింకలు జేరి అబ్బో అన్నట్లుంటుండె, అది ఇప్పుడు మనూరికి రాత్రిబడి ఐంది. మేమంత గలిసి ఈ ఊళ్ళ ఎవరి పెండ్లిళ్ళైనగాని, వాళ్ళెంత మోతెబరి కర్ణప్పటేండ్లైన, వాండ్ల పెండ్లిండ్లకు మణుసులు మోసే మ్యానా పల్లకీలు రాగూడదు. సంబురానికి మెరిమెణ జేసి పగటి దీపాలెలిగిచ్చి ఊరంత మెరిచ్చిన మెరియ్యని ఊరేగింపులు తీసె మగ్దూరు లేదు అంట కట్టడి జేసినం. ఇంగ మనపెత్తాత కండ్లు నిప్పుకలు సెరుగంగ, చేసేది లేక తామసం ఆపుకొని పణమీది చెముటలు చిన్నపంచె తోటి తుడ్సుకుంట బుస్సు బుస్సు మంటుండంగ మేమంత ఈ పాత సవారీలను బద్దురంగ గుమ్ములింట్ల అలంకారాలోలె యాళ్ళాడగట్టినం".

బండి మా ఇంటి కమాను ముంగల ఆగింది. గజ్జెల సప్పుడు ఇని ఆ సుట్టుపక్కల పిల్లలంత ఉరుక్కుంటొచ్చి సుట్టు జుట్టుకున్నరు. ఈ పిల్లలు ఇన్నాళ్ళ తీర్గ ఈసురుమంట లేరు, ఇప్పుడు సీమిడి ముక్కులు లేవు, సింపులు లేవు, సీరపేండ్లు లేవు, వోరగాళ్ళు లేవు, ఊడ్సుకండ్లు లేవు, పిల్లలందరు దోసపండ్లోలె, ఉంకు చెండ్లోలె కళకళ లాడ్తుండరు.

SCERT, TELANGANA

బండిదిగి బంకులు దాటి ఇంట్లకు నడ్సిన. అలువాటు సొప్పున బాయికాడి గచ్చుల్లకు నడ్సిన. ఆడ ఎప్పటి తీర్గ కండ్లు బయట బంకుల్లకు సారిచ్చి, ఓ చేత సెంబు, ఓ చేయి నడుమున వెట్టి వొయ్యారంగ వోనమాలి నిలవడి లేదు. వొనమాలమ్మ ఇప్పుడు మా పెద్దత్త పక్కన దేవుణింటి ముందల గూసుండి వొత్తులు పేనుతుండది. ఇది కలనా? నిజమా? అంట డింగై అక్కడికక్కడ జూస్తుండంగనె 'అక్కా!' అంట విల్సుకుంటొచ్చి కుసుమ నాకు నీల్ల చెంబు అందిచ్చింది. ఒక్కసారి అమాంతం నా చేతులున్న చెంబు జారినంత పనైంది, గని అనుకోకుండ నా రొండు చేతులు మా పాలేరు రాజని బిడ్డ కుసుమ (దానికి ఆ పేరు పెట్టింది నేనే) దిక్కు సాగినవి. అది నా ఎదకొచ్చి ఆనింది. అన్ని కండ్లు ఒక దిక్కే సేడవట్టినవి. ఇవ్వరుకదులలేదు. ఇవ్వరినోట మాట పెకులలేదు. మా బాయి దగ్గెరున్న తరాలనాటి కారుమల్లె మొద్దు అనుకోకుండ మళ్ళా ఈనాటికి సిగురేసి సిగ్గారి తీర్గ వన్నెలు వద్తుండది. ఇంతట్లకే మా తమ్ముడొచ్చి ముసి ముసి నగుకుంట బాయికాడి కమాను స్తంభానికి ఆని నిలవడ్డడు. ఇల్లంత ఎన్నెలలు కురిసినట్లనిపిచ్చింది.



అవును ఇది కొత్త బాటనె! ఇంతకంటె కొత్తబాట, మంచిబాట ఇంగెట్లుంటది? యాడుంటది? బాట ఏసెటోళ్ళు నడుస్తుండాలె గని, పాపం ఆ బాట వొల్లనంటదా? వొదుగనంటదా? నల్గురు పల్కిందె మాట, నల్గురు మెచ్చిందె నడుత, నల్గురు నడిసిందె బాట.

**ఆలోచించండి-చెప్పండి**

- *రాత్రిబడి అంటే ఏమిటి? రాత్రి బళ్ళను ఎందుకు నడుపుతారు?*
- *'నల్గురు నడిసిందె బాట'లోని అంతరార్థం ఏమిటి? చర్చించండి.*
- *మీ పరిసర ప్రాంతాల్లో పిల్లల రూపురేఖలు, వేషధారణ ఎట్లా ఉంటాయి?*

SCERT, TELANGANA

# ఇవి చేయండి

A4T6Z9

## I అవగాహన - ప్రతిస్పందన

**1. ఈ కథకు 'కొత్తబాట' అనే పేరు తగినదని భావిస్తున్నారా? ఎందుకు? చర్చించండి.**

**2. పాఠం చదువండి. కింది పేరాల ఆధారంగా పట్టిక నింపండి.**

| పేరా సంఖ్య | పేరా శీర్షిక | పేరాలోని ముఖ్యమైన విషయం |
|---|---|---|
| 2 | | |
| 7 | | |
| 13 | | |
| 18 | | |

**3. కింది పేరా చదువండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.**

పల్లెసీమకు పట్టుకొమ్మలాగ మారుమూల గిరిజన గ్రామమైన కొండాపూర్ ఆదర్శంగా నిలిచింది. వరంగల్ రూరల్ (కాకతీయ) జిల్లా నల్లబెల్లి మండలానికి 18 కిలోమీటర్ల దూరాన ఉన్న కొండాపూర్ చుట్టూ దట్టమైన అడవిమధ్య నిలిచిన అటవీ గ్రామం. ఇక్కడ 1945లో ప్రత్యేక గ్రామపంచాయితీ ఏర్పడింది. 2007 డిసెంబర్ 5న సర్పంచ్ వాసం కన్నయ్య అధ్యక్షతన జరిగిన గ్రామసభలో గ్రామ సమస్యల పరిష్కారానికి, గ్రామాభివృద్ధికి 8 కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలు లోడిసంస్థ సహకారంతో, గ్రామస్థుల శ్రమదానంతో మేడివాగుపై పక్కారోడ్డు నిర్మించాయి. అధికారుల సహకారంతో మద్యపాన నిషేధం అమలులో ఉన్నది. వందశాతం అక్షరాస్యత సాధించారు. గ్రామ జనాభాకు సరిపడా మినరల్ ప్లాంట్ ఏర్పాటు చేసుకున్నారు. గ్రామంలో బాలకార్మికులు లేకుండా చేశారు. పిల్లలందరిని బళ్ళలో చేర్చారు. గిరిజనులు సాధించిన ఈ అభివృద్ధిని చూసి అంతర్జాతీయ గూగుల్ ఆర్గ్ సంస్థ ఈ గ్రామాన్ని ఉత్తమగ్రామ పురస్కార్‌కు ఎంపిక చేసింది.

అ) కొండాపూర్ ఎక్కడ ఉన్నది?

_______________

ఆ) గ్రామపంచాయితీ ఎప్పుడు ఏర్పడింది?

_______________

ఇ) గ్రామ సర్పంచ్ ఎవరు?

_______________

SCERT, TELANGANA

ఈ) పక్కా రోడ్డు ఎవరి సహకారంతో, ఎవరు నిర్మించారు?

ఉ) గ్రామ ప్రజలు సాధించిన విజయాలు ఏవి?

ఊ) ఈ పేరాకు శీర్షిక ఏం పెట్టవచ్చు? ఎందుకు?

## II వ్యక్తీకరణ - సృజనాత్మకత

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) "ఎంత చెడ్డగని, ఎంత బాగా బతికిన గని ఇంకోణి ఆసరతోటి మంది భుజాలెక్కి నడువకుండ పయినం సాగితె సాలు" అన్న అక్కమాటల్లో ఆంతర్యం ఏమై ఉంటుంది?

ఆ) "అక్కడక్కడ నక్కలు అదునుగాస్తున్న జాడలు కనబడ్తున్నవి" అంటే మీకేం అర్థమైంది?

ఇ) మీ గ్రామంలోని ప్రకృతిని లేదా మీ ఊరి ప్రత్యేకతలను గురించి రాయండి.

ఈ) చెరువుల ప్రాముఖ్యత ఏమిటి?

**2. కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి.**

అ) పాఠం ఆధారంగా పల్లెల్లో వచ్చిన మార్పులను విశ్లేషిస్తూ రాయండి.

**3. కింది ప్రశ్నకు సృజనాత్మకంగా సమాధానం రాయండి.**

అ) పల్లె సౌందర్యాన్ని వర్ణిస్తూ పది పంక్తుల వచన కవిత రాయండి.

## III భాషాంశాలు

### పదజాలం

**1. కింది వాక్యాల్లో గీతగీసిన పదాలను సొంతవాక్యాల్లో ఉపయోగించండి.**

అ) ఉపాధ్యాయుడు చెప్పే పాఠాన్ని <u>చెవివారిచ్చి</u> వినాలి.

ఆ) చిరుతపులులు <u>గవిన్లలో</u> నివసిస్తాయి.

ఇ) <u>కుటిలవాజితనం</u> పనికిరాదు.

ఈ) మా ఊరి <u>పొలిమేర</u> లో పంటపొలాలున్నాయి.



SCERT, TELANGANA

**2. కింది వాక్యాల్లో పర్యాయపదాల కింద గీత గీయండి.**

అ) రోజూ పెయి కడుక్కోవాలి. లేకపోతే మేను వాసన వస్తుంది. దేహం నిండా ఈగలు ముసురుతాయి.

ఆ) మనుషులు నీళ్ళు దొరికె తావుల్ల నివసిస్తారు. సరుకులు అమ్మే చోటులకు దగ్గరుంటారు. అందమైన ప్రదేశాలను ఇష్టపడతారు.

**3. కింది పట్టిక నుండి ప్రకృతి, వికృతులను వేరుచేసి రాయండి.**

| సముద్రం | అదెరువు | శిఖ | విద్య | పైనం |
|---|---|---|---|---|
| విద్దె | ప్రయాణం | సంద్రం | సిగ | ఆధారం |

**4. కింది జాతీయాలను ఏ అర్థంలో వాడుతారో తెలపండి.**

| | |
|---|---|
| నక్షత్రకుడు | వెంబడిపడి పీడించేవాడు అనే అర్థంలో వాడుతారు |
| నిండుకొన్నవి | |
| దడిగట్టు | |
| నిప్పుకలుసెరుగంగ | |

## వ్యాకరణాంశాలు

**కింది పదాలను విడదీసి సంధులను గుర్తించండి.**

అ) ప్రాణాలు గోల్పోవు = ______ + ______ = ______

ఆ) మూటంగట్టు = ______ + ______ = ______

ఇ) ఆసువోయుట = ______ + ______ = ______

ఈ) కాలుసేతులు = ______ + ______ = ______

ఉ) పూచెనుగలువలు = ______ + ______ = ______

### వృద్ధిసంధి

**❋ కింది పదాలను విడదీయండి.**

ఉదా: రసైక = రస + ఏక = ( అ + ఏ = ఐ )

అ) ఏకైక = ______ + ______ = (        )

ఆ) వసుధైక = ______ + ______ = (        )

SCERT, TELANGANA

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఉదా: దివ్యైరావతం | = | దివ్య + ఐరావతం | | = | ( అ + ఐ = ఐ ) |
| అ) దేశైశ్వర్యం | = | ________ | + ________ | = | ( ) |
| ఆ) అష్టైశ్వర్యాలు | = | ________ | + ________ | = | ( ) |
| ఉదా: ఘనౌషధి | = | ఘన + ఓషధి | | = | ( అ + ఓ = ఔ ) |
| అ) వనౌషధి | = | ________ | + ________ | = | ( ) |
| ఆ) మహౌషధి | = | ________ | + ________ | = | ( ) |
| ఉదా: రసౌచిత్యం | = | రస + ఔచిత్యం | | = | ( అ + ఔ = ఔ ) |
| అ) దివ్యౌషధం | = | ________ | + ________ | = | ( ) |
| ఆ) నాటకౌచిత్యం | = | ________ | + ________ | = | ( ) |

పైన ఇచ్చిన పదాలను విడదీసినప్పుడు మీరు గమనించిన విషయాలు సరిచూడండి.

అ) ఈ సంధి ఏర్పడేటప్పుడు ప్రతి సారి పూర్వస్వరంగా 'అ, ఆ' లలో ఒకటి వచ్చింది.

ఆ) పరస్వరం స్థానంలో వరుసగా ఏ, ఐ, ఓ, ఔ ఉన్నాయి.

ఇ) 'అ' కారానికి ఏ, ఐ లు కలిసినప్పుడు 'ఐ' వచ్చింది.

ఈ) 'అ' కారానికి ఓ, ఔ లు కలిసినప్పుడు 'ఔ' వచ్చింది.

**ఐ, ఔ లను 'వృద్ధులు' అంటారు.**

అంటే...

i) 'అ' కారానికి ఏ, ఐ లు పరమైతే 'ఐ' వస్తుంది.

ii) 'అ' కారానికి ఓ, ఔ లు పరమైతే 'ఔ' వస్తుంది.

'వృద్ధుల'వల్ల ఏర్పడిన సంధి కనుక ఇది వృద్ధి సంధి.

**సూత్రం :** అకారానికి (అ, ఆ లకు) ఏ, ఐ లు పరమైతే 'ఐ' కారం, ఓ, ఔ లు పరమైతే 'ఔ' కారం ఏకాదేశంగా వస్తాయి.

## ప్రాజెక్టు పని

- అందమైన పల్లెటూరు చిత్రాలను సేకరించండి. పల్లెకు సంబంధించిన కవిత / పాట సేకరించి ప్రదర్శించండి. మీ మిత్రులు రాసినవన్నీ ఒక చోట చేర్చి సంకలనం తయారు చేయండి.

**సూక్తి**

**పరిస్థితులు మారాలంటే నువ్వు మారాలి.**
**అవి బాగుపడాలంటే నువ్వు బాగుపడాలి.**
**మారుతున్న ప్రపంచంతోపాటు**
**మనమూ మారాలి.**

SCERT, TELANGANA

# 5 నగర గీతం

**- అలిశెట్టి ప్రభాకర్**

S1A9C1

## చదువండి - ఆలోచించి చెప్పండి

చాటుమాటుగా అర్ధాంగి చేటలో కన్నీళ్లు చెరుగుతున్నప్పుడు
సంసారం బరువెంతో సమీక్షించగలిగినవాణ్ణి
ఆకుపచ్చని చెట్లు, ఆహ్లాదభరితమైన వాతావరణమేమి లేకుండానే
పగలూరాత్రి ఆస్బెస్టాస్ రేకులకింద పడి ఎంత వేడెక్కినా
మాడిపోకుండా ఉండగల్గిన మానవాతీతుణ్ణి
నరకప్రాయమైన నగర నాగరికతను నరనరానా జీర్ణించుకున్నవాణ్ణి
రోజుకో రెండు కవితా వాక్యాల్ని రాయలేనా...
అది మనకు పెన్నుతో పెట్టిన విద్య... అఫ్‌కోర్సు...
కవిత్వం ఎంత నిత్యనూతనంగా వెలికి వచ్చినా
రాసిన ప్రతిదీ ఆణిముత్యం కాదని అందరికి తెలుసు

**- అలిశెట్టి ప్రభాకర్**

## ప్రశ్నలు

1. 'చాటుమాటుగా అర్ధాంగి చేటలో కన్నీళ్ళు చెరుగుతున్నప్పుడు' వాక్యం ద్వారా మీరేం గ్రహించారు?
2. కవి నివాసం ఎట్లా ఉన్నది?
3. నగర నాగరికతను నరకప్రాయమని కవి ఎందుకు అని ఉంటాడు? దానిపై మీ అభిప్రాయాలు చెప్పండి.
4. కవితాత్మక వాక్యాలు చదివారు కదా! ఈ కవి గురించి మీకు ఏమర్థమైంది?

## పాఠం నేపథ్యం / ఉద్దేశం

ఆధునిక కాలంలో మనుషులంతా నగరాల్లో జీవించాలని కోరుకుంటున్నారు. మరోవైపు పల్లెల్లో ఉపాధి అవకాశాలు తగ్గడంతో బతుకుతెరువుకోసం నగరాలకు వలసలు పెరిగాయి. నగరంలోని అనుకూలాంశాలన్నింటిని వినియోగించుకోవాలనే కోరికతో మనుషులు నగరంలో ఉండడానికి తాపత్రయపడుతున్నారు. దీనితో అనేక నగరాలు అత్యధిక జనాభాతో కిక్కిరిసిపోతున్నాయి. చాలా సమస్యలు పెరిగిపోయాయి. ప్రపంచీకరణ ప్రభావంతో నగరం శరవేగంగా తన రూపం మార్చుకుంటున్నది. సామాన్యుడికి అందనంత దూరంగా కదిలిపోతున్నది. మధ్యతరగతికి అంతుచిక్కని ప్రాంతంగా మారిపోయింది. మనిషి యాంత్రిక స్థితిలోకి మారిపోతున్నాడు. తనకుతానే పరాయీకరణకు గురవుతున్నాడు.

ఈ నేపథ్యంలో నగరజీవితంలోని యథార్థదృశ్యాల్ని మన కళ్ళముందు నిలుపుతూ నగరపు మరో పార్శ్వాన్ని చూపుతూ వాస్తవాల్ని కఠినంగా నిర్వచించిన తీరును తెలియజెప్పడమే ఈ పాఠం ఉద్దేశం.

SCERT, TELANGANA

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం "మినీ కవిత" అనే ప్రక్రియకు చెందినది. ఏదైనా ఒక అంశాన్ని కొసమెరుపుతో వ్యంగ్యంగా చురకలతో తక్కువ పంక్తుల్లో చెప్పడమే మినీ కవిత.

'అలిశెట్టి ప్రభాకర్ కవిత' అనే గ్రంథంలోని 'సిటీలైఫ్' అనే మినీ కవితలలో కొన్నిటిని 'నగరగీతం'గా కూర్చడమైనది.

## కవి పరిచయం



**12-01-1954**
**12-01-1993**

జగిత్యాల జిల్లాలోని జగిత్యాల జన్మస్థలం. మొదట చిత్రకారుడుగా జీవితం ప్రారంభించాడు. ప్రారంభంలో పండుగల, ప్రకృతి దృశ్యాల, సినీనటుల బొమ్మలను పత్రికలకు వేశాడు. తరువాత జగిత్యాలలో 'సాహితీమిత్రదీప్తి' సంస్థ పరిచయంతో కవిత్వరంగంలోకి ప్రవేశించాడు. 1974లో ఆంధ్రసచిత్ర వారపత్రికలో వచ్చిన 'పరిష్కారం' అచ్చయిన ఆయన మొదటి కవిత. జగిత్యాలలో 'స్టూడియో పూర్ణిమ' (1976), కరీంనగర్‌లో 'స్టూడియో శిల్పి' (1979) హైదరాబాద్‌లో 'స్టూడియో చిత్రలేఖ' (1983) ఏర్పాటు చేసుకొని జీవికకోసం ఫోటోగ్రాఫర్‌గా జీవిత పోరాటంలో కవిగా ఎదిగాడు. ఏనాడూ సంపాదన కోసం ఆరాటపడలేదు. తన కళ ప్రజల కోసమే అని చివరివరకు నమ్మాడు. ఎర్ర పావురాలు (1978) మొదటి కవితా సంకలనం. మంటల జెండాలు, చురకలు (1979), రక్తరేఖ (1985), ఎన్నికల ఎండమావి (1989), సంక్షోభగీతం (1990), సిటీలైఫ్ (1992) అచ్చయిన కవిత్వ సంకలనాలు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆరేళ్ళపాటు సీరియల్‌గా "సిటీలైఫ్" పేరుతో హైదరాబాదు నగరంపై రాసిన మినీ కవితలతో ప్రఖ్యాతిపొందాడు. తన కవిత్వంతో పాఠకుల్లో ఆలోచనాదృక్పథాన్ని, సామాజిక చైతన్యాన్ని పెంపొందించిన కవి అలిశెట్టి ప్రభాకర్.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకోండి.

SCERT, TELANGANA

## ప్రవేశిక


**దృష్టిని బట్టి సృష్టి గోచరిస్తుంది.**

**కొందరిని కొన్ని సన్నివేశాలు విశేషంగా ఆకర్షిస్తాయి.**

**సహృదయుడు ప్రతి కదలిక నుంచీ ప్రేరణ పొందుతాడు.**

**అతనికి భాష ఆయుధమైతే, భావం కవితారూపం సంతరించుకుంటుంది.**

**నగరంలోని మూలలను, మూలాలనూ ఓ కవి హృదయం ఎట్లా దర్శించిందో - 'అలిశెట్టి' మినీ కవిత(లు) మన కళ్ళకు గడుతుంది. మనసు కిటికీ తెరిచి చూస్తే అక్షరాల వెనుక అనంత దృశ్యాలు కనిపిస్తాయి...**



## I

నగారా మోగిందా
నయాగరా దుమికిందా
నాలుగురోడ్ల కూడలిలో ఏమది?
అదే, నగరారణ్యహోరు
నరుడి జీవనఘోష

తల్లి ఒడివంటి
పల్లెసీమల్నొదిలి
తరలివచ్చిన పేదరైతులూ
ఇనప్పెట్టెల్లాంటి
ఈ పట్టణాల్లో
ఊపిరాడని మీ బతుకులూ

నగరంలో ప్రతిమనిషి
పఠనీయ గ్రంథమే
మరి నీ బతుకు
పేజీలు తిరగేసేదెవరో!

SCERT, TELANGANA

ఉదయమే
బస్సుల్లో రిక్షాల్లో
పేవ్‌మెంట్లపై విరబూసిన
కాన్వెంటు పువ్వుల సందడి
రాలే చదువుల పుప్పొడి!




- పల్లెసీమల్ని కవి తల్లిఒడితో ఎందుకు పోల్చాడు?
- పట్టణాలను 'ఇనప్పెట్టెలు' అని అనడంలో కవి ఉద్దేశం ఏమై ఉంటుంది?
- "నగరంలో ప్రతి మనిషి పఠనీయ గ్రంథమే" అనే వాక్యం గురించి మీకు ఏమర్థమైంది?
- "పేవ్‌మెంట్లపై విరబూసిన కాన్వెంటు పువ్వుల సందడి" అని కవి ఎవరి గురించి అన్నాడు? దీని గురించి మీ అభిప్రాయం తెలుపండి.

## II

సిటీ అంటే అన్నీ
బ్యూటీ బిల్డింగ్‌లు కావు
అటు భవంతులూ ఇటు పూరిళ్ళూ
దారిద్ర్యం, సౌభాగ్యం సమాంతర రేఖలు!
ఇది వెరైటీ సమస్యల మనుష్యుల
సమ్మేళన కోలాహలం!
ఎంతచేసినా ఎవరికీ
తీరిక దక్కదు కోరిక చిక్కదు
మెర్క్యూరీ నవ్వులు, పాదరసం నడకలు
కొందరికి రెండు కాళ్ళు
రిక్షావాళ్ళకి మూడుకాళ్ళు
ఉన్నవాళ్ళకి నాలుక్కాళ్ళు!
నగరంలో అన్నిపక్కలా
సారించాలి మన చూపులు
మహానగరాల రోడ్లకి
మరణం నాలుగువైపులు!
నగరం మహావృక్షంమీద
ఎవరికి వారే ఏకాకి!
నగరం అర్థంకాని రసాయనశాల!
నగరం చిక్కువీడని పద్మవ్యూహం!!




- 'సిటీ అంటే అన్నీ బ్యూటీ బిల్డింగ్‌లు కావు!' ఇది వాస్తవమేనా? ఎందుకు?
- రెండు కాళ్ళు, మూడు కాళ్ళు, నాలుగు కాళ్ళు అని కవి అనడంలో ఉద్దేశం ఏమిటి?
- "మహానగరాల రోడ్లకి మరణం నాలుగువైపులు" అంటే ఏమిటి?
- నగరాన్ని రసాయనశాల అనీ, పద్మవ్యూహం అనీ కవి అనడంలో ఉద్దేశం ఏమై ఉంటుంది?

SCERT, TELANGANA

## సారాంశం

అనేక వాహనాల శబ్దాలు, మనుషుల మాటలు, చిరువ్యాపారుల అరుపులతో నగరంలోని నాలుగు రోడ్ల కూడలిలో వినిపించే రణగొణ ధ్వనులు గుండెలదిరిపోయేలా మోగిస్తున్న ఢంకానాదంలా, ఉద్ధృతమైన వేగంతో దూకే నయాగరా జలపాతం హోరులా అనిపిస్తాయి. నిజానికవి అరణ్యంలాంటి నగరం చేస్తున్న ధ్వనిలా, నగరజీవి బతుకుపోరాటంలోంచి వచ్చిన ఉఋములాంటి శబ్దంలా ఉన్నాయని కవి వర్ణిస్తున్నాడు.

అమ్మ ఒడిలాంటి పుట్టిన ఊరును వదిలి ఉపాధికోసం నగరం తరలివచ్చిన వారికి ఇంత పెద్దపట్నంలో తలదాచుకోవడానికి కాసింత స్థలం కూడా దొరకదు. పేదరైతులు ఇనప్పెట్టెల్లాంటి ఇరుకిరుకు మురికి ప్రదేశంలో ఊపిరాడని స్థితిని అనుభవిస్తూ బతుకుతుంటారు.

నగరంలో ప్రతిమనిషీ చదవవలసిన ఒక పుస్తకం లాంటివాడు. అయితే ఎవరూ అతని బతుకు పుస్తకంలోని పేజీలను చదివేవారే ఉండరు. నగరంలోని మనిషి వెనక అనేక ఆసక్తికరమైన ఆనంద, విషాదగాథలుంటాయి. ఒక్కరైనా అతని బాగోగులు పట్టించుకునేవారే ఉండరనే చేదునిజాన్ని చెపుతున్నాడు కవి.

నగరంలో ఉదయాన్నే విరబూసిన పువ్వుల్లాంటి స్కూల్‌పిల్లలు సిటీబస్సుల్లో, ఆటోల్లో, పేవ్‌మెంట్లపై సందడి చేస్తుంటారు. వారి మాటల్లోంచి చదువులసారం పుప్పొడిలా రాలుతుంటుంది.

నగరం నిండా అన్నివైపులా అందమైన ఎత్తైన భవనాలు ఉంటాయనుకోవద్దు. ఒకవైపు ఖరీదైన భవంతుల పక్కనే చిన్న చిన్న పూరిపాకలూ ఉంటాయి. ఇక్కడ ఐశ్వర్యం, దారిద్ర్యం పక్కపక్కనే సమాంతర రేఖలుగా కనిపిస్తాయి. నగరం వైవిధ్యమైన సమస్యలతో విభిన్నమనస్తత్వాలతో కలసిపోయి కలకలంతో నిండి ఉంటుంది. ఎంత నిరంతరాయంగా పనిచేసినా నగరంలోని మనిషికి విశ్రాంతి తీసుకోవడానికి అనువైన సమయం దొరకదు. సంపాదించిన ధనంతో కోరికను తీర్చుకునే తీరిక దొరకదు. కృత్రిమమైన వెలుగుల్లాంటి అసహజపు నవ్వులతో, స్థిరత్వంలేని హడావుడి నడకలతో వెళ్ళేవాళ్ళు, ఆటోరిక్షాల్లో తిరిగేవాళ్ళు, కార్లలో ప్రయాణించే ధనవంతులూ ఉంటారు.

నగరంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. అక్కడ అన్నివైపులా ప్రమాదాలు పొంచి ఉంటాయి. నాలుగుదిక్కుల్లోని రోడ్లలో మృత్యువు పొంచి ఉంటుందని కవి హెచ్చరిస్తున్నాడు.

వృక్షాలమీద ఉండే పక్షులు పరస్పరం కలిసిపోయి కలివిడిగా ఉంటాయి. నగరమనే మహావృక్షంమీద నివసించే ఈ మనుషులు సాటిమనిషితో ఎటువంటి ఆత్మీయమైన పలకరింపులు లేకుండా ఇరుగూపొరుగనే భావన కూడా లేకుండా ఎవరికి వారే ఏకాకిగా బతుకుతుంటారు. ఈ యాంత్రిక మానసికస్థితిని నిరసిస్తున్నాడు కవి.

ప్రయోగశాలలో ఏవేవో రసాయన ద్రవాలు, ఆమ్లాలు ఉంటాయి. వాటి చర్యలు అందరికీ అర్థం కావు. నగరం అంతకంటే అర్థంకాని రసాయనశాలలా ఉంటుంది. నగరంలో బతుకుదామని వచ్చినవాళ్ళు, ఉపాధి దొరకకపోయినా ఏదో ఒకరోజు దొరుకుతుందని ఆశగా వేచిచూస్తుంటారు. ఇక్కడి సౌకర్యాలు, విలాసాలు, వినోదాలు పైపై మెరుగులు బలంగా ఆకర్షిస్తాయి. మరోవైపు నిరుద్యోగం, జీవనవ్యయం భయపెడుతున్నా నగరం విడిచి వెళ్ళబుద్ధికాదు. కాలుష్యం కలవరపెట్టినా, ట్రాఫిక్ జామ్‌లో జీవితం ఇరుక్కుపోయినా నగరం విడిచి ప్రశాంతంగా పల్లెలకు తిరిగిపోనియ్యని, చిక్కుముడి విడదీయలేని పద్మవ్యూహం లాంటిది నగరం.

SCERT, TELANGANA

J3U4T2

# ఇవి చేయండి

## I అవగాహన - ప్రతిస్పందన

**1. కింది అంశాలలో ఒకదాని గురించి చర్చించండి.**

అ) మీరు ఇప్పటివరకు ఏఏ నగరాలను చూశారు? మీరు చూసిన నగరాల్లో మీకు నచ్చిన, నచ్చని అంశాలు తెలుపండి.

ఆ) మీ ఊరి నుండి ఎవరైనా నగరాలకు వలస వెళ్ళారా? ఎందుకు వెళ్ళవలసి వచ్చింది? వాళ్ళు అక్కడ ఏం చేస్తున్నారు?

**2. పాఠం ఆధారంగా కింది కవితా పంక్తుల్లో దాగిన అంతరార్థాన్ని గుర్తించి రాయండి.**

అ) నగరంలో ప్రతి మనిషి పఠనీయగ్రంథమే.

ఆ) నగరం మహావృక్షంమీద ఎవరికి వారే ఏకాకి.

ఇ) మహానగరాల రోడ్లకు మరణం నాలుగు వైపులు.

**3. కింది వచన కవితను చదవండి.**

నా జ్ఞాపకాల్లో గూడు కట్టుకొన్న మమతల ముల్లె
మలిన మెరుగని మట్టి మనుషుల ఎదమల్లె నా పల్లె!

చుట్టూ బాంధవ్యాల పాతాళ గరిగె నా పల్లె
అనుబంధాల పెరుగు గురిగి నా పల్లె!

తనువంతా తంగేడు పూలు పేర్చుకొన్న బతుకమ్మ
కాపురాజయ్య గీతల్లో బోనాలెత్తిన పల్లెపడతి బొమ్మ

అసోయ్ దూలాల పీరీల పండుగ
అలాయ్ బలాయ్‌ల దసరా పండుగ
ఆటల అల్లిబిల్లి జూలా నా పల్లె!

నా పల్లెలో మా ఇళ్ళు
ఊరంతటికి ఆనందాల్ని పంచే లోగిళ్ళు!

*** కవిత చదివారు కదా! కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

అ) కవితలోని ప్రాస పదాలను గుర్తించి రాయండి.

జ. ________________________________________

SCERT, TELANGANA

ఆ) కవితలో కవి ఏయే పండుగలు ప్రస్తావించాడు?

జ. ______________________________

ఇ) మనుషుల నడుమ బాంధవ్యాలను కవి వేటితో పోల్చాడు?

జ. ______________________________

ఈ) కవితకు శీర్షిక పెట్టండి. ఎందుకు ఆ శీర్షిక పెట్టారో వివరించండి.

జ. ______________________________

## II వ్యక్తీకరణ - సృజనాత్మకత

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) అలిశెట్టి ప్రభాకర్ గురించి రాయండి.

ఆ) "నగరజీవికి తీరిక దక్కదు. కోరిక చిక్కదు" అనే కవితాపంక్తుల్లోని వాస్తవాన్ని వివరించండి.

ఇ) నగర జీవితంలోని ప్రతికూల అంశాలను ఇంత కఠినంగా వర్ణించడంలో కవి ఆంతర్యం ఏమిటి?

ఈ) నగరంలో మనిషి జీవన విధానం గురించి మీ అభిప్రాయం తెలుపండి.

**2. కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి.**

అ) నేడు నగర జీవనం ఎందుకు సంక్లిష్టంగా మారిందో విశ్లేషించండి.

**3. కింది అంశం గురించి సృజనాత్మకంగా రాయండి.**

అ) మన పరిసరాల పరిశుభ్రత కోసం అందరూ కృషిచేయాలని తెలిపేటట్లు కరపత్రం రాసి ప్రదర్శించండి.

## III భాషాంశాలు

### పదజాలం

**1. కింది పదాలకు అర్థాలు రాయండి.**

అ) నగారా =

ఆ) సందడి =

ఇ) ఘోష =

ఈ) పఠనీయ గ్రంథం =

SCERT, TELANGANA

**2. కింది పదాలకు పర్యాయపదాలు రాసి వాటితో వాక్యాలు రాయండి.**

అ) నరుడు  ఆ) అరణ్యం  ఇ) రైతు  ఈ) పువ్వు

ఉ) మరణం  ఊ) వాంఛ  ఎ) వృక్షం  ఏ) పల్లె

ఉదా॥ పల్లె – గ్రామం, జనపదం

పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు అని గ్రామస్వరాజ్యం కోసం గాంధీజీ కలలు కన్నాడు. జనపదాలను బాగుజేసుడే దేశ సౌభాగ్యమనుకున్నాడు.

## వ్యాకరణాంశాలు

**1. కింది కవితాభాగాల్లోని అలంకారాన్ని గుర్తించండి.**

అ) నగారా మోగిందా
నయాగరా దుమికిందా

ఆ) కొందరికి రెండు కాళ్ళు
రిక్షావాళ్ళకి మూడు కాళ్ళు
ఉన్నవాళ్ళకి నాలుక్కాళ్ళు

**2. కింది పద్యాలలోని అలంకారాలను గుర్తించండి.**

అ) అడిగెద నని కడువడిఁ జను
నడిగినఁదను మగుడ నుడుగఁడని నడ యుడుగున్
వెడవెడ చిడిముడి తడఁబడ
నడుగిడు నడుగిడదు జడిమ నడుగిడు నెడలన్

ఆ) రంగదరాతిభంగ; ఖగరాజతురంగ; విపత్పరంపరో
త్తుంగ తమఃపతంగ; పరితోషితరంగ; దయాంతరంగ; స
త్సంగ; ధరాత్మజా హృదయ సారస భృంగ; నిశాచరాబ్జ మా
తంగ; శుభాంగ! భద్రగిరి దాశరథీ! కరుణాపయోనిధీ!

### రూపకాలంకారము

**✻ కింది వాక్యాలను పరిశీలించండి.**

(i) ఉపాధ్యాయుడు జ్ఞానజ్యోతులను ప్రకాశింపజేస్తాడు.

(ii) బతుకాటలో గెలుపు ఓటములు సహజం.

(iii) వానజాణ చినుకుపూలను చల్లింది.

(iv) నవ్వులనావలో తుళ్ళుతూ పయనిస్తున్నాం.

పై వాక్యాలను గమనించారు కదా! ఏం అర్థమయ్యింది.

SCERT, TELANGANA

మొదటి వాక్యంలో జ్ఞానమే జ్యోతిగా చెప్పబడింది. ఇందులో జ్ఞానం ఉపమేయం. జ్యోతి ఉపమానం. ఈ రెండింటికి భేదం లేనట్లు (అభేదం)గా చెప్పబడింది. ఇట్లా అభేదం చెప్పడాన్నే **'రూపకాలంకారం'** అంటారు.

**లక్షణం :** ఉపమేయానికి, ఉపమానానికి భేదం (తేడా) ఉన్నా, లేనట్లు చెపితే అది రూపకాలంకారం.

ఉదా॥ నగరారణ్య హోరు నరుడి జీవనఘోష.

**సమన్వయం :** ఇందులో నగరం ఉపమేయం. అరణ్యం ఉపమానం. ఇక్కడ ఉపమేయమైన నగరానికి, ఉపమానమైన అరణ్యానికి భేదం ఉన్నా, లేనట్లే చెప్పబడింది. కాబట్టి ఇది రూపకాలంకారం.

(ii) (iii) (iv) లలో ఒక వాక్యానికి సమన్వయం రాయండి.

ఇలాంటివి పాఠంలో వెతికి రాయండి. సమన్వయం చేయండి.

## ప్రాజెక్టు పని

- పల్లెలు / పట్నాలలోని జీవన విధానానికి గల తేడాలు పట్టికగా రాయండి. నివేదిక రాసి ప్రదర్శించండి.

## మీకు తెలుసా?

**పట్టణ వీధుల్లో విద్యుత్తు వాడకం తక్కువగా ఉండడానికి నియాన్ దీపాలను వాడుతారు. అయితే ఈ నియాన్ దీపాల వెలుగు ఆరోగ్యానికి హానికలిగిస్తున్నదని 'ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సస్టైనబుల్' అనే సంస్థ ప్రకటించింది. ముంబయి నగరంలో నియాన్ దీపాల వాడకాన్ని నిషేధించాలని ముంబయి నగరపాలక సంస్థ మీద కోర్టులో కేసువేసింది. ముంబయి కోర్టు ఒక కమిటీని ఏర్పరచింది. కమిటీ నివేదిక ప్రకారం నియాన్ దీపాల వెలుగు చాలా ఎక్కువగా ఉంటే మూర్ఛరోగం వచ్చే అవకాశం ఉంటుంది. కళ్ళు, మెదడుకు హాని కలిగిస్తుంది. అధికరక్తపీడనం, నరాలక్షీణత, అల్సరు వంటి రోగాలకు కారణమవుతుంది. అందువలన రాత్రి పదకొండు గంటలనుండి నియాన్ దీపాలను వాడరాదని హైకోర్టు తీర్పునిచ్చింది.**

**సూక్తి**

**సహజమైన పర్యావరణ పరిసరాలవల్ల**
**జీవనానందం పునరుత్తేజం పొందుతుంది.**
**జీవించాలనే తపన నిరంతరం**
**పునరావృత్తమవుతుంది.**

SCERT, TELANGANA

# 6 భాగ్యోదయం

– కృష్ణస్వామి ముదిరాజ్

F5G2S3

## చదువండి – ఆలోచించి చెప్పండి

నవభారత రాజ్యాంగ నిర్మాత, చరిత్రకారుడు, జాతీయతావాది, తత్త్వశాస్త్రవేత్త, దళిత నాయకుడు డా॥బి.ఆర్.అంబేద్కర్. దేశంలోని అస్పృశ్యతను నివారించడానికి, దళితుల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశాడు. నిమ్న వర్గాలలో 'అందరిలాగ మనమూ అన్నీ చేయగలం' అన్న ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం అతని లక్ష్యం. దేశప్రజలందరికీ సమాన హక్కులు కల్పించాలనే ఉద్దేశంతో ఉత్కృష్టమైన రాజ్యాంగాన్ని రూపొందించాడు. దేశ విదేశాలలో విద్యను అభ్యసించి ప్రపంచంలోనే మహామేధావిగా గుర్తింపు పొందాడు.

## ప్రశ్నలు

*1. పై పేరా ఎవరిని గురించి తెలుపుతున్నది?*

*2. ఆయన ఎవరి గురించి కృషి చేశాడు? ఎందుకు?*

*3. మన రాష్ట్రంలో దళితులు, నిమ్నజాతుల వారికోసం కృషి చేసిన వ్యక్తులు ఎవరు? వాళ్ళ గురించి చెప్పండి.*

## పాఠం ఉద్దేశం

స్వయంకృషి, ఆత్మవిశ్వాసం ఉంటే ప్రతి ఒక్కరూ ఏమైనా సాధించగలరు. అన్ని వర్గాల వాళ్ళలో సామాజిక భాగస్వామ్యం, చైతన్యం అవసరం. స్వార్థం పెరిగిపోతున్న ప్రస్తుత సమాజంలో ఇతరుల గురించి ఆలోచించి, వాళ్ళ ప్రగతికి తోడ్పడే వ్యక్తులు అరుదు. అటువంటి వ్యక్తిత్వం నుండి స్ఫూర్తి పొందడమే ఈ పాఠం ఉద్దేశం.

SCERT TELANGANA

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠ్యాంశం 'జీవిత చరిత్ర' ప్రక్రియకు చెందినది. విభిన్న రంగాలలో పనిచేస్తూ సమాజంమీద ప్రభావం చూపిన వ్యక్తుల విశిష్టతలను తెలుపుతూ రాసే గ్రంథమే 'జీవిత చరిత్ర'. భాగ్యరెడ్డివర్మ కుమారుడైన ఎం.బి.గౌతమ్ రచించిన 'భాగ్యరెడ్డివర్మ జీవితచరిత్ర' గ్రంథంలోని కృష్ణస్వామి ముదిరాజ్ రాసిన వ్యాసంలోనిది ఈ పాఠ్యభాగం.

## రచయిత పరిచయం



**25-08-1893**

**15-12-1967**

హైదరాబాద్‌లో సామాజిక రాజకీయ ఉద్యమాలకు నాందీ గీతం పలికిన చైతన్యశీలి కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్. ఈయన స్వాతంత్ర్య సమరయోధుడిగా రచయితగా జర్నలిస్ట్‌గా విద్యాసంస్థల స్థాపకుడిగా విద్యావేత్తగా హైదరాబాద్ మేయర్‌గా ఆంధ్రమహాసభ నిర్వాహకుడిగా బహుజన సమాజ సంస్కర్తగా ప్రజల మన్ననలందుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి. 1957లో హైదరాబాద్ నగరమేయర్‌గా ఎన్నికై నగరాభివృద్ధికోసం రాబోయే ముప్పైఏండ్ల అవసరాలకనుగుణంగా 'మాస్టర్‌ప్లాన్' తయారుచేసిన దార్శనికుడు. 'దక్కన్‌స్టార్' అనే ఆంగ్లవారపత్రికను స్థాపించి సంపాదకుడిగా విలువైన సంపాదకీయాలు, వ్యాసాలను రచించాడు. హైదరాబాద్ చరిత్రను తెలుసుకోవడానికి ఈయన రచనలు ప్రామాణిక ఆధారాలుగా నిలబడుతాయి. అంతేకాదు హైదరాబాద్ నగరాన్ని ఛాయాచిత్రాల్లో వెయ్యిపేజీల్లో బంధించి 'పిక్టోరియల్ హైదరాబాద్' అనే అద్భుతమైన గ్రంథాన్ని చరిత్రకు దృశ్యరూపంగా మనకు అందించాడు.

తన మిత్రుడు భాగ్యరెడ్డివర్మతో కలిసి దళితుల అభ్యున్నతి కోసం కృషిచేశాడు. 1948లో ఉర్దూలో 'హైదరాబాద్-కి తీన్ సాలా సియాసి జదు జిహద్' పేరుతో హైదరాబాద్‌లోని రాజకీయోద్యమాలపై గ్రంథాన్ని రాశాడు. భారత ప్రభుత్వంచే 'భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్ర' రాసే సంఘంలో ప్యానల్ సభ్యుడిగా నియమితుడయ్యాడు.

SCERT, TELANGANA

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకొండి.




**ప్రవేశిక**

***ఆయన అనేక బహిరంగ సభలు నిర్వహించాడు. సామాజిక స్వచ్ఛత గురించి చెప్పి, తన జాతి జనులను ఏకతాటి పై నడుపగలిగాడు. ఆయన చేపట్టిన పనులలోకెల్లా మరపురానిది దేవదాసి, ముర్లీ, వేశ్యాసంప్రదాయాలను అడ్డుకోవడం. ఆడ, మగ పిల్లలను దేవునికి వదిలివేయడాన్ని తీవ్రంగా నిరసించాడు. తాగుడును మాన్పించాడు - ఈ విధంగా సామాజిక బాధ్యతను నెరవేర్చడానికి తన జీవితాన్నంతా ధారపోసే మహోన్నత వ్యక్తులు కొందరే ఉంటారు. ఆ కొందరిలోనూ ముందు వరుసలో ఉండే భాగ్యరెడ్డివర్మ గురించి తెలుసుకోవడం ఎంతో అవసరం కదా!***

## I

తన జాతి జనుల బాగుకోసం చిన్నప్పటి నుండే అంకితమయిన భాగ్యరెడ్డి వర్మ 1888లో పుట్టినాడు. ఆయన చిన్నప్పుడు చదువుకున్న చదువే ఆయన జీవిత గమనాన్ని నిర్దేశించింది. అంటరాని వర్గాలు అప్పటికి అనుభవిస్తున్న అవస్థల నుంచి గట్టెక్కించడానికి ఆయన అంకిత భావంతో పని చేశాడు. తాను చదివిన చదువు వల్ల కులవ్యవస్థ అంటే ఏమిటో దాని నిజస్వరూపం ఎటువంటిదో అవగతమయింది. ఇందుకు ధర్మశాస్త్రాలను, చరిత్రను బాగా చదివినాడు. వాటి వల్ల అంటరాని వర్గాల కడగండ్లను అర్థం చేసుకోవడానికి వాటిని నిర్మూలించి వారిలో సామాజిక వికాసం కలిగించడానికి ఆయనకు దారి దొరికినట్టయింది.

అత్యంత ముఖ్యమయిన ఈ పనికి సంబంధించి ఆచరణ, ఆలోచనలో ఆయన పూర్తి స్వేచ్ఛను అనుభవించాడు. స్వతంత్రంగా పని చేశాడు. ప్రభుత్వపక్షం నుంచి సైతం ఆయనకు అండ దొరికింది.

SCERT TELANGANA

అణగారిన కులాల నాయకులతో కూడా ఈ క్రమంలో పరిచయం పెరిగింది. క్రమ క్రమంగా వారి నుంచి సహకారం, నైతిక మద్దతు కూడగట్టుకున్నాడు. గొప్ప మనుషులలో, సంస్కర్తలలో ఉండే చిత్తశుద్ధిని అలవర్చుకుని ఆయన అంటరాని వర్గాల ఉన్నతి కోసం సంస్కరణ మొదలు పెట్టాడు.

ఒకవేళ హిందూమతం, హిందువులు తమ చరిత్రను లిఖిత బద్ధం చేయాలనుకుంటే సంస్కర్తగా భాగ్యరెడ్డివర్మ పేరు మొదటిస్థానంలో ఉంటుంది. అణగారినవర్గాల వికాసానికి ఆయన తన సమస్తాన్ని అర్పించాడు. తన తెలివితేటలను అందుకోసమే వెచ్చించాడు. ఏమీ ఆశించకుండా, తమకోసం ఎప్పటికీ పనిచేసే ఆయనను చూసి అంటరాని వర్గాలన్నీ ఆయనను తిరుగులేని నాయకునిగా ఒప్పుకున్నాయి. చిత్తశుద్ధి, నిజాయితీ, పట్టుదలతో పనిచేసే వర్మ అచిరకాలంలోనే వారి నమ్మకాన్ని చూరగొనగలిగాడు. తమ దుస్థితికి కారణం తమ అజ్ఞానం, ఉదాసీనతేనన్న ఎరుకను తన అనుచరులలో కలిగేటట్టు చేయగలిగాడు.



**ఆలోచించండి-చెప్పండి**

- కుల వ్యవస్థ వలన సమాజంలో ఏం జరుగుతున్నది?
- చిత్తశుద్ధి, నిజాయితీ అంటే మీకు ఏమి అర్థమయింది?
- అజ్ఞానం, ఉదాసీనత వలన నష్టాలేమిటి? చర్చించండి.

## II

మనుషులంతా పుట్టుకతో సమానమని, ఎవరూ ఎక్కువ, ఎవరూ తక్కువ కాదన్న సత్యాన్ని తెలుసుకునేటట్టు చేశాడు. అయితే లోలోపల జీర్ణించుకుపోయిన మూఢనమ్మకాలు అజ్ఞానాన్ని తొలగించడం అంతగా సులువుకాదన్నది తెలిసిందే. అయితే కొద్ది కొద్దిగానే అయినప్పటికీ ఆయన నిరంతర శ్రద్ధ వల్ల అంటరాని వర్గాలు చదువుపై చూపు పెట్టడం సాధ్యమైంది. ఇందువల్ల కొన్ని సాంఘిక దురాచారాలు మటుమాయం కావడం జరిగింది.

ఆయన అనేక బహిరంగ సభలు నిర్వహించాడు. సామాజిక స్వచ్ఛత గురించి చెప్పి తన జాతి జనులను ఏకతాటిపై నడుపగలిగాడు. ఆయన చేపట్టిన పనులలో కెల్లా మరుపురానిది దేవదాసి, ముర్లీ, వేశ్యా సంప్రదాయాలను అడ్డుకోవడం. పసివాళ్ళయిన ఆడ, మగ పిల్లలను దేవునికి వదిలి వేయడాన్ని తీవ్రంగా నిరసించాడు. తాగుడు వలన కుటుంబాలు ఎట్లా గుల్లగా మారిపోతాయో కుల పెద్దలకు ఆ మహమ్మారి గురించి చెప్పి వారిని మానిపించగలిగినాడు. నిరంతరం తన కార్యాచరణకు దొరికే సహకారంవలన ఆయన కొన్ని కుటుంబాలను ఈ దురాచారాలనుంచి బయటపడేలా చేశాడు.

ప్రతి ఏటా జరిగే మత సాంఘికసభలకు ఆయన హాజరయ్యేవారు. ప్రజాభిప్రాయాన్ని కూడగట్టే ప్రముఖులపై ఆయన ప్రభావం ఎంతగానో ఉండేది. ఆంధ్రమహాసభ, ఆదిహిందూ మహాసభ, అఖిలభారత అంటరానివర్గాల సభ వంటి సంస్థలు జాతీయ స్థాయిలో నిర్వహించిన అనేక సభలలో ఆయన చురుకుగా పాల్గొన్నాడు. ఆయన పాల్గొన్న ప్రతి సభలో తన జాతి జనులు ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులపై వివరంగా చెప్పేవాడు. ఆయన జన జీవితంలో కాలు పెట్టినదాదిగా మొత్తం 3,348 ఉపన్యాసాలు ఇచ్చినట్టు తేలింది. ఆయన అణగారిన వర్గాలలో చైతన్యాన్ని తేవడానికి కృషి చేసినాడు.



**ఆలోచించండి-చెప్పండి**

- మూఢ నమ్మకాలు అంటే మీకేం అర్థమయ్యింది?
- వర్మ తన జాతి జనుల్లో ఏ విధమైన మార్పును తీసుకురాగలిగాడు?
- మంచివక్త అని ఎవరిని అనవచ్చు?

SCERT, TELANGANA

1925లో న్యాయమూర్తి రాయ్‌బాల ముకుంద్ అధ్యక్షత వహించిన ఒక సభలో హైదరాబాద్ సంస్థానంలో గల ఆది హిందువుల ప్రతినిధులంతా ఆయనను తమ మార్గదర్శకునిగా ఎన్నుకున్నారు. ఇది ఏ సామాజిక వర్గపు నాయకునికైనా గర్వకారణమవుతుంది. ఆయన 1925లో ఆదిహిందువుల ఆటల ప్రదర్శన నిర్వహించి, ఆదిహిందూ యువతీయువకులు సవర్ణ యువతీ యువకులతో సమంగా రాణిస్తారని నిరూపించాడు.

## III

ఆది హిందువుల మేలుకోసం వర్మ నిరంతరం చేపట్టిన కార్యాచరణ ఎంతో మంది ప్రముఖుల మనసులను చూరగొని వారు ఆదిహిందువులకు దగ్గరయ్యేలా చేసింది. భాగ్యరెడ్డివర్మ నిరంతర కార్యాచరణ సభల వలన ఆదిహిందూ సమాజం జాగరూకమయ్యింది. ఆదిహిందువులు సొంతకాళ్ళ మీద నిలబడాలంటే చదువు ఒక్కటే మార్గమని వర్మ బలమయిన నమ్మకం. ఈ విషయంలో ఆయన ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి తన బాధ్యతను గుర్తించేలా చేశాడు.



**ఆలోచించండి-చెప్పండి**



- చదువుకోవడం వల్ల సమాజం ఏవిధంగా చైతన్యవంతమవుతుంది?
- నాయకత్వ పటిమను ఏవిధంగా అంచనా వేయవచ్చు?

కృషి, పోరాటం ఫలితంగా ప్రభుత్వం ఆదిహిందువుల కోసం ఎన్నో పాఠశాలలు నెలకొల్పింది. 1931 జనాభా లెక్కల సేకరణ సందర్భంగా వర్మ ఎంతగానో శ్రమపడి అంటరాని వర్గాలను ఆది హిందువులుగా నమోదు చేయించాడు. ఇది ఆయన నాయకత్వ పటిమకు మచ్చుతునక. హిందూ సమాజం మొత్తంగా ఆయనకు రుణపడి ఉండాలె. ఆ చర్యతో హిందూ సమాజాన్ని ఆయన చీలికలు, పేలికలు కాకుండా రక్షించగలిగాడు.

I4L9Y2

## ఇవి చేయండి

## I అవగాహన - ప్రతిస్పందన

**1. నిమ్న వర్గాలలో భాగ్యరెడ్డి వర్మ తెచ్చిన మార్పులు చెప్పండి.**

**2. భాగ్యరెడ్డి వర్మ, అంబేద్కర్‌ల మధ్య పోలికలను తెలుపండి.**

**3. కింది పేరా చదువండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.**

మహారాష్ట్రలో పుట్టిన జ్యోతిబాపూలె బహుజనుల అభివృద్ధికి విశేషకృషి చేశాడు. దొరల దోపిడీ దౌర్జన్యాలను ధైర్యంతో ఎదుర్కొన్నాడు. పేదలందరికీ విద్య అందుబాటులోకి రావాలని ఉద్యమాలు చేశాడు. సత్యశోధక సమాజం ఏర్పాటు చేశాడు. బి.యస్.వెంకటరావు హైదరాబాద్‌లోని ఘాస్‌మండిలో పుట్టాడు. హైదరాబాదు

SCERT TELANGANA

అంబేద్కర్‌గా ప్రసిద్ధి చెందాడు. హైదరాబాదులో అంబేద్కరిజానికి పాదులు తీసి, దారులు వేశాడు. సమరోత్సాహంతో దళిత ఉద్యమాలను నడిపిన ధీశాలి. హైదరాబాద్‌లో దేవదాసీ దురాచార నిర్మూలనకు, దళితులలో విద్యాభివృద్ధికి కృషి చేశాడు. 1926లో ఆదిహిందూ మహాసభను స్థాపించాడు.

సరైన జవాబు గుర్తించి కుండలీకరణం(బ్రాకెట్)లో రాయండి.

అ) జ్యోతిబాపూలె స్థాపించిన సమాజం పేరు ఏమిటి? ( )

అ) సత్యశోధక ఆ) సమసమాజం ఇ) నవసమాజం

ఆ) పేదలందరికీ అందుబాటులోనికి రావలిసింది. ( )

అ) డబ్బు ఆ) చదువు ఇ) న్యాయం

ఇ) దేవదాసీ దురాచార నిర్మూలనకు కృషిచేసింది. ( )

అ) జ్యోతిబాపూలె ఆ) అంబేద్కర్ ఇ) బి.ఎస్.వెంకటరావు

ఈ) ఆదిహిందూ మహాసభను స్థాపించిన సంవత్సరం. ( )

అ) 1936 ఆ) 1926 ఇ) 1916

## II వ్యక్తీకరణ - సృజనాత్మకత

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాలలో జవాబులు రాయండి.**

అ) చదువుకుంటే కలిగే లాభాలను తెలుపండి.

ఆ) అసమానతలు తొలగి సమానత్వం రావాలంటే ఏం జరగాలి?

ఇ) అంకితభావంతో పని చేయడం అంటే ఏమిటి?

ఈ) వ్యసనాల వలన ఎట్లాంటి నష్టాలు కలుగుతాయి?

**2. కింది ప్రశ్నలకు పది వాక్యాలలో జవాబులు రాయండి.**

అ) మీ చుట్టూ ఉన్న సమాజంలో నెలకొన్న మూఢనమ్మకాలను పారదోలడానికి మీరు ఏం చేయగలరు?

(లేదా)

ఆ) భాగ్యరెడ్డివర్మ ఆదిహిందువులకోసం చేసిన కృషిని వివరించండి.

**3. కింది అంశాన్ని గురించి సృజనాత్మకంగా / ప్రశంసిస్తూ రాయండి.**

అ) భాగ్యరెడ్డివర్మ గురించి తెలుసుకున్నారు కదా! ఇట్లాగే సమాజం కోసం పాటుపడిన వాళ్ళలో ఎవరి గురించైనా 'అభినందన' వ్యాసం రాయండి.

SCERT, TELANGANA

## పదజాలం

**1. కింది పదాలకు పర్యాయ పదాలను రాయండి.**

అ) అండ = ______________, ______________

ఆ) ఉన్నతి = ______________, ______________

ఇ) స్వేచ్ఛ = ______________, ______________

ఈ) వికాసం = ______________, ______________

**2. కింది పదాలను ఉపయోగిస్తూ సొంతవాక్యాలు రాయండి.**

అ) ఏకతాటిపై = ______________________________

ఆ) మచ్చుతునక = ______________________________

ఇ) మహమ్మారి = ______________________________

ఈ) నిరంతరం = ______________________________

**3. కింది పదాలను / పదబంధాలను వివరించి రాయండి.**

అ) అంకితం కావడం = ______________________________

ఆ) నైతిక మద్దతు = ______________________________

ఇ) చిత్తశుద్ధి = ______________________________

ఈ) సాంఘిక దురాచారాలు = ______________________________

ఉ) సొంతకాళ్ళపై నిలబడడం = ______________________________

## వ్యాకరణాంశాలు

### ప్రత్యక్ష కథనం

*** కింది వాక్యాలను పరిశీలించండి.**

అ) "అక్కా! ఆ చెరువు జూడు."

ఆ) "నేను రాన్రా తమ్ముడు."

ఇ) "పిల్లలూ! రేపు బీర్‌పూరు జాతరకు వెళుతున్నాను."

ఈ) "మేమూ వస్తాం సర్."

SCERT, TELANGANA

పై వాక్యాలను పరిశీలించారు గదా!

పై వాక్యాలు నేను, మేము మొదలైన వారు చెబుతున్నట్లుగా ఉన్నాయి కదా!

ఇట్లా ఉత్తమపురుషలోని వాక్యాలు సాధారణంగా ప్రత్యక్షంగా చెపుతున్నట్లు ఉంటాయి. కాబట్టి ఇవి "ప్రత్యక్ష" కథనంలో ఉన్న వాక్యాలు. – ప్రత్యక్ష కథనానికి ఉద్ధరణ చిహ్నాలు ( "   " ) ఉండాలి.

**కింది ఉదాహరణలను పరిశీలించండి.**

అ) "మనుషులంతా పుట్టుకతో సమానం, ఎవరూ ఎక్కువకాదు, ఎవరూ తక్కువ కాదు" అన్నాడు భాగ్యరెడ్డి వర్మ.

ఆ) రుద్రమదేవి తల్లి నారాంబతో "నువ్వు నేను మామూలు స్త్రీలం కాదు. నువ్వు పట్టమహిషివి, నేను భావి చక్రవర్తిని, మనకు కండ్లు మటుకే ఉండాలి కాని కన్నీళ్ళు ఉండకూడదు" అన్నది.

పై ఉదాహరణలను పరిశీలిస్తే ప్రత్యక్ష కథనంలో రాసేటప్పుడు కింది నియమాలను గుర్తుంచుకోవాలని తెలుస్తున్నది.

- ఒకరు చెప్పిన మాటలు / వాక్యాలను చెప్పింది చెప్పినట్లే రాయాలి.
- ఆ మాటలకు / వాక్యాలకు ఉద్ధరణ చిహ్నాలు ఉండాలి.
- ప్రథమపురుషలో ఉన్న పదాలు (అనగా తమను, తమ, తాను, తాము వంటి పదాలు) ఉత్తమ పురుషలోనికి నేను, మేముగా మారుతాయి.

## పరోక్ష కథనం

* **కింది వాక్యాలు చదువండి.**

అ) హర్షవర్ధన్ తాను రానని హర్షిణితో అన్నాడు.

ఆ) ప్రధానోపాధ్యాయుడు చెప్పినట్లు చేస్తామని పిల్లలు అన్నారు.

ఇ) తనను క్షమించమని రాజు తన మిత్రునితో అన్నాడు.

పైనున్న వాక్యాలు చదివారు కదా!

ఇవి సూటిగా వాళ్లే చెప్తున్నట్లుకాకుండా! ఇంకొకళ్ళు చెప్తున్నట్లున్నాయి కదా!

ఇలాంటి వాక్యాలను "పరోక్ష కథనం"లో ఉన్న వాక్యాలు అంటారు.

వీటిలో ఉద్ధరణ చిహ్నాలు ఉపయోగించవలసిన అవసరం లేదు.

SCERT, TELANGANA

**కింది వాక్యాలను చదువండి. ఏం మార్పు జరిగిందో చెప్పండి.**

అ) "నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను" అన్నాడు శ్రీనివాస్. (ప్రత్యక్ష కథనం)

ఆ) తాను తన దేశాన్ని ప్రేమిస్తున్నానని శ్రీనివాస్ అన్నాడు. (పరోక్ష కథనం)

మొదటి వాక్యంలో శ్రీనివాస్ మాటలకు ఉద్ధరణ చిహ్నాలు పెట్టారు.

రెండవ వాక్యంలో శ్రీనివాస్ మాటలను ఇంకొకరు చెప్పినట్లు రాశారు.

ఇందుకోసం ఉద్ధరణ చిహ్నాలు తీసేసి "అని" చేర్చి వాక్యం రాశారు.

మొదటిది ప్రత్యక్ష కథనం. రెండవది పరోక్ష కథనం.

పై ఉదాహరణల పరిశీలన ద్వారా పరోక్ష కథన వాక్యాలు రాసేటప్పుడు కింది నియమాలను గుర్తుంచుకోవాలని తెలుస్తున్నది.

పరోక్ష కథనంలో ఉద్ధరణ చిహ్నాలు తొలగించి "అని" చేరుస్తారు.

ఉత్తమ పురుష పదాలు **నేను, మేము, నా, మా** వంటివి. ప్రథమ పురుష పదాలుగా **తాను, తాము, తన తమ** లుగా మారుతాయి.

పాఠంలోని పరోక్ష కథన వాక్యాలను గుర్తించండి. వాటిని ప్రత్యక్ష కథన వాక్యాలుగా మార్చండి.

## ప్రాజెక్టు పని

- బడుగువర్గాల కోసం కృషిచేసిన జ్యోతిబాపూలె, అంబేద్కర్, సావిత్రీబాయిపూలె జీవితాల్లోని ఏదైనా ముఖ్యమైన ఘట్టాన్ని మీ మాటల్లో రాయండి. నివేదిక రాసి తరగతిలో చదివి వినిపించండి.

**సూక్తి**

**మంచి సమాజం మనిషి శరీరం వంటిది. అందుకే శరీరమైనా, సమాజమైనా - అందులో ఏ ఒక్క భాగానికి బాధ కలిగినా, నివారణకు అందరూ నడుం బిగించాలి.**

**- వినోబాభావే**

SCERT, TELANGANA

**చదువండి - తెలుసుకొండి**

# తెలంగాణ గర్వించదగ్గ పరిశోధకుడు 'శాసనాల శాస్త్రి - బి.ఎన్.శాస్త్రి'



కొందరు ఏ పని చేసినా దీంట్లో నాకేం లాభం? అని ఆలోచిస్తుంటారు. 'నాదంతా దాచుకోవాల'నుకొనేవారు కొందరైతే, దొరికినంత దోచుకోవాలనుకొనేవారు మరికొందరు. కాని నిస్స్వార్థంగా నిజాయితీగా తన సంపదను, జ్ఞానసంపదను సమాజాభివృద్ధికి సమర్పణచేసే త్యాగధనులు కొందరే. అలాంటివారిలో బి.ఎన్.శాస్త్రి ముందువరుసలో నిలుస్తాడు.

బి.ఎన్.శాస్త్రి పూర్తిపేరు భిన్నూరి నరసింహశాస్త్రి. పుట్టింది యాదాద్రి భువనగిరి జిల్లా ఇంద్రపాలనగరం (తుమ్మలగూడెం). స్వస్థలం వలిగొండ. కవి, రచయిత, విమర్శకుడు, సంపాదకుడు, చారిత్రక పరిశోధకునిగా బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించాడు. ఎన్ని రంగాలలో కృషిచేసినా వారి పేరు వినగానే చరిత్ర పరిశోధకుడే కళ్ళముందు మెదులుతాడు. ఏడేండ్ల వయసులో ఉన్నప్పుడు వాళ్ళ ఊరి గుడిదగ్గర చెండాట ఆడుతున్నాడు. చెండు కోనేరులో పడ్డది. తేవడానికి వెళ్ళాడు. అక్కడ రాయిపై ఏవో అక్షరాలు కనిపించినాయి. అవేమిటో తెలుసుకోవాలనుకున్నాడు. ఆ కోరిక, పట్టుదలే అతడిని తరువాతి కాలంలో పరిశోధకుడిగా నిలిపాయి.

తొమ్మిదోతరగతిలోనే 'సంధ్యారాగం' నవల రాశాడు. తపోభంగం, పాపాయి పతకం (గేయకావ్యాలు), రాధ జీవనం, తీరని కోరిక, వాకాటక మహాదేవి వంటి నవలలు, నిర్బంధవిద్య, అపోహ వంటి నాటకాలు, పులిజాల వెంకటరంగారావు జీవితచరిత్ర, కాశీఖండము - దాని ప్రాశస్త్యము (సాహిత్య విమర్శ) వంటి రచనలు చేశాడు. ఇవన్నీ ఒక ఎత్తైతే ఆంధ్రదేశచరిత్ర - సంస్కృతి (3 భాగాలు), భారతదేశచరిత్ర-సంస్కృతి (21 సంపుటాలు) మరొకఎత్తు. వీటితోపాటు నల్లగొండ, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల సర్వస్వాలను, రెడ్డిరాజ్య, బ్రాహ్మణరాజ్య సర్వస్వాలను ప్రకటించాడు. 12 శాసన సంపుటాలను ప్రకటించాడు. వేల గ్రామాలు తిరిగి వందలకొద్ది శాసనాలను వెలికితీసి 'శాసనాల శాస్త్రి'గా కీర్తి పొందాడు. నిష్పక్షపాతంగా, ప్రామాణిక చరిత్రను జాతికందించాడు.

పట్టుదలకు పర్యాయపదం బి.ఎన్.శాస్త్రి. ఎం.ఎ. చదివిన తరువాత శాసనాలపై పరిశోధన చేయాలనుకున్నాడు. కాని పుట్టపర్తి శ్రీనివాసాచార్యులు 'తెలుగు చదివినోడికి శాసనాలేందెలుస్తయ'ని ఎక్కిరించాడు. దీన్ని సవాలుగా తీసుకొని 'శాసన సాహిత్యంలో తెలుగుభాషా వికాసం' అన్న విషయంపై పిహెచ్.డి. చేశాడు. దీనికోసం పాళి, ప్రాకృత భాషలు, వివిధ శాసన లిపులను నేర్చుకొన్నాడు. ఈ పరిశోధనలో భాగంగా ఆదికవి నన్నయ కాదు నన్నెచోడుడు అని నిరూపించాడు. అయితే ఈ విషయాన్ని జీర్ణించుకోలేని విశ్వవిద్యాలయ ఆచార్యులు పరిశోధనగ్రంథంలో ఆ భాగాన్ని తీసేస్తేనే పిహెచ్.డి. పట్టానిస్తామన్నారు. కాని ఆత్మాభిమానియైన శాస్త్రి తాను సప్రమాణంగా నిరూపించిన దాన్ని తీసివేయడానికి ఒప్పుకోక పిహెచ్.డి.నే వదులుకున్నాడు. ఇదీ ఆయన పరిశోధన నిబద్ధత. విష్ణుకుండినుల రాజధాని గుంటూరుప్రాంతం కాదని నల్లగొండప్రాంతం అని తేల్చిచెప్పాడు. నిద్రాహారాలు మాని ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా చరిత్ర రచన కోసం కృషి చేశాడు. తన మూసీ పత్రిక ద్వారా ఎన్నో చారిత్రక, సాంస్కృతిక, సాహిత్య పరిశోధనలకు తలుపులు తెరిచాడు. ఎందరో కవి, రచయితలను ప్రోత్సహించాడు. తన పుస్తకాలద్వారా వచ్చే డబ్బును బీద విద్యార్థుల సహాయానికి వాడాడు. పరిశోధనలో, పుస్తకాల ముద్రణలో తన ఆస్తిని పోగొట్టుకొని అప్పులపాలయ్యాడు. కాని జాతికి తరగని చారిత్రక సంపదను సంపాదించిపెట్టాడు. కుల, మత, వయోభేదాలు పాటించని నిష్కపటి.

నిజాంవిమోచనోద్యమంలో పాల్గొన్న బి.ఎన్.శాస్త్రికి తెలంగాణ అంటే అమితమైన ప్రేమ. ఎన్నో సంస్థలు, విశ్వవిద్యాలయాలు చేయాల్సిన చారిత్రక పరిశోధనను ఒక్కచేతిమీదుగా చేశాడు అదీ ఎవరినీ (ఆర్థికంగా) యాచించకుండా. ఇతనే ఒక మహాసంస్థ. దేశంలో ఇలాంటి పరిశోధకులు చాలా అరుదు. అందుకే బి.ఎన్.శాస్త్రి తెలంగాణ గర్వించదగ్గ మహాపరిశోధకుడు.

SCERT TELANGANA

# 7 శతక మధురిమ

Y5C4R7

## చదువండి - ఆలోచించి చెప్పండి

నల్లగొంగడిదెచ్చి చల్లనద్దినగాని
మల్లెపూల విధంబు తెల్లఁబడునె
వేపాకు పసరెంతసేపు గాచిన గాని
తేనెతో సమముగ తియ్యఁబడునె
వెల్లిపాయలు దెచ్చి వే గంధమునఁ గూర్చ
పరిమళించునె మొల్ల విరులవలెను
కుక్కతోకకు రాతిగుండు గట్టిన గాని
వంకబోయిన కొన చక్కనగునె

కొంటెలను సజ్జనులతోను గూర్చితేమి
ఆత్మపరిశుద్ధులై భక్తులౌదురెట్లు
చక్రధర! ధర్మపురిధామ! సార్వభౌమ!
నరహరీ! భక్తజనకల్ప! నాగతల్ప!

**- నరహరి శతకము. కాకుత్థం శేషప్పకవి**

## ప్రశ్నలు

1. ఈ పద్యం ఎవరు రాశారు? ఏ శతకంలో ఉన్నది?
2. ఈ పద్యం ద్వారా మీరేమి గ్రహించారు?
3. ఇట్లాంటి పద్యాలు మీకింకా ఏమి తెలుసు?
4. వీటిని ఎందుకు నేర్చుకోవాలి?

## పాఠం ఉద్దేశం

సమాజహితాన్ని కోరి కవులు శతక రచనలు చేశారు. సమాజంలోని పరిస్థితులను తెలుపుతూ మానవులలో నైతిక, ఆధ్యాత్మిక విలువలను పెంపొందించుటకు శతక కవులు కృషిచేశారు. అట్లాంటి వివిధ శతక పద్యాల్లోని విలువలను తెలియజేయడమే ఈ పాఠ్యభాగ ఉద్దేశం.

SCERT, TELANGANA

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం శతక ప్రక్రియకు చెందినది. శతకాలలోని పద్యాలను 'ముక్తకాలు' అంటారు. ముక్తక పద్యం దేనికదే స్వతంత్ర భావంతో ఉంటుంది. శతకాల్లో మకుటం సాధారణంగా పద్యపాదం చివర ఉంటుంది. అయితే మకుట రహితంగా కూడా కొన్ని శతకాలు ఉన్నాయి. ఈ పాఠ్యభాగంలో సర్వేశ్వర, శ్రీకాళహస్తీశ్వర, మల్లభూపాలీయ, దాశరథి, నరసింహ, విశ్వనాథేశ్వర, లొంక రామేశ్వర, వేణుగోపాల శతకాల పద్యాలు ఉన్నాయి.


## కవి పరిచయం


(ఊహాచిత్రం)
(13వ శతాబ్దం)

1. ***సర్వేశ్వర శతకం :*** యథావాక్కుల అన్నమయ్య 13వ శతాబ్దికి చెందినవాడు. ఇతని శైలి ధారాళమైనది. సర్వేశ్వర శతకానికి శతక సాహిత్యంలో గొప్ప ప్రాచుర్యమున్నది.


(ఊహాచిత్రం)
(16వ శతాబ్దం)

2. ***శ్రీకాళహస్తీశ్వర శతకం :*** ధూర్జటి శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలోని అష్టదిగ్గజాల్లో ఒకడు. 16వ శతాబ్దికి చెందిన ఈయన శ్రీకాళహస్తి మాహాత్మ్యమనే ప్రబంధం రాశాడు. కృష్ణదేవరాయల ఆస్థానంలో ఉండి కూడా "రాజుల్ మత్తులు, వారి సేవ నరకప్రాయం" అని చెప్పిన ధీశాలి.


(ఊహాచిత్రం)
(17వ శతాబ్దం)

3. ***మల్లభూపాలీయం :*** ఎలకూచి బాలసరస్వతి నాగర్‌కర్నూల్ జిల్లా జటప్రోలు సంస్థానాధీశుడైన సురభి మాధవరాయల ఆస్థానకవి. తెలుగులో మొదటి త్ర్యర్థికావ్యమైన 'రాఘవ యాదవ పాండవీయం'ను రాశాడు. భర్తృహరి సంస్కృతంలో రాసిన 'సుభాషిత త్రిశతి'ని తెలుగులో అనువదించిన తొలికవి. ఈయన రచన పాండిత్య స్ఫోరకంగా ధారాళంగా ఉంటుంది.

SCERT, TELANGANA



(17వ శతాబ్దం)

4. **దాశరథి శతకం :** రామదాసుగా పేరుపొందిన కంచర్ల గోపన్న ఖమ్మం జిల్లా నేలకొండపల్లివాసి. భద్రాచలంలో శ్రీరామాలయాన్ని నిర్మించిన భక్తాగ్రేసరుడు. భద్రాచల శ్రీరామచంద్రస్వామి పేరున 'దాశరథి శతకా'న్ని రాశాడు. ఈ స్వామిపై ఎన్నో కీర్తనలను రచించిన వాగ్గేయకారుడు. అందమైన శబ్దాలంకారాలు ఈయన కవిత్వంలో జాలువారాయి.



(18వ శతాబ్దం)

5. **నరసింహ శతకం :** కాకుత్థ్సం శేషప్ప కవి జగిత్యాల జిల్లా ధర్మపురి నివాసి. నరహరి, నృకేసరి శతకాలతోపాటు ధర్మపురి రామాయణమనే యక్షగానం రాశాడు. ఈతని రచనల్లో భక్తి తత్పరతతోపాటు తాత్త్విక చింతన, సామాజికస్పృహ కనిపిస్తుంది. తెలంగాణ ప్రాంతంలోని జానపదులు కూడా నరసింహశతక పద్యాలను అలవోకగా పాడుకుంటారు.



(1934-2011)

6. **విశ్వనాథేశ్వర శతకం :** గుమ్మన్నగారి లక్ష్మీనరసింహశర్మ సిద్దిపేట జిల్లా పోతారెడ్డిపేట గ్రామంలో జన్మించాడు. మూడు వందలకుపైగా అష్టావధానాలు చేసి 'అవధాని శశాంక' 'ఆశుకవితాకేసరి' అన్న బిరుదులను పొందాడు. హిందోళ రాగంలో ఈయన పద్యపఠన విన్యాసం ప్రత్యేకమైనది. కవితా కళ్యాణి, అవధాన సరస్వతి, వాగీశ్వరీ స్తుతి, ఆద్యమాతృక, పద్యోద్యానము మొదలైనవి ఈయన రచనలు.



(1934-2000)

7. **శ్రీలొంకరామేశ్వర శతకం :** నంబి శ్రీధరరావు నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ (వేముగల్లు) నివాసి. శ్రీమన్నింబాచల మాహాత్మ్యము, శ్రీమన్నింబగిరి నరసింహ శతకం ఈయన రచనలు. 'కవిరాజ' బిరుదును పొందాడు.



(14-01-1920
03-04-2010)

8. **వేణుగోపాల శతకం :** గడిగె భీమకవి రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం నాగరకుంట గ్రామంలో జన్మించాడు. వీధిబడి వరకు విద్యాభ్యాసం చేసిన ఈయనకు పద్యరచనలో నైపుణ్యం అబ్బడం విశేషం. వేణుగోపాల శతకంలోని పద్యాలు సరళశైలిలో సుబోధకంగా ఉంటాయి.

SCERT, TELANGANA

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకొండి.


విద్యార్థుల వికాసానికి ప్రభుత్వ కానుక


## ప్రవేశిక

*మానవుల ప్రవర్తన ఎట్లా ఉండాలి? ప్రజలు ఎవరిని ఆశ్రయించాలి? స్నేహితులు ఎట్లా ఉంటారు? భగవంతుని గుణ గణాలు, భక్తులతో ఎట్లా ఉండాలి? కీర్తిమంతులు ఎవరు?మనుషుల్లోని రాక్షసగుణాలు ఏవి? అని తెలుపుతూ వివిధ శతకకర్తలు రాసిన పద్యాలను పాఠం చదివి తెలుసుకోండి. వీటి ఆవశ్యకతను అర్థం చేసుకోండి. ఆచరించే ప్రయత్నం చేయండి.*

## I



❖మ. భవదీయార్చన సేయుచోఁ బ్రథమ పుష్పంబెన్న సత్యంబు, రెం
డవ పుష్పంబు దయాగుణం, బతివిశిష్టం బేకనిష్ఠా సమో
త్సవ సంపత్తి తృతీయ పుష్పమది భాస్వద్భక్తి సంయుక్తి యో
గవిధానం బవి లేని పూజల మదింగైకోవు సర్వేశ్వరా. 1



❖శా. ఊరూరం జనులెల్ల భిక్షమిడరో, యుండంగుహల్గల్గవో
చీరానీకము వీథులందొరకదో, శీతామృత స్వచ్ఛవాః
పూరం బేరుల బారదో, తపసులం బ్రోవంగ నీ వోపవో
చేరం బోవుదురేల రాజుల జనుల్ శ్రీకాళహస్తీశ్వరా! 2



❖మ. సిరి లేకైన విభూషితుండె యయి భాసిల్లున్ బుధుండౌదలన్
గురుపాదానతి కేలనీగి చెవులందున్విన్కి వక్త్రంబునన్
స్థిర సత్యోక్తి భుజంబులన్విజయమున్ చిత్తంబునన్ సన్మనో
హర సౌజన్యము గల్గినన్ సురభిమల్లా! నీతివాచస్పతీ! 3

### ఆలోచించండి-చెప్పండి

- *దైవాన్ని పూజించే విధానాలు ఎట్లా ఉండాలి? ఎందుకు?*
- *ప్రజలు రాజులను ఆశ్రయించ వచ్చునా? ఎందుకు?*
- *సిరిలేకున్నా పండితుడు ఏయే గుణాలవల్ల శోభిస్తాడు?*

SCERT, TELANGANA

## II



❖ఉ. ఖండనభీముఁ డార్తజన బాంధవుఁ డుజ్జ్వల బాణతూణ కో
దండ కళాప్రచండ భుజతాండవ కీర్తికి రామమూర్తికిన్
రెండవ సాటి దైవమిక లేఁడనుచున్ గడగట్టి భేరికా
డాండ డడాండడాండ నినదంబులజాండము నిండ మత్తవే
దండము నెక్కి చాటెదను దాశరథీ! కరుణా పయోనిధీ!! 4

❖సీ. హరిదాసులను నిందలాడకుండినఁ జాలుఁ
సకల గ్రంథమ్ములు చదివినట్లు
భిక్షమియ్యంగఁ దప్పింపకుండినఁ జాలుఁ
జేముట్టి దానంబు చేసినట్లు
మించి సజ్జనుల వంచింపకుండినఁ జాలుఁ
నింపుగా బహుమాన మిచ్చినట్లు
దేవాగ్రహారముల్ దీయకుండినఁ జాలుఁ
గనకకంబపుగుళ్ళు గట్టినట్లు
తే.గీ. ఒకరి వర్షాశనము ముంచకున్నఁ జాలుఁ
బేరు కీర్తిగ సత్రముల్ పెట్టినట్లు
భూషణవికాస! శ్రీధర్మపురి నివాస!
దుష్టసంహార! నరసింహ! దురితదూర! 5

**ఆలోచించండి-చెప్పండి**


- *రాముని గొప్పదనాన్ని ఏ విధంగా చాటిచెప్పవచ్చు?*
- *సత్ప్రవర్తన వల్ల పొందే ఫలితాలు ఏమిటి?*
- *మోసం ఎందుకు చేయకూడదు?*

SCERT, TELANGANA

## III



❖మ. ఘనుడవ్వాడగు, వేడు త్యాగమయ దీక్షంబూని సర్వంసహా
జన దైన్యస్థితి బోనడంచి సకలాశాపేశలానంద జీ
వన సంరంభము పెంచి, దేశజననీ ప్రాశస్త్యమున్ పంచునో
అనిదంపూర్వ యశస్వి యాతడగు నన్నా! విశ్వనాథేశ్వరా! 6



❖శా. పొత్తంబై కడునేర్పుతో హితము నుద్బోధించు మిత్రుండు, సం
విత్తంబై యొక కార్యసాధనమునన్ వెల్గొందు మిత్రుండు, స్వా
యత్తంబైన కృపాణమై యరుల నాహారించు మిత్రుండు, ప్రో
చ్చిత్తంబై సుఖమిచ్చు మిత్రుడు దగన్ శ్రీలొంకరామేశ్వరా! 7



❖సీ. కలనైన సత్యంబు బలుకనొల్లనివాడు
మాయమాటల సొమ్ము దీయువాడు
కులగర్వమున పేద కొంపలార్చెడివాడు
లంచంబులకు వెల బెంచువాడు
చెడు ప్రవర్తనలందు జెలగి తిరుగువాడు
వరుసవావికి నీళ్ళు వదులువాడు
ముచ్చటాడుచు కొంప ముంచజూచెడివాడు
కన్నవారల గెంటుచున్నవాడు

గీ. పుడమిలో నరరూపుడై పుట్టియున్న
రాక్షసుడు గాక వేరౌన రామచంద్ర!
కృపనిధీ! ధరనాగరకుంటపౌరి!
వేణుగోపాలకృష్ణ! మద్వేల్పు శౌరి 8

 ఆలోచించండి-చెప్పండి 

- కవి దృష్టిలో నిజమైన ఘనుడెవరు?
- మిత్రుని సహాయం ఎన్ని విధాలుగా ఉంటుంది?
- నరరూప రాక్షసులంటే ఎవరు?

SCERT, TELANGANA

## తాత్పర్యాలు

1) సర్వేశ్వరా! నీ పూజ చేసేటప్పుడు మొదటి పుష్పం సత్యం. రెండవ పుష్పం దయ. మూడో పుష్పం మిక్కిలి విశిష్టమైన ఏకాగ్రత. ఇది భక్తియోగ విధానం. ఈ మూడు పుష్పాలు లేని పూజలను నీవు అంగీకరించవుకదా!

2) శ్రీకాళహస్తీశ్వరా! తినడానికి అడిగితే ఎవరయినా ఇంత భిక్షం పెడతారు. నివసించడానికి గుహలున్నాయి. వస్త్రాలు వీధుల్లో దొరుకుతాయి. తాగడానికి నదుల్లో చల్లని అమృతంవంటి స్వచ్ఛమైననీరు దొరుకుతుంది. తాపసులను కాపాడటానికి నీవున్నావు. అయినా ఈ ప్రజలు రాజులను ఎందుకు ఆశ్రయిస్తారో తెలియదు.

3) నీతిలో బృహస్పతి అంతటి వాడవయిన ఓ సురభిమల్లా! తలవంచి గురువు పాదాలకు నమస్కరించేవాడు, దానగుణం కలిగినవాడు, చెప్పే విషయాన్ని శ్రద్ధగా వినేవాడు. సత్యవ్రతుడైనవాడు, భుజబలంతో విజయాలను పొందేవాడు, మనస్సునిండా మంచితనం కలవాడయిన పండితుడు సంపదలు లేకున్నా ప్రకాశిస్తాడు.

4) దశరథుని కుమారా! దయాసముద్రునివైన ఓ శ్రీరామా! నీవు యుద్ధరంగంలో శత్రుభయంకరుడవు, దుఃఖాలు పొందేవారి పాలిట బంధువువు, కాంతిమంతమైన బాణాలు, అమ్ములపొది, కోదండమును కలిగి, ప్రచండ భుజతాండవంతో ధనుర్విద్యాకళలో కీర్తి పొందిన నీకు సాటివచ్చే దైవం మరొకరులేరని, మదించిన ఏనుగు నెక్కి ఢంకా మ్రోగిస్తూ భూమండలమంతా వినబడేటట్లు చాటుతాను!

5) అలంకారాలచేత శోభిల్లేవాడా! ధర్మపురిక్షేత్రంలో వెలసినవాడా! దుష్టులను సంహరించేవాడా! పాపాలను దూరంచేసేవాడా! నరసింహా! విష్ణుభక్తులను నిందించకుండా ఉంటేచాలు, అనేక గ్రంథాలను చదివినట్లే. భిక్షమిచ్చేవారిని ఆపకుంటేచాలు, అది దానము చేసినట్లే. సజ్జనులను మోసం చేయకుండా ఉంటేచాలు, గొప్ప బహుమతినిచ్చినట్లే. దేవతా మాన్యములను ఆక్రమించకుండా ఉంటేచాలు, బంగారు ధ్వజస్తంభంతో కూడిన గుడికట్టించినట్లే. ఇంకొకరి 'వర్షాశనాన్ని' (ఒక ఏడాదికి సరిపడే భోజనాన్ని) ముంచకుంటేచాలు, తన పేరుతో సత్రాలు కట్టించినట్లే అవుతుంది.

6) విశ్వనాథేశ్వరా! త్యాగంతో కూడిన దీక్షనుపూని, జనులందరి దీనస్థితిని రూపుమాపి, అందరికి సుకుమారమైన, ఆనందకర జీవితసుఖాన్ని పంచి, మాతృదేశపు గొప్పతనాన్ని ఎవరయితే విశదపరుస్తారో వారే గొప్ప వారవుతారు. అపూర్వమైన కీర్తిమంతులవుతారు.

7) ఓ లొంక రామేశ్వరా! మిత్రుడు పుస్తకంమాదిరిగా మిక్కిలినేర్పుతో మంచిని బోధిస్తాడు. కార్య సఫలతలో విలువైన ధనంవలె ఉపకరిస్తాడు. శత్రునాశనంలో స్వాధీనమైన కత్తివలె సహాయపడుతాడు. నిండు మనస్సై సుఖాన్నిస్తాడు.

8) దయకు నిధివంటివాడా! నాగరకుంట పురమునందు కొలువైనవాడా! వేణుగోపాలకృష్ణా! నా దైవమా! శౌరీ! కలలో కూడా సత్యాన్ని పలకడానికి ఇష్టపడనివాడు, మాయమాటలు చెప్పి ఇతరుల సొమ్ము అపహరించేవాడు, కులగర్వంతోటి పేదవాండ్ల ఇండ్లను నాశనం చేసేవాడు, లంచాలకు విలువను పెంచేవాడు, చెడు ప్రవర్తనతో తిరిగేవాడు, వావివరుసలను పాటించనివాడు, నవ్వుతూ ముచ్చటాడుతూనే ఎదుటివాడిని నాశనం చేయాలనుకునేవాడు, తల్లిదండ్రులను ఇంటినుంచి వెళ్ళగొట్టేవాడు ఈ భూమిమీద మానవరూపంలో ఉన్న రాక్షసుడే.



SCERT, TELANGANA

# ఇవి చేయండి

C5I7G6

## I అవగాహన - ప్రతిస్పందన

1. **శతక ప్రక్రియ శతాబ్దాల తరబడి కొనసాగుతూ ఉన్నది. పాఠంలోని శతక పద్యాల భావాలు నేటి కాలానికి కూడా తోడ్పడుతాయని భావిస్తున్నారా? ఎందుకు? చర్చించండి.**

2. **కింది భావమున్న పద్యపాదాలను పాఠంలో గుర్తించండి.**

   అ) మిత్రుడు యుద్ధరంగంలో కత్తివలె ఉపయోగపడుతాడు.

   ఆ) రాముని మించిన దైవం లేదని చాటుతాను.

3. **విద్వాన్ కలువకుంట కృష్ణమాచార్య రాసిన కింది పద్యాన్ని చదువండి. భావాన్ని సొంతమాటల్లో రాయండి. పద్యానికి తగిన శీర్షికను పెట్టండి.**

   అనుభవమ్మున నేర్చిన యట్టి చదువు
   తండ్రివలె కాపునిచ్చును తాను ముందు
   పడిన కష్టాలచే గుణపాఠమయ్యి
   తగిన ప్రేరణ - కాపాడు తల్లివోలె

   భావం : ______________________________

   ______________________________

   ______________________________

   ______________________________

   శీర్షిక : ______________

## II వ్యక్తీకరణ - సృజనాత్మకత

1. **కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

   అ) మీ దృష్టిలో అపూర్వ కీర్తిమంతుడంటే ఎట్లా ఉండాలి?

SCERT, TELANGANA

ఆ) త్యాగి లక్షణాలెట్లా ఉంటాయి?

ఇ) మిత్రుడు పుస్తకంవలె మంచి దారి చూపుతాడని ఎట్లా చెప్పగలరు?

ఈ) పూజకు సత్యం, దయ, ఏకాగ్రత అనే పుష్పాలు అవసరమని పాఠంలో తెలుసుకున్నారు కదా! మరి చదువు విషయంలో ఏవేవి అవసరమనుకుంటున్నారు?

**2. కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి.**

అ) శతక పద్యాలలోని నీతులు నిత్యజీవితంలో ఎట్లా ఉపయోగపడుతాయో విశ్లేషించి రాయండి.

**3. కింది అంశాన్ని గురించి సృజనాత్మకంగా / ప్రశంసిస్తూ రాయండి.**

అ) ఈ పాఠం ఆధారంగా మనం అలవర్చుకోవాల్సిన మంచి గుణాలు, అలవర్చుకోకూడని గుణాలను వివరిస్తూ మిత్రునికి ఒక లేఖ రాయండి.

(లేదా)

ఆ) ఏదైనా ఒక పద్యభావం ఆధారంగా నీతికథ రాసి ప్రదర్శించండి.

## III భాషాంశాలు

### పదజాలం

**1. కింది పదాలతో సొంతవాక్యాలు రాయండి.**

అ) భాసిల్లు =

ఆ) ఉద్బోధించు =

ఇ) దైన్యస్థితి =

ఈ) నరరూపరాక్షసుడు =

**2. కింది వాక్యాలలోని పర్యాయ పదాలు గుర్తించండి. రాయండి.**

అ) అడవిలో ఏనుగుల గుంపు ఉన్నది. ఆ గుంపుకు ఒక గజము నాయకత్వం వహిస్తున్నది. ఆ కరి తన గుంపులోని నాగములను రక్షిస్తుంది.

ఆ) స్నేహితులతో నిజాయితీగా ఉండాలి. ఆ నిజాయితీ ఎందరో మిత్రులను సంపాదిస్తుంది. ఆ నెచ్చెలులే మనకు నిజమైన సంపద.

SCERT, TELANGANA

ఇ) రాజుల వీరత్వానికి చిహ్నం కృపాణం. వారు కత్తిసాములో నైపుణ్యానికి ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. ఆ అసితోనే రాజులు శత్రువులపై విజయం సాధిస్తారు.

ఈ) బంగారం అంటే అందరికీ ఇష్టం. అందుకే కనకం కొనడానికి అందరూ ఆసక్తి చూపుతారు. ఆ స్వర్ణంతో స్వర్ణకారుల దగ్గరకు వెళ్ళి తమకు నచ్చిన పసిడి ఆభరణాలను తయారు చేయించుకుంటారు.

**3. కింది వాక్యాలలోని ప్రకృతి వికృతులను గుర్తించండి. వేరు చేసి రాయండి.**

అ) తూరుపు దెస ఎర్రబడింది. దక్షిణ దిశవైపున్న నేను ఒక్కసారిగా అటు తిరిగాను.

ఆ) సముద్రంలోని కెరటాలు ఉవ్వెత్తున లేస్తున్నాయి. ఆ సమయంలో సంద్రం భయాన్ని కలిగిస్తుంది.

ఇ) రాయడు తలుచుకుంటే అన్నీ సాధ్యం. రాజు మనసును పసిగట్టడం కష్టం.

## వ్యాకరణాంశాలు

**1. కింది వాక్యాలు చదివి సంధి పదాలు గుర్తించి, విడదీసి సంధుల పేర్లు రాయండి.**

అ) సీతను అందరూ బుద్ధిమంతురాలు అంటారు.

ఆ) అచ్చోట ఆ గులాబి మొక్కకు ఎన్ని పూలు పూచినాయో!

ఇ) రోగికి వైద్యుడు దివ్యౌషధం ఇచ్చాడు.

ఈ) ఎవరెస్టు నధిరోహించిన పూర్ణ సాహసవంతురాలు.

ఉ) సమాజం అభివృద్ధి చెందాలంటే సమైక్యత అవసరం.

ఊ) విద్యావంతులే ఎక్కాలంలోనైనా కీర్తించబడతారు.

**2. కింది పద్యపాదానికి గణవిభజన చేసి గురు లఘువులను గుర్తించి ఏ పద్యపాదమో తెలుపండి.**

అ) ఖండనభీముఁ డార్తజన బాంధవుఁ డుజ్జ్వల బాణతూణ కో

### ఆటవెలది

*** కింది పద్యపాదాలను గమనించండి.**

అ)

| న | హ | హ | సల | సల |
|---|---|---|---|---|
| I I I | U I | U I | I I U I | I I U I |
| బ్రతుక | వచ్చుఁ | గాక | బహుబంధ | నములైన |

ఆ)

| హ | హ | హ | హ | హ |
|---|---|---|---|---|
| U I | U I | U I | U I | U I |
| వచ్చుఁ | గాక | లేమి | వచ్చుఁ | గాఁ క |

SCERT, TELANGANA

| | హ | న | హ | సల | సల |
|---|---|---|---|---|---|
| | U I | I I I | U I | I I U I | I I U I |
| ఇ) | జీవ | ధనము | లైనc | జెడు గాక | పడుcగాక |

| | హ | న | హ | హ | న |
|---|---|---|---|---|---|
| | U I | I I I | U I | U I | I I I |
| ఈ) | మాట | దిరుగ | లేరు | మాన | ధనులు |

1. పై పద్యంలో 4 పాదాలున్నాయి.
2. ప్రతి పాదానికి ఐదు గణాలు ఉన్నాయి.
3. 1, 3 పాదాల్లో వరుసగా మూడు సూర్యగణాలు, రెండు ఇంద్రగణాలు ఉన్నాయి.
4. 2, 4 పాదాల్లో ఐదు సూర్యగణాలు ఉన్నాయి.
5. ప్రతి పాదంలో 4వ గణంలోని మొదటి అక్షరం యతి చెల్లింది.
6. ప్రాసనియమం పాటించలేదు.

* ఇట్లాంటి లక్షణాలున్న పద్యాన్ని **'ఆటవెలది'** పద్యం అని అంటారు.

♦ కింది పద్యపాదాన్ని గణ విభజన చేసి ఏ పద్యపాదమో గుర్తించండి.

"వటుని కాళ్ళు గడుగ వరహేమఘటమున".

## ప్రాజెక్టు పని

♦ 6 నుండి 10వ తరగతి వరకు చదువుకొన్న శతకాల వివరాలు కింది పట్టికలో రాయండి. నివేదిక రాసి ప్రదర్శించండి. వాటిలో ఎన్ని పద్యాలు మీరు కంఠస్థం చేశారో తెలుపండి.

| క్ర.సం | శతకం పేరు | కవి పేరు | కాలం | కంఠస్థంగా ఉన్న పద్యాల సంఖ్య |
|---|---|---|---|---|
| | | | | |

**సూక్తి**

**తన తోటి వారితో స్నేహంగా ఉంటూ ఇతరులకు మంచిని పంచుతూ, గురువులకు విధేయుడై ఉంటూ అభ్యసించే విద్య మంచి ఫలితాన్నిస్తుంది.**

SCERT, TELANGANA

# 8 లక్ష్యసిద్ధి

P8N5D8

**జూన్ 2, 2014 రోజు తెలంగాణలోని వివిధ దినపత్రికల్లో వచ్చిన సంపాదకీయ శీర్షికలు చదువండి. వాటి గురించి ఆలోచించి చెప్పండి.**

ఎన్నేళ్లో వేచిన ఉదయం - ఈనాడు

పొద్దుపొడుపు - ఆంధ్రజ్యోతి

తెలంగాణకు నవవసంతం - విశాలాంధ్ర

స్వాగతాంజలి - ప్రజాశక్తి

లక్ష్యసిద్ధి - నమస్తే తెలంగాణ

నవతెలంగాణ - సాక్షి

## ప్రశ్నలు

1. పైనున్న సంపాదకీయ శీర్షికలు ఏ విషయాన్ని తెలుపుతున్నాయి?
2. ఆ వార్తకున్న ప్రాధాన్యమేమిటి?
3. మీరెప్పుడైనా సంపాదకీయాలు చదివారా? సంపాదకీయమంటే ఏమిటి?
4. సంపాదకీయాల ద్వారా ఆయా పత్రికల గూర్చి మనం ఏం తెలుసుకోవచ్చు?

## పాఠం ఉద్దేశం

దిన పత్రికల్లోని సంపాదకీయాలు, వ్యాఖ్యలు సమాజ చైతన్యానికి తోడ్పడుతాయి. కాబట్టి విద్యార్థుల్లో సంపాదకీయ వ్యాసాలు వ్యాఖ్యల పట్ల అభిరుచిని కలిగిస్తూ ఆసక్తిని పెంపొందింపజేయడం, సాధారణ వార్తలకు, సంపాదకీయాలకు మధ్య ఉండే తేడాను, వాటి ప్రాధాన్యాన్ని అర్థం చేసుకొనేందుకు ఉద్దేశించినదే ఈ పాఠం.

SCERT, TELANGANA

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం సంపాదకీయ ప్రక్రియకు చెందినది. సమకాలీన సంఘటనలలో ముఖ్యమైన వాటిని తీసుకొని పత్రికల్లో వ్యాఖ్యాన రూపంతో పూర్వాపరాలను పరామర్శిస్తూ సాగే రచన సంపాదకీయ వ్యాసం. తక్కువ మాటల్లో పాఠకులను ఆకట్టుకుంటూ, ఆలోచింప చేయగలగడం మంచి సంపాదకీయ లక్షణం. ఇవి తత్కాలానికి సంబంధించినవే అయినా ఒక్కొక్క సందర్భంలో విభిన్న కాలాలకూ అనువర్తింపజేసుకోవచ్చు.

తెలంగాణ రాష్ట్ర అవతరణ సందర్భంగా 2వ జూన్, 2014 నాడు "నమస్తే తెలంగాణ" దినపత్రికలో వెలువడిన సంపాదకీయవ్యాసం ఇది.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకొండి.

## ప్రవేశిక

**'సంపాదకీయం' సమకాలీన ప్రపంచంలో జరిగిన స్థానిక, జాతీయ, అంతర్జాతీయ స్థాయి సంఘటనలను గాని, దాని పరిణామాలనుగాని, అద్భుత విశేషాలనుగాని వివరిస్తుంది. జాతిపిత మహాత్మాగాంధీ మృతి చెందినప్పుడు అంతర్జాతీయ స్థాయిలో పత్రికలన్నీ సంతాపం తెలియజేస్తూ గాంధీ గొప్పతనాన్ని కీర్తిస్తూ ప్రత్యేక సంపాదకీయాలు రాశాయి. అదే విధంగా మన భారతీయ క్రీడాకారులు, శాస్త్రవేత్తలు ఆయా రంగాల్లో అద్భుత విజయాలు ఆవిష్కరించినప్పుడు (ఆనాటి) దినపత్రికలన్నీ వారిని ప్రశంసిస్తూ సంపాదకీయాలు రాశాయి. అట్లాగే 1969 నుండి 2 జూన్, 2014 వరకు సాగిన తెలంగాణ రాష్ట్ర ఉద్యమం సఫలమై, తెలంగాణ సకల జనుల స్వప్నం సాకారమైన వేళ, భారతదేశ పటంపై 29వ రాష్ట్రంగా 'తెలంగాణ' అవతరించింది. ఈ సందర్భంగా పత్రికలన్నీ పతాక శీర్షికలతో ఈ వార్తను ప్రచురించి, ప్రత్యేక సంపాదకీయాలు రాశాయి. అట్లాంటి సంపాదకీయాల్లో ఒకటి ప్రస్తుత పాఠ్యాంశం. తెలంగాణ ఉద్యమ మహాప్రస్థానంలోని మైలురాళ్ళను మనకు పరిచయం చేస్తున్నదీ వ్యాసం.**

SCERT, TELANGANA

## I



"అర్ధరాత్రి వేళ ప్రపంచమంతా నిద్రిస్తున్నప్పుడు, భారత్ సజీవంగా స్వతంత్రంగా మేల్కొంటుంది. ఓక్షణం వస్తుంది. చరిత్రలో అరుదుగా వస్తుంది. పాతదనం నుంచి కొత్తదనంలోకి అడుగుపెడుతం. ఒక శకం ముగుస్తుంది. సుదీర్ఘకాలం అణచివేయబడిన జాతి ఆత్మ తన గొంతు వినిపిస్తుంది". దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు నెహ్రూ చెప్పిన ఈ మాటలు ఇప్పుడు తెలంగాణాకు అక్షరాలా సరిపోతాయి. జూన్ ఒకటవ తేదీ అర్ధరాత్రి ప్రపంచమంతా నిద్రిస్తున్నవేళ తెలంగాణజాతి తన స్వాతంత్ర్య ప్రకటన చేసింది. అది తెలంగాణ సమాజం చేసిన సమష్టి ప్రకటన. అర్ధరాత్రి వేళ ఆకాశంలో పంచ వన్నెల సూర్యులు పలకరించినట్లు... ఇంద్రధనస్సు విరగబూసినట్టు, తారలు దిగివచ్చి తెలంగాణ సంబురాల్లో తారాడినట్టు తెలంగాణ అంతా ఉద్వేగ భరితం. తెలంగాణ పోరాటం గమ్యాన్ని ముద్దాడిన క్షణమది. జాతి చరిత్రలో అరుదైన క్షణం... అత్యద్భుతమైన క్షణం!

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన వేళ మూడు తరాల బిడ్డల కండ్ల నుంచి భావోద్వేగంతో బాష్పాలు రాలాయి. 1969 ఉద్యమం మలిదశ పోరాటం, పతాకస్థాయి ఘట్టాలు... లాఠీలు, తూటాలు... గాయాలు ఇట్లా ఎవరి జ్ఞాపకాలు, అనుభూతులు వారివి. ఆనందోత్సాహాలతో పాటు పోరాటజ్ఞాపకాలు కూడా ముసురుకొని హృదయాలను ఆర్ద్రంగా మార్చాయి.

**ఆలోచించండి-చెప్పండి**

- "సుదీర్ఘకాలం అణచివేయబడిన జాతి ఆత్మ తన గొంతు వినిపిస్తుంది". ఈ మాటలన్నది ఏ సందర్భంలో? ఎవరన్నారు?
- ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర పోరాటంలోని ఏయే ఘట్టాలు ఈ ప్రాంత ప్రజల హృదయాలను ఆర్ద్రంగా మార్చాయి?

## II

తెలంగాణలోని ప్రతి అడుగడుగూ ఉద్యమ చరిత్రతో ముడిపడి పవిత్రమైన పవిత్ర స్థలమేనాయె! సచివాలయంలో నల్లపోచమ్మను మాయం చేసి 'బెజవాడ దుర్గ'ను పెట్టినప్పుడు తెలంగాణ ఉద్యోగులు పోరాటానికి దిగారు. దీంతో మళ్ళా నల్లపోచమ్మ వెలిసింది. ఇప్పుడా గుడిలోనే తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ పూజలు జేయడం! ఉద్యమం చివరి దశలో పరేడ్ గ్రౌండ్‌లో సభ పెట్టుకోవడానికి అనుమతి లభించలేదు. ఇప్పుడా మైదానంలోనే తెలంగాణ ముఖ్యమంత్రి గౌరవ వందనం స్వీకరించారు. హైద్రాబాదు వీధుల్లో ఆంక్షల్ని ధిక్కరిస్తూ తిరిగిన రోజులున్నాయి. ఇప్పుడా వీధుల్లోనే 'జై తెలంగాణ' నినాదాల్తో ఉద్యమకారులు రాచఠీవితో తిరుగాడుతున్నారు. ఉస్మానియా క్యాంపస్‌లో ఎన్ని ఉద్రిక్త ఘట్టాలని! క్యాంపస్‌లో పిల్లలను లాఠీలతో కొడుతుంటే చూడలేక, దేశ విదేశాలలోని తెలంగాణా బిడ్డలంతా తల్లడిల్లిపోయిన క్షణాలెన్నో! ఉద్యమం ప్రతి మలుపులో తెలంగాణ బిడ్డలు గన్‌పార్క్ అమరవీరుల స్తూపం దగ్గర కలుసుకొని చర్చించుకునేటోళ్ళు. వలస పాలకుల ఆంక్షల మధ్య లాఠీదెబ్బలకు జడువక ముళ్ళ తీగలను ఛేదించుకొని అమరవీరుల స్తూపం దగ్గరకు ఉరకడం చాలా మందికి అనుభవమే! జూన్ రెండు ప్రవేశ ఘడియల్లో అనేక మంది అక్కడ చేరి చెమ్మగిల్లిన కనులతో అమరవీరులకు నివాళులు అర్పించారు.

**ఆలోచించండి-చెప్పండి**

- *'జై తెలంగాణ' నినాదం బలపడడానికి దారితీసిన సంఘటనలేవి? వాటి పర్యవసానాలేవి?*
- *ఉద్యమ కాలంలో హైదరాబాదు వీధులు, మైదానాల ప్రత్యేకతలు ఏమిటి?*
- *"గన్‌పార్క్ అమరవీరుల స్తూపంతో ముడివడిన సంఘటనలెన్నో..." ఆ సంఘటనలను గురించి చర్చించండి.*

## III

స్వీయరాష్ట్రం సిద్ధించింది గనుక, ఇక జాతి సర్వతోముఖాభివృద్ధికోసం పాటుపడవలసి ఉంది. వలస పాలనలో అణచివేతకు గురైన తెలంగాణ భాష, సంస్కృతులకు మళ్ళీ ప్రాణం పోయాలె. ఉత్కృష్టమైన తెలంగాణ జీవన విధానాన్ని పునరుద్ధరించుకోవాలె. తెలంగాణా అస్తిత్వాన్ని సమున్నతంగా నిలబెట్టే కృషి ఏ ఒక్క రంగానికో పరిమితమైంది కాదు. ఇదొక సమష్టి యజ్ఞం. పరాయి పాలనలో తెలంగాణ సమాజం ఎంతో క్షోభను, సంక్షోభాన్ని అనుభవించింది. సామాజిక జీవనం ఛిద్రమైంది. సామాజిక సంబంధాలు తెగిపోయాయి. తెలంగాణ సమాజం ఇప్పుడు ప్రశాంతతను, పచ్చని బతుకును కోరుతున్నది. ఈ పునర్నిర్మాణం అంత సులభమైంది కాదు. శక్తియుక్తులన్నీ, కూడగట్టుకుని నిర్దిష్ట కార్యాచరణతో ముందుకు సాగితేనే ఈ విషాదం నుంచి బయట పడగలం. జనానికి తక్షణం కావల్సింది కడుపు నిండా తిండి. కంటి నిండా నిద్ర. రేపటి గురించి బుగులు లేని జీవితం. ఇవేమీ చంద్రుడిని తెచ్చివ్వమని కోరడంకాదు. కనీస అవసరాలు తీరడం, గౌరవమైన బ్రతుకు ప్రజల ప్రాథమిక హక్కు. కేసీఆర్ ఎన్నికల ముందు ప్రకటించిన ప్రణాళిక. అధికారం చేపట్టగానే ఇచ్చిన తొలి ప్రసంగం ఈ ఆశయ సాధనకు

SCERT, TELANGANA

అనుగుణంగానే ఉండడం హర్షణీయం! స్వాతంత్ర్యం వచ్చిన తొలి దశాబ్దాలలో అనేక సంక్షేమ పథకాలు అమలు అయ్యేవి. పరాయి పాలనలో నిధుల మళ్ళింపు పాలనా పరమైన వివక్షవల్ల అవి తెలంగాణకు అందలేదు. అందువల్ల మూడు తరాల అణచివేతలో మగ్గిన సమాజాన్ని మళ్ళా సంక్షేమ పథకాల రూపంలో ఆదుకోవడం తప్పనిసరి. రుణాలమాఫీ, రెండు పడకగదుల ఇల్లు మొదలైనవన్నీ సంక్షేమ రాజ్య విధానానికి అనుగుణమైన హామీలు. తెలంగాణకు నీటిపారుదల రంగంలో జరిగిన అన్యాయాన్ని చక్కదిద్దడం ఒక బృహత్కార్యం. కేసీఆర్ మొదటిరోజే ప్రకటించినట్లు పరిపాలనారంగంలో సంస్కరణలు ప్రవేశపెట్టడం కూడా అవసరమే. తెలంగాణ ఒకప్పుడు దేశంగా ఉండేది. స్వీయ పరిపాలన మనకు కొత్తకాదు. అపారమైన వనరులున్నాయి. ప్రజలు కష్టించే తత్వంగలవారు. బుద్ధిబలానికి కొదవలేదు. ఇందుకుతోడు మూడు తరాల పాటు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకోసం పోరాడిన జాతికి వాటి విలువ తెలిసి ఉంటుంది. అందువల్ల తెలంగాణ భవిష్యత్తుపై సందేహానికి తావులేదు. స్వతంత్ర తెలంగాణ అభివృద్ధి బాటలో పయనిస్తుంది. ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుంది.



**ఆలోచించండి-చెప్పండి**

- తెలంగాణ పునర్నిర్మాణంలో ఎట్లాంటి చర్యలు వెంటనే చేపట్టాలని సంపాదకుడు భావిస్తున్నాడు? దీన్ని మీరు సమర్థిస్తారా?
- నవ తెలంగాణ నిర్మాణంలో ప్రభుత్వ వ్యూహాలు ఏమిటి?
- తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో మీరెట్లాంటి పాత్ర పోషిస్తారు?

W2J1W4

## ఇవి చేయండి

### I అవగాహన - ప్రతిస్పందన

**1. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి కృషిచేసిన వారిని అభినందించడానికి మీ పాఠశాలలో సమావేశం నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ఏదైనా ఒక అంశం గురించి మాట్లాడాలి. మీరైతే కింది అంశాలలో దేని గురించి మాట్లాడుతారు?**

అ) రాష్ట్రసాధనలో కవులు, కళాకారుల పాత్ర.

ఆ) ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల పాత్ర.

ఇ) ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల పాత్ర.

ఈ) సకలజనుల పాత్ర.

SCERT, TELANGANA

**2. కింది పేరా చదువండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.**

1926 మే 19న గోలకొండ పత్రిక ప్రారంభమైంది. నేడు ఉన్న సదుపాయాలు నాడు పత్రికా నిర్వహణకు ఏమాత్రం లేకుండె. సంపాదకుడే అన్ని పనులు నిర్వహించుకొనేవాడు. విలేఖరిపని, వ్యాసరచయితలపని, గుమాస్తాపని, ప్రూఫ్‌రీడర్ పని ఇట్లా దాదాపు అన్ని పనులను ఒక్కరే చేయవలసివచ్చేది. ఈ పరిస్థితుల్లో గోలకొండ పత్రిక ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నది. బంధుమిత్రుల సహకారంతో సురవరం ప్రతాపరెడ్డి పట్టుదలతో పత్రిక నిర్వహించాడు. 1939 ఆగస్టు 3వ తేదీ నుండి గోలకొండ పత్రికకు సంపాదకుడిగా ప్రతాపరెడ్డి నియమితుడయ్యాడు. గోలకొండ పత్రిక ప్రతాపరెడ్డి ప్రతిభకు అద్దం పట్టింది. తెలంగాణ ప్రజానీకాన్ని జాగృతపరిచింది. ఆయన రాసిన వ్యాసాలు, విమర్శలు, సంపాదకీయాలు వెయ్యికిపైగా ఉంటాయి. పత్రికలో చర్చావేదికను నిర్వహించి సత్యాలను నిగ్గుతేల్చే అవకాశాలను విమర్శకులకు కలిగించేవాడు. వ్యక్తి స్వాతంత్ర్యం, పౌరహక్కులు, ప్రాంతీయ భాషలకు, పత్రికా స్వాతంత్ర్యానికి గడ్డురోజులున్నప్పటికీ కూడా నిజాం ప్రభుత్వం ఆంక్షలనెదుర్కొంటూ గోలకొండ పత్రిక తెలంగాణ ప్రజల్లో కొత్త భావాలను, ఆలోచనలను, చైతన్యాన్ని రగిల్చింది.

అ) గోలకొండ పత్రిక సంపాదకుడెవరు?

ఆ) నాటి పత్రికాసంపాదకులు ఏయే పనులు చేసేవారు?

ఇ) ప్రతాపరెడ్డి గోలకొండపత్రిక ద్వారా ఏం చేశాడు?

ఈ) గోలకొండ పత్రికవల్ల తెలంగాణ ప్రజలకు కలిగిన ప్రయోజనమేమిటి?

ఉ) పై పేరాకు పేరు పెట్టండి.

## II వ్యక్తీకరణ - సృజనాత్మకత

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును జాతి చరిత్రలో ఒక అద్భుతమైన ఘట్టంగా ఎందుకు అనుకుంటున్నారు?

ఆ) తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో మీరు ఎట్లాంటి పాత్ర పోషిస్తారు?

ఇ) సంపాదకీయాలు పత్రికల్లో ఎందుకు రాస్తారు?

ఈ) పత్రికల్లోని సంపాదకీయాలకు, సాధారణ వార్తాంశాలకు మధ్యనున్న భేదాలేవి?

SCERT, TELANGANA

**2. కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి.**

అ) 'సంపాదకీయాలు సమకాలీన అంశాలను ప్రతిబింబిస్తాయి'. – దీనిని సమర్థిస్తూ రాయండి.

**3. కింది అంశాన్ని గురించి సృజనాత్మకంగా / ప్రశంసిస్తూ రాయండి.**

అ) ఈ మధ్యకాలంలో చోటు చేసుకున్న ఏదైనా ఒక ప్రధాన సామాజికాంశం / సంఘటనల ఆధారంగా సంపాదకీయవ్యాసం రాయండి. మీ తరగతిలో ప్రదర్శించండి.

## III భాషాంశాలు

### పదజాలం

**1. కింది పదాలు ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి.**

అ) మురుకొను = ______________________

ఆ) ప్రాణంపోయు = ______________________

ఇ) గొంతు వినిపించు = ______________________

ఈ) యజ్ఞం = ______________________

**2. కింది పదాలకు పర్యాయ పదాలు రాసి, వాటితో వాక్యాలు రాయండి.**

ఉదా: తారలు = చుక్కలు, నక్షత్రాలు

ఆకాశంలో నక్షత్రాలు మల్లెలు విరబూసినట్లుగా ఎంతో అద్భుతంగా ఉన్నాయి.

అ) జ్ఞాపకం = __________ ______________________


ఆ) పోరాటం = __________ ______________________

ఇ) విషాదం = __________ ______________________

ఈ) సంస్కరణ = __________ ______________________

SCERT, TELANGANA

**3. దిన పత్రికలకు సంబంధించిన పదజాలం ఆధారంగా భావనా చిత్రాన్ని గీయండి.**




ఒక అంశానికి చెందిన ప్రధాన విషయాలను వర్గీకరించుకొని దానికి సంబంధించిన ఉపభావనలను / కీలకమైన వాటిని పొందుపరుస్తూ గీసే చిత్రాన్ని భావనా చిత్రం అంటారు.

(Conceptual Understanding)

## వ్యాకరణాంశాలు

**1. కింది ప్రత్యక్ష కథన వాక్యాలను పరోక్ష కథనంలోకి మార్చండి.**

అ) రాజకీయపార్టీల వారు "జనానికి తక్షణం కావల్సింది కడుపునిండా తిండి, కంటినిండా నిద్ర" అని ఎన్నికల ప్రణాళికల్లో ప్రకటించారు.

ఆ) "సుదీర్ఘకాలం అణచివేయబడిన జాతి ఆత్మ తన గొంతు వినిపిస్తుంది" అని నెహ్రూ అన్నాడు.

**2. కింది పరోక్ష కథన వాక్యాలను ప్రత్యక్ష కథనంలోకి మార్చండి.**

అ) పరిపాలనారంగంలో సంస్కరణలు ప్రవేశపెట్టడం అవసరమని ముఖ్యమంత్రి ప్రకటించాడు.

ఆ) సమాజాన్ని సంక్షేమపథకాల రూపంలో ఆదుకోవడం తప్పనిసరని మేధావులు నిర్ణయించారు.

ఇ) తెలుగులోనే రాయండని, తెలుగే మాట్లాడండని టి.వి. ఛానల్లో ప్రసారం చేశారు.

**3. కింది పదాలను విడదీసి, సంధులను గుర్తించి, సూత్రాలను రాయండి.**

అ) ప్రపంచమంతా ____________ + ____________ = ______________________

ఆ) అత్యద్భుతం ____________ + ____________ = ______________________

ఇ) సచివాలయం ____________ + ____________ = ______________________

SCERT, TELANGANA

4. **కింది పదాలకు విగ్రహవాక్యాలు రాసి, సమాసాల పేర్లు రాయండి.**

అ) బృహత్కార్యం ________________, ________________

ఆ) శక్తియుక్తులు ________________, ________________

ఇ) సంక్షేమపథకాలు ________________, ________________

## అతిశయోక్తి అలంకారం

❋ **కింది ఉదాహరణను పరిశీలించండి.**

ఉదా: హిమాలయ శిఖరాలు ఆకాశాన్ని తాకుతున్నాయి.

హిమాలయ పర్వతాలు చాలా ఎత్తుగా ఉంటాయి. కాని అవి నిజంగా ఆకాశాన్ని తాకవు. కాని వాటిని ఎక్కువచేసి చెప్పడంవల్ల 'ఆకాశాన్ని తాకుతున్నాయి' అని అంటున్నాము.

♦ **ఏదైనా ఒక వస్తువును గాని, విషయాన్ని గాని ఉన్నదాని కంటే ఎక్కువ చేసి చెప్పడం 'అతిశయోక్తి' అలంకారం.**

❋ **కింది వాటిని పరిశీలించండి. అలంకారం గుర్తించండి.**

(కింది పద్యం సీతాదేవి, అశోకవనంలో హనుమంతుని విరాడ్రూప దర్శన సందర్భంలోనిది)

అ) కం. చుక్కలు తల పూవులుగా
నక్కజముగ మేను పెంచి యంబరవీథిన్
వెక్కసమై చూపట్టిన
నక్కోమలి ముదము నొందె నాత్మస్థితిలోన్. – మొల్ల రామాయణం

ఆ) మా ఊర్లో సముద్రమంత చెరువు ఉన్నది.

ఇ) అభిరాం తాటి చెట్టంత పొడవు ఉన్నాడు.

## స్వభావోక్తి అలంకారం

❋ **కింది ఉదాహరణను పరిశీలించండి.**

శివాజీ ఎర్రబడిన కన్నులతో అదిరిపడే పై పెదవితో ఘనహుంకారముతో కదలాడే కనుబొమ్మ ముడితో గర్జిస్తూ "గౌరవించదగిన, పూజించదగిన స్త్రీని బంధించి అవమానిస్తావా?" అని సోన్‌దేవుని మందలించాడు.

పై వాక్యంలో కన్నులు ఎర్రబడటం, పై పెదవి అదరడం, గట్టిగా హుంకరించడం, కనుబొమ్మ ముడి కదలాడటం కోపంగా ఉన్నప్పుడు కలిగే స్వభావాలు. ఇట్లా ఏదైనా విషయాన్ని ఉన్నది ఉన్నట్లుగా వర్ణించడం కూడా ఒక అలంకారమే. దీన్ని 'స్వభావోక్తి' అలంకారం అంటారు.

SCERT, TELANGANA

**స్వభావోక్తి అలంకారం : విషయాన్ని ఉన్నది ఉన్నట్లుగా వర్ణించడమే 'స్వభావోక్తి అలంకారం'.**

"జింకలు బిత్తర చూపులు చూస్తూ చెవులు నిగిడ్చి చెంగు చెంగున గెంతుతున్నాయి."

పై వాక్యంలోని అలంకారాన్ని గుర్తించండి.

## ప్రాజెక్టు పని

- వివిధ దిన పత్రికల ఆధారంగా 5 సంపాదకీయ వ్యాసాలు సేకరించండి. చదివి అర్థం చేసుకోండి. కీలకాంశాలను గుర్తించండి. పట్టికలో నమోదు చేయండి. నివేదిక రాసి ప్రదర్శించండి.

| క్ర.సం | తేదీ | పత్రిక | సంపాదకీయ శీర్షిక | విషయం |
|---|---|---|---|---|
| | | | | |

## మీకు తెలుసా?

**1969 – ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం :** తెలంగాణ ప్రాంతానికి ఇచ్చిన కొన్ని రక్షణలు, షరతులు ప్రాతిపదికపై ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. పెద్దమనుషుల ఒప్పందం కుదుర్చుకొనబడింది. ప్రభుత్వానికి తగు సిఫార్సులు చేసేటందుకు ఒక ప్రాంతీయ సంఘం ఉండేది. పెద్దమనుషుల ఒప్పందం తు.చ. తప్పకుండ అమలవుతుందని కేంద్ర ప్రభుత్వంవారు హామీ ఇచ్చారు. కాని విఫలమయ్యారు. ప్రజల నమ్మకానికి ద్రోహం జరిగింది. ప్రజల్లో పెద్దపెట్టున అసంతృప్తి చెలరేగింది. తెలంగాణ ప్రజలు ముక్త కంఠంతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని కోరుకున్నారు. స్వల్ప వ్యవధిలోనే ఇది స్వచ్ఛందమైన, ఉధృతమైన ప్రజోద్యమంగా మారింది. గ్రామం మొదలుకొని నగరం వరకు అన్ని రంగాలకు చెందిన యువకులు, మహిళలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు అందరు ఉద్యమంలో పాల్గొన్నారు. నాటి పత్రికలైన 'జై తెలంగాణ', 'తెలుగుగడ్డ', 'తెలుగువాణి' కూడ వీటికి తమ మద్దతును ప్రకటించాయి. ఈ సందర్భంలోనే తెలంగాణ ప్రజాసమితి, తెలంగాణ విమోచనోద్యమ సమితి వంటి సంస్థలు ఆవిర్భవించాయి.

**సూక్తి**

సత్యాన్ని త్రికరణశుద్ధిగా నమ్మితే విజయం తథ్యం.
నెమ్మదిగానైనా సరే మనం జయించక తప్పదు.

– స్వామి వివేకానంద

SCERT TELANGANA

# 9 జీవన భాష్యం

- డా॥ సి.నారాయణ రెడ్డి

A2Q4L3

## చదువండి - ఆలోచించి చెప్పండి

పరులకోసం పాటుపడని
    నరునిబతుకు దేనికని?
మూగనేలకు నీరందివ్వని
    వాగుపరుగు దేనికని?
జల్లుకు నిలవని ఎండకు ఆగని
    చిల్లులగొడుగు దేనికని?
పదపదమంటూ పదములేగాని
    కదలని అడుగు దేనికని?

**- సినారె**

## ప్రశ్నలు

1. పరులకోసం పాటుపడటం అంటే ఏమిటి?
2. కవి ప్రశ్నల్లోని ఆంతర్యం ఏమిటి?
3. దీనిని రాసిందెవరు?

SCERT, TELANGANA

## పాఠం ఉద్దేశం

మనిషి దేన్ని గురించి నిరుత్సాహపడకూడదు. దేన్నైనా ప్రయత్నం ద్వారా సాధించవచ్చు. దుఃఖాన్ని తట్టుకుంటూ కష్టాలను ఎదుర్కొంటూ తనంతటతాను ఎదుగుతూ ఇతరుల కోసం పాటుపడుతూ జీవించే మనిషి సమాజంలో గౌరవం పొందుతాడని చెప్పడం, తెలుగులో గజల్ ప్రక్రియను పరిచయం చేయడం ఈ పాఠం ఉద్దేశం.

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం 'గజల్' ప్రక్రియకు చెందినది. గజల్‌లో పల్లవిని "మత్లా" అని, చివరి చరణాన్ని "మక్తా" అని, కవి నామముద్రను "తఖల్లుస్" అని అంటారు. పల్లవి చివర ఉన్న పదం, ప్రతి చరణం చివర అంత్యప్రాసను రూపొందిస్తుంది.

సరస భావన, చమత్కార ఖేలన, ఇంపూ, కుదింపూ గజల్ జీవగుణాలు.

ప్రస్తుత పాఠ్యభాగం "డాక్టర్ సి.నారాయణరెడ్డి సమగ్ర సాహిత్యం" ఆరవ సంపుటిలోని "తెలుగు గజళ్ళు" లోనిది.

## కవి పరిచయం



**29-07-1931**
**12-06-2017**

రాజన్న సిరిసిల్ల జిల్లా హనుమాజీపేట గ్రామంలో జన్మించిన ఆచార్య సింగిరెడ్డి నారాయణ రెడ్డి ప్రముఖకవి. గొప్ప వక్త. సాహితీపరిశోధకుడు, బహుభాషావేత్త, ప్రయోగశీలి.

నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు, మధ్యతరగతి మందహాసం, ద్విపదులు, ప్రపంచపదులు మొదలైన 70కి పైగా కావ్యాలు రాశాడు. సినిమా పాటలకు సాహితీ గుబాళింపులను అద్దిన రసహృదయుడు సినారె. "ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు - ప్రయోగములు" అన్న వీరి ప్రామాణిక సిద్ధాంత గ్రంథం ఎందరో పరిశోధకులకు మార్గదర్శకం.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖలో ఆచార్యుడుగా అధికార భాషా సంఘం అధ్యక్షుడుగా అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికీ తెలుగు విశ్వవిద్యాలయానికీ ఉపకులపతి (వైస్ ఛాన్స్‌లర్)గా పని చేశాడు. రాజ్యసభ సభ్యులుగా, ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులుగా సేవలందించాడు. భారత ప్రభుత్వం వారిచే "పద్మభూషణ్' పురస్కారంతో సత్కరించబడ్డాడు. 'విశ్వంభర' కావ్యానికి జాతీయస్థాయిలో అత్యున్నత సాహితీ పురస్కారమైన "జ్ఞానపీఠ అవార్డు"ను అందుకున్నాడు. శబ్దశక్తి, అర్థయుక్తి సినారె కలానికీ, గళానికీ ఉన్న ప్రత్యేకత.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకొండి.


SCERT TELANGANA

## ప్రవేశిక

**ఏ ఆటంకాలు లేకుండా సాఫీగా జరిగే ప్రయాణానికి ప్రత్యేకమైన గుర్తింపు ఉండదు. అనేక రకాల అవరోధాలను, ఆటుపోట్లను అనుభవిస్తూ విజయాన్ని సాధించడంలోనే ఆనందం, సంతృప్తితోపాటు నిజమైన గుర్తింపు లభిస్తుంది. అటువంటి అనేక జీవన విలువలను ఉద్బోధించే మానవ వికాస భాష్యాన్ని విందాం.**

## I

మబ్బుకు మనసే కరిగితే అది నీరవుతుంది
మనసుకు మబ్బే ముసిరితే కన్నీరవుతుంది
వంకలు డొంకలు కలవనీ జడిపించకు నేస్తం!
జంకని అడుగులు కదిలితే అది దారవుతుంది.



### ఆలోచించండి-చెప్పండి

- 'మనసుకు మబ్బుముసరడం' అనడంలో ఆంతర్యమేమిటి?
- 'జంకని అడుగులు కదిలితే అది దారవుతుం'దనడాన్ని మీరెట్లా సమర్థిస్తారు?

SCERT, TELANGANA



## II

ఎడారి దిబ్బలు దున్నితే ఫలమేముందనకు
ఇసుక గుండెలు పగిలితే అది పైరవుతుంది
మనిషీ మృగమూ ఒకటనీ అనుకుంటే వ్యర్థం
మనుషులు పదుగురు కూడితే ఒక ఊరవుతుంది

ఎంతటి ఎత్తుల కెదిగినా ఉంటుంది పరీక్ష
హిమగిరి శిరసే మాడితే అది యేరవుతుంది
బిరుదులు పొందే వ్యాప్తికీ విలువేమి "సినారె"
చెరగని త్యాగం మిగిలితే ఒక పేరవుతుంది.

### ఆలోచించండి-చెప్పండి

- మనిషీ మృగము ఒకటేనా? కాదా? చర్చించండి.
- హిమగిరి శిరసు మాడటం అంటే మీకేమర్థమయింది?
- 'చెరగని త్యాగం మిగిలితే ఒక పేరవుతుం'దనడాన్ని మీరు సమర్థిస్తారా? ఎట్లా?

### సారాంశం

నీటితో నిండిన మబ్బులు తేమతో బరువెక్కితే వర్షమై అవి భూమి మీద కురుస్తాయి. అలాగే మనసుకు ఆందోళనలు, బాధలు, చింతలు అనే దిగులుమబ్బులు కమ్ముకుంటే దుఃఖస్థితి వస్తుంది. అది కన్నీరుగా మారుతుంది.

ఒక లక్ష్యాన్ని సాధించడానికి బయలుదేరినపుడు అడుగడుగునా ఎన్నో కష్టాలు, అడ్డంకులు ఎదురవుతాయని లోకం భయపెడుతుంది. కాని ఆ మాటలకు భయపడకుండా నిరుత్సాహపడకుండా ముందుకు నడిస్తేనే విజయం లభిస్తుంది. ఆ స్ఫూర్తే నలుగురు అనుసరించే దారిగా మారుతుంది.

బీడుపడి, పనికిరాకుండా ఉన్న నేలలో ఏ పంటలూ పండవని ఏ ప్రయత్నాలూ చేయకుండానే నిరాశపడవద్దు. కష్టపడి ఆ నేలను దున్నితే, విశ్వాసంతో విత్తనాలు నాటితే మంచి పంటలు పండుతాయి.

నలుగురు మనుషులు కలిసి పరస్పర సహకారంతో జీవించడమే ఉత్తమ సాంఘిక జీవనం. సాటి మనుషుల పట్ల సానుకూల దృక్పథాన్ని ఏర్పరచుకోవాలి. అప్పుడే అందరు కలిసి ఆనందంగా జీవించగలుగుతారు. అటువంటి మనుషులు కలిస్తేనే ఒక ఊరు ఏర్పడుతుంది.

ఎంత సామర్థ్యమున్నా, అధికారం, సంపదలు ఉన్నా ఎన్నోవిజయాలు సాధించినా ఇక నాకు ఏ కష్టాలూ బాధలూ రావని ధీమాగా ఉండలేం. విధి ఎప్పుడు ఏ కష్టాలు కలిగిస్తుందో సమస్యల పరీక్షలు పెడుతుందో ఎవరూ

SCERT, TELANGANA

ఊహించలేరు. దాని శక్తిముందు ఎవరైనా తలవంచవలసిందే. ఉన్నతమైన హిమాలయ పర్వతశిఖరం కూడా ఎండ వేడికి కరిగిపోయి నదిగా ప్రవహించవలసిందే! అలాగే ఎంతటి మనిషి గర్వమైనా నీరుకారిపోవలసిందే.

మనపేరు ప్రపంచానికంతా తెలిసేలా ప్రఖ్యాతి పొందామని, ప్రతిష్ఠాత్మక బిరుదులు, సత్కారాలు పొందామని అనుకోవడంలో నిజమైనవిలువ, గుర్తింపు లేదు. మానవాళికి పనికివచ్చే గొప్పపని, చెరగని త్యాగం చేస్తేనే ఆ మనిషిపేరు చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుంది.

U6Y2Q8

## ఇవి చేయండి

### I అవగాహన - ప్రతిస్పందన

**1. కింది అంశాన్ని గురించి చర్చించండి.**

అ) "జీవనభాష్యం" అనే శీర్షిక ఈ గజల్‌కు ఎలా సరిపోయిందో చెప్పండి.

**2. పాఠం చదివి ప్రాస పదాలను గుర్తించండి. రాయండి.**

| ప్రాస పదాలు |
| --- |
| |
| |
| |
| |
| |

**3. కింది అపరిచిత గేయ పాదాలను చదువండి.**

భీతి లేక మనిషి ఎచట శిరమునెత్తి నిలుచునో
తనివి తీర జనులకెల్ల జ్ఞానసుధలు దొరుకునో
అడ్డుగోడ లేని సమసమాజమెచట నుండునో
హృదంతరాళ జనితమౌ సత్యమెచట వరలునో

ఆ స్వతంత్ర స్వర్గసీమ నిర్మింపగ తరలి రమ్ము
లెమ్ము లెమ్ము లెమ్ము లెమ్ము లెమ్ము సోదరా!

SCERT, TELANGANA

* **గేయం చదివి కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

అ) 'శిరమునెత్తి నిలుచునో' అంటే మీకేమి అర్థమైంది?

జ. ______________________________

ఆ) జ్ఞానసుధలు ఎట్లా ఉండాలని గేయంలో ఉన్నది?

జ. ______________________________

ఇ) సమసమాజం ఎట్లా ఏర్పడుతుంది?

జ. ______________________________

ఈ) సత్యం విలసిల్లడం అంటే ఏమిటి?

జ. ______________________________

ఉ) 'స్వర్గసీమ' అనడంలో అంతరార్థం ఏమిటి?

జ. ______________________________

## II వ్యక్తీకరణ - సృజనాత్మకత

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) "చెరగని త్యాగం మిగిలితే ఒక పేరవుతుంది" అంటే త్యాగం చేసేవారి, మంచిపనులు చేసే వారి పేర్లు చరిత్రలో శాశ్వతంగా నిలుస్తాయి అని అర్థం. అందుకోసం ఎట్లాంటి మంచిపనులు చేయాలి?

ఆ) "ఎడారి దిబ్బలు దున్నితే ఫలమేముందనకు" అనే వాక్యం ద్వారా విద్యార్థులకు 'సినారె' ఇచ్చే సందేశం ఏమై ఉండవచ్చు?

ఇ) 'మనుషులు పదుగురు కూడితే ఒక ఊరవుతుంది' అని 'సినారె' ఎందుకు అని ఉంటాడు?

**2. కింది ప్రశ్నలలో ఒకదానికి పది వాక్యాల్లో జవాబు రాయండి.**

అ) 'జీవనభాష్యం' అందించే సందేశాన్ని వివరించండి.

**3. కింది అంశాన్ని గురించి సృజనాత్మకంగా / ప్రశంసిస్తూ రాయండి.**

'జీవన భాష్యం" గజల్‌లోని అంత్య ప్రాసల ఆధారంగా సొంతంగా ఒక వచన కవితను రాయండి.

------ నీరవుతుంది.
------ దారవుతుంది.
------ పైరవుతుంది.
------ ఊరవుతుంది.
------ ఏరవుతుంది.
------ పేరవుతుంది.

(లేదా)

ఆచార్య సి. నారాయణరెడ్డి గారు ఒకవేళ మీ పాఠశాలకు వస్తే మీరు వారి నుండి ఏం తెలుసుకోవాలనుకొంటున్నారో ప్రశ్నలు రాయండి.

SCERT, TELANGANA

## III భాషాంశాలు

### పదజాలం

**1. కింది పదాలకు పర్యాయ పదాలు రాయండి.**

అ) మబ్బు : ______________ ______________

ఆ) గుండె : ______________ ______________

ఇ) శిరసు : ______________ ______________

**2. కింది పదాలను ఉపయోగించి సొంత వాక్యాలు రాయండి.**

అ) వ్యాప్తి : ______________________________

ఆ) జంకని అడుగులు : ______________________________

ఇ) ఎడారి దిబ్బలు : ______________________________

ఈ) చెరగని త్యాగం : ______________________________

### వ్యాకరణాంశాలు

**1. కింది పదాలు కలిపి, సంధిని గుర్తించి రాయండి.**

అ) నీరు + అవుతుంది = __________ + __________, ______________

ఆ) ఎత్తులకు + ఎదిగిన = __________ + __________, ______________

ఇ) పేరు + అవుతుంది = __________ + __________, ______________

**2. కింది పంక్తులలోని సమాస పదాలు గుర్తించి, విగ్రహవాక్యాలు రాసి, అవి ఏ సమాసాలో తెలియజేయండి.**

అ) ఎడారి దిబ్బలు దున్నితే ఫలమేముందనకు.

______________ ______________ ______________

ఆ) ఇసుక గుండెలు పగిలితే అది పైరవుతుంది.

______________ ______________ ______________

SCERT, TELANGANA

**3. కింది వాటిని చదివి ఏ అలంకారాలో గుర్తించండి.**

అ) నీకు వంద వందనాలు

జ॥ ________________

ఆ) తెలుగు జాతికి అభ్యుదయం
నవ భారతికే నవోదయం

జ॥ ________________

ఇ) రాజు రివాజులు బూజు పట్టగన్

జ॥ ________________

ఈ) అజ్ఞానాంధకారం తొలిగితే మంచిది

జ॥ ________________

## ప్రాజెక్టు పని

- డా॥ సి.నారాయణరెడ్డి రాసిన ఏవైనా రెండు గేయాలు / గజల్‌లను సేకరించండి. నివేదిక రాసి ప్రదర్శించండి.

**సూక్తి**

**మనిషిలో ఏ గుణం సన్నగిల్లినా మానవత్వం మృతి చెందకుండా ఉంటే చాలు.**
**ఆ మానవత్వమే మనిషిని మహనీయుడిని చేస్తుంది.**

SCERT, TELANGANA

# 10 గోలకొండ పట్టణము

– ఆదిరాజు వీరభద్రరావు

T2L6K7

## చిత్రాన్ని చూడండి – ఆలోచించి చెప్పండి



## ప్రశ్నలు

1. పై చిత్రంలో ఏం కనిపిస్తున్నది?
2. జెండా ఎగురవేస్తున్నవారు ఎవరు?
3. జెండాను ఎక్కడ ఎగురవేశారు? ఎందుకు?
4. గోలకొండ కోట ప్రత్యేకతలు మీకేమైనా తెలుసా?

## పాఠం ఉద్దేశం

తెలంగాణలో చారిత్రక కట్టడాలకు కొదువ లేదు. వీటిలో గోలకొండ ఘనమైన చారిత్రకప్రాధాన్యం సంతరించుకొన్నది. ఈ పట్టణం యొక్క ప్రాశస్త్యం... నాటి కోటల నిర్మాణం... మంచినీటి వసతుల కల్పన... అద్భుత సాంకేతిక నిర్మాణాలు... పట్టణంలో జరిగిన ప్రపంచస్థాయి వర్తక, వ్యాపారాలు... ఆహారపుటలవాట్లు, కోటలో జరిగిన కార్యకలాపాలు, స్థాపించిన పరిశ్రమలు, గోలకొండ పట్టణ ప్రాముఖ్యతతోపాటు 1940లనాటి తెలంగాణ వచన రచనా శైలిని తెలుపడమే ఈ పాఠం ఉద్దేశం.

SCERT, TELANGANA

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం వ్యాసప్రక్రియకు చెందినది. వ్యాసం అంటే వివరించి చెప్పడం. చరిత్రను తెలిపే వ్యాసాన్ని చారిత్రక వ్యాసం అంటారు. తెలంగాణ ప్రాంతంలోని కోటల నిర్మాణ వైభవాన్ని, విశిష్టతను తెలుపుతూ రాసిన వ్యాసమే ఈ పాఠం.

ఈ వ్యాసం ఆదిరాజు వీరభద్రరావు రాసిన 'మన తెలంగాణము' అనే వ్యాససంపుటి లోనిది.

## రచయిత పరిచయం



**16-11-1890**

**28-09-1973**

చరిత్ర, సాహిత్య పరిశోధకుడిగా ప్రఖ్యాతిగాంచిన ఆదిరాజు వీరభద్రరావు ఖమ్మంజిల్లా మధిర తాలూకాలో జన్మించి హైదరాబాదులో స్థిరపడ్డాడు. చరిత్ర రచనాకళలో ప్రామాణికస్థాయిని అందుకున్న ఈయన ప్రాచీనాంధ్ర నగరములు, లలిత కథావళి, రత్నప్రభ, జీవిత చరితావళి, జీవిత చరిత్రలు, నవ్వుల పువ్వులు, మిఠాయిచెట్టు, షితాబ్‌ఖాన్ అనే రచనలు చేశాడు. సంగ్రహాంధ్ర విజ్ఞానకోశంలో యాభైవ్యాసాలు రాశాడు. హైదరాబాద్ రేడియోలో తొలి ప్రసంగం చేసినవాడిగా చరిత్రకెక్కాడు. గ్రీకు పురాణకథలు ఇంకా మరెన్నో వ్యాసాలు అముద్రితంగా ఉన్నాయి. చాదర్‌ఘాట్ హైస్కూల్ హైదరాబాద్‌లో ప్రధాన తెలుగుపండితుడిగా పనిచేశాడు. 'లక్ష్మణరాయ పరిశోధక మండలి'కి కార్యదర్శిగా వ్యవహరించాడు. తన పాండిత్యం, పరిశోధనలతో 'తెలంగాణ భీష్ముడి'గా పేరు తెచ్చుకున్నాడు.

SCERT TELANGANA

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకొండి.

## ప్రవేశిక

***ఏ జాతికైనా, ఏ ప్రాంతానికైనా తమ చరిత్రను మరచిపోవడమంత దురదృష్టం మరొకటి ఉండదు. తెలంగాణలోనే ఎంతో విశిష్టతను సంతరించుకున్న గోలకొండ పట్టణ వైభవాన్ని, నాటి అద్భుత నిర్మాణాలను వర్ణించడానికి మాటలు చాలవు. చిరస్మరణీయమైన ఈ కట్టడంలోని సాంకేతిక నైపుణ్యాన్ని ఎందరో చరిత్రకారులు అభివర్ణించే ప్రయత్నం చేశారు. గోలకొండ వైభవాన్ని కళ్ళతో చూడవలసిందేకాని మాటల్లో చెప్పడం సాధ్యం కాదు. ఆదిరాజు వీరభద్ర రావు ఆ ప్రయత్నం చేశాడు. ఆయన మాటల్లోనే గోలకొండ పట్టణ విశేషాలను, ఆనాటి పరిస్థితులను ఈ పాఠం చదివి తెలుసుకొండి. ప్రత్యక్షంగా చూసిన అనుభూతిని పొందండి.***

## I

పట్టణమనగా గోలకొండపట్టణమనియే దక్షిణాపథమున ప్రసిద్ధి. గోలకొండ దుర్గమనగా ఒక్క కోట గాదు. మూడు కోటలు. ఈ మూడు కోటలును ఒక దానిని చుట్టుకొని మరియొకటి కట్టబడినది. మొదటి రెండవ కోటల ప్రాకారముల మధ్యముననే గోలకొండపట్టణ ముఖ్య భాగము వెలసియుండెను. దుర్గమునకు సుమారు ఏడు మైళ్ళ కైవారము, ఎనుబదిఏడు బురుజులు, ఎనిమిది దర్వాజాలు ఉండెను. సుమారు నాలుగు మైళ్ల వైశాల్యముండెను.

గోలకొండ పట్టణ నిర్మాణ పథకమునకు కర్త ఆజంఖాన్ అను ఇంజనీరు అని తెలియుచున్నది. ఈతడే పట్టణము యొక్క రూపురేఖలను దిద్దినవాడు. పట్టణమును పెక్కు భాగములుగా విభజించిరి. ఆ భాగములను మొహల్లాలు అనుచుండిరి. ఈ మొహల్లాల పేర్లు తెలుపు రికార్డులు లేవు. వివరములు బాగుగా దెలియదు. ఐనను, హక్నీకమాన్, దికాబ్‌బాగ్, కటోరాహవుజు, మీరుజుమ్లా మొహల్లా, మాదన్న మొహల్లా అను పేర్లు కొన్ని తెలియుచున్నవి. మీరుజుమ్లా, మాదన్న నివసించు మందిరాలుండుటచే ఆ ప్రాంతములకు వారి పేర్లే యుంచబడినవి.

గోలకొండ పట్టణములో ఏనుగులు, ఒంటెలు, గుఱ్ఱాలు, అధికసంఖ్యలో నుండి పట్టణములో సందడిగా సంచరించుచుండెను. కావున వీథులు విశాలములయి యుండి యుండునని మనము గ్రహించవలెను. రాజభవనాలు పడమటి దిశయందుండెను. తూర్పు, దక్షిణ, ఉత్తర ప్రాంతములందు, ప్రజా సముదాయము నివసించుచుండెను. ఉత్తర ప్రాంతము మాత్రము అధిక జనసమ్మర్దము గలిగి యుండెను.

గోలకొండ పట్టణమునకు పెంపు, సొంపులు కలిగించుటలో మొదటివాడగు కులీ కుతుబుషా, నాల్గవవాడగు ఇబ్రాహీం కుతుబ్‌షా (1550–1580) ఐదవవాడగు మహమ్మదు కులీ కుతుబ్‌షా, ఏడవవాడగు అబ్దుల్లా కుతుబ్‌షా చాల శ్రద్ధ వహించిరి.

ఇబ్రాహీం కుతుబ్‌షా సరదార్లను, భాగ్యవంతులను కోటలోపల మేడలు కట్టవలసినదిగా ఆజ్ఞాపించెను. ఈ విధముగా పట్టణము అలంకార భూయిష్ఠముగా నుండుటకు అందరును ఉత్సాహముతో పాటుబడిరి. కచ్చేరి భవనములు, ఉద్యోగస్థుల భవనములు, దేవాలయములు, మసీదులు, ధర్మశాలలు, భిక్షాగృహములు, రమ్యోద్యానములు, పాఠశాలలు, స్నాన మందిరములు మున్నగునవి నిర్మితములయ్యెను. ఇబ్రాహీంకుతుబ్‌షా పంద్రెండు భిక్షాగృహములు నిర్మించెను. ఈ పన్నెండును



SCERT, TELANGANA



పన్నెండుగురు ఇమాములకు అంకితము చేయబడెను. నగీనాబాగ్ ఒక అందాల కుప్పయగు రమ్యోద్యానమణి. షాహిమహలులు అను రాజ హర్మ్యములు ఆనాటి ఇంజనీర్ల ప్రతిభకు ప్రకాశవంతములగు ఉదాహరణములు. "దిల్‌కుషా" భవనము మనోహరమైన మందిరరాజము. ఈ మందిరమునందే పారశీకదేశపు రాయబారికిని, అతని అనుచరవర్గమునకు బస ఏర్పాటు చేయబడెను. యుద్ధభటులకు ప్రత్యేకముగా రెండు బారకాసు లుండెను. రెండు ప్రాకారముల మధ్య నొకటియు, పర్వత శిఖరమునందు మరొకటియు బారకాసులు ఉండుచుండెను. గోలకొండ పట్టణములో ఉద్యానవన నిర్మాణము నందు విలక్షణమయి, ఆకర్షణీయమైనట్టివి మిద్దెలమీది తోటలు (Roof gardens) భవనముల పైభాగమున ఎంతో నైపుణ్యముతో రూపురేఖలు దిద్ది, తీర్చి, రమ్యోద్యానములను మనోహరముగ నిర్మించినారు. ఈ ఉద్యాన వనమునకు నీటిని సప్లయిచేయు విధానము అందులో నీటి కాలువలు, జలాశయములు, కేళాకూళులు, జలపాతములు అచ్చెరువు గొల్పుచుండెను. ఈ అంతరాళ నందనవనము బాబిలోనియాలో అత్యంత ప్రాచీన కాలంలో నుండెను. భారతభూమిలో ఏకైకదృశ్యముగా గోలకొండ పట్టణములోనే యుండెను. మజ్నా బురుజుకు వాయవ్యదిశయందు దొడ్డబాల్బోవా (Balaboa) వృక్షమొకటియుండెను. దీని స్కంధపు కైవారము 80 అడుగులుండెను. ఆ చెట్టు యొక్క పాదమునందలి తొఱ్ఱలో ఒక గుండ్రనిబల్ల, దానిచుట్టు నాలుగు కుర్చీలు వేసికొని నలుగురు కూర్చుండి

**ఆలోచించండి-చెప్పండి**

- *ఆజంఖాను ఎవరు? ఆయన గొప్పతనం ఏమిటి?*
- *పట్టణం అలంకార భూయిష్ఠంగా ఉండడం అంటే ఏమిటి?*
- *గోలకొండ కోట ఎందుకు అచ్చెరువు గొల్పుతున్నది?*


SCERT, TELANGANA

ఉపాహారము పుచ్చుకొనుటకు వీలగునంత విశాల ప్రదేశముండెను. ఆ తొఱ్ఱ గదిలోనికి గాలి, వెలుతురుగూడ చక్కగా ప్రసరించుచుండెను. ఈ చెట్టును సుల్తాన్ అబ్దుల్లా కుతుబ్‌షా ఆఫ్రికా నుండి తెప్పించినాడట. కటోరా హవుజు అనునది ఒక జలాశయము. ఈ కటోరా హవుజు ప్రాంతము వేసవి కాలములో గొప్పవారికి విహారభూమిగా నుండెను.


## II

హైదరాబాదునగరము నిర్మాణమై క్రమాభివృద్ధి చెందుచుండుటచే, గోలకొండ ప్రాధాన్యము తగ్గుచుండెను. అందుచే గోలకొండలోని వర్తకులు, సర్దారులు, సామాన్యజనము గోలకొండను వదలి హైదరాబాదులో నివసింపసాగిరి. హైదరాబాదులో దొరికిన రికార్డునుబట్టి ఒక చరిత్రకారుడు ఊహించి గోలకొండపట్టణములో రమారమి నలుబదివేల యిండ్లు ఉండియుండుననియు, రెండు లక్షల ప్రజలు నివసించుచుండి యుందురనియు లెక్కతేల్చినాడు. ఈ ప్రజల సౌకర్యార్థము మహమ్మదు కులీ కుతుబుషా 78 లక్షల హోనులు వెచ్చించినాడు. పట్టణములోని జనమునకు పానీయజలము లభించుటకు మంచి ఏర్పాటు చేయబడెను. దుర్గమున కొంతదూరములో ఎత్తుప్రదేశమున దుర్గతటాకము నిర్మింపబడెను. ఆ దుర్గతటాకము నుండి, భూమిలోనుండి మట్టిగొట్టముల ద్వారా నీటిని ప్రవహింపజేసి కటోరా హవుజును నింపుచుండిరి. కటోరా హవుజు నుండి నీరు మట్టిగొట్టములద్వారా పట్టణములోని పలు ప్రాంతములకు సప్లయి అగుచుండెను. నీటిని నిలువచేయుటకు పెక్కు హవుజులు నిర్మితములయ్యెను. కొన్ని హవుజులు జనానా వారికి నియమితములయియుండెను.

రాజుగారి హర్మ్యమును చేరవలెనంటే పన్నెండు ద్వారములు దాటవలసి యుండెను. ఉమ్రావుల యొక్కయు, పెద్ద అధికారుల యొక్కయు మందిరములన్నియు చాలవరకు లోపలికోటలో నుండుచుండెను. గొప్పవారికి గోలకొండ యందును భాగానగరము నందును మందిరము లుండుచుండెను. పట్టణములోని బజార్లలో చిల్లర వస్తువులు, తినుబండారములు విలాసవస్తువులు, నగలు, నాణెములు విరివిగా అమ్మబడుచుండెను. గోలకొండ పట్టణములో వణిక్పుంగవులు విదేశములతో వర్తకము చేయుచు కుబేరసములయి యుండిరి. అప్పుడీ పట్టణములో దొరకనివస్తువే లేకుండెను. వజ్రాలకు గోలకొండ పుట్టినిల్లేగదా! భారతభూమి నలుమూలల నుండి వర్తకము సాగుచుండెను. విదేశముల నుండి వచ్చెడి సరుకులు మచిలీపట్టణము



SCERT TELANGANA



(బందరు) నుండి నేరుగా గోలకొండకు వచ్చుచుండెను. విదేశ వ్యాపారము చేయువారిలో డచ్చివారు ప్రధానులుగా నుండిరి. ఈ వర్తకమునకు గోలకొండపట్టణము కేంద్రముగా నుండి తెలంగాణము నంతకును ప్రాకుచుండెను. ఇబ్రాహీం కులీకుతుబుషా కాలములో తెలంగాణము ఈజిప్టువలె ప్రపంచపు అంగడిగానుండెను. తుర్కిస్థాన్, అరేబియా, పారశీకము మొదలగు దేశాలనుండి వర్తకులు వచ్చుచుండిరి. కౌశల్యముగల శిల్పులు, చిత్రకారులు ఉండిరి.

పట్టణములోనికి సరుకంతయు బంజారాదర్వాజా ద్వారానే వచ్చుచుండును. బంజారాలనబడు లంబాడీలు ధాన్యము, ఉప్పు మొదలగునవి తెచ్చుచుండుటచే ప్రవేశద్వారమునకు బంజారా దర్వాజా అను పేరువచ్చినది.

బియ్యము, జొన్నలు, గోధుమలు, చందనము, సీసము, తగరము, కస్తూరి, చైనాపట్టుగుడ్డలు, కర్పూరము, గాజుసామానులు, సువాసనద్రవ్యములు మొదలగునవి దిగుమతి అగుచుండెను. కొన్ని వస్తువులు ధరలు వివరించుకొనుచున్నాను.

| | | | |
|---|---|---|---|
| 1. | గోధుమలు | పుట్టి 1–కి | 4 హోనులు |
| 2. | బియ్యము | పుట్టి 1–కి | $1\frac{1}{2}$ హోనులు |
| 3. | మిరియాలు | పుట్టి 1–కి | 25 హోనులు |
| 4. | చందనపు చెక్క | పుట్టి 1–కి | 12 హోనులు |
| 5. | సీసము | పుట్టి 1–కి | 12 హోనులు |
| 6. | తగరము | పుట్టి 1–కి | 80 హోనులు |
| 7. | లవంగాలు | 40 శేర్ల మణుమునకు | 10 హోనులు |
| 8. | వెన్న | 12 శేర్ల మణుమునకు | 10 పణములు |
| 9. | పట్టునూలు | మణుము 1–కి | 45 హోనులు |
| 10. | కస్తూరి | శేరు 1–కి | 12 హోనులు |
| 11. | పచ్చకర్పూరము | శేరు 1–కి | 20 హోనులు |
| 12. | ఎద్దు | ఒక్కటికి | 2 హోనులు |
| 13. | మేక | ఒక్కటికి | 2 పణములు |
| 14. | కోళ్ళు | 60 కి | 1 హోను |
| 15. | గుడ్లు | 80 కి | 1 పణము |

SCERT, TELANGANA

ఈ విధముగా 300 సంవత్సరముల క్రిందట ధర లుండెను. "హోను" అనునది ఒక బంగారు నాణెము. దీనిని పెగోడా అనికూడ అందురు. ఒక్కొక్క హోను 4 రూపాయల విలువను కలిగియుండెను. "పణము" అనునది హోనులో పదహారవ భాగము. పెగోడాలలో అర్ధ, పావు పెగోడాలుకూడా ఉండెను. ఇవిగాక పైసలు, గవ్వలు క్రయ విక్రయాదులయందు ప్రచారములోనుండెను. పైఠన్ వస్త్రాలు, బందరు కలంకారీ చీరలు ఎక్కువగా అమ్ముడుబోవుచుండెను. రంగుల కర్మాగారము డచ్చివారు నడుపుచుండిరి. ఉన్ని పరిశ్రమ, ఇనుము పరిశ్రమ సాగుచుండెను. ఈ ఇనుము కర్మాగారమునందే ఆయుధములు, ఫిరంగులు నిర్మించుచుండిరి. కూరగాయలు, మాంసము అమ్ము దుకాణములుండెను. కాని అవి అంతపెద్దవికావు. కోటవెలుపల పెద్ద మార్కెట్లుండెను.

గోలకొండ పట్టణములోనికి రాకపోకల విషయములో చాల జాగ్రత్త వహించుచుండిరి. క్రొత్తవాడు వచ్చినచో వానికి ప్రవేశము చాల దుర్లభము. వానికి దారోగా యొద్దినుండి అనుమతి పత్రమైనా యుండవలెను. లేదా రాజోద్యోగులలో ఎవ్వని పరిచయమయినా యుండవలయును. క్రొత్తవాడు రాగానే వానివద్ద ఉప్పుగాని, పొగాకుగాని ఉన్నదేమోనని వళ్ళు, బట్టలు బాగా తడవిచూచెదరు. ఈ రెండు వస్తువులవల్ల రాజుగారికి ఎక్కువగా రెవిన్యూ వసూలగుచుండెను. వానికి ఒక్కొక్కసారి రెండు మూడు రోజులవరకు ప్రవేశము లభింపకపోవచ్చును. అనుమతినిచ్చు దారోగా లేడనియో, మరేవేవో సాకులు గల్పించి, ద్వారరక్షకులు వాని నుండి లాభము బొందుటకు ప్రయత్నించుచుందురు.

గోలకొండ పట్టణములో గొప్ప అధికారులు కూడ వర్తకము చేయుచుండిరి. మీరుజుమ్లా యను మంత్రి కొన్ని వజ్రపుగనులకు సొంతదారుడయి వజ్రాల వ్యాపారమున మిగుల ధనము గడించుచుండెను. అతనివద్ద ఇరువయి మణుగుల తూకముగల వజ్రాలుండెను. అక్కన్న సేనాని కొన్ని ఓడలకు సొంతదారుడయి ఓడలవ్యాపారము చేయుచుండెను.



**ఆలోచించండి-చెప్పండి**

- గోలకొండ వదిలి సామాన్యజనం హైదరాబాదుకు ఎందుకు వెళ్ళి ఉంటారు?
- గోలకొండ పట్టణంలో వర్తక వాణిజ్యాలు ఎట్లా సాగాయి?
- గోలకొండ పట్టణంలోకి రాకపోకల విషయంలో ఎందుకు జాగ్రత్తలు తీసుకునేవారు?

## III

గోలకొండ పాదుషాలలో ఇబ్రాహీం కుతుబుషా విద్యాప్రియుడు. ఈతని ఆస్థానములో కవులు, పండితులు హిందువులలో, మహ్మదీయులలో ఉండిరి. విద్యాగోష్ఠి సదా సాగుచుండెను. పాదుషా వారు పండితులను బాగుగా సన్మానించుచుండిరి. ఇబ్రాహీం కుతుబ్‌షా చాలాకాలము విజయనగరమునందు రాజాదరణమున పెరిగినవాడగుటచే ఆంధ్రభాషా మాధుర్యమును గ్రోలినవాడు. ఆంధ్ర భాషయందు అభిమానముగలిగి, ఆంధ్రకవులను

సత్కరించుచుండెను. అద్దంకి గంగాధరకవి 'తపతీ సంవరణోపాఖ్యాన' కావ్యమును రచించి ఈ పాదుషాకు అంకిత మిచ్చియున్నాడు. ఇబ్రాహీంపాదుషా మహబూబునగరు జిల్లాలో నివశించుచుండిన ఆసూరి మరింగంటి సింగరాచార్య మహాకవికి 'మత్తగంధేభసితఛత్ర ముత్తమాశ్వ హాటకాంబర చతురంతయాన యగ్రహారముల'ను ఇచ్చి సత్కరించినాడు. సుల్తాన్ ఇబ్రాహీం పాదుషా సేనానియగు అమీర్‌ఖాన్ మొట్టమొదటి అచ్చతెనుగు కబ్బమగు "యయాతిచరిత్ర"కు కృతిభర్తయయి, ఆ కావ్యమును రచించిన పొన్నగంటి తెలగనార్యుని సత్కరించినాడు. ఏడవ పాదుషాయగు అబ్దుల్లా పాదుషా బ్రాహ్మణభక్తి కలవాడు. ఇతని చుట్టును ఎల్లప్పుడు బ్రాహ్మణులు పరివేష్టించి యుండెడివారు. ఈ బ్రాహ్మణుల సలహా ప్రకారము రాజుగారు నడచుకొనుచుండిరి. ఇతడు విజ్ఞాన శాస్త్రములు, లలితకళలు, వాఙ్మయము వృద్ధిచేయుటకు ప్రయత్నించెను. అందుచే దేశదేశాల్లోని విద్వాంసులు ఈతని ఆస్థానమునకు వచ్చుచుండిరి.

లోపలి కోటలో ఉత్తర భాగమునందు జింకల వనము ఒకటి యుండెను. ఈ జింకల గుంపును ఎవరునూ కొట్టగూడదు. బాధింపగూడదు అని రాజాజ్ఞ యుండెను.

పట్టణములో ద్రాక్షతోటలు పెక్కు ఉండెను. ద్రాక్షలు జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రియల్ నెలలలో పక్వమునకు వచ్చును. ద్రాక్షలకు మంచిగా దోహదము చేయుదురు. ఈ ద్రాక్షపండ్ల నుండి ద్రాక్షాసవము తయారుచేసి త్రాగుచుండిరి. అశేష జనమునకు తాటి కల్లు ప్రీతికరమయిన పానీయముగా నుండెను.

గోలకొండ పట్టణములో 1589 ప్రాంతములో మహామారీ పీడ సంభవించెను. లెక్కలేనంతమంది మరణించిరి. చివరకు కొందరు సాధువులు పీర్ల పంజాలు, తాబూతులు పట్టుకొని భజనలతో ఊరేగిరి. తత్ఫలితముగా ఆ మహామారి పీడవదలెను. తత్ జ్ఞాపక చిహ్నముగా కృతజ్ఞతా సూచకముగా మహమ్మదు కులీకుతుబ్‌షా పాదుషావారు 1591 సంవత్సరమున హైద్రాబాదులో తాబూతు ఆకారమున చారుమినారు నిర్మాణము గావించిరి.

ఉమ్రావులు బజారులయందు బోవుట చాల పటాటోపముగా నుండుచుండెను. ఒక ఉమ్రావు బయలుదేరితే ముందు ఒకటో, రెండో ఏనుగులు పోవును. వీటిమీద ధ్వజములు పట్టుకొని ముగ్గురు భటులు కూర్చుందురు. తరువాత అస్త్ర శస్త్రాదులను ధరించిన ఏబది, అరువదిమంది భటులు అశ్వారూఢులై పోవుదురు. వీరి వెనుక గుఱ్ఱాల మీద కూర్చుండి బాకాలూదుచు, సన్నాయిలు బాడుచు కొందరు బయలుదేరుదురు. వీరి వెనుక ఉమ్రావు అశ్వారూఢుడయి వచ్చును. ఈతని కంగరక్షకులుగా ముప్పది, నలుబది మంది పదాతివర్గముండును. కొందరు ఉమ్రావులకు సురటీలు విసురుచుందురు. ఒకడు గొడగు పట్టును. ఇంకొకడు హుక్కాపట్టుకొని వచ్చుచుండును. ఒకడు కావడిలో జలపూర్ణ కుంభములను పట్టుకొని వచ్చును. తరువాత ఒక పల్లకిని నలుగురు మోసుకొని వచ్చుచుందురు. భుజాలు మార్చుకొనడానికి ఇద్దరు బోయీలు విడిగానుందురు. వీరందరి చివర ఒకటో, రెండో ఒంటెలు బయలుదేరును. ఒంటెలమీద కూర్చుండి భటులు తప్పెటలు వాయించుచుందురు. నవాబుగారికి ఇష్టమయినప్పుడు గుఱ్ఱముదిగి పల్లకిలో పరుండెదరు. పల్లకీకి వెండిపూత పూయబడి యుండును. పల్లకి దండెలకు వెండిపొన్ను లుండును. పల్లకిలో పరుండినప్పుడు ఉమ్రావు చేతిలో పుష్పగుచ్ఛమును పట్టుకొని యుండును. తాంబూల చర్వణము చేయుచునో, హుక్కా పీల్చుచునో కనుపట్టుచుండును.

గోలకొండ పట్టణములో నేరస్థులను శిక్షించు విధానము మిగుల కఠినముగా నుండెను. వారిని జైలులో బెట్టు పద్ధతియే లేకుండెను. వెంటనే విచారణ చేయుటయు, దోషియైనచో శిక్షించుటయు, నిర్దోషియైనచో విడిచిపెట్టుటయు జరుగుచుండెను.

గోలకొండ పట్టణములో జనాభావత్తిడి అధికమయ్యెను. నీటి వసతి కూడ చాలదయ్యెను. అందుచే పాదుషాలు, గొప్పవారు, కొందరు వర్తకులు హైద్రాబాదులో నివసింపసాగిరి. అయినను ముఖ్యమయిన ప్రభుత్వ కార్యాలయములు, ధనాగారము, సేనాసిబ్బంది గోలకొండ పట్టణములోనే యుండుచుండెను. యుద్ధభీతి కలిగినప్పుడు రాజులు, రాణులు మొదలగువారు గోలకొండ దుర్గములో తలదాచుకొనుచుండిరి. గోలకొండనుండి హైద్రాబాదు రాజధానిగా ఎప్పుడు మార్చబడినదో సరిగా తెలియదు. కాని పదునారవ శతాబ్దము చివరనిది జరిగియుండవచ్చునని చరిత్రకారు లూహించుచున్నారు.

SCERT, TELANGANA

గోలకొండ పట్టణములోని పురుషులు, స్త్రీలు సరిసమానమైన అవయవస్ఫూర్తి గలిగియుండిరి. మనోజ్ఞమైన ముఖవిలాసములతో ఒప్పుచుండిరి. ఉమ్రావులు, సేనానులు గంభీర సుందరాకారము గలిగియుండి ఆకర్షణీయముగా నుండిరి. ఉమ్రావులు మితిలేని భాగ్యవంతులు. రాజు మొదలుకొని బీదవరకు ఆటపాటలతో వినోదించుచు, భోగలాలసులై యుండిరి.

రెండు వందల ఏబది సంవత్సరములు సకలసంపద్వైభవములతో విరాజిల్లి, ప్రపంచమును మిరుమిట్లు గొలిపిన గోలకొండ పట్టణమును 1687వ సంవత్సరమున ఔరంగజేబు చక్రవర్తి మోసముగా జయించి, సర్వనాశనము గావించెను. అంతటితో గోలకొండ పట్టణపు అందచందములు, వైభవములు, ఠీవి పరిసమాప్తి జెందెను.

**ఆలోచించండి-చెప్పండి**

- *గోలకొండ పాదుషాలు జీవకారుణ్యం గలవారని, ప్రకృతి ప్రేమికులని ఎట్లా చెప్పగలవు?*
- *పట్టణాల్లో జనాభా ఎందుకు పెరుగుతుంది?*

T7Q7V8

## ఇవి చేయండి

## I అవగాహన - ప్రతిస్పందన

**1. గోలకొండ పట్టణము పాఠం ఆధారంగా నాటి చరిత్ర, సంస్కృతికి సంబంధించిన అంశాలు ఎట్లా ఉండేవని భావిస్తున్నారు? చర్చించండి.**

**2. కింద ఇచ్చిన పదాలు ఏయే పేరాల్లో ఉన్నాయో గుర్తించి, పట్టికలో వివరించి రాయండి.**

| పేరా | పేరా సంఖ్య | దేని గురించి వివరించబడింది. |
|---|---|---|
| నగీనాబాగ్ | | |
| దిల్‌కుషాభవనము | | |
| బారకాసులు | | |
| బాల్సోవా | | |
| వణిక్పుంగవులు | | |
| బంజారాదర్వాజా | | |
| హోసులు | | |
| మత్తగంధేభం | | |
| కేళాకూళులు | | |
| అంతరాళ నందనవనము | | |
| ధనాగారం | | |

SCERT, TELANGANA

### 3. కింది పేరా చదువండి. పట్టిక రాయండి.

భారతదేశంలోని ప్రసిద్ధి చెందిన కోటల్లో దేవరకొండ కోట ఒకటి. రేచర్ల నాయకరాజుల పరిపాలనలో ఈ కోట ఎంతో గొప్పగా విరాజిల్లినది. రెండవ మాదా నాయకుడు ఈ కోటను నిర్మించాడు. ఎత్తైన ఏడు కొండలను కలుపుతూ ఈ దుర్గాన్ని అత్యద్భుతంగా నిర్మించాడు. ఐదువందల ఎకరాలపైగా విస్తీర్ణంగల ఈ కోటలో పంటభూములు, కాలువలు, ధాన్యాగారాలు, సెలయేళ్ళు, సైనిక శిబిరాలు, గుర్రపుశాలలు, ఆలయాలు ఉన్నాయి. ఈ కోటకు 360 బురుజులు ఉన్నాయి. 9 ప్రధానద్వారాలు, 23 పెద్దబావులు, 53 దిగుడు బావులు, 6 కోనేర్లు ఉన్నాయి. అత్యంత కళాకృతమైన సింహద్వారాలు ఉన్నాయి. మన పాఠ్యపుస్తకాల మొదటిపేజీలో కనిపించే విశిష్టమైన 'పూర్ణకుంభ' చిహ్నం ఇక్కడే లభించింది. ఈ కోటయొక్క విశేషం ఏమిటంటే ఏ శత్రురాజు దీన్ని ఆక్రమించుకోలేకపోయాడు. నాయకరాజుల కాలంలో ఇది స్వయంప్రతిపత్తిగల దుర్గంగా వెలిగింది. దీనికి దగ్గరలో కల రాచకొండ సమీపంలోని నాగసముద్రం చెరువులను ఈ రాజులే తవ్వించారు.

| నిర్మించినవారు | కోటలో ఏమేమి ఉన్నవి? | కోటకు సంబంధించిన విశేషాలు | నాయకరాజుల పాలనా ప్రత్యేకత |
|---|---|---|---|
| | | | |

## II వ్యక్తీకరణ - సృజనాత్మకత

### 1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.

అ) "గోలకొండ పాదుషాలు సాహిత్య పోషకులు" అనడానికి ఉదాహరణలు తెలుపండి.

ఆ) నాటి తెలంగాణలో కూడా తెలుగు భాష ఉచ్ఛస్థితిలో ఉందని ఎట్లా చెప్పగలరు?

ఇ) "తెలంగాణము ఈజిప్టువలె ప్రపంచపు అంగడి" అనడానికి కారణాలు రాయండి.

ఈ) ఈనాడు పట్టణాలలో జనాభా అధికమవడం వలన కలిగే ఇబ్బందులు ఏమిటి?

### 2. కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి.

అ) గోలకొండ పట్టణము విశిష్టతను తెలుపండి.

### 3. కింది అంశాన్ని గురించి సృజనాత్మకంగా / ప్రశంసిస్తూ రాయండి.

అ) ఏదైనా ఒక పట్టణం లేదా ఊరి చారిత్రక / సాంస్కృతిక విశేషాలతో వ్యాసం రాయండి.



SCERT, TELANGANA

## III భాషాంశాలు

### పదజాలం

1. కింది వాటిని సొంతవాక్యాల్లో ప్రయోగించండి.

అ) పుట్టినిల్లు : ______________________

ఆ) పాటుపడడం : ______________________

ఇ) పీడవదలడం : ______________________

ఈ) తలదాచుకోవడం: ______________________

2. కింది పదాలను వివరించి రాయండి.

అ) పటాటోపము : ______________________

ఆ) అగ్రహారం : ______________________

ఇ) బంజారాదర్వాజా : ______________________

ఈ) ధర్మశాల : ______________________

### వ్యాకరణాంశాలు

1. కింది వాక్యాల్లోని సంధి పదాలను విడదీసి అవి ఏ సంధులో రాయండి.

అ) పండుగ దినాలలో దేవాలయాలు భక్తులతో కిటకిటలాడుతాయి.

__________ + __________ = ______________

ఆ) మధురలోని రమ్యోద్యానములు చూపరుల మనస్సులను ఆకట్టుకుంటాయి.

__________ + __________ = ______________

ఇ) ఛత్రపతి శివాజీ అశ్వారూఢుడు అయి శత్రువులను సంహరించాడు.

__________ + __________ = ______________

ఈ) రాజాజ్ఞ లేనిదే ఏ కార్యక్రమాలు జరుపరు.

__________ + __________ = ______________

SCERT, TELANGANA

## బహువ్రీహి సమాసం

*** కింది సమాసపదాలను వాటి విగ్రహవాక్యాలను పరిశీలించండి.**

అ) ఆజానుబాహుడు – జానువుల వరకు బాహువులు కలవాడు.

ఆ) ముక్కంటి – మూడు కన్నులు కలవాడు.

ఇ) గరుడ వాహనుడు – గరుడుడు వాహనముగా కలవాడు.

ఈ) చతుర్ముఖుడు – నాలుగు ముఖాలు కలవాడు.

ఉ) పద్మాక్షి – పద్మం వంటి కన్నులు కలది.

పై పదాలలో మొదటి పదానికి గాని రెండవ పదానికి గాని ప్రాధాన్యం లేదు. రెండు పదాలు మరో పదం యొక్క అర్థాన్ని స్ఫురింపజేస్తున్నాయి. ఇలా మరో పదం యొక్క అర్థానికి ప్రాధాన్యం ఉన్న సమాసాన్ని **"బహువ్రీహి"** సమాసం అంటారు.

ఉదా: 'చక్రపాణి' అనే సమాస పదంలో 'చక్రము' అనే పదానికి ప్రాధాన్యం లేదు. 'పాణి' (చేయి) అనే పదానికి కూడా ప్రాధాన్యం లేదు. చక్రము పాణియందు కలిగిన వానికి ప్రాధాన్యం ఉన్నది. ఇట్లా సమాసంలో పదాల ద్వారా వచ్చే మరో పదము యొక్క అర్థానికి ప్రాధాన్యం ఉన్నది కాబట్టి ఇది బహువ్రీహి సమాసం.

**అన్యపదార్థ ప్రాధాన్యం బహువ్రీహి.**

**2. కింది సమాస పదాలకు విగ్రహ వాక్యాలు రాసి, సమాసాలను రాయండి.**

ఉదా: యయాతిచరిత్ర – యయాతి యొక్క చరిత్ర – షష్ఠీ తత్పురుష సమాసం

| సమాసపదం | విగ్రహవాక్యం | సమాసంపేరు |
|---|---|---|
| అ) బ్రాహ్మణభక్తి | ________ | ________ |
| ఆ) నీలవేణి | ________ | ________ |
| ఇ) పుష్పగుచ్ఛము | ________ | ________ |
| ఈ) గోలకొండ పట్టణము | ________ | ________ |
| ఉ) గరళకంఠుడు | ________ | ________ |
| ఊ) సుందరాకారములు | ________ | ________ |
| ఋ) దయాంతరంగుడు | ________ | ________ |
| ౠ) అందచందములు | ________ | ________ |

SCERT, TELANGANA

**3. కింది వాక్యాలను వ్యవహారభాషలోనికి మార్చండి.**

ఉదా: పట్టణము అలంకారముగా నుండుటకు అందరును ఉత్సాహముతో పాటుపడిరి.

పట్టణం అలంకారంగా ఉండడానికి అందరూ ఉత్సాహంతో పాటుపడ్డారు.

అ) ఈ మందిరము నందే పారశీకపు రాయబారికిని, అతని అనుచరవర్గమునకును బస ఏర్పాటు చేసిరి.

___

ఆ) నీటి కాలువలు, జలాశయములు, జలపాతములు అచ్చెరువు గొల్పుచుండెను.

___

ఇ) పెద్ద అధికారుల యొక్కయు మందిరములన్నియు లోపలి కోటలో నుండుచుండెను.

___

ఈ) వజ్రములకు గోలకొండ పుట్టినిల్లే గదా!

___

ఉ) పట్టణములోనికి సరుకంతయు బంజారాదర్వాజా ద్వారానే వచ్చుచుండును.

___

## ప్రాజెక్టు పని

- మీ జిల్లాలోని వివిధ కోటల చిత్రాలు లేదా మీరు చూసిన కోట / ప్రాచీన గుడి / కట్టడం ఆధారంగా నివేదిక రాయండి. ప్రదర్శించండి.

## మీకు తెలుసా?

**గోల్కొండ కోటను బండరాళ్ళతో కట్టారు. గోల్కొండ కైవారము నాలుగు మైళ్ళను మించి ఉంటది. దీనికి ఎనిమిది బురుజులున్నవి. ఈ బురుజులన్నియు శతఘ్నుల స్థావరములు. మొగలు సైన్యం సర్వశక్తియుక్తులను కూడదీసుకొని తొమ్మిది నెలలు శ్రమించి ఒక్క బురుజును మాత్రమే కూల్చగలిగిరి. ఐతే ఆ బురుజు స్థానమున ఒక్క రాత్రిలో మరొక బురుజును కుతుబ్‌షాహీ సైనికాధికారులు కట్టగలిగిరి. గోల్కొండ కోటలో కొండశిఖరమున 'బాలహిస్సారు' అను ప్రాసాదమున్నది. దానికి పోవు మార్గమునకు, కోట ప్రాకారమునకు అమర్చిన ద్వారముకడ ఒక రాతి గుండున్నది. ఆ రాతిపై నిలచి చప్పట్లు కొట్టిన ఆ శబ్దము బాలహిస్సారులోనికి స్పష్టంగ వినిపించును. అట్లు ప్రతిధ్వనించు ఏర్పాటును నిర్మాణములోనే కల్పించిరి. ఇవి అన్నియు మానవుని ప్రజ్ఞ వలన నెలకొన్న అమర్పులు.**

**– మూలం : కె.వి.భూపాల్‌రావు రాసిన 'మహామంత్రి మాదన్న కథ' లోనిది.**

**సూక్తి**

చరిత్ర స్వదేశాభిమానాన్ని నేర్పే

చక్కనైన సాధనం

SCERT, TELANGANA

చదువండి - తెలుసుకోండి

# జానపద కళారూపం 'ఒగ్గు కథ'

తెలంగాణలోనే పుట్టి ఇక్కడే పెరిగిన అపురూప జానపద కళారూపం ఒగ్గుకథ. ఆయా కళారూపాలలో ఉపయోగించే ఒక వాయిద్యాన్ని ఆ కళకు శీర్షికగా పెట్టడం అరుదు. ఆ లక్షణం ఒగ్గుకథకు ఉన్నది. ఒగ్గు అంటే శివుని చేతిలోని ఢమరుకం అని అర్థం. ఈ పదం కేవలం తెలంగాణ ప్రాంతంలోనే వినిపిస్తుంది. ఇది అచ్చమైన దేశీపదం. ఒగ్గుకథల్ని తెలంగాణ ప్రాంతంలోని గొల్ల, కుర్మలు తమ కులపురాణంగా భావిస్తారు. కుర్మలు ఈ కథలను ఎక్కువ ప్రచారం చేశారు. తరువాత కాలంలో ఇతర కులాల వాళ్ళు కూడా ఈ కళారూపాన్ని నేర్చుకొని ప్రచారం చేశారు. బీరప్ప, మల్లయ్య కథలు మొదటి నుంచి ఉన్నాయి. ఆ తరువాత ఇతర కథలు పుట్టుకొచ్చాయి.

ఒగ్గు కళారూపం చూస్తుంటే ఒక నాటకం చూసిన అనుభూతి, ఒక నాట్యకళను వీక్షించినంత ఆనందం, ఒక ప్రవచనం విన్నంత సంతృప్తి, ఒక సంగీత కచేరిలో దొరికేంత రసాస్వాదన లభిస్తుంది. ఒగ్గుకథా ప్రదర్శనకు ఉపయోగపడే వాయిద్యాల్లో ముఖ్యమైనది, తప్పకుండా ఉండాల్సింది ఒగ్గు. పలు సన్నివేశాల్లో తాళానికి అనుగుణంగా సంఘటనలకు అనుకూలంగా వాయిస్తుంటారు. ఒగ్గుడోలు అన్ని వాయిద్యాల్లోకెల్లా పెద్దది, ముఖ్యమైనది. డోలు మోతతోనే కథా ప్రారంభమవుతుంది. గంభీరమైన ధ్వనిచేస్తూ ప్రతి సన్నివేశంలో తప్పక మోగే వాయిద్యం డోలు. కథా గమనంలో కొన్ని సన్నివేశాల్లో ఉద్రేకం కలిగించడానికి డోలుని మెళ్ళో వేసుకుని నృత్యం చేస్తారు. పళ్ళతో బిగించి పట్టుకుని తాండవం చేస్తారు. గుండ్రంగా ఆవేశంతో తిరుగుతారు. వీపుకు తగిలించుకుని విన్యాసంగా వాయిస్తారు. తాళాలు అరచేతికి రెండింతలు పెద్దగా ఉండి ప్రతీరాగానికి లయని అందిస్తూ శ్రావ్యంగ మోగే వాయిద్యం. వీటికి తోడుగా చిన్నతాళాలను కూడా ఉపయోగిస్తారు. కాళ్ళకు గజ్జెలు, భుజంపై రుమాలు, చేతిలో చిన్న కర్రని కథానడకకు ఉపయోగించుకుంటారు.

ఇతివృత్తం దగ్గర నుంచి కథనం వరకు ప్రత్యేకమైన శైలిలో నిర్మాణం పొందిన ప్రక్రియ ఒగ్గుకథ. కథను ఉపన్యాస ధోరణిలో లేక నాటక రూపంలోనో లేక సంగీత రూపకంలోనో లేదా పద్యాల రూపంలోనో చెప్పటం ఆయా కళారూపాల స్వభావం. ఇన్ని విభాగాలను తనలో పలికించడం ఒగ్గుకథ ప్రత్యేకత. ఒక ప్రధాన కథకుడు ఒక సహాయకుడు ముగ్గురు వంతగాళ్ళు ఉంటే చాలు ఒగ్గు కథ అలవోకగా సాగిపోతుంది.

ఒగ్గుకథ నాటక ప్రక్రియకాదు. అయినా నాటక సన్నివేశాలు అనేకం ఉన్నాయి. సంప్రదాయ వేషధారణే కానీ పాత్రోచిత వేషధారణ ఉండదు. కథకులు కథను చెబుతూ వెంటనే తమను తాము పాత్రలుగా మలుచుకుంటారు. గాంభీర్యప్రదర్శనలో, లాలిత్య పోషణలో ఇతర నాటక కళాకారులకు ఏమాత్రం తక్కువ కాకుండా నటిస్తారు. ముఖకవళికలు కదపటంలో, చేతులతో నాటక ముద్రల్ని ప్రదర్శిస్తారు.

ఒగ్గుకథా నిర్వహణలో శబ్దం పాత్ర కీలకమైంది. సంభాషణలు, ధ్వన్యనుకరణలు, రాగాలు అన్నీ శబ్దంపైనే ఆధారపడి ప్రవర్తిల్లుతాయి. సంభాషణలు స్త్రీ, పురుష పాత్రలకు అనుగుణంగ మలుచుకుంటారు. కొన్ని స్త్రీ పాత్రలు ఏడ్చే సందర్భంలో కళాకారులు కూడ ఏడుస్తారు. శ్రోతల్నీ ఏడిపిస్తారు. కొన్ని కొన్నిచోట్ల ధ్వన్యనుకరణ చేస్తుంటారు. గొర్రెలాగ అరవటం, గొర్లకాపర్లు చేసే విచిత్రమైన ధ్వనిని అనుకరిస్తూ శ్రోతల్ని నవ్విస్తూ ఉంటారు.

ఒగ్గు కళాకారులు ఆశు రచనా నైపుణ్యం కూడా కలిగి ఉంటారు. యతి, ప్రాసలు తప్పకుండ మాత్రా ఛందస్సులో కథా సందర్భానికి తగిన విధంగ పాటలు అల్లుతారు. మూలకథకు ఏమాత్రం భంగం కలగకుండ వీటిని జొప్పిస్తారు. ప్రార్థనాగీతంలో మొదట గంగని తలవటం ప్రత్యేకమైనది. దేశీయత ఉట్టిపడేటట్టుగా గంగ గొప్పతనాన్ని చెప్పడం, జనాల్ని మంత్ర ముగ్ధుల్ని చేసేరాగాలాపన, విస్మయం కలిగించే ఆహార్యం, పొడుపు కథలు, జాతీయాలు, సామెతలు, అన్యదేశ్యాలు కథలో సహజంగా ప్రవర్తిల్లుతాయి.

మిద్దెరాములు, చుక్కసత్తయ్య లాంటి ఒగ్గు కళాకారులు ప్రపంచపు జానపద కళాయవనికపై ఒగ్గుకథా రూపాన్ని స్థిరంగ నిలిపారు. ఈ కళారూపాన్ని భావితరాలకు అందిద్దాం.

- 'నమస్తే తెలంగాణ' సౌజన్యంతో

SCERT TELANGANA

# 11 భిక్ష

- శ్రీనాథుడు

X8G8C1

## చదువండి - ఆలోచించి చెప్పండి

కం. తనకోపమె తనశత్రువు
తనశాంతమె తనకురక్ష దయ చుట్టంబౌఁ
దనసంతోషమె స్వర్గము
తనదుఃఖమె నరకమండ్రు తథ్యము సుమతీ.

## ప్రశ్నలు

1. ఈ పద్యంలో శత్రువుగా దేనిని పేర్కొన్నాడు? ఎందుకు?
2. శాంతి రక్షగా ఉంటుందనడంలో కవి ఉద్దేశమేమిటి?
3. సంతోషాన్ని స్వర్గంగా కవి ఎందుకు భావిస్తున్నాడు?
4. కోపంవల్ల కలిగే అనర్థాలను గురించిన సంఘటనలు మీకేమైనా తెలుసా? చెప్పండి.

## పాఠం నేపథ్యం / ఉద్దేశం

వేదవిభజన చేసి, పంచమవేదంగా మహాభారతాన్ని రచించి, అష్టాదశ(18) పురాణాలను రచించిన బ్రహ్మజ్ఞాని వేదవ్యాసుడు. పరమపవిత్రం, పరమేశ్వరునికి ప్రీతిపాత్రం అయిన కాశీలో వ్యాసుడు తన పదివేలమంది శిష్యులతో కొంతకాలం నివసించాడు. బ్రాహ్మీముహూర్తంలో నిద్రలేచి, ప్రాతర్మాధ్యాహ్నిక విధులను పూర్తిగావించి శిష్యులతో కాశీనగరంలో భిక్షాటనం చేసేవాడు. శిష్యులు, తానూ వేరువేరుగా తెచ్చిన భిక్షలో సగం అతిథి అభ్యాగతులకు సమర్పించి, మిగిలింది భుజించేవారు. ఒకరోజున కాశీ విశ్వనాథునికి వ్యాసుడిని పరీక్షించాలన్న సంకల్పం కలిగింది. ఆ సందర్భంగా జరిగిన సంఘటనే ఈ పాఠం.


ఆకలి ఎంత వారినైనా విచక్షణ కోల్పోయేలా చేస్తుంది. ఇది మంచిది కాదని తెలియజెప్పడమే ఈ పాఠం ఉద్దేశం.

SCERT TELANGANA

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం కావ్యప్రక్రియకు చెందినది. కావ్యం వర్ణనా ప్రధానమైనది. ఇది శ్రీనాథ కవిసార్వభౌముడు రచించిన 'కాశీఖండము' సప్తమాశ్వాసం లోనిది.

## కవి పరిచయం


(ఊహాచిత్రం)
(1380-1470)

తెలుగు సాహిత్యంలో పేరెన్నికగన్న కవి శ్రీనాథుడు. ఈయన తల్లిదండ్రులు మారయ, భీమాంబ. కొండవీటిని పరిపాలించిన పెదకోమటి వేమారెడ్డి ఆస్థానంలో విద్యాధికారి. విజయనగర ప్రౌఢదేవరాయల ఆస్థానంలో 'గౌడడిండిమభట్టు'ను తనవాదనా పటిమతో ఓడించి కనకాభిషేకాన్ని, 'కవిసార్వభౌమ' బిరుదును పొందాడు.

మరుత్తరాట్చరిత్ర, శాలివాహన సప్తశతి, పండితారాధ్య చరిత్ర, శృంగారనైషధం, భీమఖండం, కాశీఖండం, హరవిలాసం, ధనంజయవిజయం, క్రీడాభిరామం, శివరాత్రిమాహాత్మ్యం, పల్నాటి వీరచరిత్ర, నందనందన చరిత్ర శ్రీనాథుని రచనలు. చమత్కారానికి, లోకానుశీలనకు, రసజ్ఞతకు, జీవితవిధానానికి అద్దంపట్టే చాటువులు చాలా చెప్పాడు.

ఉద్దండ లీల, ఉభయ వాక్ప్రౌఢి, రసాభ్యుచితబంధం, సూక్తి వైచిత్రి తన కవితాలక్షణాలని చెప్పుకున్న శ్రీనాథుడు సీసపద్య రచనలో మేటి.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకొండి.

SCERT, TELANGANA

## ప్రవేశిక

***ఈనాడు 'భిక్ష' అనే మాట కేవలం 'అడుక్కుతినడం' అనే అల్పార్థానికి పరిమితమైంది కాని, ఒకప్పుడు 'భిక్ష' అనేది పరమపవిత్రమైన వ్రతం. శివుడు ఆదిభిక్షువుగా ప్రసిద్ధి. గురువులు శిష్యులకు 'జ్ఞానభిక్ష' పెట్టేవాళ్ళు. బుద్ధుడు భిక్షాధర్మంతోనే జీవనం సాగించేవాడు; బౌద్ధులందరికీ అదే జీవనసూత్రంగా ఉండేది. గురుకులంలో చదువుకునే రాజకుమారులైనా భిక్షాటనంతో విద్యార్థిజీవనం గడిపేవారు. భిక్షపెట్టేవాళ్ళు కూడా అది మహాపుణ్యకార్యంగా భావించి, తమ ఇంటికి వచ్చిన వారికి నమస్కరించి, పూజించి, భిక్ష సమర్పించేవాళ్ళు. భిక్షాధర్మంతో చరించిన వేదవ్యాసమహర్షి కాశీనగరంలో పొందిన అనుభవమేమిటో ఈ పాఠం చదివి తెలుసుకొండి.***

SCERT, TELANGANA

## I

తే.గీ. నెట్టుకొని కాయ బీఱెండ పట్టపగలు
తాను శిష్యులు నిల్లిల్లు దప్పకుండఁ
గాశికా విప్రగృహ వాటికల నొనర్చు
నఖిల విద్యాగురుండు భిక్షాటనంబు. 1

తే.గీ. వండుచున్నారమను నొక్క వనజనేత్ర
తిరిగి రమ్మను నొక్క లేఁదీఁగెబోఁడి
దేవకార్యంబు నేఁడనుఁ దెఱవ యోర్తు
ద్వాఃకవాటంబుఁ దెఱవదు వనిత యొకతె 2

సీ. ముంగిట గోమయంబున గోముఖము దీర్చి
కడలు నాల్గుగ ముగ్గుకఱ్ఱ వెట్టి,
యతిథి నచ్చో నిల్పి యర్ఘ్యపాద్యము లిచ్చి
పుష్పగంధంబులఁ బూజసేసి,
ప్రక్షాళితంబైన పసిఁడి చట్టువమున
నన్నంబుమీఁద నెయ్యభిఘరించి,
ఫలపాయసాపూప బహుపదార్థములతో
భక్తివిశ్వాస తాత్పర్యగరిమఁ

తే.గీ. బెట్టుదురు మాధుకరభిక్ష భిక్షుకులకుఁ
గంకణంబులతో సూడిగములు రాయఁ
గ్రమకరముల బ్రాహ్మణాంగనలు కాశి
నన్నపూర్ణ భవాని కట్టనుఁగుఁ జెలులు 3

### ఆలోచించండి-చెప్పండి

- ప్రాచీనకాలంలో భిక్షాటనాన్ని పవిత్రకార్యంగా ఎందుకు భావించేవారు?
- భిక్ష సమర్పించేటప్పుడు నాటికి, నేటికి ఉన్న తేడాలేమిటి?

కం. ఆ పరమపురంధ్రులయం
దే పుణ్యాంగనయు భిక్ష యిడదయ్యెఁ గటా!
రేపాడి మేలుకని యే
నే పాపాత్ముని ముఖంబు నీక్షించితినో? 4


తే.గీ. ఉపవసింతుముగాక నేఁడుడిగి మడిఁగి
యస్తమించుచు నున్నవాఁ డహిమభానుఁ
డెల్లి పారణకైన లేదెట్లు మనకు?
మాధుకరభిక్ష బ్రాహ్మణమందిరముల 5

## II

వ. అని యా రాత్రి గడపి మఱునాఁడు మధ్యాహ్నకాలంబున శిష్యులుం దాను వేఱువేఱు విప్రభవన వాటికల భిక్షాటనంబొనర్పంబోయి, తొలునాఁటియట్ల ముక్కంటిమాయ నే మచ్చెకంటియు వంటకంబు పెట్టకున్నఁ గటకటంబడి భిక్షాపాత్రంబు నట్టనడువీథిం బగులవైచి కోపావేశంబున – 6

తే.గీ. ధనము లేకుండెదరు మూఁడు తరములందు
మూఁడు తరములఁ జెడుఁగాక మోక్షలక్ష్మి
విద్యయును మూఁడు తరముల వెడలవలయుఁ
బంచజనులకుఁగాశికాపట్టణమున 7

వ. అని పారాశర్యుండు క్షుత్పిపాసా పరవశుండై శపియింపందలంచు నవసరంబున నొక్క విప్రభవనంబు వాఁకిటం బార్వతి ప్రాకృతవేషంబున 8



ఉ. వేదపురాణశాస్త్ర పదవీ నదవీయసియైన పెద్దము
త్తైదువ కాశికానగర హాటకపీఠ శిఖాధిరూఢ య
య్యాదిమ శక్తి, సంయమివరా! యిటు రమ్మని పిల్చె హస్తసం
జ్ఞాదరలీల రత్నఖచితాభరణంబులు ఘల్లు ఘల్లనన్ 9

SCERT, TELANGANA

❖శా. ఆకంఠంబుగ నిప్డు మాధుకర భిక్షాన్నంబు భక్షింపఁగా
లేకున్నం గడు నంగలార్చెదవు మేలే? లెస్స! శాంతుండవే!
నీకంటెన్ మతిహీనులే కటకటా! నీవార ముష్టింపచుల్
శాకాహారులుఁ గందభోజులు, శిలోంఛప్రక్రముల్ తాపసుల్! 10

తే.గీ. ఓ మునీశ్వర! వినవయ్య యున్న యూరుఁ
గన్నతల్లియు నొక్క రూపన్న రీతి
యటు విశేషించి శివుని యర్ధాంగలక్ష్మి
కాశి; యివ్వీటిమీఁద నాగ్రహము దగునె? 11

వ. ఇట్టి కాశికానగరంబుమీద భిక్ష లేకుండుట కారణంబుగా నీయంత వాడు కటకటంబడి శపియింపందలంచునే? విశేషించి యాఁకొన్నవాఁడవు గావున నీ యవసరంబున నిన్ను హెచ్చు గుందాడుట మము బోఁటి గృహిణులకు మెచ్చుగాదు. మా యింటికిం గుడువ రమ్ము! కుడిచి కూర్చున్న పిమ్మటం గొన్నిమాటలు నీతో నాడఁగలనని నమ్మహాసాధ్వింగని, పారాశర్యుండిట్టులనియె – 12

**ఆలోచించండి-చెప్పండి**

- *భిక్ష దొరకని వ్యాసుడు కోపగించాడు కదా! దీనిపైన మీ అభిప్రాయమేమిటి?*
- *'ఆకలి మనిషిని విచక్షణ కోల్పోయేటట్లు చేస్తుంది' దీన్ని గురించి మాట్లాడండి.*
- *ఉన్న ఊరు కన్నతల్లితో సమానమని ఎందుకు అంటారు?*



SCERT TELANGANA

## III

తే.గీ. అస్తమింపఁగఁజేసినాఁ డహిమకరుఁడు
శిష్యులేఁగాక యయుతంబు చిగురుబోఁడి!
వ్రతము తప్పి భుజింపంగ వలను గాదు
నేఁడు నిన్నటి మఱునాఁడు నిక్కువంబు 13

❖చ. అనవుడు నల్ల నవ్వి కమలానన యిట్లను, లెస్సగాక, యో
మునివర! నీవు శిష్యగణముంగొని చయ్యన రమ్ము విశ్వనా
థుని కృపపేర్మి నెందఱతిథుల్ చనుదెంచినఁ గామధేనువుం
బనిగొనునట్లు పెట్టుదు నపారములైన యభీప్సితాన్నముల్ 14

వ. అనిన నట్లకాక మహాప్రసాదంబని వేదవ్యాసుండు శిష్యులంగూర్చుకొని భాగీరథికిం జని యుపస్పర్శంబాచరించి
యేతెంచిన – 15




**ఆలోచించండి-చెప్పండి**

- *భోజనానికి ఆహ్వానించిన గృహిణితో వ్యాసుడు పలికిన మాటలను బట్టి మీకేమి అర్థమయింది?*
- *ఈ పాఠం ఆధారంగా నాటి గురుశిష్య సంబంధాల గురించి వివరించండి.*

తే.గీ. గొడుగు పాగల గిలకలు గులకరింప
నిందుబింబాస్య యెదురుగా నేగుదెంచి
ఛాత్రసహితంబుగాఁ బరాశరతనూజు
బంతి సాగించె భుక్తి శాలాంతరమున 16

### తాత్పర్యాలు

1. సమస్త విద్యలకు గురుడైన వ్యాసమహర్షి శిష్యులతో కూడి పట్టపగలు, మండుటెండలో కాశీనగరంలోని బ్రాహ్మణవీథిలో భిక్షకోసం ఇల్లిల్లూ తిరుగసాగాడు.
2. ఒక ఇల్లాలు "వండుతున్నాం" అన్నది; మరొక స్త్రీ "మళ్ళీ రండి" అన్నది; ఇంకొకామె ఈరోజు వ్రతం (దేవకార్యం) అని చెపుతుంది; వేరొకామె అసలు తలుపులే తెరవడం లేదు.
3. కాశీనగరంలోని గృహిణులు అన్నపూర్ణభవానికి ప్రియమైన చెలులుగా పేరుగాంచారు. వాళ్ళు భిక్షార్థమై వచ్చిన వారికి వాకిట్లో ఆవుపేడతో చక్కగా అలికి, నాలుగంచులూ కలిసేటట్లు ముగ్గుపెట్టి, వచ్చిన అతిథిని దాని మధ్యలో నిలబెట్టి, కాళ్ళకూ చేతులకూ నీళ్ళిచ్చి, పూవులతో గంధంతో వారిని అర్చించి, శుభ్రంగా కడిగిన బంగారుగరిటెతో అన్నం మీద నెయ్యి అభిఘరించి(వేసి), పండ్లు, పరమాన్నం, పిండివంటలు చేర్చి, భక్తి విశ్వాసాలు ఉట్టిపడుతుండగా కంకణాలు, గాజులూ పరస్పరం ఒరుసు కొంటుండగా తమ అందమైన చేతులతో భిక్షుకులకు భిక్ష సమర్పిస్తారు.

SCERT, TELANGANA

4. “అటువంటి పుణ్యస్త్రీలున్న ఈ నేలలో ఒక్కరైనా భిక్ష సమర్పించడం లేదంటే ఆశ్చర్యంగా ఉన్నది. ఈరోజు ఉదయమే లేచి, ఏ పాపిష్ఠివాని ముఖం చూశానో” అనుకున్నాడు వ్యాసుడు.

5. “సరే, ఇక భిక్షాటనం మాని ఈ రోజుకు ఉపవాసమే చేస్తాం. సూర్యుడు అస్తమిస్తున్నాడు. రేపైనా మనకు ఈ బ్రాహ్మణవాటికలో ఉపవాసాంతభోజనానికి సరిపడ భిక్ష దొరకకపోదు.”

6. అని వ్యాసుడు శిష్యులతో ఆ రాత్రి మఠంలో గడిపి, మరునాడు యథావిధిగా మధ్యాహ్న సమయానికి శిష్యులు, తాను వేరువేరుగా విప్రవాటికల్లో భిక్షాటనం చేయసాగారు. కాని మొదటి రోజులాగానే విశ్వనాథుని మాయవల్ల ఏ ఇల్లాలూ భిక్ష పెట్టలేదు. దాంతో బాధపడి కోపంతో భిక్షాపాత్రను ముక్కలు ముక్కలయ్యేటట్లు నట్టనడి వీథిలో విసిరికొట్టి ఆవేశంతో–

7. “ఈ కాశీ పట్టణంలో నివసించేవారికి మూడు తరాల దాకా ధనం, విద్య, మోక్షం లేకుండుగాక!”

8. అని ఆకలిదప్పులచే బాధపడుతున్న వ్యాసుడు శపించబోయిన సమయంలో ఒక బ్రాహ్మణమందిరపు వాకిట పార్వతీదేవి సామాన్య స్త్రీ వేషంలో వచ్చింది.

9. వేదపురాణ శాస్త్రాలు నిర్దేశించే జ్ఞాన స్వరూపిణి ఆ ముత్తైదువ. కాశీనగరం అనే స్వర్ణపీఠ శిఖరాన్ని అధిరోహించి ఉన్న ఆదిశక్తి – చేతికి ధరించిన రత్నకంకణాలు ఘల్లు ఘల్లుమనేట్లు ఆదరంతో చెయ్యి ఊపుతూ “ఓ సంయమీంద్రా! ఇటురా” అని పిలిచింది.

10. “గొంతుదాకా తినడానికి మాధుకర భిక్షదొరకలేదని ఇంతగా చిందులువేస్తున్నావు కదా! ఇది నీకు మంచిదా? బాగున్నది. నిజంగా నీవు శాంతస్వభావుడవా? పిడికెడు వరిగింజలతో కాలం వెళ్ళబుచ్చేవారు, శాకాహారంతో, దుంపలతో సరిపెట్టుకొనేవాళ్ళు, రోళ్ళవద్ద చెదిరిపడ్డ బియ్యం ఏరుకొని జీవనం సాగించే మునులు నీకంటే తెలివితక్కువవాళ్ళా?

11. ఓ మునిశ్రేష్ఠా! ‘ఉన్నఊరు కన్నతల్లితో సమానం’ అనే నీతి నీకు తెలియదా? అంతకంటె విశేషించి శివుని అర్ధాంగలక్ష్మియైన ఈ కాశీనగరిమీద నీవింత కోపం చూపించడం తగునా?” అని మందలించింది పార్వతీదేవి.

12. “కేవలం భిక్ష దొరకలేదనే నెపంతో బాధపడి నీలాంటి ఉత్తముడు విశిష్టమైన కాశీనగరాన్ని శపించాలనుకుంటాడా? చాలా ఆకలితో ఉన్నావు. కాబట్టి ఈ సమయంలో నిన్ను ఎక్కువగా బాధపెట్టడం మావంటి గృహిణులకు మంచిదికాదు. మాయింటికి భోజనానికి రా! తిని కూర్చున్న తర్వాత నీతో కొన్ని మాటలు మాట్లాడుతా” అన్న ఆ మహాసాధ్విని చూసి, వ్యాసుడిట్లా అన్నాడు –

13. “తల్లీ! సూర్యుడస్తమిస్తున్నాడు. నేనే కాదు, నాతోపాటు ఎంతోమంది శిష్యులూ ఉన్నారు. శిష్యులతో కలసి భుజించాలనే నా వ్రతం విడిచిపెట్టి మీ ఇంట నేనొక్కడినే భుజించలేను. ఈరోజు నిన్నటికి మరునాడేకదా!” (అంటే నిన్నటిలాగే ఈరోజు కూడా ఉపవాసం తప్పదని అంతరార్థం)

SCERT, TELANGANA

14. అని వేదవ్యాసుడు పలుకగా కొంచెం నవ్వి పద్మముఖియైన ఆ ఇల్లాలు "సరేలే! మునీంద్రా! విశ్వనాథుని దయవల్ల ఎంతమంది అతిథులు వచ్చినా కామధేనువువలె కోరిన పదార్థాలన్నీ అనంతంగా నేను ఏర్పాటు చేయగలను. నీ శిష్యగణాన్ని తీసుకొని వెంటనే రా!" అన్నది.

15. అనగా, "సరే! మహాప్రసాదం" అని, వేదవ్యాసుడు శిష్యులను తీసుకొని గంగానదికి వెళ్ళి, స్నాన, ఆచమనాదులు పూర్తి గావించుకొని రాగా-

16. వారి గొడుగు పావుకోళ్ళ (గొడుగు ఆకారంలోని బుడిపెలున్న పావుకోళ్ళు) గిలకలు మోగుతుండగా చంద్రముఖి అయిన ఆ ఇల్లాలు వాళ్ళకు ఎదురువెళ్ళి ఆహ్వానించింది. శిష్యులతో వ్యాసుడు భోజనశాలలో కూర్చున్నాడు. అప్పుడామె వడ్డన సాగించింది.

R9D5U5

## ఇవి చేయండి

## I అవగాహన - ప్రతిస్పందన

**1. కింది పద్యం చదువండి. శ్రీనాథుడు తన గురించి తాను ఏమని చెప్పుకొన్నాడో తెలుపండి.**

సీ॥ వచియింతు వేములవాడ భీమన భంగి
నుద్దండలీల నొక్కొక్కమాటు
భాషింతు నన్నయభట్టు మార్గంబున
నుభయవాక్ప్రౌఢి నొక్కొక్క మాటు
వాక్రుత్తు తిక్కయజ్వ ప్రకారము రసా
భ్యుచిత బంధమున నొక్కొక్కమాటు
పరిఢవింతు ప్రబంధపరమేశ్వరుని తేవ
సూక్తివైచిత్రి నొక్కొక్కమాటు

తే॥గీ॥ నైషధాది మహాప్రబంధములు పెక్కు
చెప్పినాడవు మాకు నాశ్రితుడ వనఘ
ఇపుడు చెప్పఁదొడంగిన యీ ప్రబంధ
మంకితముసేయు వీరభద్రయ్యపేర (కాశీ 1-18)

**2. 'అన్ని దానాల్లోకీ అన్నదానం మిన్న' అనే అంశంపై తరగతిలో చర్చించండి.**

**3. 'ఆకంఠంబుగ.................శిలోంఛప్రక్రముల్ తాపసుల్!' పద్యాన్ని పాదభంగం లేకుండా పూరించి, భావాన్ని రాయండి.**

SCERT, TELANGANA

## II వ్యక్తీకరణ - సృజనాత్మకత

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) పాఠం ఆధారంగా వ్యాసుడు ప్రవర్తించిన తీరుపై మీ అభిప్రాయం రాయండి.

ఆ) "నేఁడు నిన్నటికి మఱునాఁడు నిక్కువంబు" అను మాటలు ఎవరు ఎవరితో, ఏ సందర్భంలో అన్నారు? వీటి అంతరార్థమేమిటో వివరించండి.

ఇ) ఆకలి వల్ల వ్యాసుడు కాశీనగరాన్ని శపించాలనుకున్నాడు కదా! 'ఆకలి మనిషి విచక్షణను నశింపజేస్తుంది' అనే దాని గురించి రాయండి.

**2. కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) భిక్ష పాఠంలోని కథను సంక్షిప్తంగా రాయండి.

(లేదా)

ఆ) కోపంవల్ల కలిగే దుష్పరిణామాలను గురించి రాయండి.

**3. కింది అంశాలను గురించి సృజనాత్మకంగా / ప్రశంసిస్తూ రాయండి.**

అ) భిక్ష, రక్ష, పరీక్ష, సమీక్ష, వివక్ష..... వంటి పదాలతో ఒక చక్కని భావాన్ని ప్రకటించే కవిత రాయండి.

SCERT, TELANGANA

## III భాషాంశాలు

### పదజాలం

**1. కింది వాక్యాల్లో గీతగీసిన పదాలకు పర్యాయపదాలు రాయండి.**

అ) ద్వారకవాటంబు దెఱవదు <u>వనిత</u> యొకతె.

ఆ) ప్రక్షాళితంబైన <u>పసిఁడి</u> చట్టువము.

ఇ) <u>పారాశర్యుండు</u> క్షుత్పిపాసా పరవశుండై శపియింపఁదలంచెను.

ఈ) ఇవ్వీటిమీద <u>నాగ్రహము</u> తగునె?

ఉ) అస్తమింపగ జేసినాడు <u>అహిమకరుడు.</u>

**2. కింది పదాలకు అర్థాలను రాయండి.**

అ) ద్వాఃకవాటము ఆ) వీక్షించు ఇ) అంగన

ఈ) మచ్చెకంటి ఉ) భుక్తిశాల

**3. కింది వాక్యాల్లో నానార్థాలు వచ్చే పదాలను గుర్తించండి.**

అ) వీడు ఏ వీడువాడోగాని దుష్కార్యములను వీడుచున్నాడు.

ఆ) రాజు ఆకాశంలోని రాజును చూసి సంతోషించాడు.

**4. కింది ప్రకృతి పదాలకు సరైన వికృతి పదాలను ఎంపిక చేయండి.**

అ) విద్య ( )

క) విదియ చ) విజ్జ ట) విద్దె త) విద్య

ఆ) భిక్ష ( )

క) బత్తెము చ) బచ్చ ట) బిచ్చ త) బిచ్చము

ఇ) యాత్ర ( )

క) యతర చ) జాతర ట) జైత్ర త) యతనము

ఈ) మత్స్యము ( )

క) మచ్ఛీ చ) మత్తియము ట) మచ్చెము త) మత్తము

ఉ) రత్నము ( )

క) రతనము చ) రచ్చ ట) రచ్చము త) రత్తము

ఊ) పంక్తి ( )

క) పంతులు చ) పత్తి ట) బంతి త) పంకు

## వ్యాకరణాంశాలు

**1. కింద గీత గీసిన పదాల్లోని సంధులను గుర్తించి సంధిపేరు రాయండి.**

అ) పుణ్యాంగనయు భిక్ష యిడదయ్యెఁ గటా!

ఆ) కాశి; యివ్వీటి మీద నాగ్రహము దగునె.

ఇ) ఓ మునీశ్వర! వినవయ్య.

**2. పాఠంలోని తేటగీతి పద్యాన్ని గుర్తించి లక్షణాలతో సమన్వయం చేయండి.**

SCERT, TELANGANA

## సీసపద్యం

❋ **కింది తరగతులలో తేటగీతి, ఆటవెలది పద్యాలు తెలుసుకున్నారు కదా! ఇప్పుడు 'సీస పద్య' లక్షణాలను పరిశీలిద్దాం.**

**కింది ఉదాహరణలను పరిశీలించండి.**

ఉదా:

| ర | సల | ర | సల |
|---|---|---|---|
| U I U | I I U I | U I U | I I U I |
| కాకతీ | యులకంచు | గంట మ్రో | గిననాడు |
| ఇంద్ర | ఇంద్ర | ఇంద్ర | ఇంద్ర |

| నగ | నగ | న | హ |
|---|---|---|---|
| I I I U | I I I U | I I I | U I |
| కరకు రా | జులకు త | త్తరలు | పుట్టె |
| ఇంద్ర | ఇంద్ర | సూర్య | సూర్య |

| త | ర | ర | సల |
|---|---|---|---|
| U I U | U I U | U I U | I I U I |
| కాపయ్య | నాయకుం | డేపుసూ | పిననాడు |

| సల | సల | హ | న |
|---|---|---|---|
| I I U I | I I U I | U I | I I I |
| పరరాజు | లకు గుండె | పట్టు | కొనియె |

**సీసపద్య లక్షణం :**

- ఇందులో నాలుగు పాదాలుంటాయి.
- ప్రతిపాదంలో ఆరు ఇంద్రగణాలు, రెండు సూర్యగణాలు వరుసగా ఉంటాయి.
- పద్యపాదం రెండు సమభాగాలుగా ఉంటుంది.
- రెండు భాగాల్లోను మూడో గణంలోని మొదటి అక్షరం యతి లేదా ప్రాస యతి.
- ప్రాసనియమం లేదు.
- తేటగీతి లేదా ఆటవెలది దీనికి చివరగా ఉంటుంది.

పై పద్యపాదాల్లో –

- ఒక్కొక్కటి రెండు భాగాలుగా ఉన్నాయి.
- రెండు భాగాల్లో కలిపి ఎనిమిది గణాలున్నాయి. (ఆరు ఇంద్రగణాలు + రెండు సూర్యగణాలు)
- యతి, ప్రాస యతులు (కా–గ; ర–ర) (ప–పు; ప–ప) ఉన్నాయి.
- ప్రాసనియమం లేదు. వీటిని బట్టి ఇది సీసపద్యం అని గుర్తించవచ్చు.

3. **పాఠంలోని సీసపద్యానికి గణవిభజన చేసి లక్షణాలను అన్వయించండి.**

### ప్రాజెక్టు పని

- శ్రీనాథుడు రచించిన ఏవైనా 5 పద్యాలు సేకరించండి. (లేదా) కాశీపట్టణ విశేషాలు తెలుసుకొని రాయండి. నివేదిక రాసి వినిపించండి.

**సూక్తి**

**మేధావి ఎన్నికష్టాలుపడ్డా, శుద్ధమైన నడవడిని, జీవనాన్ని వదలడు. దానివల్లనే అతడు ప్రతిష్ఠను, ఉత్తమ గతులనూ పొందుతాడు.**

**– మహాభారతం ఉద్యోగపర్వం**

SCERT, TELANGANA

# 12 భూమిక

- గూడూరి సీతారాం

U2I1W8

## చదవండి - ఆలోచించి చెప్పండి

పుస్తకాలకు రెక్కలుండవు. కాని వాటిని చదివితే మనకు రెక్కలు మొలిచినట్లుగా ఉంటుంది. ఆ రెక్కలు జ్ఞానాన్ని, ఆలోచనాశక్తిని, సృజనాత్మకతా నైపుణ్యాన్ని, లోకపరిశీలనా దృష్టిని, జిజ్ఞాసను, ఉత్సాహాన్ని అందిస్తాయి. మంచిపుస్తకం ఉత్తమమిత్రునితో సమానం. శరీరానికి వ్యాయామం ఎట్లాంటి శక్తినిస్తుందో మంచిపుస్తకం చదవడంవల్ల మనసుకు అలాంటి ఉత్తేజం కలుగుతుంది. ఏది మంచిపుస్తకం, ఏ పుస్తకాన్ని చదువాలనే ఎంపికలో పుస్తక పరిచయవాక్యాలు మార్గదర్శనం చేస్తాయి.

## ప్రశ్నలు

*1. పుస్తకాలు చదువడంవల్ల కలిగే ప్రయోజనాలు ఏవి?*

*2. ఎటువంటి పుస్తకాలను చదువాలి?*

*3. 'ఏదైనా పుస్తకాన్ని చదువాలి' అనే ఆసక్తిని కలిగించే అంశమేది?*

*4. మీరు చదివిన కొన్ని పుస్తకాల పేర్లు చెప్పండి.*

## పాఠం ఉద్దేశం

ముందుమాటవల్ల పుస్తకంపై ప్రాథమిక అవగాహన ఎలా కలుగుతుందో పుస్తకాన్ని చదవాలనే ఆసక్తి, ఆతురత ఎట్లా ఏర్పడుతాయో తెలియజేస్తూ దాని స్వరూపస్వభావాలను పరిచయం చేయడమే ఈ పాఠం ఉద్దేశం.

SCERT, TELANGANA

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం 'పీఠిక' ప్రక్రియకు చెందినది. ఒక పుస్తకం ఆశయాన్ని, అంతస్సారాన్ని, తాత్త్వికతను, రచయిత దృక్పథాన్ని, ప్రచురణకర్త వ్యయప్రయాసలను తెలియజేసేదే పీఠిక. ఒక గ్రంథ నేపథ్యాన్ని, లక్ష్యాలను పరిచయం చేస్తూ ఆ గ్రంథ రచయితగాని, మరొకరుగాని, విమర్శకుడుగాని రాసే విశ్లేషణాత్మక పరిచయవాక్యాలను పీఠిక అంటారు. దీనికే ముందుమాట, భూమిక, ప్రస్తావన, తొలిపలుకు, మున్నుడి, ఆముఖం మొదలైన పేర్లెన్నో ఉన్నాయి. నేషనల్ బుక్‌ట్రస్ట్ ప్రచురించిన 'నెల్లూరి కేశవస్వామి ఉత్తమ కథలు' సంపుటికి గూడూరి సీతారాం రాసిన పీఠిక ప్రస్తుత పాఠ్యాంశం.

## కవి పరిచయం



**18-07-1936**
**25-09-2011**

రాజన్న సిరిసిల్ల జిల్లా దగ్గరగల హనుమాజీపేట గ్రామంలో గూడూరి సీతారాం జన్మించాడు. 1953 నుండి 1965 వరకు సుమారు 80 కథలవరకు రాశాడు. వీటిలో కొన్ని కథలు మాత్రమే దొరుకుతున్నాయి. తెలంగాణ కథా సాహిత్యంలో పేదకులాల జీవితాలను, అట్టడుగు వర్గాల భాషను అక్షరబద్ధం చేసిన రచయిత. స్వాతంత్ర్యానంతర తెలంగాణ తొలితరం కథలకు దిక్సూచిగా నిలబడటమే గాకుండా 1953లో తెలంగాణ రచయితల సంఘానికి కార్యదర్శిగా పనిచేశాడు. పలు గ్రంథాలకు సంపాదకుడిగా వ్యవహరించాడు. 'మారాజు, లచ్చి, పిచ్చోడు, రాజమ్మ రాజీరికం' ఈయన ప్రసిద్ధ కథలు. తెలంగాణ భాషను, యాసను ఒలికించడం ఈయన కలానికున్న ప్రత్యేకత.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకొండి.

SCERT TELANGANA

**ప్రవేశిక**

***కథలు ఒకప్పుడు మానసికానందాన్ని, నైతిక విలువలను చెప్పడానికి పరిమితమై ఉండేవి. 20వ శతాబ్దంలో ఆధునిక కథానిక సాహితీరంగ ప్రవేశం చేయడంతో కథ స్వరూప స్వభావాల్లో స్పష్టమైన మార్పులు చోటుచేసుకున్నాయి. కథానిక సామాజిక బాధ్యతను తలకెత్తుకున్నది. మానవ మనస్తత్త్వాన్ని, సంఘర్షణను. భిన్న సంస్కృతులను తన జీవలక్షణాలుగా చేసుకున్నది. తెలుగు కథానిక అంతర్జాతీయ వేదికల మీద గర్వంగా తలెత్తుకొని నిలబడింది. అటువంటి గొప్ప కథానికా రచయితల్లో నెల్లూరి కేశవస్వామి ఒకరు.***

***విశిష్టమైన వస్తు, శిల్ప నైపుణ్యంతో మహోన్నతమైన కథలు రాసిన నెల్లూరి కేశవస్వామి భారతీయ కథాసాహిత్యంలో సుప్రసిద్ధులైన ప్రేమ్‌చంద్, కిషన్ చందర్‌లతో పోల్చదగినవాడు. ఆయన ఉత్తమ కథల గురించి కొంతైనా తెలుసుకోవడం ఎంతైనా అవసరం.***

SCERT TELANGANA

## I

నెల్లూరి కేశవస్వామితో నా స్నేహం 1950ల నాటిది. నేను హైదరాబాద్‌లోని నిజాం కాలేజీలో డిగ్రీ చదువుతున్న కాలంలో పల్లా దుర్గయ్య, మహాకవి దాశరథి కృష్ణమాచార్య, దాశరథి రంగాచార్య, వట్టికోట ఆళ్వారుస్వామి, బిరుదురాజు రామరాజు, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, డా॥ సి.నారాయణ రెడ్డి, డి. రామలింగం, నెల్లూరి కేశవస్వామి, నా చిన్ననాటి స్నేహితుడు జి. సురమౌళి, మరికొందరం తరచూ నారాయణగూడలో కలుసుకునే వాళ్ళం. సాహిత్య చర్చలు సాగుతుండేవి. నేను ఆ కాలంలోనే విరివిగా కథలురాయడం ప్రారంభించాను. తెలుగు స్వతంత్ర, ఆంధ్రప్రభ వారపత్రిక, తెలుగుదేశం, సుజాత, పల్లెటూరు, ప్రజామాత వారపత్రిక, స్రవంతి మాసపత్రికలలో కథలు అచ్చవుతుండేవి. నెల్లూరి కేశవస్వామి, డి.రామలింగం, జి.సురమౌళి, దాశరథి రంగాచార్య, నేను కథలు రాస్తుంటే మిగతావాళ్ళు కవిత్వం రాస్తుండే వాళ్ళు. మేము అప్పటి మా కథల అచ్చుప్రతులను కాపాడుకోలేక పోయాము. అప్పుడు ఆ ధ్యాస కూడా ఉండేది కాదు.

నా కథల్లాగే నెల్లూరి కేశవస్వామి కథలు ఎన్నో దొరకకుండా పోయాయి. అదృష్టమేమంటే ఆయన 1969లో, 1981లో కొన్ని కథలనైనా సంపుటాలుగా వెలువరించడం వల్ల తెలుగు సాహిత్యానికి దక్కాయి.

1902 నుండి ప్రారంభమై తెలంగాణ కథ సామాజిక పరిణామాలను చిత్రిస్తూ వస్తున్నది. బండారు అచ్చమాంబ తొలి కథకురాలని చరిత్ర స్పష్టం చేసింది. అప్పటి తెలంగాణ కథ పుట్టుక నుండి సామాజిక చైతన్యంతోనే కొనసాగుతూ వచ్చింది. సమాజపరిశీలన, విశ్లేషణ, మానసికచిత్రణ, సామాజిక పరిణామాలు, ఫ్యూడల్‌సమాజం, ప్రజాస్వామిక స్వేచ్ఛావాయువులు, తెలంగాణ పలుకుబడులు, గ్రామీణ కులవృత్తులు, సంస్కృతి, గ్రామీణజీవితం, ఉర్దూమీడియం పోయి తెలుగుమీడియం రావడం, ప్రజాస్వామిక ఉద్యమాలు, రాజకీయ పరిణామాలు మొదలైనవి తెలంగాణ కథలో పలు కోణాల్లో చిత్రించబడ్డాయి. 1918లో స్థాపించబడి, దేశంలోనే మిక్కిలి ప్రసిద్ధి గాంచిన ఉస్మానియా యూనివర్సిటీ ఇందుకు భూమికనందించింది.

హైదరాబాద్ రాజ్యం స్వాతంత్ర్యానికి పూర్వం ఒక ప్రత్యేకదేశంగా, రాజ్యంగా సొంతకరెన్సీని, సైన్యాన్ని కలిగివుండిన, ఐక్యరాజ్య సమితిలోని సభ్యదేశం. హైదరాబాద్ రాజ్యం బ్రిటీషిండియాలోని అతి పెద్దరాజ్యం. అంత పెద్దరాజ్యం ఇండియాలో మరొకటి లేదు. తెలంగాణ, కర్నాటక, మహరాష్ట్ర, ప్రాంతాలతో హైదరాబాద్ రాజ్యం కొనసాగింది.

హైదరాబాద్ రాజ్యంలో నిజామాంధ్ర మహాసభ, కమ్యూనిస్టులు, స్టేట్ కాంగ్రెస్, ప్రజాస్వామిక హక్కుల కోసం, స్వాతంత్ర్యంకోసం ఉద్యమించారు. 1946-1951 మధ్య తెలంగాణ రైతాంగ పోరాటం జరిగింది. ఈ సాయుధ రైతాంగ పోరాటంలో నాలుగువేల మంది చనిపోయారు. మరోవైపు రజాకార్లు విజృంభించి రైతాంగ పోరాటంపై దాడులు చేశారు. రజాకార్లకు కాశీంరజ్వీ నాయకత్వం వహించాడు. 1944-51 మధ్య హైదరాబాద్ రాజ్యంలోని అంతర్యుద్ధం, సామాజిక సంక్షోభంవల్ల ఇండియన్ యూనియన్ సైన్యాలు హైదరాబాద్ రాజ్యంపై దండెత్తి రజాకార్లను, ఉద్యమకారులను, కమ్యూనిస్టులను అణిచివేశారు. 13 సెప్టెంబర్, 1948న హైదరాబాద్ రాజ్యంలోకి ఇండియన్ యూనియన్ సైన్యాలు ప్రవేశించాయి.

17 సెప్టెంబర్, 1948న నిజాం రాజు లొంగిపోయినట్టు ప్రకటించడం, హైదరాబాద్ రాజ్యం ఇండియన్ యూనియన్‌లో విలీనమైనట్టు సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రకటించడం, ఒప్పందాలు కుదుర్చుకోవడం జరిగింది. హైదరాబాద్ రాజ్యం నుండి కొందరు ముస్లింలు పాకిస్తాన్‌కు వెళ్ళిపోవాలని భావించారు. కొందరు వెళ్ళిపోయారు. ఈ చారిత్రక, సామాజిక పరిణామాలను సంక్షుభిత సమాజాన్ని, మానసిక సంఘర్షణను కథల రూపంలో నిక్షిప్తం చేసిన కథకుడు నెల్లూరి కేశవస్వామి.



హైదరాబాద్‌లో పుట్టిన నెల్లూరి కేశవస్వామి నిజాం కాలేజీలో 'ప్రి డిగ్రీ' చదివి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంజనీర్‌గా పట్టభద్రుడై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పబ్లిక్‌వర్క్స్ డిపార్టుమెంటు నీటిపారుదల శాఖలో ఇంజనీర్‌గా పనిచేసి రిటైరయ్యారు. కేశవస్వామి హైదరాబాద్ నగరంలో నివసిస్తూ, అక్కడి జీవితాలను, సంస్కృతిని తెలుగులో చిత్రించిన రచయిత.


**ఆలోచించండి-చెప్పండి**


- కథలకు, కవిత్వానికి గల భేదం ఏమిటి? మీకు ఏవంటే ఇష్టం? ఎందుకు?
- నాటి హైదరాబాదు రాజ్యంలో హక్కులకోసం, స్వాతంత్ర్యంకోసం ప్రజలు ఎందుకు ఉద్యమించి ఉండవచ్చు?
- హైదరాబాదు నగర జీవితాన్ని, సంస్కృతిని తెలుగులో చిత్రించడం అంటే మీకేమి అర్థమైంది?

ఇండియన్ యూనియన్‌లోని జాతీయోద్యమ కాలంలో హైదరాబాద్ రాజ్యంలో ఏం జరుగుతూ వచ్చిందో నెల్లూరి కేశవస్వామి కథల ద్వారా మనకు కొంతైనా తెలుస్తుంది. హైదరాబాద్ రాజ్యం గురించి తమిళంలో, మరాఠీలో వచ్చినంత సాహిత్యం తెలుగులో రాలేదు. తమిళం, మరాఠీలో వచ్చిన హైదరాబాద్ రాజ్యం గురించిన కథలు, నవలలు కేంద్ర సాహిత్య అకాడమీ ద్వారా పలుభాషల్లోకి అనువదించబడ్డాయి. అలా తెలుగులోకి వచ్చాయి. కేశవస్వామి కథలు తెలుగులో రాయబడిన కథలు. తెలుగు సాహిత్యంలో ఈ కథలకు విశిష్టస్థానం వుంది.

## II

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, రాయలసీమ, తెలంగాణ అనే ప్రాంతీయ విభాగాలున్నాయి. నెల్లూరి కేశవస్వామి తెలంగాణ ప్రాంతానికి చెందిన తెలుగు రచయిత. హైదరాబాద్‌లో నివసించి హైదరాబాద్‌లోని జీవభాషను కథల్లో చిత్రించిన రచయిత. ఆయన చాలా కథలు రాశారు. ప్రస్తుతం వాటిలో కొన్ని మాత్రమే లభిస్తున్నాయి. వీరి తొలి కథల సంపుటి 'పసిడిబొమ్మ' ఆగస్టు 1969లో వెలువడింది. మరో తెలంగాణ సుప్రసిద్ధరచయిత కీ.శే. భాస్కరభట్ల కృష్ణారావుగారికి ఈ కథల సంపుటి అంకితం ఇవ్వబడింది. ఈ సంపుటిలోని కథలు రచయిత ప్రారంభదశను తెలపడంతో పాటు క్రమంగా చక్కని రచయితగా ఎదిగిన క్రమాన్ని కూడా స్పష్టం చేస్తాయి.

కేశవస్వామి రెండవ కథాసంకలనం "చార్‌మినార్ కథలు". ఇవి కేవలం ఊహాజనిత కథలు కావు. సామాజిక పరిణామాలకు సాహిత్య రూపం ఇచ్చిన సామాజిక చరిత్ర రచన అని చెప్పవచ్చు. చార్‌మినార్ కథలు హైదరాబాద్ రాజ్యం చరిత్రను, సంస్కృతిని, మానవ సంబంధాలను, ఇక్కడి ముస్లింల జీవితాలను అపూర్వంగా చిత్రించాయి. ఇందులో 'విముక్తి', 'రూహిఆపా', 'షరీఫా', 'ప్రతీకారం', 'అదృష్టం', 'యుగాంతం', 'వంశాంకురం', 'కేవలం మనుషులం' 'ఆఖరి కానుక', 'భరోసా' అనే శీర్షికలతో రాసిన 11 కథలున్నాయి.

చార్‌మినార్ కథల్లోని నవాబులు, దేవిడీలు, మహబూబ్ కి మెహిందీ, కోఠీలు, దివాన్‌ఖాన్‌లు, జనానా ఖానాలు, బేగం సాహెబాలు, దుల్హన్ పాషాలు, పాన్‌దాన్, పరాటా కీమా, దాల్చా, నమాజులు, పరదాల వెనుక జీవితంలోని సంస్కృతి, సంఘటనలు లక్నో, అవధ్, ఢిల్లీలలోని ముస్లిం రాజుల, రాజ్యాల, ప్రజల జీవితాలను, అవిభక్త ఇండియాలోని పాకిస్తాన్, బంగ్లాదేశ్ ప్రాంతాల సంస్కృతిని, మధ్య ఆసియా ముస్లిం దేశాల సంస్కృతిని గుర్తుకు తెస్తాయి. ఈ కథలు అంతర్జాతీయ సంస్కృతి, జీవన విధానం హైదరాబాద్ రాజ్యంలో నిర్దిష్టంగా ఎలా వుండేదో తెలుపుతాయి. 11వ శతాబ్దం

SCERT, TELANGANA

నుండి ఇండియాలో సాగిన ముస్లింల వలసలు, రాజ్యాలు, అవి తెచ్చిన పరిపాలనా విధానాలు, జీవన విధానం, సంస్కృతి భారతీయ సంస్కృతిపై, జీవన విధానంపై చెరగని ముద్ర వేసాయి. భారతీయ సంస్కృతిలో, జీవితంలో అంతర్భాగమైనాయి. అవి హిందూ ప్రజల జీవితంలోకి కూడా ప్రవేశిస్తూ, రెండు మతాల మధ్య ఆలోచనల్లో, సంస్కృతిలో, జీవితంలో ఆదాన ప్రదానాలు జరిగాయి. అలా ఒక నూతన సమన్వయ సంస్కృతి విస్తరించింది. అలా విస్తరించడంలో భాగంగా హైదరాబాద్ నగరం కాస్మోపాలిటన్ నగరంగా ఎదిగింది. ఆ నేపథ్యాన్ని, ఆ జీవితాలను కేశవస్వామి తన కథల్లో చిత్రించారు.

'యుగాంతం' కథ ప్రత్యేకంగా చెప్పాల్సిన కథ. ఇండియా రెండు దేశాలుగా విడిపోయి పాకిస్తాన్ ఏర్పడిన నాటి పరిస్థితులు, సంక్షోభాలు, హత్యాకాండ గురించి భీష్మ సహానీ 'తమస్' నవలలో చిత్రించారు. అది దూరదర్శన్‌లో టీవీ సీరియల్‌గా ప్రసారమైనప్పుడు పెద్ద ఎత్తున చర్చ సాగింది. అలాంటి పరిస్థితులే హైదరాబాద్ రాజ్యంలో 1946-50ల మధ్య ఎలా కొనసాగాయో చాలా మందికి తెలియదు. హైదరాబాద్‌రాష్ట్ర చరిత్ర ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డంతో మూలకు నెట్టివేయబడింది. ఒక సామాజిక వ్యవస్థ, రాజరిక వ్యవస్థ అంతమవుతూ ఒక నూతనదశలోకి సమాజం, మానవ సంబంధాలు మారుతున్న పరిణామాలను చిత్రించడం వల్ల కథకు 'యుగాంతం' అనే పేరు సార్థకతను చేకూర్చింది.

'యుగాంతం' నిజంగానే ఒక యుగాంతాన్ని చిత్రించిన గొప్ప కథ. హైదరాబాద్ రాజ్యంలోని ప్రత్యేక పరిణామాలను, సామాజిక చరిత్రను ఈ కథ ఒక చారిత్రక డాక్యుమెంటులా మనముందుంచుతుంది. ఈ ఒక్క కథ రాసి మరేమీ రాయకపోయినప్పటికీ నెల్లూరి కేశవస్వామి భారతదేశం గర్వించదగిన గొప్ప కథకుల్లో ఒకడుగా కీర్తించబడేవాడు.

చార్‌మినార్ కథల సంపుటి వెలువడిన నేపథ్యం నెల్లూరు కేశవస్వామిని రచయితగా హిమాలయాల ఉన్నత శిఖరాలపై నిలుపుతుంది. కొన్ని అసాంఘిక శక్తులు హైదరాబాద్ ఓల్డ్ సిటీలో హిందూ, ముస్లిం సంఘర్షణల పేరిట అపార్థాలు సృష్టించి మారణకాండను జరిపారు. హిందూ, ముస్లింల మధ్య అసలు నేరస్తులు, వారి రాజకీయ లక్ష్యాలు తెలియక అనుమాన బీజాలు పెరిగాయి.

ఆ సంక్షుభిత వాతావరణంలో హిందూ, ముస్లింల సఖ్యత కోసం ఎందరో ప్రజాస్వామికవాదులు నడుం బిగించారు. రచయితగా, లోహియా సోషలిస్టుగా నెల్లూరు కేశవస్వామి ఈ సంఘటనల పట్ల చలించిపోయి అశాంతిగా గడిపిన నిద్రలేని రాత్రులెన్నో... తాను ఈ సమాజంలో తిరిగి హిందూ, ముస్లిం సఖ్యత కోసం ఏమి చేయలేనా? రాజకీయాల కోసం మానవ సంబంధాలు, మమతలు, మతాలు, కులాతీత, మతాతీత స్నేహాలు, ఆత్మీయతలు బలికావల్సిందేనా అని... అలా కావడానికి వీల్లేదని, తాను జీవించిన, తాను అనుభవించిన స్నేహం, ఆత్మీయత, కులాతీత, మతాతీత మమతలు, ఓల్డ్ సిటీ జీవితాన్ని చార్మినార్ కథలుగా వెలువరించారాయన. ఇలా ఒక సామాజిక శాస్త్రవేత్తగా చైతన్యశీలిగా తన వంతు కర్తవ్యాన్ని కేశవస్వామి నెరవేరుస్తూ రాసిన కథలివి. చార్‌మినార్ కథలు కేవలం కథలు కావు. వాస్తవ జీవితాల, సామాజిక పరిణామాల సామాజిక చరిత్రను నిక్షిప్తం చేసుకున్న చారిత్రాత్మక కథలు. ముఖ్యంగా నిజాం రాజ్య యుగాంత పరిణామాలను చిత్రించిన కథలు. ఈ కథల్లో నెల్లూరి కేశవస్వామి హృదయం వుంది.



**ఆలోచించండి-చెప్పండి**

- అపార్థాలు ఎందుకు వస్తాయి?
- 'చార్‌మినార్' కథలను ఎందుకు చదువాలి?
- రెండు మతాల మధ్య ఆలోచనలు, సంస్కృతిలో ఆదానప్రదానాలు జరగడం అంటే ఏమిటి?

SCERT TELANGANA

## III

అందులో భాగంగా చూసినప్పుడు కేశవస్వామి రాసిన 'రుహీ ఆపా' కథ మహోన్నతమైన మానవీయ సంబంధాలను, మనిషిలోని సున్నితమైన హృదయాన్ని కులమతాలకు అతీతంగా స్పందించే మనిషిని చిత్రించిన కథ. ముజ్రాల జీవితాల్లో ఆనందించే, జీవితమంతా హృదయంలో దాచుకునే సంతోష సన్నివేశాలు 'రూహీ ఆపా'లో చిత్రించారు కేశవస్వామి. రెండు కథల పాత్రలకు అవే పేర్లు ఉంచడంలో రచయిత ఒక స్పష్టమైన దృష్టితోనే రాశాడని చెప్పకనే తెలుస్తున్నది.

ఒక రోజు రమణి పాట వినడానికి నవాబుగారు వస్తున్నారని అమ్మ తయారుకమ్మని చెపుతుంది. ఏదో అనుమానం పొడసూపితే అలాంటిదేమీ లేదని తల్లి హామీ ఇస్తుంది. నవాబు ముందు ఒక గజల్ అందుకుంది. అది విన్నంతసేపు నవాబుగారు కళ్ళు మూసుకునే వున్నారు. నవాబుగారు నెలకు వెయ్యి రూపాయలు భరణం ఇస్తారని వారానికోసారో, నెలకోసారో వారి దేవిడీకి (భవంతికి) మధ్యాహ్నం పూట వెళ్ళి గంటో రెండు గంటలో పాటలు వినిపించి రావాలని ముజ్రాలు పూర్తిగా మానివేయాలని, కావాలంటే రేడియోలో ప్రోగ్రాం ఇవ్వొచ్చని చెప్పినట్టు తల్లి చెపుతుంది. ఆనాటి నుంచి రమణి రోజు వారి కార్యక్రమం మారిపోయింది. ఒకరోజు నవాబు నీకీ పేరు బాగాలేదని 'రూహి' అని పేరుతో పిలుస్తానని కోరుతాడు.

రెండేళ్ళ తర్వాత అతని కొడుకు రూహికి ఎదురవుతాడు. నవాబు వూరుకు వెళ్ళిన సమయంలో చిన్న నవాబు సలీం రూహిని ఆహ్వానిస్తాడు. రూహి పరిపరి విధాలుగా పోతుంది. సలీం ఆమెని తమ రహస్య గదిలోకి తీసుకెళ్తాడు. అక్కడ ఒక పరదా వేసిన ఫోటో చూపిస్తాడు. ఆ ఫోటో అచ్చం రూహి (రమణి) లాగే వుంటుంది. రూహి ఆ ఫోటో చూసి ఆశ్చర్యపోతుంది. మా అక్క అని సలీం చెపుతాడు. నిన్ను అక్క అని పిలవాలని వుందని రూహిఅపా అని పిలుస్తాడు. రూహిఅపాను నవాబు ఎందుకంత ఇష్టపడి వాత్సల్యం చూపాడో మనకు తెలుస్తుంది. ఆమె నవాబు కూతురా? అని పాఠకులకు సందేహం కలుగుతుంది. సొంత కూతురులా నవాబు, నవాబు కొడుకు ఒక ముజ్రాల రమణిని గౌరవించిన తీరును చిత్రించడం ద్వారా ముస్లిం నవాబుల్లో కొనసాగిన హృదయ సంస్కారాన్ని రచయిత ఒడిసి పట్టాడు.

ఇందులోని 'షరీఫా', 'ప్రతీకారం', 'అదృష్టం', 'వంశాంకురం', 'కేవలం మనుషులం', 'భరోసా', 'ఆఖరి కానుక' మొదలగు కథలు విశిష్టమైనవి. దేనికవే ప్రత్యేకమైనవి. 'వంశాంకురం' కథలో ముస్లిం పెళ్లి సంబంధాలెలా వుంటాయో, కొడుకు పుట్టాలనే ఆశ ఆడపిల్లల జీవితాలను ఎలా అతలాకుతలం చేసి ఆత్మహత్యకు పురికొల్పుతాయో హృదయవిదారకంగా చిత్రించింది.

'కేవలం మనుషులం' కథలో హుస్సేన్ మిర్జా, మహబూబ్‌రాయ్ సక్సేనా దశాబ్దాల స్నేహితులు. వారి కుటుంబాలు స్నేహంగా కలిసి వుంటాయి. మతాల సరిహద్దులను చెరిపివేసిన స్నేహం గురించిన చక్కని కథ.

'భరోసా' కథ నమ్మిన పేదలను నట్టేట ఎలా ముంచుతారో భరోసాను భగ్నం చేసిన యథార్థ కథ. 'ఆఖరి కానుక' కథ రోజురోజుకు పేదరికంలోకి ఈడ్వబడుతున్న ముస్లిం కుటుంబాలు అరబ్బు దేశాల షేక్‌లకు తమ కూతుళ్ళను ఇచ్చి పెళ్ళి చేసి తద్వారా కాస్త ఆర్థిక సౌలభ్యం పొందాలనుకునే దుస్థితిని తెలియజేస్తుంది.

SCERT, TELANGANA

ఇలా వాసిలో, విశిష్టమైన వస్తు, శిల్ప నైపుణ్యంతో మహోన్నతమైన కథలు రాసిన నెల్లూరి కేశవస్వామిని భారతీయ సాహిత్యంలో పోల్చవలసి వస్తే ఉర్దూ, హిందీల్లో రాసిన సుప్రసిద్ధ రచయితలు ప్రేంచంద్, కిషన్‌చందర్‌ల కోవకుచెందిన రచయిత. అలనాడు హైదరాబాద్ రాజ్యంలోని గోల్కొండ గనుల్లో లభించిన ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కొహినూర్, జాకోబ్ వజ్రాల వంటివే స్వర్గీయ నెల్లూరి కేశవస్వామి కథలు.

**ఆలోచించండి-చెప్పండి**

- హృదయ సంస్కారం అంటే ఏమిటి? కొన్ని ఉదాహరణలు చెప్పండి.
- 'స్నేహం మతాల సరిహద్దులను చెరిపివేస్తుంది?' - సమర్థించండి.
- పేదల కష్టాలు ఎట్లా ఉంటాయి? పేదల జీవితాల్లో మార్పులు రావడానికి ఏం చేస్తే బాగుంటుంది?

## ఇవి చేయండి

L6M7N5

### I అవగాహన - ప్రతిస్పందన

**1.** **కవులు, రచయితలు రాసిన పుస్తకాలను అందరికీ పరిచయం చేయడానికి పుస్తకావిష్కరణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇటువంటి కార్యక్రమాలలో ఏమేం చేస్తారో చెప్పండి.**

**2.** **నేటి సమాజానికి ఎటువంటి రచయితల అవసరం ఉందో చెప్పండి.**

**3.** **పాఠం ఆధారంగా కింది పట్టికను పూరించండి.**

| పేరా | దేని గురించి వివరించబడింది. |
|---|---|
| 1) ఇండియన్ యూనియన్‌లోని ...... .....................విశిష్ట స్థానం ఉంది. | |
| 2) యుగాంతం కథ ..................... ...... సార్థకతను చేకూర్చింది. | |
| 3) ఆ సంక్షుభిత ........................... ...... హృదయం ఉంది. | |
| 4) భరోసాకథ ............................ ............. తెలియజేస్తుంది. | |

SCERT, TELANGANA

## II వ్యక్తీకరణ - సృజనాత్మకత

1. **కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) 'ఒక భాషలోని సాహిత్యం చదవడం ద్వారా నాటి పరిస్థితులను అర్థం చేసుకోవచ్చు' దీనిపై మీ అభిప్రాయం చెప్పండి.

ఆ) తెలంగాణ పలుకుబడులంటే ఏమిటి? కొన్ని ఉదాహరణలు రాయండి.

ఇ) "తెలంగాణ కథ పుట్టుక నుండి సామాజిక చైతన్యంతోనే కొనసాగుతూ వచ్చింది" అనే వాక్యం ద్వారా మీకేమర్థమయిందో తెలుపండి.

2. **కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) మెతుకును చూసి అన్నం ఉడికిందో లేదో చెప్పవచ్చు. అట్లే 'పుస్తక పరిచయ వ్యాసాన్ని లేదా సమీక్షను చదివితే కూడా ఆ పుస్తకం గురించి ఆమూలాగ్రంగా అర్థం చేసుకోవచ్చు' ఎట్లాగో రాయండి.

(లేదా)

ఆ) కేశవస్వామి కథల గురించి గూడూరి సీతారాం రాసిన వ్యాసం ఆధారంగా కేశవస్వామి రచనల గురించి రాయండి.

3. **కింది అంశాన్ని గురించి సృజనాత్మకంగా / ప్రశంసిస్తూ రాయండి.**

అ) మీ పాఠశాల గ్రంథాలయంలోని ఏదైనా ఒక కథల పుస్తకం తీసుకొని చదువండి. దీనికి పుస్తక పరిచయం (పీఠిక) రాయండి.

## III భాషాంశాలు

### పదజాలం

1. **గీత గీసిన పదాలకు అర్థాలను రాయండి.**

అ) రాజు ధ్యాస అంతా క్రికెట్ ఆటపైనే ఉన్నది. ______________________

ఆ) ప్రజ్ఞ, మనోజ్ఞ ఇద్దరూ సఖ్యత తో మెలుగుతారు. ______________________

ఇ) ఫల్గుణ్ హస్తవాసి చాలా మంచిది. ______________________

SCERT, TELANGANA

ఈ) తెలంగాణలో యాదగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం ప్రఖ్యాతి చెందింది.

______________________________________________

ఉ) పూర్వం జమీందారుల దేవిడీలలో చర్చాగోష్ఠులు జరిగేవి. ______________________

**2. కింది పదాలను వివరించి రాయండి.**

అ) హృదయసంస్కారం : ______________________

ఆ) సామాజిక పరిణామం : ______________________

ఇ) భారతీయ సంస్కృతి : ______________________

ఈ) అతలాకుతలం : ______________________

## వ్యాకరణాంశాలు

**1. కింది పదాలకు విగ్రహవాక్యాలురాసి, సమాసాలు గుర్తించండి.**

అ) దశకంఠుడు = ______________, ______________

ఆ) పీతాంబరుడు = ______________, ______________

ఇ) అరవిందానన = ______________, ______________

ఈ) మృగనేత్ర = ______________, ______________

ఉ) చంచలాక్షి = ______________, ______________

ఊ) మానధనులు = ______________, ______________

ఋ) రాజవదన = ______________, ______________

ౠ) నీరజభవుడు = ______________, ______________

**2. కింది ప్రత్యక్ష వాక్యాలను పరోక్ష వాక్యాలుగా మార్చండి.**

అ) "హైదరాబాదు రాజ్యం ఇండియన్ యూనియన్‌లో విలీనమైంది" అని సర్దార్ వల్లభభాయ్ పటేల్ ప్రకటించాడు.

ఆ) "తెలుగు కథాసాహిత్యంలో రమణీయమైన పోకడలు కల్పించిన ప్రసిద్ధ కథకుల్లో ఒకరు నెల్లూరి కేశవస్వామి" అని గూడూరి సీతారాం అన్నాడు.

ఇ) "చార్మినార్ అనే పేరును బట్టే ఈ కథల విశిష్టత వ్యక్తమవుతుంది" అని డి. రామలింగం పేర్కొన్నాడు.

**3. కింది కర్తరి వాక్యాలను కర్మణి వాక్యాలుగా మార్చండి.**

అ) పాకిస్తాన్ ఏర్పడిన నాటి పరిస్థితుల గురించి భీష్మసహాని 'తమస్' నవలలో చిత్రించాడు.

ఆ) హైదరాబాద్ రాష్ట్ర చరిత్రను ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత మూలకు నెట్టివేశారు.

ఇ) నెల్లూరి కేశవస్వామిని భారతదేశం గర్వించదగిన గొప్ప కథకుల్లో ఒకడిగా కీర్తించారు.



SCERT, TELANGANA

## శ్లేషాలంకారం

* **కింది వాక్యాలను పరిశీలించండి.**

అ) మిమ్ముమాధవుడు రక్షించుగాక!

అర్థం 1. మిమ్ము మాధవుడు (విష్ణువు) రక్షించుగాక!

2. మిమ్ము ఉమాధవుడు (శివుడు) రక్షించుగాక!

ఆ) మానవ జీవనం సుకుమారం.

అర్థం 1. మా నవ (ఆధునిక) జీవనం సుకుమారమైంది.

2. మానవ (మనిషి) జీవనం సుకుమారమైంది.

పై అర్థాలను గమనించినారు కదా! ఒకే శబ్దం రెండు వేర్వేరు అర్థాలనందిస్తున్నది. (విభిన్న అర్థాలు ఆశ్రయించి ఉన్నాయి.) ఇట్లా విభిన్న అర్థాలను కలిగి ఉండే పదాలుంటే దానిని **'శ్లేషాలంకారం'** అని అంటారు.

**లక్షణం : నానార్థాలను కలిగి ఉండే అలంకారం శ్లేష.**

**4. కింది లక్ష్యాలలో ఉన్న అలంకారాన్ని గుర్తించి సమన్వయం చేయండి.**

అ) రాజు కువలయానందకరుడు.

ఆ) నీవేల వచ్చెదవు.

**5. కింది వాక్యాల్లోని అలంకారాలను గుర్తించండి.**

అ) మావిడాకులు తెచ్చివ్వండి.

ఆ) వాడి కత్తి తీసుకోండి.

ఇ) ఆమె లత పక్కన నిలుచున్నది.

## ప్రాజెక్టు పని

♦ వార్తా పత్రికలు లేదా మ్యాగజైన్‌లలో వచ్చిన పుస్తకం పరిచయాలను / సమీక్షా వ్యాసాలను సేకరించండి. నివేదిక రాసి తరగతిలో ప్రదర్శించండి.


**సూక్తి**

**మంచిపుస్తకం మంచిమనసుకు మరోపేరు**
**సొంతపుస్తకం మంచిమనిషికి మరోతోడు**

SCERT, TELANGANA

చదువండి – తెలుసుకొండి

# విశ్వకవి 'గీతాంజలి'



సాహిత్య సృజనలో అంతర్జాతీయ కీర్తినందుకొన్న మహాకవి రవీంద్రనాథ్ టాగూర్. కవిగా రచయితగా తత్త్వవేత్తగా సంగీతజ్ఞుడిగా చిత్రకారుడిగా బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించాడు. రవీంద్రుని పేరు వినగానే చప్పున స్ఫురించేవి 'జనగణమన' గీతం, 'గీతాంజలి'. 'జనగణమన' గీతం భారత జాతీయగీతంగా గుర్తింపబడింది. బంగ్లాదేశ్ జాతీయగీతం కూడా ఇతని లేఖిని నుండి వెలువడినదే. ఇలా రెండు జాతీయగీతాలనందించిన కవిగా అపూర్వ చరిత్రను సృష్టించాడు. 'శాంతినికేతన్' పేరున ఆదర్శవిద్యాలయాన్ని స్థాపించి 'గురుదేవుడు'గా కీర్తింపబడ్డాడు. ఈ సంస్థద్వారా సంస్కారయుక్తమైన విద్యనందించాడు.

కవిగా ఇతనికి ప్రపంచవ్యాప్త గుర్తింపును తెచ్చిన రచన 'గీతాంజలి'. 1913లో దీనికి 'నోబెల్ సాహిత్య పురస్కారం' దక్కింది. నోబెల్ బహుమతిని అందుకున్న తొలి భారతీయుడిగా టాగూర్ అరుదైన గౌరవాన్ని పొందాడు. 'గీతాంజలి' భారతీయ భాషల్లోకి మాత్రమేకాక ఎన్నో విదేశీ భాషలలోకి అనువదింపబడింది. ఒక్క తెలుగు భాషలోనే దాదాపు 50 దాకా అనువాదాలొచ్చాయంటే దీని గొప్పదనమేమిటో ఊహించవచ్చు. తాత్త్విక, సామాజిక అంశాలను స్పృశిస్తూ సాగిన ఈ రచన పాఠకుని హృదయాన్ని కదిలిస్తుంది.

'గీతాంజలి'లోని రెండు అనువాద కవితా ఖండికలను ఇప్పుడు చూద్దాం.

1. ఎక్కడ మనసు నిర్భయంగా ఉంటుందో
ఎక్కడ మనుషులు తలెత్తి తిరుగుతారో
ఎక్కడ జ్ఞానం విరివిగా వెలుస్తుందో
సంసారపు గోడలమధ్య ఎక్కడ భాగాల కింద ప్రపంచం విడిపోలేదో
ఎక్కడ సత్యాంతరాళంలోంచి పలుకులు బైలు వెడలతాయో
ఎక్కడ అలసటనెరగని శ్రమ తన బాహువుల్ని పరిపూర్ణతవైపు జాస్తుందో
ఎక్కడ నిర్జీవమైన ఆచారపుటెడారిలో స్వచ్ఛమైన బుద్ధిప్రవాహం ఇంకిపోకుండా ఉంటుందో
ఎక్కడ మనసు నిరంతరం వికసించే భావాలలోకీ, కార్యాలలోకీ నీచే నడపబడుతుందో
ఆ స్వేచ్ఛా స్వర్గానికి, తండ్రీ! నా దేశాన్ని మేల్కొలుపు.

– చలం

2. నా హృదయంలోని పేదరికాన్ని సమూలంగా తొలగించు ప్రభూ – ఇదే నా ప్రార్థన.
నా సుఖదుఃఖాలను తేలికగా భరించ గలిగే శక్తిని నాకు ప్రసాదించు.
సేవలోనే నా ప్రేమను ఫలింపజేసుకొనే శక్తిని అందజేయి.
పేదలను కాదనకుండా, అధికారదర్పానికి దాసోహమనకుండా ఉండే శక్తిని ప్రసాదించు.
దైనందిన అల్పవిషయాలకు అతీతంగా బుద్ధిని నిలుపుకోగల శక్తిని ప్రసాదించు.
నీ అభీష్టానికి ప్రేమతో నా శక్తిని అర్పించుకోగలిగే శక్తి నివ్వు.

– డా|| జె. భాగ్యలక్ష్మి

SCERT, TELANGANA

# ఉపవాచకం

## మన ఇతిహాసం

# రామాయణం

## (వాల్మీకి రామాయణానికి సంక్షిప్త వచనరూపం)

### రామాయణాన్ని ఎందుకు చదువాలంటే...

మానవ జీవితాన్ని సంస్కరించగల మహాకావ్యం రామాయణం. మానవ హృదయాల నుండి ఎప్పటికీ చెరగని కథ. 'అమ్మానాన్నల అనురాగం, పుత్రుల అభిమానం – అన్నదమ్ముల అనుబంధం, భార్యాభర్తల సంబంధం – గురుభక్తి, శిష్యానురక్తి – స్నేహఫలం, ధర్మబలం – వినయంతో ఒదగడం, వివేకంతో ఎదగడం –జీవకారుణ్యభావన, ప్రకృతిలాలన' – ఇలా జీవిత పార్శ్వాలనెన్నింటినో పట్టి చూపిస్తుంది రామాయణం. రామాయణాన్ని చదవడమంటే జీవితాన్ని చదవడమే. రామాయణం పారాయణ గ్రంథంకాదు, ఆచరణ ప్రధాన గ్రంథం. ఉత్తమ ధర్మాలను ఆచరిస్తే మనిషి మనీషిగా ఎలా ఎదగగలడో నేర్పుతుంది. చిన్న చిన్న పాత్రల ద్వారా సమున్నత సందేశాన్నందిస్తుంది. "రామో విగ్రహవాన్‌ధర్మః సత్యధర్మ పరాక్రమః" అన్న మహితోక్తిని మారీచుని నోటినుండి మహర్షి పలికించాడు. రామునివంటి ఆదర్శమూర్తి, రామాయణం వంటి ఆదర్శకావ్యం 'నభూతో నభవిష్యతి!' మనిషి ఉన్నంతకాలం రామాయణం ఉంటుంది.

ప్రపంచ సాహిత్యంలోనే ఆదికావ్యం రామాయణం. వాల్మీకి మహర్షి దీనిని రచించి 'ఆదికవి'గా కీర్తిపొందాడు. 'రామాయణం, పౌలస్త్యవధ, సీతాయాశ్చరితం మహత్' అనే మూడు పేర్లు దీనికున్నాయి. ఆరు కాండల (విభాగం) తో, ఇరవై నాలుగు వేల శ్లోకాలతో, సంస్కృత భాషలో సాగిన రచన ఇది. తరువాతి కాలంలో ఎన్నో రామాయణాలు వచ్చాయి. మన దేశంలోనే కాదు ప్రపంచంలోని పలుదేశాల్లో ఈ రామాయణ కథ మనకు కనిపిస్తుంది. వారి వారి ప్రతిభననుసరించి వాల్మీకి కథకు జోడింపులు చేసిన కవులూ ఉన్నారు. అవే నిజం అన్నంతగా ప్రచారం పొందాయి కొన్ని సంఘటనలు.

వాల్మీకి రామాయణ కథను సంక్షిప్తంగా అందించే ప్రయత్నం ఇది. సమున్నత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ముందు తరాలవారికి స్ఫూర్తి కోసం చేసిన రచన ఇది.

SCERT, TELANGANA



# బాలకాండం



శ్రీమన్నారాయణుని నిరంతరం స్మరించే నారదమహర్షి ఒకనాడు మునిశ్రేష్ఠుడైన వాల్మీకి ఆశ్రమానికి వచ్చాడు. నారదుడు తపస్వి, వాక్చతురుల్లో శ్రేష్ఠుడు. వాల్మీకి జిజ్ఞాసతో నారదుల వారినడిగాడు (జిజ్ఞాసే విజ్ఞానానికి మూలం). "ఓ మహర్షీ! అన్నీ మంచి గుణాలు కలవాడు, ఎలాంటి ఆపదలు చుట్టుముట్టినా తొణకనివాడు, ధర్మంతెలిసినవాడు, ఆశ్రయించినవారిని ఆదుకునేవాడు, మాటతప్పనివాడు, సకల ప్రాణులకు మేలుచేసేవాడు, వీరుడు, ధీరుడు, అసూయలేనివాడు, అందమున్నవాడు... ఇలాంటి శుభలక్షణాలు కలవాడు ఎవరైనా ఈ లోకంలో ఉన్నాడా?" అని ప్రశ్నించాడు. నారదుడు చిరునవ్వుతో సమాధానమిచ్చాడు. "మహామునీ! ఇన్ని లక్షణాలు ఒకే వ్యక్తిలో కుదురుకోవడం సాధారణంగా జరగదు. కానీ, నీవు తెలిపిన విశిష్ట గుణాలన్నీ మూర్తీభవించినవాడు శ్రీరాము"డని తెలిపాడు. రామాయణగాథను సంక్షిప్తంగా వాల్మీకికి వినిపించాడు నారదుడు. అక్కడి నుంచి బ్రహ్మలోకానికి వెళ్ళిపోయాడు.

రామకథ వాల్మీకి మనసులో నాటుకుపోయింది. నారదుని మాటలు ఇంకా చెవిలో ఇల్లు కట్టుకుని పోరుతున్నాయి. గంగానదీ సమీపానగల తమసానదికి స్నానం చేయడానికి బయల్దేరాడు. భరద్వాజాది శిష్యులు వెంట నడుస్తున్నారు. తమసానది మంచివాని మనసువలె స్వచ్ఛంగా ఉంది.

స్నానానికి నదిలోకి దిగిన వాల్మీకి చుట్టూ ఉన్న ప్రకృతి అందాలకు పరవశిస్తున్నాడు. సమీపంలో ఒక కొమ్మపైన క్రౌంచ పక్షుల జంటను చూశాడు. వాటి అనురాగం ముచ్చటగొలుపుతున్నది. వాటి మధురధ్వనులు వీనులవిందు చేస్తున్నాయి. ఇంతలో ఒక వేటగాడు క్రూరబాణంతో మగపక్షిని నేలకూల్చాడు. అది నెత్తురోడుతూ విలవిలలాడుతూ ప్రాణాలను విడచింది. ఆ ఎడబాటును తట్టుకోలేని ఆడపక్షి తల్లడిల్లిపోయింది. హృదయ విదారకమైన ఈ దృశ్యాన్ని చూశాడు వాల్మీకి. కరుణరసం జాలువారింది. ధర్మావేశం కట్టలు తెంచుకుంది. వెంటనే నోటి వెంట అప్రయత్నంగా...

మానిషాద ప్రతిష్ఠాంత్వ
మగమః శాశ్వతీః సమాః।
యత్ క్రౌంచమిథునాదేకమ్
అవధీః కామమోహితమ్॥

("ఓ కిరాతుడా! క్రౌంచపక్షి జంటలో పరవశమైయున్న ఒక పక్షిని చంపిన నీవు శాశ్వతంగా అపకీర్తి పాలవుతావు") అన్న మాటలు వచ్చాయి.

అననైతే అన్నాడు కానీ తరవాత అతనికే ఆశ్చర్యంవేసింది. ఈ మాటలు సమానాక్షరాలుగల నాలుగు పాదాలతో లయబద్ధంగా వచ్చాయి. ఇది ఛందోబద్ధమైన శ్లోకమేనని నిర్ధారించుకున్నాడు. శోకం నుంచి శ్లోకం పుట్టింది. ఆశ్రమానికి తిరిగివచ్చారందరూ. కాని క్రౌంచపక్షి దారుణ దృశ్యం మాత్రం వాల్మీకి మనసునుంచి వెనుదిరగడం లేదు. అదే ఆలోచన. అదే ఆవేదన. ఇంతలో సృష్టికర్త అయిన బ్రహ్మ వాల్మీకిని చూడడానికి ఆశ్రమానికివచ్చాడు. అతనికి శాస్త్రోక్త ఉపచారాలన్నీ చేశాడు వాల్మీకి. బ్రహ్మ

SCERT, TELANGANA

వాల్మీకిని కూర్చోమన్నాడు. బ్రహ్మ ఆసనంకన్నా కొంచెం తక్కువ ఎత్తుగల ఆసనంపైన కూర్చున్నాడు వాల్మీకి. ఇది పెద్దలపట్ల ప్రవర్తించవలసిన తీరు. బ్రహ్మ ఎదురుగా ఉన్నా క్రౌంచపక్షి బాధ వాల్మీకిని వదలడం లేదు. మనసులో 'మానిషాద' శ్లోకమే మళ్ళీ ధ్వనించింది. అన్నీ తెలిసిన బ్రహ్మ చిరునవ్వును చిందిస్తూ "ఓ ఋషీశ్వరా! నీవు పలికినది శ్లోకమే. అది నా సంకల్ప ప్రభావం. ఈ ఛందస్సు (అనుష్టుప్) లోనే శ్రీరామచరిత్రను రాయ"మని ఆదేశించాడు. నారదుడు స్పష్టంగా వివరింపని రామకథా రహస్యాలు కూడా స్ఫురిస్తాయని అనుగ్రహించాడు. ఈ భూమండలంలో పర్వతాలు, నదులు ఉన్నంతకాలం రామాయణగాథను జనులు కీర్తిస్తూనే ఉంటారని ఆశీర్వదించాడు. బ్రహ్మ ఆదేశానుసారం రామాయణరచనకు శ్రీకారం చుట్టాడు వాల్మీకి మహర్షి.

**అయోధ్యా నగరం :**

సరయూనదీతీరంలో 'కోసల' అనే సుప్రసిద్ధ దేశముంది. అందులోనిదే 'అయోధ్యా' అనే మహానగరం. 'అయోధ్యా' అంటే యోధులకు జయించడానికిశక్యంకానిది. మనువు దీన్ని నిర్మించాడు. కోసల దేశాన్ని దశరథమహారాజు పరిపాలిస్తున్నాడు. అతడు సూర్యవంశం వాడు. మహావీరుడు. దేవతల పక్షాన రాక్షసులతో ఎన్నోమార్లు యుద్ధం చేసినవాడు. ధర్మపరాయణుడు. ప్రజలను కన్నబిడ్డలవలె చూసుకునేవాడు. వసిష్ఠ, వామదేవులు అతని ప్రధానపురోహితులు. సుమంత్రుడు మొదలుగాగల ఎనిమిది మంది మంత్రులు. ఇతని పాలనలో కోసల దేశం భోగభాగ్యాలతో విలసిల్లింది. ప్రజలు ధర్మవర్తనులై సుఖసంతోషాలతో ఉన్నారు. ('యథారాజా తథా ప్రజాః' – రాజు ఎలా ఉంటే ప్రజలూ అలాగే ఉంటారు.)

ఎన్ని ఉన్నా సంతానం లేదన్న చింత దశరథుణ్ణి కుంగదీసింది. సంతానప్రాప్తి కోసం అశ్వమేధయాగం చేయాలన్న ఆలోచన కలిగింది. వెంటనే పురోహితులు, గురువులతో సమావేశమయ్యాడు. మనసులోని మాట చెప్పాడు. వారు తథాస్తు అన్నారు. సరయూనదికి ఉత్తర తీరంలో యజ్ఞవేదిక సిద్ధమైంది. మంత్రీ, సారథీ అయిన సుమంత్రుడు ఈ యాగానికి ఋష్యశృంగ మహర్షిని ఆహ్వానిస్తే ఫలవంతమౌతుందని సూచించాడు. ఋష్యశృంగుడు విభాండక మహర్షి కుమారుడు. నిష్ఠాగరిష్ఠుడు. అతడు ఎక్కడ ఉంటే అక్కడ వానలు బాగా కురుస్తాయి. దశరథుని ఆజ్ఞమేరకు ఋష్యశృంగుణ్ణి సగౌరవంగా తోడ్కొనివచ్చారు. మూడు రోజులపాటు అశ్వమేధయాగం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

తరవాత దశరథుడు ఋష్యశృంగునితో పుత్రప్రాప్తికోసం చేయవలసిన క్రతువును గురించి అడిగాడు. ఆ భారాన్ని ఋష్యశృంగునిపైనే ఉంచాడు. దశరథుని అభ్యర్థనను మన్నించిన ఋష్యశృంగుడు 'పుత్రకామేష్టి' అనే యాగాన్ని ప్రారంభించాడు. హవిస్సులందుకోవడానికి బ్రహ్మాదిదేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు యజ్ఞశాలలో ప్రత్యక్షమయ్యారు.

అదే సమయంలో దేవతలందరూ బ్రహ్మను చేరి తమగోడు వెళ్ళబోసుకున్నారు. రావణాసురుడు బ్రహ్మ వరప్రభావంచేత విర్రవీగుతూ తమను చిత్రహింసలకు గురిచేస్తున్నాడన్నారు. ముల్లోకాలను బాధించడమేగాక ఇంద్రుణ్ణిసైతం రాజ్యభ్రష్టుణ్ణి చేయడానికి పూనుకొన్నాడని తెలిపారు. అతని దుండగాలకు అంతేలేదన్నారు. ఋషుల, యక్షగంధర్వుల మాట అటుంచి అతని భయంతో సూర్యుడు, సముద్రుడు, వాయువు కూడా తమ సహజస్థితిని ప్రకటించలేకపోతున్నారని వాపోయారు. అతని పీడ విరగడయ్యే ఆలోచనను బ్రహ్మనే చెప్పమని వేడుకున్నారు.

బ్రహ్మ దేవతలతో "రావణుడు గంధర్వ, యక్ష, దేవ, దానవులచే మరణం లేకుండా నన్ను వరం కోరాడు. మానవుల పట్ల అతనికి చులకనభావం. అందుకే వారి గురించి ప్రస్తావించలేదు. కనుక మానవుని చేతిలోనే రావణునికి మరణం ఉంద"ని అన్నాడు.

ఇంతలో శ్రీమహావిష్ణువు శంఖచక్రగదాధారి అయి వచ్చాడు. దేవతలు ఆ దేవదేవుణ్ణి అనేక విధాలుగా స్తుతించారు. వరగర్వంచేత కన్నూమిన్నూగానక ప్రవర్తిస్తున్న రావణుణ్ణి సంహరించడానికి మానవుడిగా అవతరించమని అభ్యర్థించారు. దశరథ మహారాజుగారి ముగ్గురు భార్యలకు నాలుగు రూపాలలో పుత్రుడవు కమ్మని ప్రాధేయపడ్డారు. అభయమిచ్చాడు ఆశ్రితవత్సలుడు. అందరి పూజలందుకొని అంతర్ధానమయ్యాడు.



SCERT, TELANGANA

దశరథుడు పుత్రకామేష్టి చేసినప్పుడు యజ్ఞకుండంనుంచి గొప్ప తేజస్సుతో కూడిన ఒక దివ్యపురుషుడు ఆవిర్భవించాడు. అతడు బ్రహ్మపంపగా వచ్చినవాడు. చేతిలో బంగారుపాత్ర వెండిమూతతో. అందులో దివ్యపాయసముంది. దాన్ని దశరథునకందించాడు. "ఈ పాయసం సంపదలనిస్తుంది ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది. అన్నిటినీ మించి సంతానాన్ని ప్రసాదిస్తుం"దన్నాడు. పేదవానికి పెన్నిధి దొరికినట్లైంది దశరథునికి. అతని మనస్సు ఆనందతాండవం చేసింది.

దివ్యపాయసాన్ని తన భార్యలైన కౌసల్య, సుమిత్ర, కైకేయిలకు పంచాడు. సంవత్సరకాలం గడిచింది. చైత్రశుద్ధనవమినాడు కౌసల్యకు శ్రీరాముడు జన్మించాడు. దశమినాడు కైకేయికి భరతుడు, సుమిత్రకు లక్ష్మణ శత్రుఘ్నులు జన్మించారు. ఈ వార్త విన్న అయోధ్య ఆనందసంద్రమైంది.

రామలక్ష్మణ భరత శత్రుఘ్నులు శుక్లపక్ష చంద్రునిలా పెరుగుతున్నారు. వేదశాస్త్రాలనభ్యసించారు. ధనుర్విద్యలో నైపుణ్యం సంపాదించారు. విజ్ఞానఖనులయ్యారు. సద్గుణాలకు ఆటపట్టైనారు. (ఉత్తమ విద్యార్థులకు ఉండవలసిన లక్షణాలివి.) రాముడు ఎప్పుడూ తల్లిదండ్రుల సేవలో నిమగ్నమయ్యేవాడు. చిన్ననాటి నుంచీ అన్నసేవే మిన్నగా భావించేవాడు లక్ష్మణుడు. ఇతడు రాముడికి బహిఃప్రాణం. భరతశత్రుఘ్నులు అన్యోన్య ప్రేమాభిమానాలు కలవారు.

కాలచక్రం తిరుగుతున్నది. ఒకనాడు దశరథుడు తన మంత్రులు పురోహితులు మొదలైనవారితో సమావేశమయ్యాడు. తన కుమారుల వివాహ ప్రస్తావన చేస్తున్నాడు. సరిగ్గా అదే సమయంలో అక్కడ అడుగుపెట్టాడు మహాతేజశ్శాలియైన విశ్వామిత్ర మహర్షి. సృష్టికి ప్రతిసృష్టి చేయగల సమర్థుడతడు. దశరథుడు ఎదురేగి సాదరంగా స్వాగతించాడు. అతిథిదేవోభవ – అతిథి మనకు దేవునితో సమానం. ఇది తెలిసిన దశరథుడు విశ్వామిత్రునకు సముచితరీతిన మర్యాదలు గావించాడు. వినయపూర్వకంగా చేతులు జోడించి విశ్వామిత్రుని రాకకు కారణాన్ని అడిగాడు. తనపైన కార్యభారం పెడితే నెరవేరుస్తానన్నాడు. దశరథుని వినయానికి మురిసిపోయాడు విశ్వామిత్రుడు. "వసిష్ఠుని ఉపదేశాలను పొందినవాడివి. నీవు ఇలాగే ప్రవర్తిస్తా"వని మెచ్చుకొన్నాడు.

విశ్వామిత్రుడు దశరథునితో తాను వచ్చిన పనిని తెలుపుతానన్నాడు. దానిని ఆచరించమన్నాడు. ఆడినమాట తప్పవద్దన్నాడు. అసలు విషయం చెప్పాడు. "ఓ రాజా! నేనొక యజ్ఞాన్ని సంకల్పించాను. కాని మారీచ, సుబాహులనే రాక్షసులు ఆ యజ్ఞానికి విఘ్నాలు కలిగిస్తున్నారు. వారిని కోపించడానికి, శపించడానికి శక్తి ఉన్నా యజ్ఞదీక్షలో ఉన్నాను కాబట్టి అది నాకు తగనిపని (ఉచితానుచితాలు గ్రహించకుండా శక్తిని దుర్వినియోగపరచగూడదు.) అందుకు సత్యపరాక్రముడు, శూరుడు అయిన శ్రీరాముణ్ణి పదిదినాలపాటు నా వెంట పంపు. అతడే ఆ రాక్షసులను చంపగల సమర్థుడు. నా వెంట వచ్చి యాగసంరక్షణ చేయడంవల్ల శ్రీరామునికి అనేక శ్రేయస్సులు కలుగుతాయి. శ్రీరాముని పరాక్రమమెలాంటిదో నాకు బాగా తెలుసు. నాకే కాదు వసిష్ఠులవారికి, వామదేవాది మహర్షులకూ తెలుసు. వారంతా అంగీకరించిన తర్వాతే రాముణ్ణి నాతో పంప"మని అన్నాడు.

ఈ మాటలు వింటూంటే దశరథుని గుండెలో రాయిపడ్డది. చేతులు జోడించి "మహర్షీ! నా రాముడు పదహారేండ్లు కూడా నిండనివాడు. ధనుర్విద్య ఇంకా పూర్తికాలేదు. యుద్ధవిషయాలతో తగిన పరిచయం లేనివాడు. కనుక దయచేసి నా రాముణ్ణి కోరకండి. అంతగా కావాలంటే ధనుర్బాణపాణినై నేను మీ వెంటవస్తాను. మీ యాగాన్ని సంరక్షించే బాధ్యత నాది. ఇవన్నీ ఎట్లా ఉన్నా రాముణ్ణి వదలి నేను ఒక్క క్షణమైనా బతకలేను. మా నోముల పంట రాముడు. ఇంతకూ ఆ రాక్షసులు ఎవరి అండతో ఈ దుండగానికి ఒడిగట్టా"రని అడిగాడు.

విశ్వామిత్రుడు సమాధానమిస్తూ "పౌలస్త్యవంశజుడైన విశ్రవసుడనే ముని కుమారుడు రావణాసురుడు. అతడు కుబేరుని సోదరుడు. అనేక రాక్షస బలాలు కలవాడు. బ్రహ్మ ఇచ్చిన అసాధారణ వరాలవల్ల అతని గర్వం ఇబ్బడిముబ్బడైంది. ముల్లోకాలనూ అల్లకల్లోలం చేస్తున్నాడు. అటువంటివాడికి యజ్ఞం భగ్నంచేయడమనేది అల్పంగా తోస్తున్నది. అందుకే ఇటువంటి పనులలో



SCERT, TELANGANA

పాల్గొనడు. మారీచ, సుబాహులు ఇతనిచేత ప్రేరితులై యజ్ఞాలకు విఘ్నాలను కలిగిస్తున్నా”రనగానే దశరథుడు మరింత భయపడ్డాడు. “యుద్ధంలో యమునితో సమానులైన వారి నెదుర్కోవడానికి నా చిన్నిపాపణ్ణి పంపను. నేను కూడా యుద్ధ విషయంలో అశక్తు”డనని పలికాడు.

దశరథుని మాటలకు విశ్వామిత్రుడు అగ్గిమీద గుగ్గిలమైనాడు. “ఇచ్చినమాట తప్పటం మీ ఇంటా వంటా లేదు. నీవందుకు సిద్ధపడితే రిక్తహస్తాలతో తిరిగి వెళతాను. మీరు సుఖంగా ఉండండి” అన్నాడు విశ్వామిత్రుడు. పరిస్థితి తీవ్రతను గమనించాడు వసిష్ఠమహర్షి. ఇచ్చిన మాట నిలబెట్టుకోమని దశరథునికి హితవు పలికాడు. మాట నిలబెట్టుకోని వానికి ధర్మకార్యాలనాచరించిన ఫలం నశిస్తుందని హెచ్చరించాడు. వివిధాస్త్ర ప్రయోగదక్షుడైన విశ్వామిత్రుడి వెంట రాముణ్ణి పంపడంలో సంశయానికి తావుండగూడదన్నాడు. రాముణ్ణి పంపితే మేలు జరుగుతుందని సుతిమెత్తగా సూచించాడు.

వసిష్ఠుని హితవచనాలకు దశరథుడు తలొగ్గాడు. రామలక్ష్మణులను పిలిపించాడు. కౌసల్యతో కలిసి ఆశీర్వదించాడు. ప్రశాంతమైన మనస్సుతో విశ్వామిత్రుడికి అప్పగించాడు.



విశ్వామిత్రుని వెంట ధనుర్ధారి అయి రాముడు నడుస్తున్నాడు. లక్ష్మణుడు అనుసరిస్తున్నాడు. సరయూనదీ తీరం వెంబడి చాలా దూరం ప్రయాణించారు ముగ్గురూ. తరవాత రామలక్ష్మణులకు ‘బల’ ‘అతిబల’ విద్యలనుపదేశించాడు విశ్వామిత్ర మహర్షి. వీటి ప్రభావంవల్ల అలసట, ఆకలిదప్పులుండవు. రూపకాంతులు తగ్గవు. నిద్రలో ఉన్నా, ఏమరుపాటుతో ఉన్నా రాక్షసులేమీ చేయలేరు. ముల్లోకాల్లో ఎదురొడ్డి నిలచేవారుండరు.

రాముడు గురుసేవలో నిమగ్నుడయ్యాడు. విశ్వామిత్రుని పాదాలొత్తాడు. సేవలు చేశాడు. (గురుసేవ విశేష ఫలితాన్నిస్తుంది.) సరయూనదీ తీరంలోనే వాళ్ళు ఆ రాత్రి నిద్రించారు.

తెల్లవారుతోంది. విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు మేల్కొలుపు పలికాడు.

**కౌసల్యాసుప్రజారామ పూర్వా సంధ్యా ప్రవర్తతే**
**ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవమాహ్నికమ్.**

“కౌసల్యాదేవి సత్సంతానమైన ఓ రామా! తూర్పున ఉషఃకాంతులు ప్రసరిస్తున్నాయి. నిద్రలేచి నిత్యకర్మలను ఆచరించ”మన్నాడు. గురువాక్యం శిరసావహించాడు రాముడు, లక్ష్మణునితో కలసి. మళ్ళీ ప్రయాణం కొనసాగింది. సరయూ గంగానదుల సంగమ ప్రదేశాన్ని చేరుకున్నారు. అక్కడి విశేషాలను గురుముఖతః తెలుసుకున్నారు. (జ్ఞానాన్ని పొందడంలో నిరంతరం అప్రమత్తులై ఉండడం ఉత్తమ విద్యార్థుల లక్షణం.)

ప్రయాణం సాగుతున్నది. ‘మలద’, ‘కరూశ’ అనే జనపదాలకు చేరుకున్నారు. ఇంద్రుని అనుగ్రహ విశేషంచేత ఈ ప్రాంతాలు ధనధాన్యాలసమృద్ధిని కలిగి ఉండేవి. కాని ‘తాటక’ అనే యక్షిణి ఈ ప్రాంతాలకు వచ్చి విధ్వంసాన్ని సృష్టించింది. పుట్టుకతోనే వేయి ఏనుగుల బలం కలిగిన ఈమెను ఎవరూ ఎదిరించలేకపోతున్నారు. ‘అగ్నికి ఆజ్యంతోడైనట్లు’ ఈమెతోబాటు ఈమె కుమారుడు ‘మారీచుడు’ విరుచుకపడుతూ ఈ జనపదాలను అతలాకుతలం చేస్తున్నాడు. దుష్టురాలైన తాటకను వధించమని రామునితో

అన్నాడు విశ్వామిత్రుడు. ఒక్కక్షణం రాముడు మౌనముద్ర దాల్చాడు. రాముని భావం గ్రహించాడు విశ్వామిత్రుడు. "స్త్రీని ఎలా చంపాలనే సంశయం వద్దు. అధర్మపరాయణ అయిన తాటకను చంపితే దోషం రా"దని కర్తవ్యముపదేశించాడు. వెంటనే రాముడు దృఢనిశ్చయుడై అంజలి ఘటించాడు. "మీరు చెప్పినట్లుగా నడచుకొమ్మని మా నాన్నగారు నన్ను ఆదేశించారు. వారి ఆజ్ఞ నాకు శిరోధార్య"మని పితృవాక్య పరిపాలనాసక్తిని చాటాడు. అలాగే గురువు ఆజ్ఞను పాలించడం శిష్యునిగా తన కర్తవ్యమని భావించి తాటకవధకు ఉద్యుక్తుడైనాడు.

వికృతాకారంతో విరుచుకుపడుతున్న తాటక చేతులను తన నిశిత బాణాలతో ఖండించాడు రాముడు. అయినా ఆవేశంతో మీదికి వస్తున్న తాటక ముక్కు చెవులను కోసివేశాడు లక్ష్మణుడు. తాటక ఆవేశం రెండింతలైంది. తాను కనబడకుండా వాళ్ళపై రాళ్ళ వానకురిపిస్తున్నది. ఇదంతా గమనిస్తున్నాడు విశ్వామిత్రుడు. సంధ్యాకాలం సమీపిస్తున్నది. ఈలోపే తాటకను పరలోకానికి పంపమని పురమాయించాడు. అసురసంధ్యాకాలంలో రాక్షసులు మహాబలాన్ని పొందుతారు. ఎదుర్కోవడం కష్టం. ఇక ఏ మాత్రం ఆలస్యం చేయకుండా రాముడు శబ్దవేధి బాణప్రయోగం చేశాడు. క్షణకాలంలో తాటక నేలపైబడి ప్రాణాలను వదిలింది. తాటక వధతో దుష్ట సంహారానికి పూనుకొన్నాడు రాముడు. ఇంద్రాది దేవతలు రాముణ్ణి స్తుతించారు. సంతుష్టుడైన విశ్వామిత్ర మహర్షి రామునికి ఎన్నో దివ్యాస్త్రాలను అనుగ్రహించాడు. (గురువు అనుగ్రహిస్తే ఇవ్వలేనిదేమిటి? శిష్యుడు పొందలేనిదేమిటి?)

రామలక్ష్మణ సహితుడయి విశ్వామిత్రుడు 'సిద్ధాశ్రమం' చేరుకున్నాడు. అదే అతని యజ్ఞభూమి. రామలక్ష్మణులు వినయంగా చేతులు జోడించి గురువుగారిని యజ్ఞదీక్షను స్వీకరించమని ప్రార్థించారు. మన్నించాడు మహర్షి. యజ్ఞదీక్షితుడయ్యాడు. మరునాడే యజ్ఞం ప్రారంభమైంది. ఆరు రోజులపాటు సాగే ఈ యజ్ఞ విషయంలో అత్యంత జాగరూకులై ఉండమని రామలక్ష్మణులకు సూచించారు మునులు. ఐదురోజులైంది. కంటిమీద కునుకులేకుండా యజ్ఞాన్ని కాపాడుతున్నారు రామలక్ష్మణులు. (కర్తవ్యాన్ని నెరవేర్చడంలో ఇంత నిష్ఠ ఉండాలి.) చివరిరోజు ఉన్నట్టుండి ఒక్కసారిగా యజ్ఞకుండంనుండి జ్వాలలు ఎగసిపడ్డాయి. ఇది రాక్షసుల రాకకు సూచన.

మారీచ, సుబాహులు అనుచరులతో వచ్చారు. యజ్ఞవేదిక పరిసరాలు రక్తవర్షంతో తడిసి ముద్దయ్యాయి. రాముడు 'శీతేషువు' అన్న మానవాస్త్రాన్ని మారీచుడిపైకి ప్రయోగించాడు. దాని దెబ్బకు మారీచుడు నూరు యోజనాల దూరం ఎగిరి సముద్రంలో పడిపోయాడు. స్పృహకోల్పోయి గిరగిరా తిరుగుతూ కొట్టుకుపోతున్నాడు. మరు నిమిషంలో 'ఆగ్నేయాస్త్రం'తో సుబాహుని వక్షస్థలాన్ని వ్రక్కలు చేశాడు. 'వాయవ్యాస్త్రం'తో మిగతా రాక్షసుల భరతంపట్టాడు. రాక్షసబాధ తొలగింది. యజ్ఞం నిర్విఘ్నంగా జరిగింది. విశ్వామిత్రుడు సంతోషించాడు. (సమర్థులైన శిష్యులను చూసి ఏ గురువు సంతోషించడు?)

మరునాడు ఉదయాన్నే రామలక్ష్మణులు విశ్వామిత్రుని ఎదుట వినయంతో నిలిచారు. ఇంకా ఏమి చేయాలో ఆజ్ఞాపించమన్నారు. విశ్వామిత్రుడు "ఓ రామా! మిథిలానగర ప్రభువు, పరమధార్మికుడైన జనక మహారాజు ఒక యజ్ఞాన్ని చేయ సంకల్పించాడు. మనం అక్కడికి వెళుదాం. అక్కడ అద్భుతమైన ఒక మహాధనుస్సుంది. నీవు చూడవచ్చు"నన్నాడు. సంసిద్ధులయ్యారు రామలక్ష్మణులు. మునిననుసరిస్తూ మిథిలవైపుగా ముందుకు సాగుతున్నారు.

అడుగులతోపాటు మాటలూ సాగుతున్నాయి. రాముని కోరిక మేరకు తమ వంశ పుట్టు పూర్వోత్తరాలను వివరించాడు విశ్వామిత్రుడు. ఆ రాత్రి శోణానదీ తీరంలో విశ్రమించారు. మరునాడు పవిత్ర గంగానదిని దర్శించారు. స్నానాలాచరించి విధ్యుక్త ధర్మాలను నెరవేర్చారు. గంగావృత్తాంతాన్ని వినగోరుతున్నానని వినయంగా అడిగాడు రాముడు. వినిపించాడు విశ్వామిత్రుడు. (జిజ్ఞాసువులైన శిష్యులు, విజ్ఞాని అయిన గురువు – ఇక జ్ఞాన ప్రసారానికి అడ్డుంటుందా?)

పాతాళంలో బూడిదకుప్పలై పడి ఉన్న తన పితరులైన సగర పుత్రులకు ఉత్తమగతులు కల్పించడానికి సంకల్పించాడు భగీరథుడు. అందుకు ఒకటే మార్గం ఉంది. సురగంగను వారి బూడిదకుప్పలపై ప్రవహింపజేయడం. కాని ఆకాశంలోని గంగను పాతాళానికి దింపడం ఒక పట్టాన జరిగే పనేనా? అయినా దృఢసంకల్పానికి అసాధ్యమైనది లేదు. భగీరథుడు తీవ్రమైన



SCERT, TELANGANA

తపస్సుచేశాడు. బ్రహ్మను, శివుణ్ణి మెప్పించాడు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా సంకల్పం నుంచి పక్కకు తప్పుకోలేదు. గంగను పాతాళందాకా తీసుకువెళ్ళడంలో సఫల మనోరథుడయ్యాడు. (అందుకే పట్టుదల విషయంలో 'భగీరథ ప్రయత్నం' అన్న జాతీయం ఏర్పడింది.) భగీరథుని వంశంలోని వాడే రాముడు.

గంగావతరణాన్ని గురించి విశ్వామిత్రుడు రామునికి చెప్పడంలో ఒక ఆంతర్యమున్నది. తన పూర్వీకులు ఎంతగొప్పవారో తెలుసుకుని దానికనుగుణంగా నడవటం. పితరులపట్ల ఎంత భక్తి ప్రపత్తులుండాలో తెలుపడం. పట్టిన పని ఫలవంతమయ్యేవరకు పట్టుదల ఎలా ఉండాలో చెప్పటం. అయితే ఇవన్నీ నేరుగా చెప్పలేదు విశ్వామిత్రుడు. అయినా ఆంతర్యాన్ని గ్రహించాడు రాముడు. (ఇదే ఉత్తమ గురుశిష్యుల వ్యవహారం.)

మిథిలానగర సమీపానికి చేరుకున్నారు విశ్వామిత్ర రామలక్ష్మణులు. అక్కడ ఒక ఆశ్రమాన్ని చూశాడు రాముడు. అది పాతదైనా అందంగా అగుపిస్తున్నది. కాని జనసంచారమే లేదు. "ఏమిటీ చిత్ర"మని అడిగాడు రాముడు. అది గౌతమ మహర్షి ఆశ్రమమని, ఆ కథనంతా వివరించాడు విశ్వామిత్రుడు. "మహాతపస్సంపన్నుడైన గౌతమ మహర్షి తన భార్య అయిన అహల్యతో ఈ ఆశ్రమంలో ఉండేవాడు. ఒకానొక సందర్భంలో అహల్య అపరాధం చేసిందని భావించి ఆగ్రహోదగ్రుడయ్యాడు గౌతముడు. వేల సంవత్సరాలు అన్నపానాదులు లేక వాయువునే ఆహారంగా తీసుకుంటూ ఈ ఆశ్రమంలోనే బూడిదలో పడి ఉండమని ఆమెను శపించాడు. ఎవ్వరికీ కనబడకుండా ఉంటావన్నాడు. రాముని రాకతో శాపవిముక్తి కలిగి నిజరూపాన్ని పొందుతా"వన్నాడు. "రామా! గౌతమాశ్రమంలో కాలుమోపి అహల్యకు శాపవిముక్తి కలిగించు" అని విశ్వామిత్రుడు ఆజ్ఞాపించాడు.

చుట్టూ బూడిద ఆవరించి ఉండి కఠోరదీక్షలో ఉన్న అహల్య పొగకమ్ముకొన్న అగ్ని తేజస్సులా ఉంది. ఆ మహాత్మురాలిని రాముడు చూశాడు. రాముడి దర్శనంతో ఆమెకు శాపవిముక్తి కలిగింది. అహల్యా గౌతములు రాముణ్ణి యథావిధిగా గౌరవించారు. వారి సత్కారాలందుకొని రాముడు విశ్వామిత్రుని వెంట లక్ష్మణ సహితుడై మిథిలా నగరానికి బయలుదేరాడు.

మిథిలానగరంలో ప్రభువైన జనకమహారాజు వీరిని సముచితంగా సమాదరించాడు. మిథిలలో అహల్యా గౌతముల పెద్ద కుమారుడైన శతానందుడు రామదర్శనం చేసుకున్నాడు. తన తల్లినుద్ధరించినందులకు కృతజ్ఞతాంజలులు సమర్పించాడు. మహాతపశ్శాలియైన విశ్వామిత్రుని అనుగ్రహం పొందగలగడం చాలా విశేషమని రాముణ్ణి మెచ్చుకున్నాడు. విశ్వామిత్ర మహర్షి అసాధారణ శక్తిసామర్థ్యాలను వివరించాడు శతానందుడు.

మరునాడు ప్రాతఃకాలంలో జనకుడు విశ్వామిత్ర రామలక్ష్మణులను ఆహ్వానించాడు. కర్తవ్యోపదేశం చేయవలసిందిగా విశ్వామిత్రుణ్ణి ప్రార్థించాడు. అప్పుడు ప్రత్యుత్తరమిస్తూ విశ్వామిత్రుడు "వీరు దశరథమహారాజు కుమారులు. జగత్ప్రసిద్ధులైన వీరులు. మీ దగ్గర ఉన్న ధనుస్సును చూడాలనుకుంటున్నారు. దాన్ని చూపించండి. శుభం జరుగుతుంది. వాళ్ళ ముచ్చటా తీరుతుం"దన్నాడు. అప్పుడు జనకుడు తనదగ్గరున్న 'శివధనుస్సు' చరిత్రను వివరించాడు. యాగం కోసం భూమిని దున్నుతుండగా ఒక పాప దొరికిందని, నాగటిచాలున దొరికినందువల్ల ఈమెకు 'సీత' అనే పేరు వచ్చిందనీ చెపుతూ ఆమెను గొప్ప పరాక్రమవంతుడికివ్వాలన్న తన అభిమతాన్ని వెలిపుచ్చాడు. శివధనుస్సును ఎక్కుపెట్టగలవాడే సీతకు తగిన భర్త అన్నాడు. గతంలో ఎందరో రాజులు వచ్చి శివధనుస్సు ఎక్కుపెట్టడానికి విఫలప్రయత్నం చేశారని, ఎక్కుపెట్టడం మాట ఎలా ఉన్నా కనీసం కదలించలేకపోయారన్నాడు.




ఇదంతా విని శివధనుస్సును తెప్పించమన్నాడు విశ్వామిత్రుడు. సరేనన్నాడు జనకుడు. బలిష్ఠులు, దీర్ఘకాయులైన ఐదువేల మంది అతికష్టం మీద శివధనుస్సుతో కూడిన పేటికను తీసుకువచ్చారు.

SCERT, TELANGANA

విశ్వామిత్ర మహర్షి అనుమతితో ధనుస్సు మధ్యభాగాన్ని అవలీలగా పట్టుకున్నాడు రాముడు. ధనుర్విద్యయందు ఆరితేరిన రాముని చేయి సోకినంతనే ఆ ధనుస్సు వంగింది. వింటినారిని సారించాడు. వేలకొలది సదస్యులు ఆశ్చర్యంలో మునిగిపోయారు. అల్లెతాడును ఆకర్ణాంతంగా లాగాడు రాముడు. పిడుగుపాటులా భయంకరశబ్దాన్ని చేస్తూ విల్లు ఫెళ్ళున విరిగింది. విశ్వామిత్రుడు, జనకుడు, రామలక్ష్మణులు తప్ప మిగతావారంతా మూర్ఛపోయారు.

ఇచ్చినమాట ప్రకారం జనకుడు సీతారాముల వివాహం జరపడానికి సంసిద్ధుడయ్యాడు. దశరథమహారాజుకు వర్తమానం పంపాడు. అయోధ్యనుంచి అందరూ తరలివచ్చారు. జనకుడు తన కుమార్తెలైన సీత ఊర్మిళలను రామలక్ష్మణులకు, తన తమ్ముడు కుశధ్వజుని కుమార్తెలైన మాండవిని, భరతునకు, శ్రుతకీర్తిని శత్రుఘ్నునకు ఇచ్చి వివాహం జరిపించాడు. అంగరంగవైభవంగా జరిగాయి కల్యాణాలు.



మరునాడు విశ్వామిత్ర మహర్షి కొత్త దంపతులను ఆశీర్వదించి, దశరథ జనకమహారాజులను వీడ్కొని హిమాలయపర్వతానికి వెళ్ళాడు. తరవాత బంధుమిత్ర సమేతంగా దశరథుడు అయోధ్యకు బయలుదేరాడు.

దారిలో వీళ్ళకు పరశురాముడు ఎదురుగా వచ్చాడు. అతడు ప్రళయకాల రుద్రుడిలా ఉన్నాడు. గండ్రగొడ్డలిని, ధనుర్బాణాలను ధరించాడు. ప్రజ్వరిల్లే అగ్నిలా భయంకరంగా ఉన్నాడు. క్షత్రియులంటే ఇతనికి సరిపడదు. పూర్వం క్షత్రియుడైన కార్తవీర్యార్జునుడు ఇతని తండ్రి అయిన జమదగ్నిని చంపాడు. అప్పటి నుండి క్షత్రియ నిర్మూలనానికి కంకణం కట్టుకున్నాడు. ఇరవై ఒక్కసార్లు భూప్రదక్షిణం చేసి ఎంతోమంది క్షత్రియులను తన గండ్రగొడ్డలికి బలిచేశాడు.

పరశురాముడు శ్రీరామునితో తనదగ్గరున్న వైష్ణవ ధనుస్సునెక్కుపెట్టమని సవాలు విసిరాడు. సరేనని రాఘవుడు అవలీలగా ఎక్కుపెట్టాడు. ఓటమినంగీకరించిన పరశురాముడు తక్షణమే మహేంద్రపర్వతానికి వెళ్ళిపోయాడు.

దశరథుడు సపరివారంగా అయోధ్యకు చేరుకున్నాడు. భరతుడు శత్రుఘ్నునితో మేనమామ వెంట తాతగారింటికి వెళ్ళాడు. రామలక్ష్మణులు తల్లిదండ్రుల సేవలో, గురువుల సేవలో తరిస్తూ అయోధ్యలోనే ఉండిపోయారు.



# అయోధ్యా కాండం



దశరథునికి పుత్రులమీద ఎంతో ప్రేమ. వారిని తన శరీరం నుండి పుట్టిన నాలుగు చేతులుగ భావించాడు. ఈ నలుగురు కుమారులలో భరత, శత్రుఘ్నులు దేశాంతరంలో ఉండడంవల్ల బెంగపెట్టుకున్నాడు. వాళ్ళను మళ్ళీమళ్ళీ తలచుకుంటున్నాడు. దశరథునికి శ్రీరామునిమీద మక్కువ ఎక్కువ. దానికి కారణం శ్రీరాముడు సద్గుణరాశి కావడమే. రూపంలోనూ గుణంలోనూ శ్రేష్ఠుడు. మహావీరుడు. మృదువుగా మాట్లాడతాడు. శరణన్నవారిని కాపాడతాడు. కోపం, గర్వం లేనివాడు. సత్యం పలికేవాడు. పరుల సంపదను ఆశించనివాడు. దీనులను ఆదుకొనేవాడు. కాలాన్ని వృథాచేయకుండా జ్ఞానులతో, సజ్జనులతో వివిధ విషయాలను చర్చించేవాడు. వినయశీలి. తల్లిదండ్రులపట్లా, గురువులపట్లా నిశ్చలభక్తి కలవాడు. సోమరితనం, ఏమరుపాటు లేనివాడు, కళలలో ఆరితేరినవాడు, అసూయ, మాత్సర్యం లేనివాడు. ప్రజలపట్ల వాత్సల్యం కలవాడు... ఇన్ని మంచిగుణాలకు పాదైన శ్రీరాముడంటే తల్లిదండ్రులకే కాదు, ప్రజలందరికీ పరమ ప్రీతి.

సకల గుణాభిరాముడైన శ్రీరాముడు తమకు ప్రభువు కావాలని ప్రజల కోరిక – దీనికి తోడు "నేను జీవించి ఉన్నప్పుడే శ్రీరాముడు రాజైతే ఎంత బాగుంటుంది? నేనెంతగా సంతోషిస్తానో?" అని ఉవ్విళ్ళూరుతున్నాడు దశరథుడు. మంత్రులతో ఆలోచించి శ్రీరాముణ్ణి యువరాజును చేయడానికి నిశ్చయించుకున్నాడు. రాజ్యంలోని ప్రముఖులను, జానపదులను, సామంతరాజులను, ప్రజలను పిలిపించాడు. శ్రీరాముని యువరాజ పట్టాభిషేక విషయాన్ని వెల్లడించాడు. ఇది అందరకు నచ్చినట్లైతేనే అనుమతినివ్వమన్నాడు. దీనికన్నా ప్రజలకు మేలుకలిగించేది ఏదైనా ఉన్నా ఆలోచించి చెప్పమన్నాడు. (ప్రజానురంజకపాలన అంటే ఇదే.) సభలోనివారంతా శ్రీరామ పట్టాభిషేకాన్నే సమర్థిస్తూ హర్షధ్వానాలు చేశారు.

రాజాజ్ఞమేరకు వసిష్ఠుడు మంత్రులను, అధికారులను యౌవరాజ్యపట్టాభిషేకమహోత్సవానికి ఏర్పాట్లను చేయవలసిందని ఆదేశించాడు. దశరథుడు శ్రీరాముణ్ణి పిలిపించాడు. శ్రీరాముడు వచ్చి తండ్రికి పాదాభివందనం చేశాడు. దశరథుడు శ్రీరాముణ్ణి అక్కున జేర్చుకున్నాడు. బంగారు సింహాసనంమీద కూర్చోబెట్టాడు. చిరునవ్వులు చిందిస్తూ "రామా! నీ సుగుణాలతో ప్రజలను మెప్పించావు. కనుక నీవు యువరాజ పట్టాభిషేకం చేసుకోవాలి. నీ బాధ్యత పెరుగుతున్నది. మరింత వినయవంతుడివి కావాలి. జితేంద్రియుడివి కావాలి..." అంటూ రాజధర్మాలను నూరిపోశాడు. తండ్రివద్ద సెలవుతీసుకొని తల్లి అయిన కౌసల్య దగ్గరికి వచ్చాడు శ్రీరాముడు. ఆమె ఆశీస్సులందుకున్నాడు. వసిష్ఠుని ఆదేశం మేరకు పట్టాభిషేకానికి అనువుగా సీతారాములు ఉపవాస దీక్షను గైకొన్నారు.

శ్రీరామ పట్టాభిషేక మహోత్సవంకోసం అయోధ్య తననుతాను అలంకరించుకుంది. నగరమంతా ఆనందశోభ తాండవిస్తున్నది. ఇది చూసిన మంథర కళ్ళలో నిప్పులు పోసుకున్నది. కైకేయి అత్తవారింటికి వచ్చినప్పుడు వెంటవచ్చిన అరణపుదాసి మంథర. పరుగు పరుగున కైకేయి దగ్గరకి వెళ్ళి పట్టాభిషేక విషయం చెప్పింది. కైకేయి చాలా ఆనందించి, వార్త చెప్పినందుకు మంథరకు విలువైన బహుమానాన్నందించింది. నిశ్చేష్టురాలైంది మంథర. "దుఃఖించవలసిన సమయంలో ఎందుకు

SCERT, TELANGANA

సంతోషిస్తున్నా"వని నిలదీసింది కైకేయిని. "నాకు రాముడు, భరతుడు ఇద్దరూ సమానమే. రాముడు పట్టాభిషిక్తుడు అవుతున్నాడంటే అంతకన్నా నాకు ఆనందమేముంటుం"దన్నది కైకేయి.

కైకేయి మాటలు విని ముక్కున వేలేసుకుంది మంథర. "రాముడు రాజైతే కౌసల్య రాజమాత అవుతుంది. అప్పుడు మాతోపాటు నీవు కూడా ఆమెకు దాసివవుతావు. రామునికి నీ కొడుకు దాస్యం చేయాల్సివస్తుంది. రాముని సంతానానికే తరువాతి కాలంలో రాజ్యాధికారం వస్తుంది. కాని భరతుని సంతానానికి రావడం శూన్యం. కనుక భరతునికి రాజ్యాధికారం దక్కేటట్లు, రాముడు అడవుల పాలయ్యేటట్లు చూడ"మని దుర్బోధ చేసింది. కైకేయి మనసు మారింది. (చెప్పుడు మాటలు చేటుకు కారణం.) తగిన ఉపాయాన్ని చెప్పమని మంథరను కోరింది కైకేయి. గతంలో దశరథుడు ఇచ్చిన రెండు వరాలను ఇప్పుడుపయోగించుకొమ్మని సూచించింది మంథర. ఈ సూచన మేరకు దశరథుని వలన వరాలు పొందడానికి కోపగృహంలోకి ప్రవేశించింది కైకేయి.

దశరథుడు శ్రీరామ పట్టాభిషేక వార్తను తెలపడానికి కైకేయివద్దకు వచ్చాడు. కటికనేలపై ఉన్నది కైకేయి. తీవ్రమైన అలకతో ఉన్నది. దశరథుడు ఓదార్చడానికి పూనుకున్నాడు. కాని అతని ప్రయత్నమంతా బూడిదలో పోసిన పన్నీరైంది. ఏం చేయాలో పాలుపోలేదు. విషయమడిగాడు. అదే అదనుగా భావించింది కైకేయి. "నాకొక కోరిక ఉంది. దాన్ని మీరే తీర్చాలి. అలా తీరుస్తానని మాట ఇవ్వా"లన్నది. ప్రాణానికి ప్రాణమైన శ్రీరాముని మీద ఒట్టు పెట్టి సరేనన్నాడు దశరథుడు. ఇంకేం మనసులోని మాటను చెప్పేసింది. "గతంలో మీరిచ్చిన రెండు వరాలను ఇప్పుడు కోరుకుంటున్నాను. శ్రీరాముని కోసం ఏర్పాటుచేసిన సన్నాహాలతో భరతుడికి పట్టాభిషేకం చేయాలి. శ్రీరాముడు నారచీరెలు, జింకచర్మం ధరించి, జటాధారి అయి దండకారణ్యానికి వెళ్ళి తాపసవృత్తిలో పదునాల్గు సంవత్సరాలు ఉండాలి. శ్రీరాముడు ఇప్పుడే, నేను చూస్తుండగానే బయలుదేరాలి" అని కోరింది.

కైకేయి మాటలకు స్పృహకోల్పోయాడు దశరథుడు. కొంతసేపటికి తేరుకున్నాడు. తన్నుకొని వస్తున్న దుఃఖంతో "కైకా! రాముడు నీకేం అపకారం చేశాడు? భరతుడికన్నా ఎక్కువగా నిన్ను సేవించాడు. అటువంటివాణ్ణి అడవుల పాల్జేయమని అడగడానికి నీకు నోరెలా వచ్చింది? నా రాముణ్ణి విడిచి నేను ఒక్క క్షణమైనా బతకలేను. చేతులు జోడిస్తున్నా. నీ పాదాలు పట్టుకొంటా… రాముణ్ణి మాత్రం నాకు దూరం చేయవద్ద"ని బతిమాలాడు. కైకేయి మారలేదు. (కఠినశిల కన్నీటికి కరుగుతుందా?)

శ్రీరాముణ్ణి తోడ్కొని రావలసిందిగా కైకేయి సుమంత్రుణ్ణి ఆజ్ఞాపించింది. రాజాజ్ఞ కావాలన్నాడు సుమంత్రుడు. "శ్రీరాముణ్ణి చూడాలని ఉంది వెంటనే తీసుకుర"మ్మన్నాడు దశరథుడు. రాజాజ్ఞను పాటించాడు సుమంత్రుడు. శ్రీరాముడు వచ్చి, దశరథుడికి, కైకేయికి పాదాభివందనాలు చేశాడు. దశరథునికి మాట రావడం లేదు కన్నీళ్ళు తప్ప. తండ్రి బాధకు కారణమేమిటో తెలియక సతమతమవుతున్నాడు దాశరథి. కైకేయిని అడిగాడు. "గతంలో నాకిచ్చిన రెండు వరాలను అడిగాను. నిన్ను దృష్టిలో ఉంచుకొని వాటిని ఉల్లంఘించేందుకు చూస్తున్నారు. వాటిని నువ్వు పాటిస్తానని ప్రమాణంచేస్తే చెపుతాను" అన్నది కైకేయి.

రాముడు క్షణం కూడా ఆలోచించలేదు "నా తండ్రే నాకు గురువు, పాలకుడు, హితుడు. ఆయన ఆదేశించాలే కాని విషాన్ని తాగడానికైనా, సముద్రంలో దూకడానికైనా సిద్ధమే. తండ్రి గారి కోరిక ఏమిటో చెపితే తప్పక పాటిస్తాను. రాముడు ఆడినమాట తప్ప"దని పలికాడు. (శ్రీరాముని పితృభక్తి, సత్యానురక్తి అలాంటివి.)

కైకేయి రెండు వరాలను గురించి చెప్పింది. రాముని ముఖంలో ఎలాంటి మార్పులేదు. సంతోషాలకు పొంగకపోవడం, బాధలకు కుంగకపోవడం స్థితప్రజ్ఞుని లక్షణం. "అమ్మా! నీవు చెప్పినట్లే చేస్తా. భరతుడంటే నాకు ప్రాణం. అతని పట్టాభిషేకాన్ని గూర్చి నాన్నగారు నాకు చెపితే కాదంటానా? ఆయన మాటలను పాటించకుండా ఉండగలనా? నాకు రాజ్యకాంక్ష లేదు. తండ్రికి సేవచేయడం, ఆయన ఆజ్ఞలను పాటించడంకన్నా మించిన ధర్మాచరణం మానవులకు ఇంకొకటి లేనేలేదు. నాన్నగారు నన్ను స్వయంగా ఆదేశించకున్నా మీరు చెప్పారు కదా! అది చాలు. నేనిప్పుడే దండకారణ్యానికి బయలుదేరుతా"నన్నాడు శ్రీరాముడు.



SCERT, TELANGANA

శ్రీరాముని మాటలు విన్న దశరథుడు శోకభారంతో స్పృహకోల్పోయాడు. శ్రీరాముడు తండ్రి పాదాలకు ప్రణమిల్లాడు. కైకేయి పాదాలకు నమస్కరించాడు. అంతఃపురం నుండి బయటకు వచ్చాడు. లక్ష్మణునితో కలసి కౌసల్యామాతను దర్శించుకున్నాడు. తన అరణ్యవాస విషయం చెప్పాడు. ఆ మాటలు వింటూనే కౌసల్య గండ్రగొడ్డలిచేత నరికిన మద్దిచెట్టులా నేల మీద పడిపోయింది. అంతులేని ఆవేదనకు లోనైంది. వనవాసానికి వెళ్ళవద్దని కౌసల్యా లక్ష్మణులు పరిపరివిధాల శ్రీరామునికి నచ్చజెప్పజూశారు. కాని శ్రీరాముడు తండ్రి మాటకే తలొగ్గాడు. వెళ్ళక తప్పదన్నాడు. కైకేయిపట్ల తనకు ఏమాత్రం అనాదరభావం లేదన్నాడు. తన పట్టాభిషేకం ఆగిపోవడానికి కైకేయి కారణం కాదని, విధి ప్రేరణచే ఆమె అట్లా మాట్లాడిందని సమర్థించాడు. తనకు రాజ్యమైనా వనవాసమైనా సమానమేనని ప్రకటించాడు.

పుత్ర వ్యామోహంతో కౌసల్య శ్రీరాముని వెంట వనవాసానికి సిద్ధపడింది. కాని భర్తను వదలిరావడం ధర్మంకాదన్నాడు శ్రీరాముడు. ఎలాగో మనసును స్తిమితపరచుకొని కౌసల్య శ్రీరాముణ్ణి దీవించింది. "రామా! సత్పురుషుల బాటలో నడువు. నీ ధర్మమే నీకురక్ష. నువ్వు చేసిన తల్లిదండ్రుల సేవ, నీ సత్య బలం నీకు రక్షగా ఉంటాయి. నీకు ఎలాంటి బాధలు కలుగకుండుగాక" అని శుభాశీస్సులందించింది.

అక్కడి నుండి సీతామందిరానికి వెళ్ళాడు శ్రీరాముడు. తన వనవాస విషయం చెప్పాడు. అయోధ్యలో ఎలా మసలుకోవాలో సీతకు తెలిపాడు. కాని సీత రామునివెంటే వనవాసానికి వెళ్ళడానికి నిశ్చయించుకుంది. ఆ మాటే శ్రీరామునితో చెప్పింది. "మీరు లేకుండా స్వర్గసుఖాలు లభించినా ఇష్టపడను. పతిని అనుసరించడమే సతికి ధర్మం, సుఖప్రదం, శుభప్రద"మని తెలిపింది. శ్రీరాముడు అంగీకరించక తప్పలేదు. తనను కూడా వెంట తీసుకెళ్ళమని లక్ష్మణుడు శ్రీరాముణ్ణి ప్రాధేయపడ్డాడు. శ్రీరాముని సేవాభాగ్యం ముందు త్రిలోకాధిపత్యం కూడా చిన్నదేనని, సకలోపచారాలు చేసే అవకాశం తనకిమ్మని అభ్యర్థించాడు. సరేనన్నాడు శ్రీరాముడు. తల్లి అయిన సుమిత్రకు, ఆత్మీయులకు ఈ విషయం తెలిపి వారి ఆమోదాన్ని పొందమన్నాడు.

సీతారామలక్ష్మణులు దశరథుని దర్శించడానికి బయలుదేరారు. కాలినడకన వస్తున్న శ్రీరాముణ్ణి చూసి ప్రజలు బావురుమన్నారు. లక్ష్మణునిలాగ తామందరూ రాముని వెంట వెళ్లాలనుకొన్నారు. రాముడు ఉంటే చాలు అది అడవియైనా తమ పాలిటి అయోధ్యేననుకున్నారు. సీతారామలక్ష్మణులు దశరథుని మందిరానికి చేరుకున్నారు. దశరథుడు రాణులందరినీ రప్పించాడు. అందరూ విలపిస్తున్నారు కైకేయి తప్ప. దశరథుని మందిరం కన్నీటిశాల అయింది.

కైకేయి స్వయంగా తెచ్చి ఇచ్చిన నార చీరలను సీతారామలక్ష్మణులు ధరించారు. తల్లిదండ్రులకు నమస్కరించారు. సుమిత్ర లక్ష్మణునితో "నాయనా, శ్రీరాముణ్ణి నీ తండ్రి అయిన దశరథులవారిలాగా, సీతను నన్నుగా భావించు. అడవిని అయోధ్య అనుకో. సుఖంగా వెళ్ళి ర"మ్మని దీవించింది. సుమంత్రుడు రథాన్ని సిద్ధంచేశాడు. సీతారామలక్ష్మణులు రథాన్ని ఎక్కారు. రథం వేగంగా ముందుకు సాగుతున్నది. శ్రీరాముణ్ణి విడవలేక కొందరు పౌరులు ఆ రథానికి రెండువైపులా, వెనుక భాగంలో వేలాడారు. మంగళ వాద్యఘోషతో మార్మోగవలసిన అయోధ్య దుఃఖసంద్రమైంది. దశరథుడు తీవ్రమైన బాధతో కౌసల్యామందిరానికి వచ్చాడు. కౌసల్యాదేవి శోకమూర్తిలా ఉంది. సుమిత్రాదేవి ఆమెను ఓదార్చింది.

శ్రీరాముని రథాన్ని నీడలా అనుసరిస్తున్నారు ప్రజలు. అయోధ్యకు మళ్ళిపొండని వాళ్ళకు శ్రీరాముడు ఎంతగానో చెపుతున్నాడు. "మీరే అయోధ్యకు రండి లేదా మేము మీ వెంట రావడానికి అనుమతించండి" అని వేడుకుంటున్నారు ప్రజలు. రథం తమసానదీ తీరానికి చేరింది. ఆ రాత్రి అందరూ అక్కడే విడిది చేశారు. తెల్లవారుతున్నది. అలసటచేత పౌరులందరూ గాఢనిద్రలో ఉన్నారు. ఇంకా వాళ్ళను శ్రమపెట్టడం శ్రీరామునికి ఇష్టంలేదు. అందుకని వాళ్ళు నిద్రలేచేలోపే అక్కడి నుండి వెళ్ళాలని లక్ష్మణునితో అన్నాడు. సుమంత్రుని సారథ్యంలో సీతారామలక్ష్మణులు అక్కడినుంచి బయలుదేరారు. నిద్రలేచిన పౌరులు శ్రీరాముడు కనబడకపోవడంతో తికమకపడ్డారు. తమ మొద్దునిద్రను తామే నిందించుకున్నారు. చేసేదిలేక అయోధ్యకు తిరుగుముఖం పట్టారు.



SCERT, TELANGANA

రథం వేదశ్రుతి, గోమతీ, సనందికా నదులను దాటింది. కోసల దేశపు పొలిమేరలకు చేరుకుంది. అక్కడి నుండి అయోధ్యవైపుగా తిరిగి శ్రీరాముడు నమస్కరించాడు. ముందుకు సాగుతూ గంగాతీరానికి చేరుకున్నారు. ఆ తీరంలో శృంగిబేరపురమున్నది. 'గుహుడు' ఆ ప్రదేశానికి రాజు. అతడు శ్రీరామభక్తుడు. శ్రీరాముడు వచ్చాడన్న వార్త విని తనవారితో శ్రీరాముని దగ్గరకు బయల్దేరాడు. గుహుణ్ణి చూసి రాముడు లక్ష్మణుడితోపాటు ఎదురువెళ్ళి కలుసుకున్నాడు. ఆ రాత్రి గుహుడి ఆతిథ్యం తీసుకున్నాడు.

మరునాడు శ్రీరాముని ఆదేశం మేరకు గుహుడు నావను సిద్ధం చేశాడు. శ్రీరాముడు మర్రిపాలను తెప్పించాడు. వాటితో తనకు లక్ష్మణునకు జడలను సిద్ధపరచాడు. రామలక్ష్మణులు జటాధారులయ్యారు. సీతారామలక్ష్మణులు పడవ ఎక్కారు. అవతలి తీరానికి తీసుకువెళ్ళాలని నావికులకు సూచించాడు గుహుడు. శ్రీరాముడు సుమంత్రునికి, గుహునికి వెళ్ళడానికి అనుమతినిచ్చాడు. నావను ముందుకు సాగించవలసిందిగా నావికులను ఆదేశించాడు.



నది మధ్యలో నావ సాగుతున్నది. సీత గంగను ప్రార్థించింది. నావ దక్షిణ తీరానికి చేరింది. నావదిగిన శ్రీరాముడు సీతా లక్ష్మణ సమేతుడై వనాలకు బయలుదేరాడు. శ్రీరాముని ఆదేశం మేరకు ముందు లక్ష్మణుడు వెనక సీత, ఆమె వెనక శ్రీరాముడు నడుస్తున్నారు. సాయంకాలానికల్లా భరద్వాజాశ్రమానికి చేరారు. ఇది గంగా యమున సంగమ ప్రదేశంలో ఉంది. ముని వాళ్ళకు అతిథి సత్కారాలు చేశాడు. వనవాసకాలాన్ని ఆ ప్రాంతంలోనే గడపమని కోరాడు. కాని రాముడు సుతిమెత్తగా తిరస్కరించాడు.

జనులకు అందుబాటులో ఉండని, ఆశ్రమవాసానికి అనువైన ప్రదేశమేదైనా సూచించమని శ్రీరాముడు కోరాడు. పది కోసుల దూరంలో 'చిత్రకూటం' అనే పవిత్రమైన పర్వత ప్రదేశం ఉందని, మహర్షుల నివాసస్థానమైన అదే తగిన చోటని భరద్వాజుడన్నాడు. మహర్షి సూచనననుసరించి యమునానదిని దాటి చిత్రకూటం చేరుకున్నారు సీతారామలక్ష్మణులు. అన్న ఆదేశం ప్రకారం అక్కడ నేరేడు కర్రలతో కుటీరాన్ని నిర్మించాడు లక్ష్మణుడు. సశాస్త్రీయంగా అందులోకి ప్రవేశించారు.

ఈ విషయాన్నంతా గూఢచారుల ద్వారా గుహుడు తెలుసుకున్నాడు. గుహుని ద్వారా సుమంత్రుడు గ్రహించాడు. సుమంత్రుడు గుహుడి దగ్గర సెలవు తీసుకొని అయోధ్యకు వెళ్ళాడు. దశరథుడు సుమంత్రుడి ద్వారా రాముని విషయాలను తెలుసుకున్నాడు. కౌసల్యాదశరథుల ఆవేదనకు అంతులేదు. దశరథుడు గతంలో తాను మునిబాలకుణ్ణి పొరపాటుగా చంపిన సంఘటనను, అతని తల్లిదండ్రులిచ్చిన శాపాన్ని గుర్తుచేసుకున్నాడు. అదే పుత్రవియోగానికి కారణమన్నాడు. శ్రీరాముని ఎడబాటుకు మనసు కకావికలమైంది, దశరథునికి. దుఃఖాగ్నికి తట్టుకోలేక గుండె చల్లబడింది. అర్థరాత్రి తరువాత దశరథుడు ప్రాణాలు విడిచాడు. అందరూ బావురుమన్నారు.

SCERT TELANGANA

దశరథుని దేహాన్ని ఒక తైలద్రోణిలో భద్రపరచారు. వసిష్ఠుడి ఆజ్ఞమేరకు దూతలు భరత శత్రుఘ్నులను తీసుకురావడానికి వెళ్ళారు. ఏడురోజులు ప్రయాణం చేసి ఎనిమిదవనాడు అయోధ్యకు చేరుకున్నారు భరత శత్రుఘ్నులు. తండ్రి మరణానికి తల్లడిల్లాడు భరతుడు. తండ్రి అంత్యక్రియలను భరతుడు నిర్వర్తించాడు.

శ్రీరామ వనవాస విషయంలో తల్లిని తప్పుబట్టాడు భరతుడు. మంథరను చంపడానికి ఉద్యుక్తుడైన శత్రుఘ్నుడు భరతుని మాట విని విరమించుకున్నాడు. మంత్రులు భరతుణ్ణి రాజ్యాధికారం చేపట్టమన్నారు. కాని భరతుడు అంగీకరించలేదు. "పెద్దవాడైన శ్రీరాముడే రాజు కావాలి. ఆయనకు బదులు నేను పదునాలుగు సంవత్సరాలు వనవాసం చేస్తాను. చతురంగ బలాలను సిద్ధపరచండి. నేను వెళ్ళి శ్రీరాముణ్ణి అయోధ్యకు తీసుకువస్తాను" అని తెలిపాడు.

భరతుడు అయోధ్యావాసులతో కూడి బయలుదేరాడు. శృంగిబేరపురం చేరాడు. గుహుడు భరతుని ఆంతర్యం తెలియక యుద్ధసన్నద్ధుడయాడు. తీరా విషయం తెలిశాక ఎదురువెళ్ళి భరతుణ్ణి ఆహ్వానించాడు. గుహుని సహకారంతో భరద్వాజాశ్రమం చేరుకున్నాడు భరతుడు. మహర్షి సత్కారాలనంది చిత్రకూటం వైపు ప్రయాణించారందరు.

అడవిలో మృగాల అలజడి మొదలైంది. కారణమేమిటో చూడమన్నాడు లక్ష్మణునితో శ్రీరాముడు. వెంటనే లక్ష్మణుడు ఒక పెద్ద మద్ది చెట్టెక్కాడు. విషయం అర్థమైంది. చెట్టు దిగి శ్రీరాముని వద్దకు వచ్చాడు. "భరతుడు దుర్బుద్ధితో ససైన్యంగా వస్తున్నాడు. మన ధనుర్బాణాలను సిద్ధంచేసుకుందా"మన్నాడు లక్ష్మణుడు. శ్రీరాముడు లక్ష్మణుని ఆలోచనలో పొరపాటు ఉందని చెప్పాడు. భరతుడలాంటివాడు కాదన్నాడు. "లక్ష్మణా! ఒకవేళ నీకు రాజ్యకాంక్ష ఉంటే చెప్పు భరతునికి చెప్పి ఆ రాజ్యాన్ని నీకే ఇప్పిస్తా"నన్నాడు. ఇంతలో భరతుడు పర్ణశాలకు చేరుకున్నాడు. శ్రీరాముణ్ణి చూడగానే దుఃఖాన్ని ఆపుకోలేకపోయాడు. శత్రుఘ్నుడు శ్రీరాముని పాదాల మీద బడ్డాడు. శ్రీరాముని కళ్ళ నుంచి అశ్రుధారలు కురిశాయి. కొంతసేపటికి తేరుకున్నాడు. భరతుణ్ణి కుశల ప్రశ్నలు వేశాడు. ప్రసంగవశాత్తు రాజనీతి ధర్మాలను బోధించాడు. శ్రీరాముడు తండ్రి మరణవార్త విని విలపించాడు. శ్రీరాముణ్ణి అయోధ్యకు రమ్మని, రాజువుకమ్మని సవినయంగా ప్రార్థించాడు భరతుడు. కాని తండ్రిమాటే శిరోధార్యమని శ్రీరాముడు అంగీకరించలేదు. శ్రీరాముని నాస్తికవాదంతో ఒప్పింపజూచాడు జాబాలి. ఇతడు దశరథుని పురోహితుడు. కాని జాబాలి వాదాన్ని శ్రీరాముడు ఖండించాడు.



భరతుని అభ్యర్థన మేరకు శ్రీరాముడు పాదుకలను అనుగ్రహించాడు. అప్పుడు భరతుడు "అన్నా! ఈ పాదుకలమీదనే రాజ్యపాలనాభారాన్ని ఉంచుతాను. ఈ పదునాలుగు సంవత్సరాలు నేనుకూడా జటలను ధరించి, నారచీరలు కట్టి, వనవాస నియమాలతో, నగరం వెలుపల ఉంటాను. పదునాల్గవ సంవత్సరం కాగానే నీ దర్శనం కాకుంటే అగ్నిప్రవేశం చేస్తా"నన్నాడు. సరేనన్నాడు శ్రీరాముడు. ఆదర్శ సోదరభావమంటే ఇది. భరతుడు నందిగ్రామం చేరుకొని, పాదుకలకు పట్టాభిషేకం చేశాడు.

శ్రీరాముడు సీతా లక్ష్మణ సమేతంగా అత్రిమహర్షి ఆశ్రమానికి వెళ్ళాడు. అత్రి అనసూయలు వీరికి సముచిత మర్యాదలు చేశారు. మహాపతివ్రత అయిన అనసూయాదేవి సీతకు దివ్యవస్త్రాభరణాలనిచ్చింది. మునీశ్వరుల ఆశీస్సులు తీసుకొని సీతా రామ లక్ష్మణులు దండకారణ్యంలోకి ప్రవేశించారు.

SCERT TELANGANA



# అరణ్య కాండం



దండకారణ్యం పవిత్ర ప్రదేశం. ప్రశాంత ప్రదేశం. అక్కడ మునుల ఆశ్రమాలు ఎన్నో ఉన్నాయి. పక్షులు, మృగాలు – సకల ప్రాణులకు సురక్షితమైన ప్రాంతం అది. అక్కడ లోకక్షేమం కోసం యజ్ఞయాగాలు జరుగుతున్నాయి. ఆశ్రమ సముదాయాన్ని చూడగానే అల్లెతాడును ధనుస్సునుండి వేరుచేశాడు శ్రీరాముడు. (అక్కడ వినయానికి తప్ప వీరత్వానికి అవకాశం లేదు. ఎక్కడ ఎట్లా ప్రవర్తించాలో తెలుసుకోవడమే ఉచితజ్ఞత. ఇది శ్రీరామునిలో సంపూర్ణంగా ఉంది.)

సీతా రామ లక్ష్మణులకు మహర్షులు సాదర స్వాగతం పలికారు. ఆ సముదాయంలోని ఒక పర్ణశాలలో విడిది ఏర్పాటుచేశారు. మరునాడు ఉదయం నిత్యోచిత కర్మలను ముగించుకొని మహర్షులకు వీడ్కోలు పలికి సీతారామలక్ష్మణులు ప్రయాణాన్ని కొనసాగించారు.

వనం మధ్యకు చేరుకున్నారు. ఇంతలో వికృతాకారంలో ఉన్న విరాధుడనే రాక్షసుడు అమాంతంగా సీతారామలక్ష్మణుల పైకి విరుచుకుపడ్డాడు. రామలక్ష్మణులను తన భుజాలపై వేసుకొని తీసుకుపోసాగాడు. సీత గగ్గోలు పెడుతున్నది. రామలక్ష్మణులు విరాధుని రెండు భుజాలను నరికివేశారు. నేలపై కుప్పకూలాడు విరాధుడు. ముష్టిఘాతాలతో, మోకాళ్ళతో దాడిచేశారు రామలక్ష్మణులు. ఎంతకూ చావని విరాధుణ్ణి గోతిలో పాతిపెట్టడానికి సంసిద్ధులయ్యారు. వెంటనే విరాధుడు తన పూర్వకథను వివరించాడు. తుంబురుడనే గంధర్వుడైన తాను కుబేరుని శాపంచే రాక్షసుడిగా మారిన విషయం తెలిపాడు. శ్రీరాముని వల్ల శాపవిముక్తి కలుగుతుందన్న కుబేరుని మాటలను జ్ఞాపకం చేసుకున్నాడు. దగ్గరలోనే ఉన్న శరభంగ మహర్షిని దర్శించుకొమ్మని, శుభం జరుగుతుందని శ్రీరామునికి చెప్పాడు. తనను గోతిలో పూడ్చమన్నాడు. అలాగే చేశారు రామలక్ష్మణులు.

విరాధుని మాట ప్రకారం శరభంగ మహర్షి దర్శనానికి బయల్దేరారు. శరభంగుడు మహాతపస్వి. దైవసాక్షాత్కారం పొందినవాడు. శ్రీరాముని చూసి శ్రీరామ దర్శనం కోసమే తాను వేచి ఉన్నానన్నాడు. తన తపఃఫలాన్నంతా శ్రీరామునికి ధారవోసాడు. (భవిష్యత్తులో శ్రీరాముడు చేయవలసిన రావణసంహారానికి ఇది కూడా తోడ్పడుతుంది. ఒక మహాకార్య సాధనలో ఎవరివంతు వారు సహకారమందించాల్సిందే.) అక్కడికి చేరువలోనే ఉన్న 'సుతీక్ష్ణ' మహర్షిని దర్శించమని శ్రీరామునికి సూచించాడు శరభంగమహర్షి. సీతారామలక్ష్మణులు చూస్తుండగానే తన దేహాన్ని విడచి అగ్నితేజస్సుతో బ్రహ్మలోకం చేరాడు.

అక్కడి మునులందరూ శ్రీరాముని వద్దకు వచ్చి తమగోడును వెళ్ళబోసుకున్నారు. రాక్షసులు మునులపై చేసే అకృత్యాలను ఏకరువుపెట్టారు. రాక్షసుల చేతిలో బలైన మునుల కళేబరాలను చూపించారు. రాక్షసుల బారి నుండి రక్షించమని ప్రార్థించారు. వారితో శ్రీరాముడు "మహాత్ములారా! మీరు నన్ను ప్రార్థించడం తగదు. ఆజ్ఞాపించాలి. మీ ఆజ్ఞలను నేను శిరసావహిస్తా"నన్నాడు. (అహంకరించకుండా తన బాధ్యతను గుర్తించడంలోనే గొప్పదనముంది.)

సీతారామలక్ష్మణులు సుతీక్ష్ణ మహర్షి ఆశ్రమం చేరుకున్నారు. శ్రీరామ దర్శనం కోసమే సుతీక్ష్ణ మహర్షి దేహం విడువకుండా ఉన్నాడు. తన తపశ్శక్తినంతా శ్రీరామునికి ధారాదత్తం చేశాడు. మరునాడు వారు మహర్షి అనుమతి తీసుకొని బయలుదేరారు.

SCERT, TELANGANA

దండకారణ్యంలోని మునుల ఆశ్రమాలను సందర్శిస్తూపోతున్నారు సీతారామలక్ష్మణులు. అక్కడక్కడ కొంతకాలం ఉంటున్నారు. ఇలా పది సంవత్సరాలు గడిచింది. మళ్ళీ సుతీక్ష్ణ మహర్షి వద్దకు వచ్చారు. అతనితో అగస్త్య మహర్షిని దర్శించుకోవాలన్న తమ ఆకాంక్షను వెలిపుచ్చారు. సుతీక్ష్ణ మహర్షి మార్గాన్ని చెప్పాడు. తన ఆశ్రమానికి దక్షిణంగా నాల్గుయోజనాల దూరంలో అగస్త్య సోదరుని ఆశ్రమం, అక్కడికి యోజనదూరంలో అగస్త్యాశ్రమం ఉందని తెలిపాడు. మహర్షివద్ద సెలవు తీసుకొని బయలుదేరారు సీతారామలక్ష్మణులు.

సాయంకాలానికి అగస్త్యసోదరుని ఆశ్రమానికి చేరుకున్నారు. (ఇక్కడో విషయం చెప్పుకోవాలి. అగస్త్యసోదరుని పేరేమో చెప్పబడలేదు. ఎక్కడ సందర్భం వచ్చినా అగస్త్యభ్రాత (సోదరుడు) అనే చెప్పారు. అందుకే పేరు తెలియని వారిని 'అగస్త్యభ్రాత' అంటుంటారు. ఈ పదబంధం జాతీయంగా స్థిరపడింది.) అగస్త్యసోదరుని ఆతిథ్యంలో ఆరాత్రి గడిపారు సీతారామలక్ష్మణులు. ఉదయాన్నే అగస్త్యాశ్రమం వైపుగా అడుగులు వేశారు.

అగస్త్యుడు తపశ్శక్తి సంపన్నుడు. ఆకాశాన్ని తాకిన వింధ్య పర్వత గర్వాన్ని అణచినవాడు. 'అగమ్ స్తంభయతీతి అగస్త్యః' పర్వతాన్ని స్తంభింపజేసినవాడు కనుక అగస్త్యుడయ్యాడు.

శ్రీరాముని రాకను గమనించి అగస్త్యుడు శిష్యసమేతంగా ఎదురువెళ్ళాడు. అతిథిని గౌరవించే సంప్రదాయమది. శ్రీరాముడు సీతాలక్ష్మణ సమేతుడై మహర్షికి పాదాభివందనం చేశాడు. అగస్త్యుడు శ్రీరామునికి దివ్యధనుస్సు, అక్షయతూణీరాలు, అమోఘమైన ఖడ్గాన్ని బహూకరించాడు. జయం కలుగుతుందని ఆశీర్వదించాడు. కష్టాలతో కూడిన వనవాసానికి సీత కోరిరావడం సాహసమని అభినందించాడు. ఆమెకుగల భర్తృప్రేమను మెచ్చుకున్నాడు.

శ్రీరాముడు తాము నివసించడానికి అనువైన ప్రాంతాన్ని సూచించమని అగస్త్యుణ్ణి అభ్యర్థించాడు. ఒక్క క్షణం ధ్యానమగ్నుడైనాడు మహర్షి. తరువాత శ్రీరామునితో "ఇక్కడికి రెండు యోజనాల దూరంలో 'పంచవటి' అనే ప్రదేశం ఉంది. అక్కడ ఫలాలకు, జలానికి కొదువలేదు గోదావరీనదీ తీరంలో ఉన్న ఆ ప్రాంతంలో జనసంచారం ఉండదు. ప్రశాంతంగా ఉంటుం"దని తెలిపాడు. అగస్త్యుడి దగ్గర సెలవు తీసుకొని పంచవటికి ప్రయాణమయ్యారు సీతారామలక్ష్మణులు.

దారిలో బలిష్ఠమైన ఒక పెద్ద గద్దను చూశారు. పక్షిరూపంలో ఉండే రాక్షసుడేమోననుకున్నారు. "నువ్వెవరి"వని అడిగారు. తనపేరు 'జటాయువు' అనీ దశరథుడి మిత్రుడిననీ చెప్పుకొన్నాడు. తన వంశచరిత్రనూ శక్తిసామర్థ్యాలను వివరించాడు జటాయువు. తన తండ్రికి ఆత్మీయుడైన జటాయువునకు సీతరక్షణ బాధ్యతను అప్పగించాడు శ్రీరాముడు. శ్రీరాముని ఆజ్ఞమేరకు పంచవటిలో పర్ణశాల నిర్మాణం చేశాడు లక్ష్మణుడు.

పంచవటిలో జీవనం ప్రశాంతంగా గడుస్తున్నది. ఒకనాడు శ్రీరాముడు పురాణకథా ప్రసంగంలో ఉన్నాడు. ఇంతలో 'శూర్పణఖ' అనే రాక్షసి అక్కడికి వచ్చింది. ఈమె రావణాసురుడి చెల్లెలు. శ్రీరాముని సౌందర్యానికి ముగ్ధురాలైంది. తనను చేపట్టమన్నది. తమ మధ్య అడ్డుగా ఉన్న సీతాలక్ష్మణులను చంపితింటానన్నది. శ్రీరాముడు పరిహాసంగా లక్ష్మణుని వద్దకు వెళ్ళమన్నాడు. లక్ష్మణుడు తాను అన్నకు దాసుడనని తనతో ఉంటే శూర్పణఖ కూడా దాస్యం చేయాల్సివస్తుందని, అందుకే శ్రీరాముణ్ణి చేరడమే సబబని సమాధానమిచ్చాడు. శ్రీరామునివైపు తిరిగింది శూర్పణఖ. సీత ఉండడంవల్లే తనను నిరాకరిస్తున్నాడని అట్టుడికిపోయింది. సీతాదేవి అడ్డు తొలగించుకోవాలని ఆమెపై దాడికి దిగింది.

క్రూరులైన దుష్టులతో పరిహాసం పనికిరాదు. అది ఎంతో ప్రమాదకరం. ఆలస్యం చేయకుండా శూర్పణఖను విరూపినిచేయమన్నాడు శ్రీరాముడు. అన్న ఆజ్ఞే ఆలస్యం – శూర్పణఖ ముక్కు చెవులు తెగిపడ్డాయి లక్ష్మణుని కత్తిదెబ్బకు. లబోదిబోమని మొత్తుకొంటూ సోదరుడైన ఖరుడి దగ్గరికి వెళ్ళింది శూర్పణఖ. ఖరుడు పద్నాలుగుమంది యోధులను పంపాడు. వాళ్ళంతా శ్రీరాముని చేతిలో మట్టిగరచారు. ఇది చూసిన శూర్పణఖ ఖరుని వద్దకు వెళ్ళి చెప్పింది. ఖరదూషణులు పద్నాలుగువేల మంది రాక్షసులతో రామునిమీదకు దండెత్తారు. మూడు గడియల్లో వాళ్ళందరినీ యమపురికి పంపించాడు శ్రీరాముడు.



SCERT TELANGANA


ఈ వార్త అకంపనుడి ద్వారా వేగంగా లంకకుచేరింది. అకంపనుడు రావణాసురుడి గూఢచారుల్లో ఒకడు. ఈ విషయాన్ని సహించుకోలేని రావణుడు శ్రీరాముణ్ణి హతమారుస్తానని ఆవేశపడ్డాడు. అకంపనుడు, అసహాయశూరుడైన శ్రీరాముణ్ణి వధించడం దేవాసురులకు కూడా సాధ్యంకాదని తేల్చేశాడు. కాని అందుకు తగిన ఒక ఉపాయాన్ని చెప్పాడు. "శ్రీరాముని భార్య సీత అందాల రాశి. శ్రీరామునికి ప్రాణం. ఎలాగైనా ఆమెను అపహరిస్తే చాలు – ఆ ఎడబాటును తట్టుకోలేక రాముడు జీవితాన్ని చాలిస్తాడు" అని. ఇది రావణునికి ఎంతగానో నచ్చింది.

మరునాడుదయమే రథంమీద ఆకాశంలో ప్రయాణిస్తూ మారీచుడి ఆశ్రమానికి చేరుకున్నాడు. సీత అపహరణ విషయం తెలిపాడు. ఈ పనిలో తనకు సహాయపడమన్నాడు. మారీచుడు మండిపడ్డాడు. "ఓ రాక్షసేంద్రా! ఈ ఆలోచన నీకెవడు చెప్పాడు? నిజంగా అతడు నీకు మిత్రుడి రూపంలో ఉన్న శత్రువు. శ్రీరాముడు సింహంవంటివాడు. సింహందగ్గరికి వెళ్ళడం ఎంత ప్రమాదం? పైగా ఇతరులకు హాని చేయాలనే ఆలోచన లేకుండా ప్రశాంతంగా ఉన్న రాముణ్ణి కవ్వించడం కొరివితో తల గోక్కోవడమే. శాంతించి, ఈ ఆలోచన విరమించి సుఖించు"మని సదుపదేశం చేశాడు. రావణుని ఆవేశం తిరుగు ముఖం పట్టింది. రావణుడూ తిరుగుముఖం పట్టాడు లంకకు.

ఖరదూషణ త్రిశరులు, పద్నాలుగు వేలమంది రాక్షసవీరులు రామునిధాటికి నిలువలేక యముడి ఇంటికి పోవడాన్ని భరించలేకపోయింది శూర్పణఖ. లంకకు పరుగుదీసింది. మంత్రులతో కొలువుదీరిన రావణుని సభలోకి వెళ్ళింది. వికృతరూపంతో వచ్చిన చెల్లెలి దీనావస్థను చూసికూడా చలించలేదు రావణుడు. శూర్పణఖ ఆవేశం కట్టలు తెంచుకుంది. రావణుడి మూర్ఖత్వాన్ని తిట్టిపోసింది. శ్రీరామునివల్ల లంకకు ముప్పువాటిల్లగలదని హెచ్చరించింది. "సౌందర్యవతి అయిన సీతకు తగిన భర్తవు నీవే"నని రావణుడిలో కొత్త ఆశలను రేకెత్తించింది.

ఒకవైపు మారీచుడి మాటలు, మరొకవైపు శూర్పణఖ పలుకులు లంకేశుని మనసును కుదిపేస్తున్నాయి. అయోమయంలో పడ్డాడు. సీతాపహరణంలోని మంచిచెడులను ఆలోచించాడు. శ్రీరాముని బలంతో తన బలాన్ని పోల్చుకున్నాడు. చివరకు సీతను అపహరించడానికే నిశ్చయించుకున్నాడు.

రావణుడు మళ్లీ మారీచునివద్దకు వెళ్ళాడు. సీతాపహరణకు బంగారులేడిగా మారి సహకరించమన్నాడు. ఆ ఆలోచనను విరమించుకోమని లంకేశునికి పరిపరివిధాల నచ్చజెప్పజూశాడు మారీచుడు. విశ్వామిత్రుని యాగ సంరక్షణ సందర్భంలో రామబాణం రుచి ఏమిటో తాను తెలుసుకున్నానన్నాడు. మారీచుడి మాటలను పెడచెవిన పెట్టాడు రావణుడు. (మూర్ఖులకు హితబోధలు చెవికెక్కవు.)



"నేను చెప్పినట్లు చేయకుంటే నా చేతిలో నీకు చావు తప్ప"దని హెచ్చరించాడు రావణుడు. ఆశ్రమానికి వెళ్తే శ్రీరాముడు చంపుతాడు. వెళ్ళకుంటే రావణుడు చంపుతాడు. 'ముందు నుయ్యి వెనక గొయ్యి'లా ఉంది మారీచుని స్థితి. చివరకొక నిశ్చయానికి వచ్చాడు. రావణునితో "నీ చేతిలో చావడం కన్నా శ్రీరాముని చేతిలో చావడమే నయం. నా జన్మ తరిస్తుం"దని తేల్చిచెప్పాడు.

మారీచుడు బంగారులేడిగా మారి శ్రీరాముని ఆశ్రమ ప్రాంతంలో తిరుగుతున్నాడు. పూలు కోయడానికి వచ్చిన సీతాదేవి ఆ జింకను చూసి ఆశ్చర్యపడింది. రామలక్ష్మణులను పిలిచింది. వారు ఆ మృగాన్ని చూశారు. లక్ష్మణుడు అది మాయామృగమేనని నిస్సంశయంగా పలికాడు. మారీచుడే ఈ రూపంలో వచ్చి ఉంటాడన్నాడు. వేటకు వచ్చే రాజులను మాయామృగరూపంలో చంపడం మారీచుడికి కొత్తదేమీ

కానదన్నాడు. ఇలాంటి లేడి ప్రపంచంలో ఉండదని అనుమానాన్ని వెలిబుచ్చాడు. సీత మాత్రం పట్టు వదలలేదు. తనకు అదెంతో నచ్చిందని, తీసుకురావాలని కోరింది. తెస్తే ఆశ్రమంలో క్రీడా మృగంగా ఉంటుందని, అయోధ్యచేరాక అంతఃపురానికే అలంకారమౌతుందని ఆశించింది.

సీత ఇష్టాన్ని తోసివేయలేక ఆ మాయలేడిని చంపి అయినా సరే తేవడానికి సంసిద్ధుడయ్యాడు శ్రీరాముడు. సీతాదేవి రక్షణ విషయంలో జటాయువు సహాయంతో అప్రమత్తంగా ఉండమని లక్ష్మణుణ్ణి ఆదేశించాడు. మాయలేడిని పట్టుకోవడానికి బయల్దేరాడు.

మృగాన్ని ప్రాణంతో పట్టుకోవాలని శతవిధాల ప్రయత్నించాడు శ్రీరాముడు. అందినట్టే అంది అందకుండా పరుగుదీస్తున్నదా మృగం. ఇక లాభం లేదనుకొని బాణాన్ని సంధించాడు, ప్రయోగించాడు శ్రీరాముడు. బాణపు దెబ్బకు తాటి చెట్టంత ఎత్తు ఎగిరి భయంకరంగా అరుస్తూ పడిపోయాడు మారీచుడు నిజ స్వరూపంతో. రాముని కంఠధ్వనిని అనుకరిస్తూ "అయ్యో సీతా! అయ్యో లక్ష్మణా!" అని బిగ్గరగా అరుస్తూ ప్రాణాలు విడిచాడు. ఈ మాటలకు సీతాలక్ష్మణులు ఎంత కలవరపడతారోనని భయపడినాడు శ్రీరాముడు.

మారీచుని కంఠధ్వనిని రామునిదిగా భావించి సీత ఆందోళన చెందింది. శ్రీరాముడు ఏదో ఆపదలో చిక్కుకున్నాడని తలచింది. ఆదుకోవడానికి వెంటనే వెళ్ళమని లక్ష్మణుణ్ణి పురమాయించింది. లక్ష్మణుడు చలించలేదు. ఇది శ్రీరాముని స్వరం కాదన్నాడు. మారీచుడి మాయాజాలమన్నాడు. "అమ్మా! నీ రక్షణ భారం శ్రీరాముడు నాకప్పగించాడు. నిన్ను ఇలా ఒంటరిగా వదలివెళ్ళలే"నని స్పష్టం చేశాడు. సీత ఆవేశం రెండింతలైంది. మనసులో ఏదో దుష్టాలోచనతో ఇలా ప్రవర్తిస్తున్నావని నిష్ఠురోక్తులాడింది. చేసేదిలేక లక్ష్మణుడు బయలుదేరడానికి సంసిద్ధుడయ్యాడు. "అమ్మా! నీకు భద్రమగుగాక. వనదేవతలు నిన్ను రక్షింతురుగాక. నాకు అపశకునాలు తోస్తున్నాయి. మళ్ళీ నువ్వు మా అన్నతో కలిసి ఉండగా చూసే భాగ్యం కలుగుతుందో, లేదో?" అని వాపోయాడు. సీత మౌనంగా ఉన్నది. అక్కడి నుంచి వెళ్ళడానికి ఏమాత్రం మనస్కరించకున్నా సీతకు నమస్కరించి శ్రీరాముడు వెళ్ళిన దిశగా నడిచాడు లక్ష్మణుడు.

లక్ష్మణుడు వెళ్ళడాన్ని గమనించాడు రావణుడు. అదే అదనుగా సన్యాసి వేషంలో సీత సమక్షానికి వచ్చాడు. యతి రూపంలో వచ్చిన రావణుణ్ణి ఆసనంమీద కూర్చుండబెట్టి సముచితంగా అతిథి మర్యాదలు చేసింది సీత. మధ్యమధ్యలో రామలక్ష్మణుల కోసం వాకిలివైపు చూస్తున్న సీతకు నిరాశే మిగులుతున్నది. రావణుడు సీతను గురించిన వివరాలు అడిగాడు. తెలిపింది. సన్యాసి వివరాలను కోరింది. తాను రాక్షసరాజు లంకేశ్వరుడనని ప్రకటించాడు. తనను పతిగా స్వీకరించమని అడిగాడు. అలా చేస్తే అంతులేని భోగభాగ్యాలతో విలసిల్లుతావని ఆశ చూపాడు. ఆ మాటలకు సీత మండిపడింది. రావణుణ్ణి తృణీకరించి మాట్లాడింది. శ్రీరాముని పరాక్రమాన్ని ప్రస్తావించింది. "నన్ను అపహరించి నీ చావును నీవే కొనితెచ్చుకోకు" అని హెచ్చరించింది.

రావణుడి కన్నులు నిప్పులు చెరుగుతున్నాయి. సన్యాసి వేషాన్ని వదిలి పదితలలతో భయంకరమైన నిజస్వరూపంతో సీత ఎదుట నిలిచాడు. బలవంతంగా సీతను తన రథంలో లంకకు తరలిస్తున్నాడు. సీత 'రామా! రామా!' అంటూ ఆర్తనాదాలను చేస్తున్నది. ఆమె వేదన అరణ్యరోదనయింది.

అప్పుడప్పుడే నిద్రకుపక్రమిస్తున్న జటాయువుకు సీతాదేవి ఆర్తనాదాలు వినబడ్డాయి. చూసే సరికల్లా సీతను అపహరించుకు పోతున్న రావణుడు కంటబడ్డాడు. జటాయువు రావణుణ్ణి ఎదిరించాడు. ఇద్దరి మధ్య పోరు హోరాహోరీగా సాగింది. చివరకు రావణుడు ఖడ్గంతో జటాయువు రెక్కలను, కాళ్ళను నరికివేసాడు. నేలపై కూలాడు జటాయువు. రక్తంతో తడసి ముద్దయిన అతణ్ణి చూసి ఆత్మబంధువును పోగొట్టుకున్నట్లు సీత ఆక్రందించింది.

రావణుడు సీతాదేవిని తీసుకొని ఆకాశమార్గం పట్టాడు. దీనురాలైన సీత హీనుడైన రావణుణ్ణి పరి పరి విధాల దూషించింది. ఇంతలో ఒక పర్వత శిఖరంమీద ఐదుగురు వానరముఖ్యులను సీత చూసింది. ఉత్తరీయపు కొంగులో తన ఆభరణాలను కొన్నింటిని మూటగట్టి వారి మధ్య పడేటట్లు వదలింది. ఒకవేళ అటువైపుగా శ్రీరాముడువస్తే తనను గురించి వానరులు అతనికి తెలియజేస్తారనే చిన్న ఆశ.



SCERT, TELANGANA

రావణుడు సీతతో లంకకు చేరాడు. తన అంతఃపురంలో సీతనుంచాడు. తన వైభవమంతా చూపించాడు. దాన్ని తృణప్రాయంగా భావించింది సీత. కనికరించమని కాళ్ళపైబడ్డాడు. నిరాకరించిందా మహాసాధ్వి. భరించలేకపోయాడు దశకంఠుడు. ఆవేశంతో, "మైథిలీ! నీకు పన్నెండు నెలల గడువిస్తున్నాను. ఈలోపున నువ్వు దారికి రాకపోతే మరునాడే ప్రాతఃకాల భోజనానికి వంటవాళ్ళు నిన్ను సిద్ధంచేస్తా"రని బెదిరించాడు. అక్కడి రాక్షసులతో, "ఈమెను అశోకవనానికి తీసుకుపొండి. వనం మధ్య ఒక రహస్య ప్రదేశంలో ఉంచి చుట్టూ కాపలాగా ఉండండి ఎలాగో ఒకలాగ ఈమెను ఒప్పించండి" అని ఆజ్ఞాపించి రుసరుసలాడుతూ వెళ్ళాడు. ఆడపులుల మధ్య జింకలాగ రాక్షస స్త్రీల మధ్య సీత బిక్కుబిక్కుమంటూ కాలాన్ని గడుపుతున్నది.

మారీచుణ్ణి వధించి శ్రీరాముడు వెనుదిరిగాడు. లక్ష్మణుడు ఎదురయ్యేసరికి నిశ్చేష్టుడయ్యాడు. సీతను ఒంటరిగా వదలి ఎందుకు వచ్చావని నిలదీశాడు. జరిగిన విషయాలు పూసగుచ్చినట్లు చెప్పాడు లక్ష్మణుడు. ఇద్దరూ ఆశ్రమానికి చేరుకున్నారు. సీతాదేవి జాడ కనిపించలేదు. వనమంతా వెతికారు. ఆమె జాడ కనిపించలేదు. జాడ చెప్పమని ప్రకృతిని ప్రార్థించాడు శ్రీరాముడు. ఆమె ఎడబాటును తట్టుకోలేక కన్నీరు మున్నీరుగా విలపించాడు. ఆవేదన ఆవేశంగా మారింది. లోకాలను ధ్వంసం చేయడానికి శ్రీరాముడు సిద్ధపడ్డాడు. లక్ష్మణుడు ఓదార్పు వాక్యాలతో అన్నను శాంతపరిచాడు.

అరణ్యంలో సీతను వెదుకుతూ వెళుతున్న రామలక్ష్మణులకు జటాయువు కనిపించాడు. రక్తంతో తడిసిన అతనిని గుర్తించలేదు శ్రీరాముడు. మీదు మిక్కిలి అతడు గద్దరూపంలో ఉన్న రాక్షసుడని సీతనతడే భక్షించి ఉంటాడనీ భ్రమపడ్డాడు. బాణంతో చంపడానికి పూనుకున్నాడు. ఇంతలో జటాయువు జరిగిన విషయం చెప్పాడు. రావణుడు సీతను అపహరించాడని, ఎదిరించిన తనకీగతి పట్టించాడని వివరించాడు. అపహరణకు గురైన సీత, అవసానదశలో ఉన్న ఆత్మీయుడు – రాముని దుఃఖం రెండింతలైంది. తన తండ్రికి ఆత్మీయుడైన జటాయువు పట్ల పితృభక్తిని ప్రదర్శిస్తూ అతని శరీరాన్ని నిమిరాడు. జటాయువు కన్నుమూశాడు. శ్రీరాముడు జటాయువుకు దహన సంస్కారాలు చేశాడు. అతనికి ఉత్తమగతులు కలగాలని గోదావరిలో జలతర్పణాలు చేశాడు.

రామలక్ష్మణులు దండకారణ్యంనుంచి క్రౌంచారణ్యానికి చేరుకున్నారు. అక్కడి వనంలో భయంకరుడైన ఒక రాక్షసుణ్ణి చూశారు. అతని తల, మెడ కనబడడంలేదు. కడుపు భాగంలో ముఖముంది. రొమ్ముమీద ఒకే కన్ను ఉంది. యోజనం పొడవు వ్యాపించిన చేతులు. ఆ చేతులలో పక్షులను, మృగాలను పట్టితింటాడు. అతనిపేరు 'కబంధుడు'. తన సమీపంలోకి వచ్చిన రామలక్ష్మణులను అమాంతంగా రెండు చేతులతో పట్టుకున్నాడు. అతని చేతుల్లో చిక్కితే తప్పించుకోవడం ఎవరితరంకాదు. (అందుకే 'కబంధ హస్తాలు' అన్న జాతీయం పుట్టుకువచ్చింది.) కబంధుడు రామలక్ష్మణులను భక్షించడానికి నోరుతెరచాడు. అన్నదమ్ములిద్దరూ తమ ఖడ్గాలతో అనాయాసంగా వాడి భుజాలను నరకివేశారు. కబంధుడు కుప్పకూలాడు. రామలక్ష్మణుల గురించి తెలుసుకున్నాడు. తన గురించి చెప్పుకున్నాడు. శాపకారణంగా తనకీ వికృతరూపం ప్రాప్తించిందన్నాడు. శ్రీరాముడు కబంధునితో 'మాకు రావణుని పేరు మాత్రమే తెలిసింది. అతని రూపం, ఉండేచోటు, శక్తిసామర్థ్యాలు తెలియవు. వాటిని చెప్పవలసింద'ని అడిగాడు. సమాధానంగా కబంధుడు "శ్రీరామా! నాకిప్పుడు దివ్యజ్ఞానంలేదు. నా శరీరాన్ని దహిస్తే నా నిజరూపం వస్తుంది. అప్పుడు చెప్పగల"నన్నాడు. కబంధుడి శరీరానికి అగ్నిసంస్కారంచేశారు రామలక్ష్మణులు. ఆ జ్వాలల నుంచి దివ్యదేహంతో బయటికి వచ్చాడు కబంధుడు. సీతాదేవి దొరికే ఉపాయాన్ని శ్రీరామునికి చెప్పాడు. ఇందుకు సుగ్రీవుడి మైత్రి బాగా తోడ్పడుతుందన్నాడు. వాలిసుగ్రీవుల కథను వివరించాడు. సుగ్రీవుణ్ణి చేరే దారిని చెప్పాడు. శ్రీరాముని అనుమతిని తీసుకొని కబంధుడు స్వర్గానికి వెళ్లాడు.

కబంధుడు సూచించిన మార్గంలో ప్రయాణిస్తూ పంపాసరస్సున్న ప్రాంతానికి చేరారు రామలక్ష్మణులు. ఆ తీరంలో ఉన్న శబరి ఆశ్రమానికి వెళ్ళారు. శబరి తపస్సిద్ధురాలు, జ్ఞానవయోవృద్ధురాలు. శ్రీరామదర్శనంతో ఆమె తనువు పులకించింది. పంపాతీరంలో దొరికే పండ్లను స్వామికి సమర్పించింది. తన జన్మ ధన్యమైనట్లు భావించింది. శ్రీరాముని అనుమతినిపొంది తన దేహాన్ని అగ్నికి ఆహుతి చేసి అగ్నికాంతితో ఊర్ధ్వలోకాలకు వెళ్ళింది.

అక్కడినుంచి ఋష్యమూక పర్వతానికి ప్రయాణమయ్యారు రామలక్ష్మణులు. దారిలో పంపాసరోవరాన్ని దర్శించారు.

SCERT, TELANGANA



# కిష్కింధా కాండం



పంపాసరోవర ప్రాంతం పరమ రమణీయంగా ఉంది. ప్రకృతి తన అందాలను ప్రదర్శిస్తున్నట్లుగా ఉంది. కాని శ్రీరాముని మనసును ఏమాత్రం సంతోషపెట్టలేకపోయింది. పైగా సీత ఎడబాటు ఆవేదన అనే అగ్నికి ఆజ్యం పోసినట్లుగా శ్రీరాముని బాధను మరింతపెంచింది. లక్ష్మణుడు ఊరడించాడు. "అన్నా ఈ దైన్యాన్ని వదులు. అదే మనకు మేలుచేస్తుంది. చేసిన ప్రయత్నం విఫలమైనప్పుడు, సంపదలను పోగొట్టుకున్నప్పుడు అధైర్యపడకుండా ప్రయత్నంచేస్తే మంచి ఫలితముంటుంది. ఉత్సాహమే బలం. ఉత్సాహమున్నవానికి అసాధ్యమనేదిలేదు. వాళ్ళు ఎటువంటి కష్టాలువచ్చినా వెనకడుగువేయరు. మన ప్రయత్నాన్ని కొనసాగిద్దాం. వదినెగారు తప్పకుండా లభిస్తారు" అని ధైర్యం చెప్పాడు.

ఋష్యమూక పర్వతం నుంచి రామలక్ష్మణులను చూశాడు సుగ్రీవుడు. గుండెలో రాయిపడ్డట్టయింది. ఆ ఇద్దరు వీరులు తన అన్న అయిన వాలి పంపగా వచ్చారేమోనని భయంతో వణకిపోతున్నాడు. ధనుర్బాణాలు ధరించిన వాళ్ళెవరో మారువేషంలోవెళ్ళి కనుక్కోమని ఆంజనేయుణ్ణి ఆదేశించాడు.

సుగ్రీవుని ఆనతిమీద రామలక్ష్మణులున్న చోటికి ఒక్క గంతువేశాడు హనుమంతుడు. సన్న్యాసి రూపంలో వారి దగ్గరికి వెళ్ళాడు. వారి రూపాన్ని పొగిడాడు. వారి పరిచయం అడిగాడు. రామలక్ష్మణులు మౌనముద్రనుదాల్చారు. హనుమంతుడు వారితో "వానరరాజు సుగ్రీవుడు ధర్మాత్ముడు, మహావీరుడు. అతణ్ణి ఆయన అన్న వాలి వంచించాడు. రక్షణకోసం జాగ్రత్తతో తిరుగుతున్నాడు. నేను సుగ్రీవుడి మంత్రిని. నన్ను 'హనుమంతు'డంటారు. నేను వాయుపుత్రుణ్ణి. ఎక్కడికైనా వెళ్ళిరాగల శక్తి గలవాణ్ణి. సుగ్రీవుడు పంపగా ఈ రూపంలో మీదగ్గరకి వచ్చాను. సుగ్రీవుడు మీతో స్నేహాన్ని కోరుతున్నాడు" అని చాకచక్యంగా మాట్లాడాడు. విషయాన్ని చెప్పేపద్ధతిలో ఎంతో నేర్పును ప్రదర్శించాడు. హనుమంతుని మాటతీరు శ్రీరాముణ్ణి ఆకట్టుకుంది. లక్ష్మణుడితో "ఇతడు వేదాలను, వ్యాకరణాన్ని క్షుణ్ణంగా చదివాడన్నది నిశ్చయం. లేకపోతే మాటల్లో ఇంత స్పష్టత ఉండదు. తడబాటు, తొందరపాటు లేకుండా, తప్పులు పలకకుండా, సరైన స్వరంతో చెప్పదలచుకున్న విషయాన్ని మనసుకు హత్తుకునేటట్లు చెప్పాడు. ఈయన మాట్లాడే తీరుచూస్తే చంపడానికి కత్తి ఎత్తిన శత్రువుకు కూడా చేతులు రావు" అని మెచ్చుకున్నాడు. మాటకున్న శక్తి అటువంటిది.

హనుమంతుడితో లక్ష్మణుడినే మాట్లాడమన్నాడు శ్రీరాముడు. హనుమంతుడి అభిప్రాయాలకు సమ్మతి తెలుపుతూ. తమ వృత్తాంతాన్ని వివరించాడు లక్ష్మణుడు. తమకు సుగ్రీవుడి సహాయం ఎంతో తగినదన్నాడు. సన్న్యాసిరూపం వదలి రామలక్ష్మణులను భుజాలపై ఎక్కించుకొని ఋష్యమూక పర్వతానికి చేరుకున్నాడు హనుమ. అంతకు ముందే భయంతో మలయగిరికి చేరిన సుగ్రీవుణ్ణి రామలక్ష్మణుల వద్దకు తీసుకువచ్చాడు ఆంజనేయుడు.

శ్రీరామ సుగ్రీవులు అగ్నిసాక్షిగా మిత్రులైనారు. సుగ్రీవుడు "రామా! ఈనాడు నీవు నాకు ప్రాణమిత్రుడివైనావు. ఇప్పటి నుంచి సుఖదుఃఖాలలో మనం ఒక్కటిగానే ఉందాం. వాలి భయం నన్ను వదలడంలేదు. నీ అభయం కావాలి" అని ప్రార్థించాడు.



SCERT, TELANGANA

శ్రీరాముడు మందహాసాన్ని చిందిస్తూ "సుగ్రీవా! ఆపదలో ఆదుకునేవాడే గదా మిత్రుడు. నీ భార్యను అపహరించిన వాలిని తప్పక వధిస్తా"నని మాటఇచ్చాడు. సుగ్రీవుడి మనసుకుదుటపడింది.

శ్రీరామసుగ్రీవులు స్నేహపూర్వకంగా మాట్లాడుకుంటున్నసమయంలోనే సీతాదేవికి, వాలికి, రావణాసురునికి ఎడమకన్ను ఒక్కసారిగా అదిరింది.

సుగ్రీవుడు గతంలో తాను నలుగురు మంత్రులతో కొండమీద ఉన్నప్పుడు ఒక రాక్షసుడు స్త్రీని బలవంతంగా తీసుకుపోవడం చూశామన్నాడు. ఆమె "రామా! లక్ష్మణా!" అని బిగ్గరగా అరవడం విన్నామన్నాడు. తమను చూసి ఒక నగల మూటను జారవిడచిందని చెప్పి, ఆ ఆభరణాలను తెచ్చి చూపించాడు. శ్రీరాముడు వాటిని చూసి కన్నీటి సంద్రమయ్యాడు. లక్ష్మణుడు "అన్నా! ఈ కేయూరాలను, కుండలాలను నేను గుర్తుపట్టలేను. కాని కాలి అందెలు మాత్రం మా వదినెగారివే. ఆమెకు నిత్యం పాదాభివందనం చేయడంవల్ల నేను వీటిని గుర్తుపట్టా"నన్నాడు.

శ్రీరాముని శోకాన్ని పోగొట్టే ప్రయత్నం చేశాడు సుగ్రీవుడు. సీతాదేవిని తీసుకురావడంలో తాను తగిన ప్రయత్నం చేస్తానన్నాడు. సపరివారంగా రావణుణ్ణి హతమార్చేందుకు తన శక్తియుక్తులన్నింటినీ వినియోగిస్తానన్నాడు. దుఃఖం అనర్థదాయకం కనుక ఎప్పుడూ దుఃఖించవద్దన్నాడు. ఎల్లప్పుడూ దుఃఖించేవారికి సుఖముండదు. తేజస్సు క్షీణిస్తుంది. ఒక్కొక్కప్పుడు ప్రాణాలు నిలవడమే కష్టంగా ఉంటుంది. కనుక దుఃఖస్థితినుంచి బయట పడమని ధైర్యవచనాలను చెప్పాడు.

"ఓ రామా! నిజమైన మిత్రుడు తన స్నేహితుడికోసం సంపదలను, సుఖాలను, చివరకు తన ప్రాణాలను కూడా విడవడానికి సిద్ధపడతాడు. ప్రాణమిత్రులమైన మనం స్నేహధర్మాన్ని చక్కగా పాటిద్దా"మన్నాడు. శ్రీరాముడు అందుకు అంగీకరిస్తూ "ఉపకారం జరగడమే మిత్రునివల్ల ఫలం – అపకారం చేయడం శత్రువు లక్షణం. నీ భార్యనపహరించిన వాలిని ఈరోజే చంపుతా"నన్నాడు. వాలితో వైరమెందుకు వచ్చిందో తెలపమన్నాడు సుగ్రీవుణ్ణి. గతకథను శ్రీరాముని చెవిన వేశాడు సుగ్రీవుడు.

"మా అన్న వాలి మహాబలశాలి. పెద్దవాడు కనుక మా తండ్రి తరవాత కిష్కింధకు రాజైనాడు. మాయావి అనే వాడికి మా అన్నతో వైరం. ఒకనాటి అర్ధరాత్రి మాయావి కిష్కింధకు వచ్చి వాలిని యుద్ధానికి ఆహ్వానించాడు. మేమెంతగా వారించినా వాలి వినకుండా వానితో పోరుకు సిద్ధమయ్యాడు. మమ్ములను చూడగానే మాయావి భయంతో వెనుదిరిగి పిక్కబలంచూపాడు. మేము వెంబడించాం. అతడు ఒక పెద్ద భూగృహంలోకి వెళ్ళాడు. వాలి ఆవేశంతో ఊగిపోతున్నాడు. నన్ను బిలద్వారం దగ్గరే ఉండమన్నాడు. మాయావిని చంపి వస్తానని వెళ్లాడు. సంవత్సరమైంది. అన్నజాడేలేదు. నా ఆశలు అడుగంటాయి. ఆందోళన ఎక్కువైంది. ఇంతలో నురుగుతోకూడిన రక్తం గుహలో నుంచి బయటకు వస్తున్నది. లోపల రాక్షసునివి, అన్నగారి అరుపులు వినిపిస్తున్నాయి. మాయావిచేతిలో మా అన్న చనిపోయాడనుకున్నాను. రాక్షసుడు బయటకు వస్తాడేమోనని కొండంత బండతో బిలద్వారాన్ని మూసేశాను. మౌనంగా కిష్కింధకు వచ్చాను. మంత్రులు నా ద్వారా సమాచారాన్ని రాబట్టారు. బలవంతంగా నన్ను రాజును చేశారు. కొంతకాలానికి వాలి వచ్చాడు. నన్ను రాజును చేయడం చూసి కనులెర్రజేశాడు, నా కుమారులను చెరసాలలో బంధించాడు. ఎంత బతిమాలినా క్షమించలేదు. సరికదా నన్ను రాజ్యభ్రష్టుణ్ణి చేయడమేకాదు. నా భార్య రుమను అపహరించాడు. ప్రాణభీతితో పరుగులుతీశాను. సమస్త భూమండలం తిరిగాను. చివరకు ఈ ఋష్యమూక పర్వతాన్ని చేరుకున్నాను. మతంగముని శాపం కారణంగా వాలి ఇక్కడకు రాలేదు. వాలి దుందుభి అనే రాక్షసుణ్ణి చంపి విసరివేసినప్పుడు ఆ రాక్షసుడి నోటినుండి రక్త బిందువులు మతంగాశ్రమం మీద పడ్డాయి. అందుకు కోపించిన ముని ఋష్యమూక పర్వతం మీద కాలుపెడితే వాలి మరణిస్తాడని శపించాడు" అంటూ సుగ్రీవుడు తన కథనంతా చెప్పాడు.



SCERT TELANGANA

శ్రీరాముని బలమెలాంటిదో తెలుసుకోవాలనుకున్నాడు సుగ్రీవుడు. దానికి జవాబుగా శ్రీరాముడు కాలి బొటనవేలితో అక్కడ పడి ఉన్న దుందుభి అస్థిపంజరాన్ని పదియోజనాల దూరం పడేటట్లు చిమ్మివేశాడు. ఒకే బాణంతో ఏడు మద్దిచెట్లను చీల్చాడు. సంతోషించాడు సుగ్రీవుడు.

వాలి వధకు ఇక ఏ మాత్రం ఆలస్యం వద్దని శ్రీరాముణ్ణి తొందరపెట్టాడు. అందరూ కిష్కింధకు వెళ్ళారు. సుగ్రీవుడు భయంకరంగా గర్జిస్తూ వాలిని యుద్ధానికి ఆహ్వానించాడు. మహాబలశాలి అయిన వాలి క్షణాలలో అక్కడ వాలాడు. ఇద్దరి యుద్ధం అక్కడ భయానక వాతావరణాన్ని సృష్టించింది. వాలిసుగ్రీవులు ఒకే పోలికతో ఉన్నారు. అందుకే శ్రీరాముడు వాలిని స్పష్టంగా గుర్తించలేకపోయాడు. వాలి విజృంభణకు తట్టుకోలేకపోయాడు సుగ్రీవుడు. శ్రీరాముని కొరకు చూశాడు. కనిపించలేదు. గుండెగుభేలుమంది. ప్రాణభయంతో ఋష్యమూకానికి పరుగులుతీశాడు సుగ్రీవుడు. అక్కడకు వెళ్ళలేని వాలి సుగ్రీవుడితో 'బతికావు పో' అని మరలిపోయాడు.

లక్ష్మణ హనుమంతులతో కూడి శ్రీరాముడు సుగ్రీవుని దగ్గరికి వచ్చాడు. సుగ్రీవుడు సిగ్గుతో తల దించుకున్నాడు. "నీ సూచన పాటించినందుకు ఫలితమిదేనా?" అని ప్రశ్నించాడు. శ్రీరాముడు అసలు విషయం చెప్పాడు. సుగ్రీవుణ్ణి గుర్తించడానికి వీలుగా 'నాగకేసరపులత'ను మెడలో వేయమని లక్ష్మణుడికి చెప్పాడు. అన్న ఆజ్ఞను వెంటనే అమలుచేశాడు లక్ష్మణుడు. పూలతో నిండిన ఆ లతను ధరించి సుగ్రీవుడు తిరిగి యుద్ధానికి సన్నద్ధమయ్యాడు.

కిష్కింధకు ప్రయాణమయ్యారందరూ. సుగ్రీవుడు వాలిని మళ్ళీ యుద్ధానికి ఆహ్వానించాడు. వాలి అడుగుముందుకు వేశాడు. కాని అతని భార్య తార అడ్డుపడింది. ఒకసారి ఓడిపోయి దెబ్బలు తిన్న సుగ్రీవుడు మళ్ళీ ఆహ్వానించడం వెనుక ఏదో ఆంతర్యం ఉందని అభిప్రాయపడింది. సుగ్రీవుడికి శ్రీరాముడు అండగా ఉన్నాడన్న విషయాన్ని ప్రస్తావించింది. యుద్ధానికి వెళ్ళడం క్షేమంకాదని వారించింది. తారమాటలను పెడచెవిన పెట్టాడు వాలి. యుద్ధదిశగా అడుగులు వేశాడు.

వాలిసుగ్రీవుల పోరు తీవ్రంగా సాగుతున్నది. రక్తం కారుతున్నా పట్టించుకునే స్థితిలో లేరు వాళ్ళిద్దరూ. మెల్లమెల్లగా సుగ్రీవుని శక్తి సన్నగిల్లుతున్నది. మాటిమాటికి దిక్కులు చూస్తున్నాడు. అతని ఆంతర్యం అర్థమైంది శ్రీరామునికి. విషసర్పంతో సమానమైన బాణాన్ని అతడు వాలిమీదకు వదిలాడు. అది క్షణాలలో వాలి వక్షఃస్థలంలో నాటుకున్నది. వాలి నేలమీదికి వాలిపోయాడు. స్పృహకోల్పోయాడు. రక్తపుమడుగులో పడి ఉన్న వాలి కొంతసేపటికి తేరుకున్నాడు. రామలక్ష్మణులను చూశాడు. శ్రీరామునితో "ఉత్తముడని పేరుపొందిన నీవు ఇంత అధర్మంగా ఎందుకు ప్రవర్తించావు? నీకు నీ దేశానికి నేనెన్నడూ అపకారం చేయతలపెట్టలేదు. అలాంటప్పుడు నన్నెందుకు చంపవలసివచ్చింది. నిన్ను ఎదిరించి యుద్ధమే చేయలేదు. వేరొకరితో పోరుతున్నప్పుడు ఎందుకు దొంగదెబ్బ తీశా"వని నిలదీశాడు. సీతాదేవి కొరకు సుగ్రీవుణ్ణి ఆశ్రయించడంకన్నా తనను కోరిఉంటే బాగుండేదన్నాడు. ఒక్కరోజులో సీతాదేవిని తెచ్చి అప్పజెప్పే వాడనని పలికాడు. రావణుణ్ణి యుద్ధంలో బంధించి తెచ్చి ముందుంచే వాడినని తెలిపాడు.

శ్రీరాముడు వాలి అభిప్రాయాలను తోసేశాడు. తమ్ముడి భార్యను చెరపట్టడం వంటి అధర్మాలకు ఒడిగట్టినందువల్ల నేను నీకు మరణదండన విధించానన్నాడు శ్రీరాముడు. వానరుడివి కనుక చాటుగా ఉండి చంపడంలో తప్పులేదన్నాడు.

శ్రీరాముని మాటలు విన్న వాలి తన తప్పును తెలుసుకున్నాడు. మన్నించమని దోసిలొగ్గాడు. భర్త విషయం తెలుసుకున్న తార పరుగుపరుగున వచ్చింది. మరణవేదనతో కింద పడి ఉన్న వాలి దీనస్థితిని చూసింది. గుండె చెరువయ్యేటట్లు ఏడ్చింది. ప్రాయోపవేశానికి సిద్ధపడిన తారను హనుమంతుడు ఓదార్చాడు. తార, అంగదుల బాధ్యతను సుగ్రీవునకు వాలి అప్పజెప్పాడు. తనమెడలోని దివ్యమైన సువర్ణమాలను సుగ్రీవునకిచ్చి వెంటనే ధరించమన్నాడు. లేకుంటే వాలి చనిపోయిన మరుక్షణమే ఆ మాలకున్న శక్తి నశిస్తుంది. కొడుకైన అంగదుడికి జీవితంలో ఎలా నడచుకోవాలో ఉపదేశించాడు. బాణం వల్ల కలుగుతున్న బాధ అంతకంతకూ అధికమై ప్రాణాలను వదిలాడు. వాలి జీవితాధ్యాయం ముగిసింది.

SCERT, TELANGANA

సుగ్రీవ హనుమదాదులు శ్రీరాముని దగ్గరికి వచ్చారు. హనుమంతుడు శ్రీరామునితో సుగ్రీవుని పట్టాభిషేక విషయం ప్రస్తావించాడు. దీనికోసం కిష్కింధకు రమ్మని ప్రార్థించాడు. తండ్రి ఆజ్ఞమేరకు పద్నాలుగు సంవత్సరాల వరకు ఏ గ్రామంలోగాని నగరంలోగాని తాను అడుగుపెట్టనని చెప్పి పితృవాక్య పరిపాలనను మరోమారు చాటుకున్నాడు శ్రీరాముడు. సుగ్రీవునికి శుభం పలికాడు. తాను ప్రసవణగిరి మీద ఉంటానన్నాడు. వర్షాకాలం పోయాక సీతాన్వేషణ ప్రయత్నం ప్రారంభించమని సుగ్రీవుణ్ణి ఆదేశించాడు. సరేనన్నాడు సుగ్రీవుడు.

కిష్కింధకు రాజుగా సుగ్రీవుడు, యువరాజుగా అంగదుడు పట్టాభిషిక్తులయ్యారు. కాలం గడుస్తూన్నది. శరత్కాలం వచ్చింది. సీతాన్వేషణ కార్యభారాన్ని సుగ్రీవుడికి గుర్తుచేశాడు హనుమంతుడు. తదనుగుణంగా సేనలను సమీకరించమని సేనాపతి అయిన 'నీలుణ్ణి' ఆజ్ఞాపించాడు సుగ్రీవుడు. ఇది శ్రీరామునికి తెలియదు. లక్ష్మణుణ్ణి పిలిచి సుగ్రీవుని దగ్గరికి వెళ్ళమన్నాడు.

లక్ష్మణుడు కిష్కింధకు పయనమయ్యాడు. సుగ్రీవుడు రాజభోగాలలో ఓలలాడుతున్నాడు. సీతాదేవి ఎడబాటువల్ల నిలువునా నీరవుతున్న అన్నగారు, నిర్లక్ష్యంతో సుగ్రీవుడు – లక్ష్మణునికి ఆగ్రహం కట్టలు తెంచుకుంది. బుసలు కొడుతున్నాడు. అతని ముందుకు రావడానికి ఎవరికీ కాళ్ళాడడంలేదు. వానరులూ, మంత్రులేకాదు – సుగ్రీవుడి పరిస్థితీ అంతే. మందిర ద్వారం దగ్గరికి వచ్చిన లక్ష్మణుడితో మాట్లాడటానికి తార వెళ్ళింది. స్త్రీలపట్ల కోపం ప్రదర్శించగూడదని శాంతించాడు లక్ష్మణుడు. సుగ్రీవుడు సీతాన్వేషణకు శ్రీకారం చుట్టాడని తార లక్ష్మణునికి తెలిపింది. అంతఃపురంలో ఉన్న సుగ్రీవుణ్ణి కలిశాడు లక్ష్మణుడు. శ్రీరాముని దయవల్లనే తానీ స్థితిలో ఉన్నానని కృతజ్ఞత ప్రకటించాడు సుగ్రీవుడు. మహా పరాక్రమశాలి శ్రీరామునికి తన సహాయం నిమిత్తమాత్రమేనన్నాడు. తనవైపునుంచి ఏదైనా తప్పు జరిగితే మన్నించమన్నాడు. లక్ష్మణుడు శాంతించాడు. తన అన్నగారి దగ్గరికి సుగ్రీవుణ్ణి రమ్మన్నాడు.

సుగ్రీవుడు వివిధ ప్రాంతాలలోగల వానర వీరులను రావలసిందిగా చెప్పమని హనుమంతుణ్ణి ఆజ్ఞాపించాడు. పదిరోజుల్లోగా రాకపోతే వాళ్ళకు మరణదండన తప్పదని హెచ్చరించాడు. హనుమంతుడు ఈ వార్తను అన్ని దిక్కులకూ వేగంగా పంపాడు. ఫలితంగా కోట్లమంది వానరయోధులు కిష్కింధకు చేరుకుంటున్నారు. (సుగ్రీవుడిని ఆజ్ఞ అటువంటిది. దానికి తిరుగులేదు. అందుకే 'సుగ్రీవాజ్ఞ' అనేది జాతీయంగా స్థిరపడ్డది.)

శ్రీరామునితో సుగ్రీవుడు సమావేశమయ్యాడు. వానరుల రాకను గురించి తెలిపాడు. సీతజాడను తెలుసుకోవడం, రావణుడి నివాసాన్ని పసిగట్టడమే ప్రధానకర్తవ్యమన్నాడు శ్రీరాముడు. శ్రీరాముని సూచన మేరకు సీతాన్వేషణకోసం వానర వీరులను నలుదిక్కులకు పంపాడు. తూర్పు దిక్కునకు 'వినతుని' నాయకత్వంలో సేనను పంపాడు. దక్షిణ దిక్కుకు అంగదుని నాయకత్వంలో హనుమంతుడు, జాంబవంతుడు మొదలైన ప్రముఖులతో కూడిన సేనను పంపాడు. మేనమామ అయిన సుషేణుని నాయకత్వంలో పడమరకు, శతబలి నాయకత్వంలో ఉత్తర దిశకు సేనను పంపాడు. ఒక్కొక్క దిక్కుకు ఏయే ప్రదేశాలగుండా వెళ్లాలో, అక్కడ ఏమేమి ఉంటాయో వివరంగా చెప్పాడు సుగ్రీవుడు. ఆ ప్రదేశాలకు సంబంధించిన అతని జ్ఞానం చూస్తే ముక్కున వేలేసుకుంటాం. నెలరోజుల్లో సమాచారం తెమ్మని సుగ్రీవాజ్ఞ. సీతాన్వేషణను సఫలం చేయగల సమర్థుడు హనుమంతుడేనని సుగ్రీవుని నమ్మకం. హనుమంతుడూ అంతే విశ్వాసంతో ఉన్నాడు. శ్రీరాముని భావనకూడా అదే. అందుకే తనపేరు చెక్కబడిన ఉంగరాన్ని



SCERT, TELANGANA

హనుమంతుడికి ఇచ్చాడు శ్రీరాముడు. సీత దీన్ని చూస్తే హనుమను రామదూతగా నమ్ముతుందన్నాడు. హనుమంతుడు నమస్కరించి రామముద్రికను గ్రహించాడు. శ్రీరాముని పాదాలకు ప్రణమిల్లి ప్రయాణమయ్యాడు.

సీతాన్వేషణకు బయలుదేరి నెలరోజులు కావస్తున్నది. తూర్పు, పడమర, ఉత్తర దిక్కులకు వెళ్ళినవాళ్ళు తీవ్రంగా వెదికి వెదికి రిక్తహస్తాలతో వెనుదిరిగారు. గడువు ముగిసేనాటికి ప్రసవణగిరిలో శ్రీరామునితో ఉన్న సుగ్రీవుడి దగ్గరికి చేరుకున్నారు. సీతజాడ కోసం చేసిన కృషి ఫలించలేదని విన్నవించుకున్నారు. హనుమంతుడు ఈ విషయంలో కృతకృత్యుడౌతాడని ధీమా వ్యక్తంచేశారు. ఎందుకంటే రావణుడు సీతను తీసుకెళ్ళింది దక్షిణంవైపే గదా.

అంగదుని నాయకత్వంలో దక్షిణం వైపుకు బయలుదేరిన హనుమంతుడు మొదలైనవాళ్ళు అణువణువునా గాలిస్తున్నారు. సుగ్రీవుడిచ్చిన గడువు పూర్తయింది. ఏం చేయాలో తోచడం లేదు. తమ వాళ్ళు నిరాశ పడకుండా జాగ్రత్తపడ్డాడు అంగదుడు. విరక్తి పొందకుండా ధైర్యోత్సాహాలతో ముందుకు సాగితే విజయం వరిస్తుందని ప్రేరేపించాడు. అందరూ రెట్టించిన ఉత్సాహంతో ముందుకు కదిలారు.

హనుమదాదులు ఒక పెద్ద గుహదగ్గరికి చేరుకున్నారు. అది 'ఋక్షబిలము'. ఒక రాక్షసుని అధీనంలో ఉంది. బాగా అలసిపోయిన వానరులను ఆకలిదప్పులు పట్టి పీడిస్తున్నాయి. గుహలోకి వెళ్ళారు. అంతా అయోమయంగా ఉంది. చివరకు స్వయంప్రభ అనే యోగిని అనుగ్రహంతో ఆకలిదప్పులను తీర్చుకున్నారు. ఆమెను ప్రార్థించి ఆమె తపః ప్రభావం వల్ల క్షణాలలో ఒక పెద్దసముద్రపు ఒడ్డుకు చేరుకున్నారు. ఆ సముద్రం 'మహోదధి'. ఉవ్వెత్తున లేచే అలల అలజడి భయాన్ని కలిగిస్తున్నది.

సముద్రతీరంలో వానరులంతా సమావేశమయ్యారు. ఏం చెయ్యాలో తీవ్రంగా చర్చించుకుంటున్నారు. సీత జాడ కనిపెట్టకుండా సుగ్రీవుని చేరరాదనుకున్నారు.

వీళ్ళ మాటల్లో 'జటాయువు' ప్రస్తావన వచ్చింది. అది విన్నాడు 'సంపాతి'. ఇతడు పక్షిరాజు, జటాయువుకు అన్న. రెక్కలులేక పడి ఉన్నాడు. సంపాతి తన సోదరుడి మరణానికి ఎంతో విలపించాడు. లంకలో సీత ఉన్న పరిస్థితులను దివ్యదృష్టితో చూసి కళ్ళకుకట్టినట్లు వివరించాడు. లంకకు ఎలా వెళ్లాలో చెప్పాడు. ఇంతలో ఆశ్చర్యకరంగా సంపాతికి రెక్కలు మొలిచాయి. (పరోపకారపుణ్యం ఊరికేపోతుందా?) అందరూ ఆనందించారు. తన రెక్కల బలాన్ని తెలుసుకోవడానికి రివ్వున ఆకాశంలోకి ఎగిరాడు సంపాతి.

వానర వీరులు బలపరాక్రమాలను ప్రదర్శించడం ద్వారానే సీతాన్వేషణ సఫలమౌతుందన్న నిశ్చయానికి వచ్చారు. కాని వంద యోజనాలు వెళ్ళి రాగలవారెవ్వరని తర్కించుకుంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కార్యహాని కలగకుండా కాపాడగలవాడు హనుమంతుడొక్కడేనని నిగ్గుదేల్చాడు జాంబవంతుడు. ఆ సమయంలో హనుమంతుడు ఒకచోట ఏకాంతంగా కూర్చుని ఉన్నాడు.

జాంబవంతుడు హనుమంతుణ్ణి చేరాడు. అతని శక్తియుక్తులెంతటివో తెలుపుతూ ప్రేరేపించాడు. దీనికి వానరుల ప్రశంసలు తోడైనాయి. ఇంకేముంది? హనుమంతుడు రెట్టించిన ఉత్సాహంతో బలాన్ని పుంజుకున్నాడు. అద్భుతమైన తేజస్సుతో వెలుగుతున్నాడు. వానరులతో "నేను మేరుపర్వతాన్ని అనాయాసంగా వేలమార్లు చుట్టగలిగాను భూమండలాన్ని సముద్రంలో ముంచగలను, గ్రహ నక్షత్రాలను అధిగమించగలను, పర్వతాలను నుగ్గు నుగ్గు చేయగలను. మహాసముద్రాలను అవలీలగా దాటగల"నని ఆత్మశక్తిని ప్రకటించాడు. (ప్రతివారిలో ఏదో ఒక శక్తి ఉంటుంది. సరైన ప్రేరణ దొరికితే అది వెలికి వస్తుంది.)

హనుమంతుని మాటలకు జాంబవంతుడు ఆనందించాడు. "నాయనా! నీ ధైర్యోత్సాహాలకు తగినట్లు మాట్లాడావు. నీ మాటలు వానరుల మనసులో గూడుకట్టుకున్న దుఃఖాన్ని దూరం చేశాయి. అందరం నీ శుభాన్ని కోరుతున్నాం. ఋషులు, వృద్ధవానరులు, గురువుల అనుగ్రహంతో ఈ సముద్రాన్ని లంఘించు. నీ రాకకోసం ఎదురుచూస్తుంటాం. మన వానరుల ప్రాణాలన్నీ నీపైనే ఆధారపడివున్నా"యని తెలిపాడు. తాను లంఘించే సమయంలో తన బలాన్ని భూమి భరించలేదని, మహేంద్రపర్వత శిఖరాలు అందుకు తగినవని హనుమంతుడు పలికి మహేంద్రగిరికి చేరాడు.



SCERT, TELANGANA



# సుందర కాండం



మహాబలుడైన మారుతి సూర్యునికి, మహేంద్రునికి, వాయువుకు, బ్రహ్మకు, ఇతరదేవతలకు నమస్కరించాడు. తన శరీరాన్ని పెంచాడు. ఒళ్ళువిరిచాడు. ప్రళయకాల మేఘగర్జనలా మహానాదంచేశాడు. చేతులను నడుముమీద ఉంచాడు. పాదాలను దట్టించాడు. చెవులను రిక్కించాడు. తోకను విదల్చాడు. అంగదాది మహావీరులతో, "వాయువేగంతో సాగిపోయే రామబాణంలాగ లంకకు వెళతాను. అక్కడ సీతామాతను చూడలేకుంటే అదే వేగంతో స్వర్గానికి వెళ్ళటం. అక్కడ కూడా సీతామాత దర్శనం కాకుంటే రావణుని బంధించి తీసుకువస్తా. ఏది ఏమైనా కార్యసఫలతతో తిరిగివస్తా"నని పలికాడు. ఒక్క ఉదుటున అంతరిక్షంలోకి ఎగిరాడు. శ్రీరామకార్యమునకు వెళుతున్న హనుమంతునికి సూర్యుడు తాపాన్ని కలిగించలేదు. వాయువు చల్లగా ప్రసరించాడు. దేవతలు, గంధర్వులు, మహర్షులు కీర్తించారు.

సముద్రముపై సాగిపోతున్న హనుమంతుణ్ణి చూసి సాగరుడు సహాయపడదలచాడు. తానింతవాడు కావడానికి ఇక్ష్వాకు ప్రభువైన సగరుడేకారణమని సాగరుని అభిప్రాయం. ఆ ఇక్ష్వాకు కులతిలకుడైన శ్రీరాముని కార్యంకోసం వెళుతున్న హనుమంతునికి శ్రమ కలగకూడదనుకున్నాడు. సముద్రంలో ఉన్న మైనాకుణ్ణి బయటకు రమ్మన్నాడు. అతని బంగారు గిరిశిఖరాలమీద హనుమంతుడు ఒకింతసేపు విశ్రాంతి తీసుకోగలడని భావించాడు. మైనాకుడు సరేనన్నాడు. ఒక్కసారిగా సముద్రంమధ్యనుంచి పైకి లేచాడు. అకస్మాత్తుగా పైకి లేచిన మైనాకుణ్ణి తనకు ఆటంకంగా తలచాడు మారుతి. తన ఎదతో నెట్టివేశాడు. మైనాకుడు అబ్బురపడ్డాడు. మానవరూపంలో గిరిశిఖరం మీద నిలచాడు. సముద్రుని కోరికను తెలిపాడు. హనుమంతుడు మైనాకునితో "నీ ఆదరపూర్వకమైన మాటలకు తృప్తిపడ్డాను. ఆతిథ్యం అందుకున్నట్లే భావించు. సమయంలేదు. ఆగడానికి వీలులేదు" అని చెప్పి చేతితో అతణ్ణి తాకాడు. ఆతిథ్యం గ్రహించినట్లుగా తెలిపి ముందుకుసాగాడు.

హనుమంతుణ్ణి పరీక్షించడానికి వచ్చిన 'సురస' అనే నాగమాత అతని సూక్ష్మబుద్ధిని, సమయస్ఫూర్తిని చూసి ఆనందించి ఆశీర్వదించింది. 'సింహిక' అనే రాక్షసి హనుమంతుని మింగాలని చూసింది. కాని హనుమంతుడే తన వాడి అయిన గోళ్ళతో సింహికను చీల్చేశాడు.

త్రికూట పర్వతంమీదున్న లంకకు చేరాడు హనుమంతుడు. నూరు యోజనాలు ప్రయాణించినా అణుమాత్రమైనా అలసిపోలేదు. శత్రుదుర్భేద్యమైన లంకను చూశాడు. అందులో ప్రవేశించడానికి రాత్రి సమయమే అనుకూలమనుకున్నాడు. అంతవరకు వేచి ఉన్నాడు. రాత్రికాగానే పిల్లి ప్రమాణంలోకి తన శరీరాన్ని కుదించుకుని లంకలోకి ప్రవేశించాడు. ఇంతలో లంకాధిదేవత (లంకిణి) అతన్ని చూసింది. "నీవెవరు? ఎందుకొచ్చా"వని నిలదీసింది. యథార్థం చెప్పమని గద్దించింది. తనను కాదని లంకలో ప్రవేశించడం సాధ్యంకాదన్నది. తన చేతిలో చావు తప్పదని హనుమంతుణ్ణి బెదిరించింది. హనుమంతుడు "లంకానగరం అందంగా ఉంటుందని విన్నాను. ఒకసారి చూసిపోవాలని వచ్చాను. చూశాక వచ్చిన దారినే వెళతా"నని చెప్పాడు. లంకిణి భయంకరంగా అరుస్తూ తన అరచేతితో హనుమంతుని బలంగా కొట్టింది. హనుమంతుడు మహానాదం చేస్తూ ఎడమచేతితో

SCERT TELANGANA

లంకిణిపై ఒక్కదెబ్బవేశాడు. స్త్రీ అని గట్టిగా కొట్టలేదు. కాని ఆమాత్రం దెబ్బకే కూలబడిపోయింది లంకిణి. బ్రహ్మవరం జ్ఞాపకం చేసుకుంది. ఒక వానరుడు వచ్చి లంకిణిని జయించినప్పుడు రాక్షసులకు కీడుమూడుతుందని బ్రహ్మ చెప్పాడు. ఆ సమయం ఆసన్నమైందని హనుమంతునితో పలికింది. లంకలోకి వెళ్ళమని చెప్పింది.

హనుమంతుడు ముఖద్వారం గుండా లంకలోకి వెళ్ళలేదు. ప్రాకారంపై నుండి దూకి వెళ్ళాడు. అది కూడా ఎడమ పాదం ముందుబెట్టి. (శత్రువుల వద్దకు వెళ్ళే సంప్రదాయం ఇది.) లంకలో ప్రవేశించిన మారుతి చిత్రవిచిత్రాలైన ఇండ్లను చూశాడు. సంగీత మాధుర్యాన్ని చవిచూశాడు. వేదఘోషను విన్నాడు. రకరకాల వాళ్ళను చూశాడు. సర్వాంగ సుందరమైన రావణుని భవనాన్ని చూశాడు. ఎక్కడా సీత జాడ కనిపించలేదు. మహాపార్శ్వ, కుంభకర్ణ, విభీషణ, మహోదర, విరూపాక్ష, విద్యుజ్జిహ్వాదుల భవనాలన్నీ వెతికాడు.

రావణాంతఃపురంలోకి వెళ్ళాడు. ఎందరో స్త్రీలు చెల్లా చెదరుగా పడుకొని నిద్రపోవడం చూశాడు. ప్రత్యేక శయ్యపై పవళించిన ఒక స్త్రీని చూశాడు. మహా సౌందర్యంతో వెలిగిపోతున్న ఆమె రావణుని భార్య మండోదరి. కాని హనుమంతుడు సీత అని భ్రమించాడు. సీతను చూశాననుకొని గంతులు వేశాడు. కొద్దిసేపటికే తన ఆలోచన తప్పని గ్రహించాడు. శ్రీరాముని ఎడబాసి సీత ఇలా ఉండగలుగుతుందా? అని అనుకున్నాడు. ఆమె సీతకానేకాదని నిశ్చయించుకున్నాడు.

ఎక్కడా సీత జాడ తెలియకపోయేసరికి సీత మరణించిదేమోనని సందేహించాడు హనుమంతుడు. సీత జాడను కనిపెట్టలేకపోయిన తాను ఏ ముఖం పెట్టుకుని తిరిగివెళ్ళాలని బాధపడ్డాడు. అయినా నిరుత్సాహపడగూడదని నిర్ణయించుకున్నాడు. ఇంత వరకు వెతకని ప్రాంతాలకు వెళ్ళాలని తీర్మానించుకున్నాడు. ఎక్కడకు వెళ్ళినా నిరాశే కలుగుతున్నది. సీత కనబడలేదని చెపితే శ్రీరాముడు జీవించడు. అతడు లేక లక్ష్మణుడుండడు. వీరి మరణ వార్త విని భరత శత్రుఘ్నులుండరు. పుత్రుల మరణానికి తట్టుకోలేక కౌసల్యా సుమిత్రా కైకేయీ తనువులు చాలిస్తారు. ప్రియమిత్రుణ్ణి వీడి సుగ్రీవుడు బతకడు. దానితో రుమ, తార, అంగదుడు మిగులరు. ఇది చూసి వానరజాతి ఈ లోకాన్ని వీడుతుంది. ఇందరి మరణానికి కారణం కావడంకన్నా ప్రాయోపవేశంతో ప్రాణాలు వదలడమే మంచిదనిపించింది మారుతికి. కాని తర్కించి చూస్తే ఆత్మహత్యకన్నా బతికుండడమే ఎన్నో విధాల ఉత్తమమనిపించింది. చచ్చి సాధించేదేమిటి? బతికితే సుఖాలను, శుభాలను పొందవచ్చు. బతికి ఉన్నవాళ్ళు ఎన్నడైనా కలుసుకోవచ్చు. అందుకే ప్రాణాలను నిలుపుకోవాలని నిర్ణయించుకున్నాడు.

అప్పటివరకు వెతకని అశోకవనంలోకి వెళ్ళాలనుకున్నాడు హనుమంతుడు. సీతారామలక్ష్మణులకు, రుద్ర, ఇంద్ర, యమ, వాయుదేవులకు సూర్యచంద్ర మరుద్గణాలకు నమస్కరించాడు. అశోకవనంలోకి అడుగుపెట్టాడు. ఇంద్రుని నందనవనం లాగా ఉంది అశోకవనం.

అణువణువునా వెదికాడు హనుమంతుడు. ఎత్తైన శింశుపావృక్షాన్ని ఎక్కాడు. దానికింద మలిన వస్త్రాలను కట్టుకొని ఉన్న ఒక స్త్రీని చూశాడు. ఆమె చుట్టూ రాక్షసస్త్రీలున్నారు. ఆమె కృశించి ఉంది. దీనావస్థలో ఉంది. ఆమె సీతే అనిపించింది హనుమంతునికి. ఆమె ధరించిన ఆభరణాలను చూశాడు. రాముడు చెప్పిన వాటితో సరిపోలాయి. ఋష్యమూక పర్వతంమీద పడిన ఆభరణాలు ఆమె శరీరంపై కనిపించడంలేదు. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకొని ఆమె సీతే అని ధ్రువపరచుకున్నాడు. ఆ వృక్షంపైనే ఉండిపోయాడు.

సీతాదేవిని చూడగానే హనుమంతుని కన్నుల నుండి ఆనందాశ్రువులు జారాయి. శ్రీరాముని స్మరించుకొని నమస్కరించాడు.

వేకువజామయింది. వేదఘోషలు వినబడుతున్నాయి. నిద్రలేచిన రావణుడు అశోకవనంవైపు అడుగులు వేస్తున్నాడు. సుగంధతైలాలతో తడిసి ఉన్న కాగడాలను ధరించిన స్త్రీలు ముందు నడుస్తున్నారు. రావణుని తేజస్సు చూసి ఆశ్చర్యచకితుడయ్యాడు హనుమంతుడు. సీత దగ్గరికి వచ్చి రావణుడు నయానా భయానా సీత మనసుమార్చే ప్రయత్నం చేశాడు. కాని ఎలాంటి ప్రలోభాలకు తాను లొంగనని సీత తేల్చిచెప్పింది. శ్రీరాముని నుంచి తప్పించుకోవడం సాధ్యంకాదని హెచ్చరించింది. రావణునిలో

SCERT TELANGANA

ఆవేశం పెల్లుబికింది. రెండు నెలల గడువు విధించాడు. ఎలాగైనా సీతను తన దారికి తెమ్మని రాక్షస స్త్రీలను ఆదేశించి తన భవనానికి చేరుకున్నాడు.

రాక్షస స్త్రీలు ఎన్నో రకాలుగా సీతకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఆమె నిరాకరించింది. చివరకు సీతను చంపుతామని భయపెట్టారు. ఈ దుఃస్థితికి సీత ఎంతో విలపించింది. శ్రీరామునికి దూరమై బతకడంకన్నా శరీరాన్ని విడవడమే మేలన్నది.

ఈ మాటలను విని కొందరు రాక్షస స్త్రీలు రావణుడికీ ఈ విషయం చెప్పడానికి వెళ్ళారు. ఇంకొందరు తక్షణమే సీతను బంధించగలమన్నారు. అంతవరకు నిదురించిన త్రిజట అప్పుడే మేల్కొంది. త్రిజట విభీషణుని కూతురు. రాక్షస స్త్రీలను అదలించింది. తనకు వచ్చిన కలను చెప్పింది. "వేయి హంసలతో కూడిన పల్లకిమీద లక్ష్మణుడితో శ్రీరాముడు కూర్చునట్లు చూశాను. సముద్రం మధ్య ఒక తెల్లని పర్వతంమీద సీత కూర్చోవడం చూశాను. నూనెపూసిన శరీరంతో రావణుడు నేలమీద పడిఉండడం చూశాను. ఒక నల్లని స్త్రీ శరీరమంతా బురద పూసుకొని ఎర్రని వస్త్రములు కట్టి, రావణుని మెడకు తాడుకట్టి దక్షిణంవైపుగా ఈడ్చుకువెళ్ళడం చూశాను. వరాహం మీద రావణుడు, మొసలిమీద ఇంద్రజిత్తూ, ఒంటెమీద కుంభకర్ణుడు దక్షిణదిశగా వెళ్ళడం చూశాను. లంక ఛిన్నభిన్నం కావడం చూశాను" అన్నది. స్వప్నంలో విమానదర్శనం కావడాన్ని బట్టి సీత కోరిక సిద్ధిస్తుందని, రావణునికి వినాశం తప్పదని, శ్రీరామునికి జయం కలుగుతుందనీ చెప్పింది.

ప్రాణత్యాగానికి సిద్ధపడ్డ సీతకు శుభశకునాలు తోచాయి. చెట్టుపైన ఉన్న హనుమంతుడు సీతాదేవిని ఎలా కాపాడుకోవాలో అని మథనపడ్డాడు. రామకథాగానమే సరైన మార్గమని ఎంచుకున్నాడు. సీతాదేవికి వినపడేటట్లు రామకథను వర్ణించాడు. సీతాదేవి అన్నివైపులా చూసింది. చెట్టుమీదున్న హనుమంతుణ్ణి చూసి ఆశ్చర్యానికి లోనైంది. హనుమంతుడు చెట్టుదిగి నమస్కరించాడు. "అమ్మా నీవెవరు? ఒకవేళ సీతాదేవివే అయితే శుభమగుగాక. దయతో విషయాలు చెప్పు"మని ప్రార్థించాడు. తనను 'సీత' అంటారని తెలిపిందా సాధ్వి – తన వృత్తాంతమంతా వివరించింది.



హనుమంతుడు తాను శ్రీరామ దూతనని చెప్పుకొన్నాడు. దగ్గరగా వస్తున్న మారుతిని చూసి రావణునిగా అనుమానించింది సీత. నిజంగా రామదూతవే అయితే రాముణ్ణి గురించి వినిపించమంది. సీత కోరికపైన హనుమంతుడు శ్రీరాముని రూపగుణాలను వివరించాడు. శ్రీరాముని ముద్రికను సమర్పించాడు. దాన్ని చూసి పరమానందభరితురాలైంది సీత. తనదైన్యాన్ని వివరించి శ్రీరాముణ్ణి త్వరగా లంకకు తీసుకువచ్చి రాక్షసుల చెరనుండి తనను విడిపించమని మారుతితో చెప్పింది. అంతదాకా ఎందుకు? తన వీపుమీద కూర్చుంటే తక్షణమే శ్రీరాముని సన్నిధికి చేరుస్తానన్నాడు హనుమంతుడు. ఇంత చిన్నవాడివి ఎలా తీసుకెళ్ళగలవని ప్రశ్నించింది సీత. హనుమంతుడు తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. సంతోషించింది సీత. అయినా హనుమతో వెళ్ళడానికి నిరాకరించింది. పరపురుషుని తాకనన్నది. శ్రీరాముడు రావణుణ్ణి సంహరించి తనను తీసుకుపోవడమే ఆయన స్థాయికి తగినదన్నది.

SCERT TELANGANA

"అమ్మా! నా వెంట రావడం నీకు అంగీకారయోగ్యం కాకుంటే శ్రీరాముడు గుర్తించగల ఏదైనా ఆనవాలు ఇ"మ్మని అడిగాడు హనుమంతుడు. తమ అనుబంధానికి గుర్తుగా కాకాసురుని కథ చెప్పింది. కొంగుముడి విప్పి అందులోని దివ్యచూడామణిని హనుమంతునికిచ్చింది.

సీతాదేవి దర్శనంతో ప్రధాన కార్యం ముగిసింది హనుమంతునికి. రావణుడు, అతని సైన్యపు శక్తిసామర్థ్యాలను కూడా తెలుసుకోవాలనిపించింది. అందుకు అశోకవనాన్ని ధ్వంసం చేయడమే మార్గంగా భావించాడు. అనుకున్నంతా చేశాడు ఆ కపివీరుడు. రాక్షస స్త్రీలు పరుగుపరుగున వెళ్ళి లంకేశునికీవిషయం చెప్పారు. రావణుడు ఎనభైవేల మంది రాక్షసులను పంపాడు. హనుమంతుడు వాళ్ళను మట్టుపెట్టాడు. తనపైకి వచ్చిన జంబుమాలిని, మంత్రిపుత్రులేడుగురిని రావణుడి సేనాపతులైదుగురిని, అక్షకుమారుణ్ణి అంతమొందించాడు. చివరకు ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించి హనుమంతుణ్ణి బంధించాడు. బ్రహ్మవరంచేత అది హనుమంతునిమీద క్షణకాలమే పనిచేస్తుంది. అయినా తాను దానికి కట్టుబడి ఉన్నట్లు నటించాడు హనుమంతుడు. రావణుని ముందు ప్రవేశపెట్టారతన్ని. రావణుడడుగగా తాను రామదూతనని చెప్పాడు. శ్రీరాముని పరాక్రమమెలాంటిదో సభాముఖంగా చాటాడు. సహించలేని రావణుడు హనుమంతుణ్ణి చంపమని ఆజ్ఞ ఇచ్చాడు. దూతను చంపడం భావ్యం కాదన్నాడు విభీషణుడు. ఇతర పద్ధతుల్లో దూతను దండించవచ్చునన్నాడు.

హనుమంతుని తోకకు నిప్పంటించి లంకంతా కలయ దిప్పమన్నాడు రావణుడు. బట్టలతో హనుమంతుని తోకను చుట్టారు. నూనెతో తడిపారు. తోకకు నిప్పుపెట్టి ఊరంతా ఊరేగిస్తున్నారు. హనుమంతుడు ఒక్కసారిగా ఆకాశంలోకి ఎగిరాడు. విభీషణుని భవనం తప్ప లంకకంతా నిప్పుపెట్టాడు. (అందుకే '(సీతను) చూసిరమ్మంటే (లంకను) కాల్చివచ్చాడని' సామెత పుట్టింది. )లంకలో హాహాకారాలు మిన్నుముట్టాయి.

లంకను కాల్చాక హనుమంతుడు సముద్రంలో తోకను చల్లార్చుకున్నాడు. తోకతోపాటు ఆయన కోపంకూడా చల్లారింది. తాను తప్పు చేశాననుకున్నాడు. కోపం ఎంతో అనర్థదాయకమనుకున్నాడు. లంకంతా కాలి సీతామాత కూడా కాలిపోయి ఉంటుందని బాధపడ్డాడు. వచ్చిన పనిని చేజేతులా పాడుచేసుకొన్నందుకు తనను తాను నిందించుకున్నాడు. కాని ఎక్కడో చిన్న ఆశ. తన తోకనే కాల్చని అగ్నిదేవుడు పరమ పూజ్యురాలైన సీతను దహిస్తాడా? అని ధైర్యం తెచ్చుకున్నాడు. ఇంతలో సీత క్షేమంగా ఉందని చారణుల ద్వారా తెలుసుకొని చాలా సంతోషించాడు. సీతమ్మ దగ్గరికి చేరి పాదాభివందనం చేశాడు. ఆమె అనుమతితో తిరుగు ప్రయాణమయ్యాడు.

'అరిష్టం' అనే పర్వతాన్ని ఎక్కాడు. అక్కడి నుంచి ఆకాశంలోకి ఎగిరాడు. మధ్యలో ఆత్మీయపూర్వకంగా మైనాకుడిని తాకి వేగంగా ప్రయాణం కొనసాగించాడు. మహేంద్రగిరికి చేరుకోబోతుండగా మహానాదం చేశాడు. జాంబవంతుడు దానిని విని పొంగిపోయాడు. హనుమంతుడు విజయుడై తిరిగివస్తున్నాడని వానరులకు తెలిపాడు.

హనుమంతుడు మహేంద్రగిరి శిఖరంమీద అడుగుపెట్టాడు. వానరులంతా చుట్టూచేరారు. పెద్దలకు నమస్కరించాడు హనుమంతుడు. "చూశాను సీతమ్మ"ను అని ప్రకటించాడు. అందరూ ఆనందించారు. లంకా ప్రయాణ విశేషాలను వారికి వివరించాడు మారుతి. అంగదుడు "ఓ వీరులారా! సీతాదేవి జాడ తెలిసిన తరవాత కూడా ఆమె లేకుండా శ్రీరాముని దగ్గరికి వెళ్ళడం సబబుకాదు. లంకకు వెళ్ళి రావణుని చంపి సీతను తీసుకొని శ్రీరాముని వద్దకు వెళుదా"మని అన్నాడు. జాంబవంతుడు అంగదుడి మాటలను ఖండించాడు. శ్రీరామసుగ్రీవులు సీతను చూసిరమ్మన్నారేకాని తీసుకురమ్మనలేదు. పైగా రావణుణ్ణి సంహరిస్తానని శ్రీరాముడు ప్రతిజ్ఞ చేసి ఉన్నాడు. దానికి భంగం కలగనీయగూడదన్నాడు. అందరం వెళ్ళి జరిగిన విషయాలను నివేదిద్దామన్నాడు.

దారిలో అందరూ మధువనంలోకి వెళ్ళారు. తేనెలు తాగారు. మధువనాన్ని ధ్వంసంచేశారు. మధువనం సుగ్రీవుని రక్షణలో ఉన్నది. అతని మేనమామ దధిముఖుడు దాన్ని కాపాడుతున్నాడు. వానరుల ధాటికి దధిముఖుడు గాయాల పాలయ్యాడు. వెంటనే వెళ్ళి సుగ్రీవునికీ విషయం చెప్పాడు. ఇదంతా శుభసూచకంగా భావించాడు సుగ్రీవుడు.

అంగద హనుమదాదులు శ్రీరాముడు సుగ్రీవుడున్న చోటుకు చేరారు. హనుమంతుడు శ్రీరామునికి సాష్టాంగ నమస్కారం చేశాడు. "చూశాను సీతమ్మను" అని చెప్పాడు. రామలక్ష్మణుల ఆనందానికి అంతులేదు. సీత ఇచ్చిన చూడామణిని శ్రీరామునికి సమర్పించాడు హనుమంతుడు. శ్రీరాముడు కోరగా సీతాన్వేషణ వృత్తాంతాన్ని చెప్పాడు.



SCERT, TELANGANA



# యుద్ధ కాండం



శ్రీరాముడు హనుమంతుడి సాహసాన్ని ప్రశంసించాడు. గరుత్మంతుడికి, వాయుదేవుడికి, హనుమంతుడికి తప్ప ఈ మహాసముద్రాన్ని లంఘించడానికి ఇతరులకు సాధ్యం కాదన్నాడు. ఇచ్చిన పనిని సాధించడమేగాక, దానికి భంగం కల్గకుండా దానికనుబంధమైన ఇతర కార్యాలను సాధించేవాడు ఉత్తముడైన సేవకుడు. కేవలం ఇచ్చిన పనినే నెరవేర్చేవాడు మధ్యముడు. తనకు సామర్థ్యం ఉన్నా ఇచ్చిన పనిని పూర్తిచేయనివాడు అధముడు. సీతాదేవి కుశల వార్త చెప్పి మహోపకారం చేసిన హనుమంతునకు ఏమియ్యగలనంటూ దగ్గరకు తీసుకొని గట్టిగా గుండెకు హత్తుకున్నాడు శ్రీరాముడు. ఇదే తానియ్యగల సర్వస్వమన్నాడు. (ఆదరాభిమానాలకు మించిన ఆస్తి ఉండదు కదా!)

శ్రీరాముని మనసులో మళ్ళీ దుఃఖం పొంగిపొర్లింది. సుగ్రీవుడు ఊరడించాడు. నిరుత్సాహం ప్రయోజనాలను నాశనం చేస్తుందన్నాడు. దుఃఖం శౌర్య పరాక్రమాలను దిగజారుస్తుందన్నాడు. శత్రువు విషయంలో ఇప్పుడు దుఃఖం కాదు, క్రోధం చూపవలసిన సమయమని సూచించాడు. మహాసముద్రంమీద సేతువును కట్టకుండా లంకను జయించడం ఇంద్రాది దేవతలకు కూడా సాధ్యం కానిపని అన్నాడు. శ్రీరాముడు అడిగినమీదట హనుమంతుడు లంకానగరంలోని రక్షణ వ్యవస్థను గురించి వివరంగా చెప్పాడు.

మధ్యాహ్నమైంది. ఈ విజయ ముహూర్తమే లంకా ప్రయాణానికి తగినదని శ్రీరాముడు సుగ్రీవునితో అన్నాడు. శ్రీరాముడు వానరులతో, "నీలుడు సైన్యానికి మార్గం చూపుతూ ముందునడవాలి. లక్షలాది వానరులు అతణ్ణి అనుసరించాలి. బాలురు వృద్ధులు, బలహీనులు కిష్కింధలోనే ఉండాలి. సుగ్రీవా! నేను హనుమంతుడి భుజంమీదా, లక్ష్మణుడు అంగదుడి భుజంమీదా కూర్చొని ముందుకు సాగుతాం. నువ్వు పల్లకినెక్కి మాతోపాటు రావాలి. జాంబవంతుడు, సుషేణుడు, వేగదర్శి సైన్యం వెనుకభాగంలో ఉండి రక్షణ బాధ్యతను చూడాలి. వెళ్ళేమార్గంలో నగరాలు, గ్రామాలు ఉంటే వాటిలోకి వెళ్ళగూడదు. జల, ఫల సహితమైన మార్గం వెంట మనం ప్రయాణించాలి" అని రాముడు సూచించాడు. ఉత్సాహం ఉరకలు వేస్తుంటే అందరూ సముద్రతీరాన్ని చేరుకున్నారు.

లంకలో రావణుడు మంత్రులతో సమావేశమయ్యాడు. వానరులను ఎదుర్కొని లంకను కాపాడుకోవడానికి ఏం చేయాలో నిర్ణయించమన్నాడు. సభలోని వారు రావణ, ఇంద్రజిత్తుల పరాక్రమాన్ని పొగిడారు. నరవానరులను లెక్కచేయాల్సిన అవసరం లేదని పెదవి విరిచారు. "రాముణ్ణి హతమార్చగల"వని లంకేశునికి ఆత్మస్థైర్యాన్ని కలిగించారు. ప్రహస్తుడు మొదలైనవారు శత్రుసేనలను తామే తుదముట్టించగలమని డంబాలు పలికారు.

ఇవన్నీ విన్నాడు రావణుని సోదరుడు విభీషణుడు. రాక్షసులతో "శత్రువుల శక్తిసామర్థ్యాలను తెలుసుకోకుండా వారిని చులకనగా భావించకూడదు. శ్రీరాముడు మనకేం అపకారం చేశాడు? మన రాజే సీతను అపహరించుకు వచ్చాడు. దీనివల్ల పాపం వస్తుంది. కీర్తిప్రతిష్ఠలు మంటగలుస్తాయి. ఆయుష్షు తగ్గుతుంది. సంపదలన్నీ నశిస్తాయి. కనుక సీతను శ్రీరామునికి


SCERT, TELANGANA

అప్పగించడమే అన్ని విధాలా మంచిది. అనవసరంగా కలహం తెచ్చుకోవడం దేనికి? పైగా శ్రీరాముని వంటి మహావీరునితో యుద్ధం తగదు" అంటూ రావణునివైపు తిరిగాడు. "అన్నా! అనవసరంగా కోపించడం మంచిదికాదు. అది ధర్మానికి ఆటంకమౌతుంది. సుఖాలను దూరంచేస్తుం"దని హితవు పలికాడు. విభీషణుని ఈ హితబోధ 'చెవిటివాని ముందు శంఖమూది'నట్లయింది. రావణుని భవనానికి వచ్చిన కుంభకర్ణుడు కూడా రావణుణ్ణి తప్పుపట్టాడు. సీతాపహరణ సమయంలో తనను సంప్రదించి ఉంటే బాగుండేదన్నాడు. ఇప్పుడు ఆలోచించి ప్రయోజనం లేదన్నాడు. ఇదంతా 'గతజలసేతుబంధనమే' (నీళ్ళుపోయిన తరువాత అడ్డుకట్టవేయడం)నని కుండ బద్దలుకొట్టినట్టు చెప్పాడు. "నువ్వు శత్రువు పట్ల వ్యవహరించిన తీరు సరైనది కాదు, శ్రీరాముడు నిన్ను ఇంకా చంపకుండా ఉండడం నీ అదృష్టం" అన్నాడు. ఇవన్నీ ఎలా ఉన్నా శ్రీరాముణ్ణి తుదముట్టించే భారం తనదేనని ప్రకటించుకున్నాడు కుంభకర్ణుడు.

రావణుడు విభీషణుని మాటలకు క్రోధావేశాలకు లోనయ్యాడు. తీవ్రస్థాయిలో నిందించాడు. అన్న తండ్రితో సమానుడని అతని నిందలను సహించాడు విభీషణుడు. కాని రావణుని అధర్మమార్గాన్ని మాత్రం సమర్థించలేదు. ధర్మం వీడిన రావణుని వీడడానికే విభీషణుడు నిర్ణయించుకున్నాడు. రెండు గడియల్లో రామలక్ష్మణులున్నచోటికి నలుగురు అనుచరులతో చేరాడు.

ఆకాశంలోనే నిలిచి శ్రీరాముణ్ణి శరణుకోరాడు విభీషణుడు. అనుగ్రహించాడు దాశరథి. విభీషణుడు శ్రీరాముని పాదాలపై వాలాడు. రావణుని విషయాలన్నీ సంక్షిప్తంగా చెప్పాడు. శ్రీరాముడు విభీషణునితో 'నేను రావణుని బంధుమిత్ర సమేతంగా హతమార్చి నిన్ను రాజును చేస్తా'నని తమ్ములమీద ఒట్టేసి చెప్పాడు. ఈ పనిలో తాను యథాశక్తి సహాయపడగలనని విభీషణుడు మాట ఇచ్చాడు. రాముడు విభీషణుణ్ణి ఆలింగనం చేసుకున్నాడు. లక్ష్మణుడితో వెంటనే సముద్రజలం తెచ్చి లంకారాజుగా విభీషణుణ్ణి పట్టాభిషిక్తుణ్ణి చేయమన్నాడు. శ్రీరాముని ఆజ్ఞ వెంటనే ఆచరణ రూపం దాల్చింది. అందరూ ఆనందాన్ని ప్రకటించారు.

సముద్రాన్ని దాటే ఉపాయమేమిటని సుగ్రీవుణ్ణి ప్రశ్నించాడు శ్రీరాముడు. సముద్రుణ్ణి ప్రార్థించడంవల్ల ఇది సాధ్యపడుతుందన్నాడు విభీషణుడు. శ్రీరాముడు సముద్రతీరంలో దర్భాసనంమీద కూర్చుని సముద్రుణ్ణి ఉపాసించాడు. మూడు రాత్రులు గడిచాయి. సముద్రుడు ఎదుట నిలువలేదు. శ్రీరాముని కన్నులు ఎర్రబారాయి. సముద్రుడి అహంకారాన్ని అణగదొక్కాలనుకున్నాడు. నీటినంతా ఇంకిపోయేటట్టు చేయాలనుకున్నాడు. బ్రహ్మాస్త్రాన్ని స్మరించాడు. ప్రకృతంతా అల్లకల్లోలమౌతున్నది. సముద్రుడు భయపడి పారిపోతున్నాడు. పరుగెత్తే వానిపై బాణం ప్రయోగించరాదని ఆగాడు శ్రీరాముడు. సముద్రుడు దారికి వచ్చాడు. లంకకు వెళ్ళడానికి దారినిస్తానన్నాడు. ఎక్కుపెట్టిన బాణం వృథాకారాదు. ఎక్కడ ప్రయోగించాలో చెప్పమన్నాడు శ్రీరాముడు. పాపాత్ములు, దోపిడిదారులు ఉండే 'ద్రుమకుల్యం'పైన ప్రయోగించమన్నాడు సముద్రుడు. అది జరిగిపోయింది.



విశ్వకర్మ కుమారుడైన 'నలుడు' శిల్పకళానిపుణుడు. ఉత్సాహం, శక్తి ఉన్నవాడు. సేతువు (వంతెన) ను నిర్మించడానికి అతడే యోగ్యుడని సముద్రుడు తెలిపాడు. ఆ సేతువును తాను భరిస్తానని మాట ఇచ్చాడు. సేతువు నిర్మాణానికి వానర నాయకులకు ఆజ్ఞ ఇచ్చాడు శ్రీరాముడు. అందరూ మహారణ్యం దారి పట్టారు. పెద్దపెద్ద చెట్లను బండరాళ్ళను మోసుకువస్తున్నారు. సముద్రంలో పడేస్తున్నారు. వాటి దెబ్బకు

SCERT, TELANGANA

సముద్రంలోని నీరు ఆకాశానికి ఎగిసిపడుతున్నది. నలుని సూచనలననుసరించి కొలతల ప్రకారం సేతువు నిర్మాణం జరుగుతూంది. వందయోజనాల పొడవు, పది యోజనాల వెడల్పుగల సేతువును కట్టడం ఐదు రోజుల్లో పూర్తయింది.

శ్రీరామలక్ష్మణులు సుగ్రీవునితో కలసి ముందు నడుస్తున్నారు. సైన్యం వారిని అనుసరిస్తున్నది. సైన్యంలో కొందరు వెనక నడుస్తున్నారు. కొందరు సేతువు మధ్యభాగంలో, మరి కొందరు రెండు పక్కలా నడుస్తున్నారు. కొందరు సముద్రంలో దూకి ఈదుతూ వస్తూంటే మరికొందరు ఆకాశంలో ఎగిరి వస్తున్నారు. వారు చేసే కోలాహలానికి సముద్రమే మౌనం దాల్చింది. అందరూ అవతలి తీరం చేరారు.

శ్రీరాముడు యుద్ధనీతిని అనుసరించి సైన్యాన్ని వివిధ విభాగాలుగా విభజించాడు. ఎవరి బాధ్యతలను వాళ్ళకు అప్పగించాడు. రావణుడి మంత్రులైన శుకసారణులు శ్రీరాముని బలం తెలుసుకోవాలని వానర రూపాలుదాల్చి వానరులలో చేరారు. విభీషణుడు వాళ్ళను గుర్తించి శ్రీరాముని ఎదుట నిలిపాడు. క్షమించాడు శ్రీరాముడు. తమను గురించి ఇంకా ఏమన్నా తెలుసుకోవాలంటే అడ్డులేదని వాళ్ళకు చెప్పాడు. సీతను వెంటనే అప్పగించకపోతే తన చేతిలో చావు తప్పదని రావణుడికి చెప్పవలసిందిగా సూచిస్తూ శుకసారణులను పంపించివేశాడు. వారు వెళ్ళి ఇక్కడి విషయాలన్నీ పొల్లుబోకుండా రావణునికి తెలిపారు.

రావణుడు సీత విషయంలో మరొక ఎత్తుగడ వేశాడు. అశోకవనం వెళ్ళి రాముడు తనచేతిలో హతుడైనాడని సీతతో పలికాడు. ఆమె నమ్మలేదు. మాయావియైన విద్యుజ్జిహ్వుణ్ణి పిలిచాడు. అతడు శ్రీరామునిదే అనిపించే మాయాశిరస్సును, ధనుర్బాణాలను తీసుకొనివచ్చి చూపించాడు సీతకు. ఇప్పటికైనా తన్నాశ్రయించమని సీతను కోరాడు రావణుడు. సీత కుమిలిపోయింది. రావణుడు తన భవనానికి వెళ్ళిపోయాడు. విభీషణుని భార్య 'సరమ' సీతను ఊరడించింది. ఇదంతా రాక్షస మాయ అని చెప్పింది. శ్రీరాముడు క్షేమమేనని తెలిపింది.

శ్రీరామచంద్రాదులు వానరసైన్యంతో సువేల పర్వతానికి చేరుకున్నారు. ఆరాత్రి అక్కడే గడిపారు. ఎత్తైన ఆ పర్వత శిఖరం నుండి లంకానగర శోభను చూశారు. లంకలో మేడపైభాగంలో ఠీవిగా కూర్చున్న రావణుణ్ణి శ్రీరాముడు చూశాడు. వానర ప్రముఖులూ చూశారు. సుగ్రీవుడు ఒక్క ఉదుటునలేచి కోపంతో ఊగిపోతున్నాడు. క్షణాలలో సువేల పర్వతంనుంచి రావణ భవనంపైన వాలాడు. తాను శ్రీరాముని మిత్రుడనని, తన దగ్గర తప్పించుకోవడం లంకేశుని తరంకాదని హెచ్చరించాడు. రావణుడిపైకి దూకి అతని కిరీటాన్ని తీసి నేలకు కొట్టాడు. రావణుడు రెచ్చిపోయాడు. "సుగ్రీవా! ఇంత వరకు నీవు నా కంటబడలేదు. లేకుంటే ఎప్పుడో హీనగ్రీవుడవు (తల తెగినవాడవు) అయ్యేవాడివి" అంటూ గర్జించాడు. ఇద్దరి మధ్యా బాహాబాహి యుద్ధం జరిగింది. సుగ్రీవుడు రావణుణ్ణి ముప్పతిప్పలు పెట్టి క్షణాలలో రివ్వున ఎగిరి సువేల పర్వతంమీద వాలాడు. శ్రీరాముడు సుగ్రీవుణ్ణి సున్నితంగా మందలించాడు. తొందరపడి ఇలాంటి సాహసాలు చేయవద్దని సలహా ఇచ్చాడు.

రావణుడి దగ్గరికి అంగదుణ్ణి రాయబారిగా పంపాడు శ్రీరాముడు. సీతను అప్పగించకపోతే శ్రీరాముని చేతిలో మరణం తథ్యమని, లంకకు విభీషణుడు రాజుకాగలడని శ్రీరాముని వాక్యంగా రావణునికి వినిపించాడు అంగదుడు. సభ అట్టుడికిపోయింది. నలుగురు రాక్షసులు అంగదుడిమీద విరుచుకుపడ్డారు. అంగదుడు వారిని తన చంకలో ఇరికించుకొని ప్రాసాదంపైకి ఎగిరాడు. అక్కడి నుండి వారిని బలంగా నేలపైకి విసిరాడు. సింహనాదం చేసి ఆకాశమార్గంలో శ్రీరాముణ్ణి చేరాడు. రావణుని భావాన్ని గ్రహించాడు శ్రీరాముడు. ధనుస్సుకు పని చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని భావించాడు.

లంకమీదికి దండయాత్ర మొదలైంది. లంకను నాలుగువైపుల నుండీ సైన్యంతో ముట్టడించాడు శ్రీరాముడు. లంకేశుడు తన భవనం మీది నుంచే పరిస్థితిని గమనించాడు. దీర్ఘాలోచనలో పడ్డాడు. యుద్ధం మొదలైంది. రెండు సైన్యాలు తీవ్రంగా పోరాడుతున్నాయి. ఆంజనేయుడి చేతిలో జంబుమాలి, సుషేణుని చేతిలో విద్యున్మాలి మరణించారు. చీకటిలో ఎవరు ఎవరో (రాక్షసుడా? వానరుడా?) అడిగి తెలుసుకుని మరీ కొట్టుకుంటున్నారు.



SCERT, TELANGANA

అంగదుని చేతిలో రావణకుమారుడు ఇంద్రజిత్తు ఓడిపోయాడు. దీనికి తట్టుకోలేకపోయాడు. కపట యుద్ధానికి దిగాడు. రామలక్ష్మణులను మూర్ఛపోయేట్టుచేసి నాగాస్త్రంతో బంధించాడు. వారు మరణించారని భ్రాంతిపడి రావణుడి దగ్గరికి వెళ్ళి విషయాన్ని తెలిపాడు. రావణుడు అభినందించాడు. రావణుడి ఆదేశం మేరకు త్రిజట మొదలైనవారు సీతను పుష్పక విమానంపై యుద్ధ భూమికి తీసుకువెళ్ళారు. నేలమీద పడిఉన్న రామలక్ష్మణులను సీత చూసింది. మరణించారని భావించి కన్నీరు కాల్వలు గట్టేలా ఏడ్చింది. పక్కనే ఉన్న త్రిజట ఓదార్పుతో కూడిన ధైర్యాన్నిచ్చింది. రామలక్ష్మణులు బతికే ఉన్నారని ఆధారాలు చూపించింది. వానరసైన్యం ప్రసన్నంగా ఉండడం ఒక కారణమని, అన్నింటికీ మించి "భర్త మరణించిన స్త్రీని పుష్పక విమానం తీసుకొనిరాదు" అని చెప్పడంతో సీత మనసు కుదుటపడింది. గరుత్మంతుని రాకతో రామలక్ష్మణులు నాగాస్త్ర ప్రభావం నుంచి విముక్తులైనారు. వానరులు 'జయజయ' ధ్వానాలు చేశారు. అవి రావణుని గుండెలో 'అప' శబ్దాన్ని జోడించుకొని ప్రతిధ్వనిస్తున్నాయి. హనుమంతుని చేతిలో ధూమ్రాక్షుడు, అకంపనుడు, అంగదుడి బారినపడి వజ్రదంష్ట్రుడు, నీలుడికి చిక్కి ప్రహస్తుడు యమపురిబాట పట్టారు.

రావణుని బాణశక్తికి సుగ్రీవుడు మూర్ఛపోయాడు. శ్రీరాముడు విల్లందుకున్నాడు. అన్నను వారించి లక్ష్మణుడు రావణుణ్ణి ఎదిరించడానికి పూనుకున్నాడు. వానరసేనమీద శరవర్షధారకురిపిస్తున్నాడు రావణుడు. ఆంజనేయుడు రావణుడి ధాటికి అడ్డుకట్ట వేశాడు. అరచేతితో హనుమంతుని బలంగా చరచాడు రావణుడు. మారుతి చలించిపోయాడు. అయినా క్షణంలో తేరుకున్నాడు. అరచేతితో రావణుణ్ణి ఒక్క దెబ్బ వేశాడు. దశగ్రీవుడు కంపించిపోయాడు. తేరుకుని "వానరా! భళా, నాకు శత్రువువే అయినా నీ శక్తిని మెచ్చుకుంటున్నా"నని యుద్ధ స్ఫూర్తిని చాటాడు రావణుడు.

రావణుడు ప్రయోగించిన 'శక్తి' అనే ఆయుధం లక్ష్మణుని ఎదలో నాటుకుంది. స్పృహదప్పాడు లక్ష్మణుడు. అతన్ని ఎత్తుకొని వెళ్ళాలని శతవిధాలా ప్రయత్నించి విఫలుడైనాడు రావణుడు. అంతలో ఆంజనేయుడు రావణుడిమీద దాడిచేశాడు. వక్షఃస్థలంమీద ముష్టిఘాతంతో రావణుణ్ణి కూలబడేటట్లు చేశాడు. లక్ష్మణుణ్ణి శ్రీరాముని వద్దకు చేర్చాడు. హనుమంతుని కోరిక మేరకు అతని భుజాలపై కూర్చుని రావణునితో పోరుచేశాడు శ్రీరాముడు. శ్రీరాముని పరాక్రమం ముందు రావణుని ధనుస్సు, కిరీటం దాసోహమన్నాయి. శ్రీరాముడు దయతలచాడు. రావణునితో "నీవు యుద్ధంలో అలసిపోయావు. సేదతీర్చుకొనిరా. అప్పుడు నా బలమేమిటో తెలుస్తుం"దని సుతిమెత్తగా చెప్పాడు.



అంతఃపురానికి తిరిగివెళ్ళినా అవమానభారం రావణుణ్ణి ఒక చోట కూర్చోనీయడం లేదు. కుంభకర్ణుని నిద్రలేపమన్నాడు రావణుడు. అతికష్టంమీద ఆ పని సాధ్యమయింది రాక్షసులకు. కుంభకర్ణునికి ఆరు నెలలు నిద్ర ఒకరోజు భోజనం. (అందుకే 'కుంభకర్ణనిద్ర' అనేది ఒక జాతీయంగా భాషలోకి వచ్చింది.) కుంభకర్ణుడు రావణుణ్ణి సమీపించాడు. జరిగిందంతా చెప్పాడు రావణుడు. తెలివిగలవారు జరిగిన దానిని గూర్చి ఆలోచించరన్నాడు కుంభకర్ణుడు. తనకు సహాయపడమని కుంభకర్ణుని కోరాడు రావణుడు. "ఆపదల పాలైన వానిని ఆదుకొనేవాడే నిజమైన మిత్రుడు. తప్పుదారి పట్టి కష్టాల్లో పడ్డవారికి చేయూతనిచ్చి ఆదుకొనేవాడే ఆప్తు"డని రావణుడన్నాడు. కుంభకర్ణుడు యుద్ధసన్నద్ధుడయ్యాడు.

కుంభకర్ణుడు యుద్ధంలో వానరులను చావుదెబ్బ తీస్తున్నాడు. వానరులు తట్టుకోలేక తలోదారి పట్టారు. శ్రీరాముణ్ణి ఆశ్రయించారు. 'ఐంద్రాస్త్రం'తో కుంభకర్ణుని శిరస్సును ఖండించి శాశ్వత నిద్రలోకి

SCERT, TELANGANA

పంపాడు శ్రీరాముడు. శ్రీరాముని బాణధాటికి కుంభకర్ణుని తల లంకలో పడిపోయింది. ఆ తల తగలడం వల్ల రాజవీథులలోని ఇంటికప్పులు, ఎత్తైన ప్రాకారాలు కూలిపోయాయి. కుంభకర్ణుని మరణవార్త రావణుణ్ణి క్రుంగదీసింది.

రావణ కుమారుడైన అతికాయుడు లక్ష్మణుని బ్రహ్మాస్త్రానికి బలైనాడు. తమ్ముణ్ణి, కొడుకును పోగొట్టుకొని తల్లడిల్లుతున్న రావణుణ్ణి ఇంద్రజిత్తు ఓదార్చాడు. భారం తనపై వేసుకొని. యుద్ధరంగానికి వచ్చాడు. రామలక్ష్మణులమీద బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. రాముని సూచనమేరకు రామునితోపాటు లక్ష్మణుడు స్పృహకోల్పోయినట్లు పడి ఉన్నాడు. వాళ్ళు మరణించారనుకున్నాడు ఇంద్రజిత్తు. తండ్రికీ వార్తను తెలిపాడు.

వానరసైన్య శిబిరంలో అలజడి మొదలైంది. విభీషణుడు ధైర్యం చెప్పాడు. రామలక్ష్మణులకు ఏమీకాలేదన్నాడు. బ్రహ్మమీది గౌరవంతో అస్త్రబాధను అనుభవించారని తెలిపాడు. బ్రహ్మాస్త్ర ప్రభావంతో అరవైఏడు కోట్ల మంది హతులయ్యారు. చాలామంది దెబ్బతిన్నారు. హనుమంతుడు, విభీషణుడు, జాంబవంతుడి కోసం వెతుకుతున్నారు. జాంబవంతుడు కనిపించాడు. సరిగ్గా చూడలేకపోతున్నానన్నాడు. ధ్వనిని బట్టి విభీషణుని గుర్తించానన్నాడు. "హనుమంతుడు క్షేమమేనా" అని అడిగాడు. ఆంతర్యం అంతుచిక్కలేదు విభీషణునికి. "హనుమంతుడు జీవిస్తే వానరసైన్యం చచ్చినా బతికినట్లే లేదా హనుమ మరణిస్తే అందరం బతికిఉన్నా చచ్చినవాళ్ళతో సమానమే"నన్నాడు జాంబవంతుడు. జాంబవంతుని ఆదేశంపై హిమాలయాలకు వెళ్ళి అక్కడ ఉన్న సర్వౌషధి మహాపర్వతాన్ని పెల్లగించి తీసుకువచ్చాడు హనుమంతుడు. ఓషధుల వాసనకే రామలక్ష్మణుల గాయాలన్నీ మటుమాయమయ్యాయి. చనిపోయిన వానరులు మళ్ళీ లేచికూర్చున్నారు. సుగ్రీవాజ్ఞతో వానరులు లంకకు నిప్పుపెట్టారు.

శత్రుపక్షాన్ని మానసికంగా దెబ్బతీయదలచాడు ఇంద్రజిత్తు. హనుమదాది వానరవీరులు చూస్తుండగా మాయాసీతను సంహరించాడు. అందరూ నిజమేననుకున్నారు. ఈ వార్త తెలిసి శ్రీరాముడు శోకసంద్రంలో మునిగిపోయాడు. ఇదంతా ఇంద్రజిత్తు మాయేనని విభీషణుడు తెలపడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

శత్రుసంహారానికి ఇంద్రజిత్తు నికుంభిలా అభిచారహోమాన్ని తలపెట్టాడు. దాన్ని భంగంచేయడానికి రామానుజ్ఞతో లక్ష్మణుడు వెళ్ళాడు. ఇంద్రజిత్తు లక్షణుల మధ్య ఘోర యుద్ధం జరిగింది. 'ఐంద్రాస్త్రము'ను ప్రయోగించి ఇంద్రజిత్తు తలను నేలరాల్చాడు లక్ష్మణుడు. శ్రీరాముడు లక్ష్మణుణ్ణి మెచ్చుకున్నాడు.

రావణుడు యుద్ధభూమిలో ప్రళయకాల రుద్రుడిలా విజృంభిస్తున్నాడు. వానర వీరులు తట్టుకోలేక యుద్ధరంగం నుండి కాలికి బుద్ధి చెపుతున్నారు. మరొకవైపు సుగ్రీవుని చేతిలో విరూపాక్షుడు, మహోదరుడు మట్టిగరచారు.

యుద్ధం చివరి అంకానికి చేరుతున్నది. రామలక్ష్మణులతో రావణునిపోరు తీవ్రతరమవుతున్నది. రావణుడు విభీషణుణ్ణి చంపడానికి బల్లెమెత్తాడు. అది మహాశక్తిమంతమైనది. విభీషణునికి ప్రాణాపాయ స్థితిని గమనించిన లక్ష్మణుడు రావణునిపై బాణాలను కుమ్మరించాడు. ఎటూ తోచక విభీషణుని చంపే ప్రయత్నాన్ని విరమించుకున్న రావణుడు లక్ష్మణునిపై ఆగ్రహించి 'శక్తి' అనే ఆయుధాన్ని ప్రయోగించాడు. అది గమనించిన శ్రీరాముడు 'శక్తి'ని వేడుకున్నాడు. 'నీలోని చంపేశక్తి నశించుగాక' అని. అంతే – అది ప్రాణశక్తిని కోల్పోయింది. లక్ష్మణుడి రొమ్ముమీద బలంగా నాటుకుంది. లక్ష్మణుడు నేలమీద పడిపోయాడు. వానరులు ఆ ఆయుధాన్ని ఎంత ప్రయత్నించినా లక్ష్మణుడి రొమ్ము నుంచి తీయలేకపోయారు. రాముడు తన రెండు చేతులతో బయటికి లాగి విరిచివేశాడు. ఇక ఉపేక్షించి లాభం లేదనుకున్నాడు శ్రీరాముడు. ఈ లోకంలో ఇక రావణుడో? రాముడో? మిగిలి ఉండడం తథ్యం' అన్నాడు. శ్రీరాముని విలువిద్యాపాండిత్యానికి ఎదురునిలువలేక రావణుడు భయంతో పరుగులు తీశాడు.

పడిపోయిన లక్ష్మణుణ్ణి చూసి విలవిలలాడిపోయాడు శ్రీరాముడు. "ఏదేశంలోనైనా భార్య దొరకవచ్చు. బంధువులు దొరకవచ్చు. కాని లక్ష్మణుని వంటి తమ్ముడు దొరక"దని కన్నీరుకార్చాడు. సుషేణుడు లక్ష్మణుని పరీక్షించి చనిపోలేదని నిర్ధారించాడు.



SCERT TELANGANA

సుషేణుని సూచనమేరకు హనుమంతుడు ఓషధులు తేవడానికి వేగంగా వెళ్ళాడు. ఓషధీపర్వతాన్నే తెచ్చాడు. ఓషధీ ప్రభావంతో లక్ష్మణుడు లేచికూర్చున్నాడు. పట్టరాని ఆనందంతో శ్రీరాముడు "లక్ష్మణా నీవు మరణించి ఉంటే నా విజయానికి అర్థమే లేదు. అప్పుడు సీతతోగాని నా ప్రాణాలతోకాని ఏం ప్రయోజనం" అన్నాడు.

ఇంద్రుడు పంపగా మాతలి దివ్యరథంతో సహా శ్రీరాముని దగ్గరికి వచ్చాడు. ప్రదక్షిణ పూర్వకంగా నమస్కరించి శ్రీరాముడు రథాన్ని అధిరోహించాడు. యుద్ధభూమికి సాగిందారథం. మిగతా దినాల కన్నా భిన్నంగా ఉందీనాటి యుద్ధం. కొంతసేపు ఎవరికెవరూ తీసిపోని విధంగా విజృంభించారు. రానురాను రామునిదే పైచేయి అవుతున్నది. రావణుని సారథి గమనించాడు. రథాన్ని పక్కకు మళ్ళించాడు. అలా చేయడం అవమానంగా భావించిన రావణుడు సారథిపై నిప్పులు చెరిగాడు. రథం మళ్ళీ రాముని ముందు నిలిచింది. యుద్ధం చూడడానికి అగస్త్యుడు దేవతలతో కూడి అక్కడకు వచ్చాడు. శ్రీరామునికి 'ఆదిత్య హృదయం' ఉపదేశించాడు. శ్రీరాముని బాణాలతాకిడికి రావణుని తలలు నేలరాలుతున్నాయి. కాని వెంటనే చిత్రంగా మళ్ళీ మొలుస్తున్నాయి.



ఆకాశానికి ఆకాశం, సముద్రునికి సముద్రమే సమానమైనట్లు రామరావణ యుద్ధానికి రామరావణ యుద్ధమే సమానమన్నట్లు సాగుతున్నది. బ్రహ్మాస్త్ర ప్రయోగం చేయవలసిందిగా 'మాతలి' శ్రీరామునికి సూచించాడు. శ్రీరాముడు బ్రహ్మాస్త్ర ప్రయోగంతో రావణాసురుణ్ణి అంతమొందించాడు.

అన్నఐన రావణుని మరణానికి విభీషణుడు బాధపడ్డాడు. దహన సంస్కారాలకు అనుమతినివ్వమని శ్రీరాముని ప్రార్థించాడు. 'వ్యక్తులు జీవించి ఉన్నంతవరకే వైరముండాలి. తరవాత దానిని వదలివేయాలి. మన కార్యం నెరవేరింది. కావలసిన సంస్కారాలను చేయ'మని అన్నాడు శ్రీరాముడు. "ఇప్పుడు రావణుడు నీకెట్లాగో నాకూ అట్లాగే గౌరవాస్పదుడు" అని తన విశాల హృదయాన్ని చాటుకున్నాడు శ్రీరాముడు. రావణుని భార్య మండోదరి భర్త మరణానికి పుట్టెడు దుఃఖంలో కూరుకుపోయింది. విభీషణుడు రావణునికి ఉత్తరక్రియలను నిర్వర్తించాడు.

శ్రీరాముని ఆదేశం మేరకు లక్ష్మణుడు విభీషణుణ్ణి లంకారాజుగా పట్టాభిషిక్తుణ్ణి చేశాడు. సీతతో తన విజయవార్తను తెలపమని హనుమంతుణ్ణి ఆదేశించాడు శ్రీరాముడు. హనుమంతుడు వెంటనే వెళ్ళి ఈ శుభవార్తను సీతమ్మ చెవిన వేశాడు. ఆమె ఆనందానికి అవధుల్లేవు. ఇంతకాలం చుట్టూచేరి బాధించిన రాక్షస స్త్రీలను చంపడానికి అనుమతినిమ్మన్నాడు హనుమ. తగని పని, వద్దని వారించింది సీత.

SCERT TELANGANA

విభీషణుడు పల్లకిలో సీతాదేవిని శ్రీరాముని దగ్గరికి చేర్చాడు. సంతోషంతో భర్తను చేరింది సీత. ఆమెను స్వీకరించడానికి రాముడు నిరాకరించాడు. "నా వంశప్రతిష్ఠ నిలుపుకోవడానికి దుష్ట రావణుని చెరనుండి నిన్ను విడిపించాను. ఇంతకాలం పరుడి పంచన ఉన్నందువల్ల నీ ప్రవర్తన గురించి నాకు సందేహముంది. కనుక నువ్వు నీ ఇష్టం వచ్చిన చోటికి వెళ్ళవచ్చు"నని శ్రీరాముడు అన్నాడు. శ్రీరాముని మాటలు ములుకుల్లా గుచ్చుకున్నాయి సీతకు. స్థాయికి దగినట్లుగా మాట్లాడలేదని రామునితో అన్నది. శ్రీరామునకు విశ్వాసం కలిగించడానికి 'అగ్ని ప్రవేశం' ఒక్కటే శరణ్యమని భావించింది. శ్రీరాముని మనసెరిగి లక్ష్మణుడు చితిని సిద్ధపరచాడు. సీత అగ్నిలోకి ప్రవేశించింది. అక్కడివారంతా ఆందోళనచెందారు. అగ్నిదేవుడు స్వయంగా సీతాదేవిని తీసుకువచ్చి ఆమె గొప్పదనాన్ని వెల్లడించాడు. ఆమెను స్వీకరించాల్సిందిగా శ్రీరాముణ్ణి కోరాడు.

సీత గురించి తనకంతా తెలుసన్నాడు శ్రీరాముడు. తన శీలం యొక్క గొప్పదనాన్ని ముల్లోకాలకు చాటడానికే ఆమె అగ్నిప్రవేశం చేస్తున్నా ఊరుకున్నానన్నాడు. సీతను దగ్గరకు తీసుకున్నాడు.

పరమశివుడు శ్రీరాముణ్ణి ప్రశంసించాడు. దుష్టసంహారంచేసిన శ్రీరాముణ్ణి ప్రజానురంజకంగా పరిపాలన చేయమన్నాడు. శ్రీరాముని కోరిక మేరకు ఇంద్రుడు మృతులైపడి ఉన్న వానరులను మళ్లీ బతికించాడు. విభీషణుడు లంకలో కొంతకాలం ఉండవలసిందని శ్రీరాముణ్ణి అభ్యర్థించాడు. భరతుని కొరకు తాను త్వరగా ప్రయాణం కావలసిందేనన్నాడు శ్రీరాముడు. వానరులను వాళ్ళ స్వస్థానాలకు వెళ్ళమనిచెప్పి, విభీషణుని వీడ్కోలు అందుకున్నాడు. పుష్పకవిమానంలో అయోధ్యకు బయలుదేరాడు. దారిలో



ఆయా ప్రదేశాలన్నీ సీతకు చూపుతున్నాడు. భరద్వాజాశ్రమాన్ని సందర్శించారు. శ్రీరామాజ్ఞతో హనుమంతుడు శ్రీరాముడు వస్తున్న విషయాన్ని భరతునికి, గుహునికి ముందుగా వెళ్ళి తెలియజేశాడు. వాళ్ళెంతో ఆనందించారు.

పుష్పక విమానంలో నందిగ్రామం చేరుకున్న సీతారామలక్ష్మణులకు భరతుడు, ప్రముఖులు ఘనంగా స్వాగతం పలికారు. సీతారామలక్ష్మణులు కౌసల్య, సుమిత్ర, కైకేయి, వశిష్ఠుల పాదాలకు ప్రణామాలు అర్పించారు. భరతుడు శ్రీరాముని చరణాలకు పాదుకలను తొడిగాడు. భరతుణ్ణి ప్రేమతో అక్కున జేర్చుకున్నాడు శ్రీరాముడు.

అంగరంగవైభవంగా శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం జరిగింది. యువరాజుగా ఉండాల్సిందిగా శ్రీరాముడు లక్ష్మణుణ్ణి కోరాడు కాని అతడు ఎంత మాత్రం ఒప్పుకోలేదు. అప్పుడు భరతుణ్ణి యువరాజుగా చేశాడు. యజ్ఞయాగాది క్రతువులను నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నాడు శ్రీరాముడు. ప్రజలను కన్నబిడ్డలా చూసుకుంటున్నాడు. ఎలాంటి ఈతిబాధలూ లేవు. అందరూ ధర్మబద్ధంగా నడచుకొంటున్నారు. ఇలా పదకొండువేల సంవత్సరాలకాలం ప్రజానురంజకంగా పరిపాలించాడు శ్రీరాముడు. అందుకే 'రామరాజ్యం' అన్న మాట నేటికీ ఆదర్శమై నిలచింది.

శ్లో॥ మంగళం కోసలేంద్రాయ – మహనీయ గుణాత్మనే।
చక్రవర్తి తనూజాయ – సార్వభౌమాయ మంగళమ్॥

# పదవిజ్ఞానం

## అర్థాలు

### అ

అంగన = స్త్రీ
అంబరం = వస్త్రం, ఆకాశం
అంతరాళం = లోపలి భాగం
అగ్రహారం = బ్రాహ్మణ పండితులకు రాజులు బహుమతులుగా ఇచ్చే ఇండ్లు, భూములు
అనిదంపూర్వం = అపూర్వం, ఇంతకుముందు లేనిది
అపూటం = పూర్తిగా
అభిఘరించు = నెయ్యిని బొట్లుబొట్లుగా వేయడం
అభీప్సితము = కోరిక
అభ్యాగతుడు = భోజన సమయమునకు వచ్చిన అతిథి
అర్ఘ్యపాద్యములు = పూజకొరకు, కాళ్ళు కడుక్కోవడానికి ఇచ్చే నీళ్ళు
అర్థి = యాచకుడు, అడుగువాడు
అలతి = కొద్ది

### ఆ

ఆకర్ణించు = విను
ఆచరణ = నడత
ఆర్ద్ర = తడిసిన
ఆశ = దిక్కు
ఆసరా = తోడు, సహాయం, అండ

### ఇ

ఇందుబింబం = చంద్రబింబం
ఇదుట = ఇచ్చుట

### ఈ

ఈవి = త్యాగం

### ఉ

ఉడుగు = నశించు
ఉద్దండ = గొప్ప, పొడవైన, ఎక్కువైన
ఉదాసీనత = నిర్లిప్తత
ఉద్ది = జత, జట్టు
ఉద్యమకారులు = మార్పుకోసం ప్రయత్నం చేసేవారు
ఉన్నతి = ప్రగతి
ఉపస్పర్శ = స్నాన ఆచమనాదులు
ఉపాహారము = అల్పాహారం (టిఫిన్)
ఉగ్రమావులు = ఉన్నత వంశీయులైన కళాపోషకులు

### ఎ

ఎచ్చుతచ్చులు = ఎక్కువ తక్కువలు

### ఏ

ఏకాగ్రత = మనసును ఒకే విషయం మీద నిలిపి ఉంచడం
ఏపు = అతిశయం (ఎక్కువ), వికాసం
ఏరుతార్లు = భేదాలు

### ఒ

ఒక్క పచ్చరం = ఒకే దుప్పటి (అంతా సమానమనే అర్థంలో)
ఒల్లదు = గ్రహింపదు, ఇష్టపడదు

### ఔ

ఔదల = నడినెత్తి

### క

కందెరుగని = కల్మషం తెలియని
కడగండ్లు = కష్టాలు, తిప్పలు
కమలానన = కమలమువంటి ముఖము కలది, స్త్రీ
కయ్య = కాలువ
కర్దమం = బురద, అడుసు
కల్లోలం = పెద్ద అల
కుటిలవాజి = కపటబుద్ధి కలవాడు, మోసగాడు
కుబ్జ = మరుగుజ్జు
కృపాణం = కత్తి, ఖడ్గం
కేళాకూళులు = క్రీడాసరస్సులు
కైవారము = చుట్టూరా, వంది స్తోత్రము
కొటారి = ఎత్తైన, చివరి
క్రతువు = యజ్ఞము

SCERT, TELANGANA

క్షేత్రం = స్థలము, పొలము

క్షోభ = కలత

**గ**

గంభీరం = లోతైన

గర్జాట్టహాసం = గంభీరమైన ధ్వని

గరిసె = ధాన్యం భద్రపరిచే గది

గవిన్లు = గుహలు

గీతిక = చిన్నపాట

గుడిగెలు = గుళికలు, మందుబిళ్ళలు

గుమ్ములు = ధాన్యాన్ని నిలువ ఉంచేందుకు ఉపయోగించే పెద్ద పెద్ద అల్లిక బుట్టలు

గుల్ల = ఖాళీ, చిన్న గంప

గోమయం = ఆవుపెండ

గోముఖం = అలుకుట

**చ**

చతురంతయానం = పల్లకి

చలువ జోల = చల్లని జోలపాట

చిత్తం = మనస్సు

చిత్తశుద్ధి = స్వచ్ఛమైన మనస్సు

చిరుతగండు = మగచిరుత

చీరానీకం = వస్త్రముల సముదాయం

చుట్టుకుదురు = చుట్టబట్ట

చెవువారిచ్చు = శ్రద్ధగావిను

చేముట్టి = చేతిపిడికిలి

**ఛ**

ఛత్రము = చత్రి, గొడుగు

ఛాత్రులు = విద్యార్థులు

**జ**

జలజం = తామరపువ్వు

జలధి = సముద్రము

జాబు = ఉత్తరం

జిగి = కాంతి

జోదులు = యోధులు

**డ**

డుల్లు = పడిపోవు, చిక్కుకుపోవు

**త**

తండ్లాట = బాధపడుట

తటాకం = చెరువు

తప్పెట = డప్పు

తరళ = చంచలమైన

తావు = చోటు, జాగ

తీంట్రించు = ప్రకాశించు, ప్రజ్వలించు, మెలిపెట్టు, దువ్వు

తెఱవ = స్త్రీ

తేజము = ప్రకాశం

**ద**

దంష్ట్రలు = కోరలు, కోరపండ్లు

దప్తురం = నమోదు పుస్తకం

దయిత = భార్య

దస్తురుమాలు = భుజానవేసుకొనే కండువా

దవీయసి = దూరమైనది

దానవేంద్రుడు = రాక్షసరాజు

ద్వాఃకవాటం = ద్వారబంధం, తలుపు, దర్వాజా

దిగుడు = దీపపుగూడు, చిన్నగూడు

దుర్భరం = భరింపరానిది

ధూర్వహులు = భారమును మోసేవి, ఎడ్లు

దేవనది = ఆకాశగంగ

దేవిడీ = సంపన్నులు నివసించే పెద్ద భవంతి

దోయిలి = దోసిలి

**ధ**

ధృతి = ధైర్యం

**న**

నందనవనం = ఇంద్రుని ఉద్యానవనము

న దవీయసి = దూరం కానిది

నిగమాంతము = వేదాల చివరన ఉండునది (ఉపనిషత్తు)

నిరతము = ఎల్లప్పుడు

నిరయం = దుర్గతి, నరకం

నీవారం = ఒక విధమైన వరిధాన్యం

నుసలక = ఆలస్యంచేయక, వ్యతిరేకించక

**ప**

పంచజనులు = పంచభూతముల వలన పుట్టినవారు (మనుషులు)

పక్షపాతము = ఒక పక్షము వహించుట

పణం = పందెం

పథం = తొవ్వ, మార్గం

పనుపు = నియోగించు

పరార్థులు = పరుల ప్రయోజనం కోరువారు.

పరివేష్టించి = చుట్టుకొని

పసందు = ఇష్టం

పసిడి చట్టువము = బంగారు గరిటె

పాలిపెర = గుర్తు, చిహ్నం, జాడ

SCERT, TELANGANA

ప్రాయం = వయసు
పుట్టి = ధాన్యాన్ని కొలిచే కొలత (సుమారు 8 క్వింటాళ్ళు)
పునర్నిర్మాణం = తిరిగి నిర్మించడం
పురంధ్రులు = ఇల్లాండ్రు
పూడువాము = పింజర జాతికి చెందిన పాము
పేర్మి = ప్రేమ, గౌరవం
పొట్టాపతి = ఆకలిబాధ
పోషాకులు = (పెళ్ళి) బట్టలు
పౌరాణికుడు = పురాణము తెలిసినవాడు, చెప్పువాడు

ఫ

ఫుల్లము = విచ్చుకున్నది

బ

బంకులు = ఇంటి ముందర ఎత్తుగా కట్టిన అరుగులు
బండజింకలు = గబ్బిలాలు
బండారు = పసుపు
బాకా = వాద్యవిశేషం
బుగులు = భయం
బురుజు = కోటను రక్షించే భటులు ఉండే ఎత్తైన నిర్మాణం

భ

భరణం = జీతం
భాగీరథి = గంగ
భాసిల్లు = ప్రకాశించు
భూతము = ప్రాణి

మ

మక్దూరు = నియమం
మచ్చకంటి = చేపలవంటి కన్నులు గల స్త్రీ, మీనాక్షి
మట్టసము = నిండైనది
మత్తగంధేభం = మదజల సువాసనలుగల ఏనుగు
మాధుకరము = ఇల్లిల్లు తిరిగి అన్నం సేకరించుకోవడం
మరాళము = హంస
మల్లెవడి = తిరుగబడి
మహామారి = మశూచి, అమ్మతల్లి
మహారవము = పెద్ద చప్పుడు
మానితులు = గౌరవింపబడినవారు
మాను = చెట్టు
మాణవకుడు = బాలుడు, పిల్లవాడు
మిత్తి = మృత్యువు (చావు), వడ్డీ
ముచ్చెలు = చెప్పులు
ముష్టి = పిడికిలి
మెండు = ఎక్కువ, అధికం
మెరిమెణ = ఊరేగింపు (మెరిచ్చు)
మేనా = పల్లకి (మ్యాన)
మోతెబరి = ధనిక రైతు

య

యశము = కీర్తి
యాదిజేసుకొను = గుర్తుకు తెచ్చుకొను

ర

రివాజు = సంప్రదాయం
రేగడి = బంకమన్ను
రొద = చప్పుడు
రొంపి = బురద

ల

లంఘించు = దూకు
లగెత్తు = పరుగెత్తు
లులితము = చలించునది, కదులునది
లేతీగబోడి = లేతతీగవంటి శరీరంగల స్త్రీ

వ

వక్త్రము = ముఖం
వణిక్పుంగవులు = శ్రేష్ఠులైన వ్యాపారులు
వదాన్యుడు = దాత
వనజనేత్రి = తామరపూవులవంటి కన్నులు గల స్త్రీ
వర్షం = ఏడాది, సంవత్సరం
వర్ణి = బ్రహ్మచారి
వస = వాక్కును శుద్ధిచేసే ఔషధమూలిక
వసుధ = భూమి
వాంఛితము = కోరిక
వాఃపూరము = జలప్రవాహం
వాఙ్మయం = వాక్కులతో ప్రచురమైంది, సాహిత్యం
వాజ్రేయ = వజ్రతుల్యమైన
వాత్సల్యం = పుత్రాదులయందుగల స్నేహభావం
వారి = నీళ్ళు
వార్ధి = సముద్రం
విక్రమము = పరాక్రమము
విద్వత్తు = పాండిత్యం
విద్వాంసుడు = పండితుడు

SCERT, TELANGANA

| | | |
|---|---|---|
| విప్రగృహం | = | బ్రాహ్మణుల ఇల్లు |
| విభావళి | = | కాంతుల వరుస |
| వీడు | = | పట్టణం |
| వేడు | = | ఎవడు |
| వైజయంతి | = | విజయ చిహ్నము, విష్ణువు మెడలోని దండ |
| వైభాతికము | = | ప్రాతఃకాలానికి సంబంధించింది |

**శ**

| | | |
|---|---|---|
| శక్రధనుస్సు | = | సింగిడి, ఇంద్రధనుస్సు |
| శిలోంఛ ప్రక్రములు | = | శిలాప్రక్రములు (పొలాల్లో రాలిన కంకుల – (గింజల)ను ఏరుకొని బ్రతికే వాళ్ళు) ఉంఛ ప్రక్రములు (రోళ్ళ దగ్గర చెదిరిపడ్డ బియ్యపు గింజలు ఏరుకొని జీవనం సాగించే వాళ్ళు) |
| శేరు | = | ధాన్యమాన విశేషం (సుమారు 1 1/4 కిలోలు) |
| శౌరి | = | విష్ణువు |
| శ్రావణాభ్రము | = | శ్రావణమాసపు మేఘము |
| శ్రీకరము | = | మేలు కలిగించేది |

**స**

| | | |
|---|---|---|
| సంధించుట | = | ఎక్కుపెట్టుట, కూర్చుట |
| సంబురాలు | = | వేడుకలు |
| సంయమి | = | ఇంద్రియములను జయించినవాడు |
| సంరంభం | = | వేగిరపాటు |
| సచివులు | = | మంత్రులు |
| సన్న | = | హస్తాదులచే చేసే సంజ్ఞ |
| సన్నిధానం | = | సమీపం, ఆశ్రయం |
| సరళీకృత | = | సులభతరంగా చేయబడిన |
| సవారి | = | వాహనం |
| సాళ్ళు | = | వరుసలు |
| సింపులు | = | పేలికలు (చింపులు) |
| సిత | = | తెల్లని |
| సీరపేండ్లు | = | మురికి బట్టల్లో పుట్టే క్రిములు |
| సూడిగములు | = | గాజులు, కడియములు |
| సొంపు | = | అందం |
| సౌదామని | = | మెరుపు |
| స్కంధం | = | కొమ్మ, భాగం |

**హ**

| | | |
|---|---|---|
| హాజర్ జవాబు | = | ప్రశ్నకు వెంటనే జవాబు చెప్పేవాడు |
| హర్మ్యము | = | ఎత్తైన మేడ |

SCERT, TELANGANA

## పర్యాయపదాలు

| | | |
|---|---|---|
| అండ | – | ఆసరా, తోడు |
| అపూటం | – | పూర్తిగా, సొంతం |
| ఆలయం | – | ఇల్లు, గృహం |
| ఆశ | – | ఇచ్ఛ, ఈప్స, కాంక్ష |
| ఉన్నతి | – | వికాసం, అభివృద్ధి, ప్రగతి |
| కనకం | – | బంగారం, హేమం, సువర్ణం |
| కుత్తుక | – | గొంతు, మెడ |
| కోవెల | – | గుడి, దేవళం |
| కృపాణము | – | ఖడ్గము, కత్తి |
| చిత్తము | – | మనసు, హృదయం |
| జలధి | – | వార్ధి, సముద్రము |
| జలజము | – | పద్మము, కమలం |
| తారలు | – | నక్షత్రాలు, చుక్కలు |
| తొలి | – | మొదటి, ఆది |
| త్యాగం | – | ఈవి, ఈగి |
| దిశ | – | దిక్కు, కాష్ఠ |
| దేవాలయం | – | గుడి, కోవెల |
| పానుపు | – | పరుపు, పడక |
| పురాగ | – | మొత్తం, అంతా |
| పొంకంగ | – | సొంపుగా, అందంగా |

పొలిమేర – సరిహద్దు, ఎల్ల
పోరాటం – యుద్ధం, సంగ్రామం, సమరం
ప్రశంస – పొగడ్త, స్తోత్రం
బంగారం – పసిడి, పైడి, పుత్తడి
బాట – దారి, మార్గం
భండనము – యుద్ధము, రణము
భర్త – ధవుడు, నాథుడు, పతి, మగడు
భార్య – పత్ని, అర్ధాంగి, దయిత, దార, జాయ
మిత్రుడు – స్నేహితుడు, చెలికాడు
వటువు – బ్రహ్మచారి, వడుగు, వర్ణి, ఉపనీతుడు
వర్షము – సంవత్సరము, ఏడాది
విప్రుడు – బ్రాహ్మణుడు, భూసురుడు
విషాదం – బాధ, దుఃఖం
విష్ణువు – నారాయణుడు, కేశవుడు, దామోదరుడు
వెచ్చించు – ఖర్చుచేయు, వినియోగించు
వెన్నెల – జ్యోత్స్న, కౌముది, చంద్రిక
వేదండము – ఏనుగు, కరి, గజము
సంబురం – సంతోషం, ఆనందం
సొంపు – సోయగం, అందం
సంస్కరణ – బాగుచేయడం, చెడును రూపుమాపడం
హాటకం – బంగారం, హొన్ను, కాంచనం, సువర్ణం, హేమం, కనకం

## నానార్థాలు

అంబరం = వస్త్రం, ఆకాశం
ఆశ = కోరిక, దిక్కు
కనకం = బంగారం, ఉమ్మెత్త, సంపెంగ
కవి = కవిత్వం చెప్పేవాడు, పండితుడు, శుక్రుడు, జలపక్షి, ఋషి
కులము = వంశం, జాతి, శరీరం, ఇల్లు
గురువు = ఉపాధ్యాయుడు, తండ్రి, బృహస్పతి, అన్న, రెండు మాత్రల కాలంలో ఉచ్చరించబడేది
ఘనము = మేఘము, ఏనుగు, కఠినం, గొప్పది, గట్టి
చిత్రము = అద్భుతరసం, ఆశ్చర్యం, చిత్తరువు (బొమ్మ), పదచమత్కారం
జీవనము = బ్రతుకు, నీళ్ళు, గాలి, ప్రాణం
పణం = పందెం, కూలి, వెల, ధనం
పేరు = నామధేయం, కీర్తి, అధికం, హారం
బాష్పము = కన్నీరు, ఆవిరి, ఇనుము
బుధుడు = పండితుడు, బుధగ్రహం, బుద్ధిమంతుడు
భీముడు = ధర్మరాజు తమ్ముడు, భయంకరుడు, శివుడు
మిత్రుడు = సూర్యుడు, స్నేహితుడు
రాజు = ప్రభువు, ఇంద్రుడు, చంద్రుడు, యక్షుడు
వర్షము = వాన, సంవత్సరం, దేశం
సాహిత్యము = కలయిక, వాఙ్మయం
సిరి = సంపద, లక్ష్మి
స్కంధము = కొమ్మ, ప్రకరణం, సమూహం, శరీరం
హరి = విష్ణువు, ఇంద్రుడు, గుఱ్ఱం, దొంగ, సింహం, కోతి
క్షేత్రము = చోటు, పుణ్యస్థానం, భూమి, శరీరం

SCERT TELANGANA

## వ్యుత్పత్త్యర్థాలు

| | | |
|---|---|---|
| కృపాణం | = | దయను పోగొట్టునది – కత్తి |
| గురువు | = | అజ్ఞానమనే అంధకారాన్ని తొలగించేవాడు – ఉపాధ్యాయుడు |
| జలధి | = | జలములు దీనిచే ధరింపబడును – సముద్రము |
| త్రివిక్రముడు | = | ముల్లోకములను ఆక్రమించినవాడు – విష్ణువు |
| దాశరథి | = | దశరథుని పుత్రుడు – శ్రీరాముడు |
| నగరం | = | కొండలవలే ఉండే పెద్దపెద్ద భవనములు కలది – పట్టణం |
| నీరజ భవుడు | = | (విష్ణువు నాభి) కమలమునందు పుట్టినవాడు – బ్రహ్మ |
| పారాశర్యుడు | = | పరాశరమహర్షి కుమారుడు – వ్యాసుడు |
| భవాని | = | భవుని భార్య – పార్వతి |
| భాగీరథి | = | భగీరథునిచే తీసుకొనిరాబడినది – గంగ |
| భానువు | = | ప్రకాశించువాడు – సూర్యుడు |
| భాష | = | భాషింపబడునది – మాట |
| ముని | = | మౌనంగా ఉండేవాడే – ఋషి |
| వసుధ | = | బంగారమును గర్భమందు కలది – భూమి |
| విష్ణువు | = | విశ్వమంతటా వ్యాపించి యుండువాడు – విష్ణుమూర్తి |
| హరుడు | = | ప్రళయకాలమున సర్వమును హరించువాడు – శివుడు |

## ప్రకృతి – వికృతి

| | | |
|---|---|---|
| ఆధారం | – | ఆదరువు |
| ఆజ్ఞ | – | ఆన |
| ఆశ్చర్యం | – | అచ్చెరువు |
| కథ | – | కత |
| కవిత | – | కైత |
| కార్యం | – | కర్జం |
| కావ్యం | – | కబ్బం |
| దిశ | – | దెస |
| ప్రయాణం | – | పయనం |
| భాష | – | బాస |
| మృత్యువు | – | మిత్తి |
| యోధులు | – | జోదులు |
| యజ్ఞం | – | జన్నం |
| విద్య | – | విద్దె |
| శిఖ | – | సిగ |
| శక్తి | – | సత్తి |
| సముద్రము | – | సంద్రము |
| సహజం | – | సాజం |
| స్తంభము | – | కంబము |
| హృదయం | – | ఎద |

SCERT TELANGANA

# విశేషాంశాలు

## 1. వీర తెలంగాణ

**1. కాపయనాయకుడు :** క్రీ॥శ॥1323 నుండి 1369 వరకు ఓరుగల్లు కోటను కేంద్రంగా చేసుకొని స్వాతంత్ర్యపోరాటం చేసినవాడు. మహాబలవంతుడైన ఢిల్లీ చక్రవర్తి మహమ్మద్ బిన్ తుగ్లక్ అధికారమును ధిక్కరించి స్వాతంత్ర్యోద్యమమును లేవదీసిన ఘనత కాపయప్రోలయనాయకులది.

కాపానీడు లేక కాపయనాయకుడు ముసునూరి నాయకుల వంశమునకు చెందినవాడు. కాపయ నాయకుడు తెలంగాణను మ్లేచ్ఛపాలన నుండి విముక్తి చేశాడు. కాకతీయుల తరువాత ఓరుగల్లును రాజధానిగా చేసుకొని పరిపాలించాడు. ముసునూరి యుగం చరిత్రలో సువర్ణఘట్టం.

## 2. ఎవరి భాష వాళ్ళకు వినసొంపు

**1. పలుకుబడి :** మాటతీరు. ఉచ్చారణలో ఉండే విలక్షణత. దీన్నే 'యాస' అంటారు.

**2. నుడికారం :** మాటయందలి చమత్కారం. ఏ భాష నుడికారం ఆ భాష మాట్లాడే ప్రజల సంస్కృతిలోంచి, భౌగోళిక పరిస్థితులలోంచి, ఆప్రాంత ప్రజల ఆచార వ్యవహారాలలోంచి ఉద్భవిస్తుంది.

**3. జాతీయం :** జాతివాడుకలో రూపుదిద్దుకున్న భాషా విశేషం. జాతీయంలోని పదాల అర్థాన్ని ఉన్నదున్నట్టుగా పరిశీలిస్తే వచ్చే అర్థం వేరు. ఆ పదాల పొందికతో వచ్చే అర్థంవేరు.

ఉదా: 'చేతికి ఎముకలేదు' అన్న జాతీయంలోని పదాలకు నిఘంటుపరంగా ఎముకలేని చేయంటే కేవలం కండరాలు మాత్రమే ఉండాలె. కాని ఈ జాతీయానికి 'ధారాళంగా దానమిచ్చే మనిషి' అని అర్థం వస్తుంది. ఈ విధంగా పదాలకున్న వాచ్యార్థం పోయి లక్ష్యార్థం రావడాన్నే 'జాతీయం' అంటారు.

కొట్టినపిండి, తలపండిన, వీనులవిందైన, కబంధహస్తాలు, అగస్త్యభ్రాత మొదలైనవి మరికొన్ని జాతీయాలు.

## 3. దానశీలము

**1. అష్టాదశపురాణాలు :**

| | | |
|---|---|---|
| 1) మత్స్య పురాణం | 2) మార్కండేయ పురాణం | 3) భాగవత పురాణం |
| 4) భవిష్య పురాణం | 5) బ్రహ్మ పురాణం | 6) బ్రహ్మవైవర్త పురాణం |
| 7) బ్రహ్మాండ పురాణం | 8) విష్ణు పురాణం | 9) వరాహ పురాణం |
| 10) వామన పురాణం | 11) వాయు పురాణం | 12) అగ్ని పురాణం |
| 13) నారద పురాణం | 14) పద్మ పురాణం | 15) లింగ పురాణం |
| 16) గరుడ పురాణం | 17) కూర్మ పురాణం | 18) స్కాంద పురాణం |

SCERT, TELANGANA

2. **శిబిచక్రవర్తి :** గొప్పదాత. దయాగుణంకలవాడు. ఈయన దానగుణాన్ని పరీక్షించుటకు ఇంద్రుడు, అగ్ని, డేగ, పావురాల రూపాలతో వస్తారు. పావురాన్ని డేగ నుంచి రక్షించడానికి శిబి తన శరీరభాగాన్ని కోసి ఆహారంగా ఇస్తాడు. తన శరీరాన్ని ఎంత కోసి సమర్పించినా అది పావురం బరువుతో సరితూగదు. అప్పుడు శిబి ఆర్తరక్షణ ధర్మాన్ని పాటించి తననే ఆహారంగా అర్పించుకుంటాడు. అంతటి మహాదాత అయిన శిబిని కీర్తించి ఇంద్రాగ్నులు అతనికి తేజో శరీరాన్ని ప్రసాదించి ఆశీర్వదిస్తారు.

## 4. కొత్తబాట

1. **నక్షత్రకుడు :** విశ్వామిత్రుని శిష్యుడు. హరిశ్చంద్రుని వద్ద అప్పు వసూలు చేయడానికి విశ్వామిత్రునిచే నియమింపబడ్డాడు. ఈ విషయమై హరిశ్చంద్రుణ్ణి ముప్పుతిప్పలు పెట్టాడు. ఎదుటివారి కష్టాలను పట్టించుకోకుండా పీడించేవాడి విషయంలో ఈ జాతీయాన్ని వాడుతారు. మూలంలోలేని ఈ పాత్రను తెలంగాణ కవి అయిన గౌరన తన హరిశ్చంద్రోపాఖ్యానంలో మొదటిసారి ప్రవేశపెట్టాడు. ఈ పాత్ర తెలుగునాట చాలా ఆదరణ పొందింది.

2. **వసతాగిన పిట్ట :** 'వస' ఒక మొక్క. చిన్న పిల్లలకు మాటలు చక్కగా రావడానికి కొంచెం మోతాదులో దీని రసాన్ని తాగిస్తారు. మోతాదు ఎక్కువైతే మాటలెక్కువైతాయి. ఎక్కువగా మాట్లాడేవారి గురించి ఈ పదబంధాన్ని వాడుతారు.

3. **వెన్నెల మాసం :** శరదృతువు విశేషంగా వెన్నెలను కురిపించే కాలం. ఆశ్వీయుజ, కార్తీక మాసాలు ఈ ఋతువుకు చెందినవి. ప్రత్యేకంగా కార్తీక మాసానికి వెన్నెల మాసంగా పేరుంది.

4. **ఆసుపోయు :** బట్టలు నేసేవారు వొడికిన దారాన్ని కుదురుకు చుట్టి ఆ తరువాత నేయవలసిన బట్ట పొడుగును అనుసరించి దారాలన్నీ వరుసలుగా అమర్చవలసి ఉంటుంది. అట్లా చేసేటప్పుడు ఆపని చేసేవాడు ఒక కొన నుండి మరో కొనకు తప్పక తిరుగవలసి ఉంటుంది. ఈ పనికి 'ఆసుపోయడం' అని పేరు. ఇట్లా విరామంలేకుండా తిరిగిన తోవనే మళ్ళీ మళ్ళీ తిరగడం అనే సందర్భంలో ఈ జాతీయాన్ని వాడుతారు.

5. **అలుగు :** చెరువు నిండిన తరువాత మత్తడి అవుతుంది. ఆ తరువాత ఉబికి బయటికి వచ్చే నీళ్ళు కాలువ అవుతుంది. దీనిని 'అలుగు' అంటారు. ఈ క్రమాన్నే చెరువు నిండింది, మత్తడి దూకింది, అలుగు పారుతుంది అని అంటారు. అలుగు చెరువుకట్టకు రక్షణ. ఎక్కువైన నీళ్ళు దీని గుండా బయటికి పోవడంవల్ల చెరువుకట్ట తెగకుండా రక్షింపబడుతుంది.

## 5. నగరగీతం

1. **పద్మవ్యూహం :** మహాభారతంలో ఈ మాట ఉంది. బయటకు వెళ్ళడానికి వీలులేకుండా కట్టుదిట్టంగా శత్రువును బంధించే యుద్ధ వ్యూహం ఇది. భారతంలో అభిమన్యుడు ఈ పద్మవ్యూహంలో చిక్కుకొని వీరమరణాన్ని పొందాడు. ఎవరైనా తమ శత్రువులు పన్నిన, సంక్లిష్టమైన ఉచ్చులో పడినట్లయితే "అతడు పద్మవ్యూహంలో చిక్కుకున్నాడు" అంటారు.

## 6. భాగ్యోదయం

1. **దేవదాసి :** ఆలయాలలో నృత్యం చేస్తూ ఆలయ సేవకే అంకితమయిన వాళ్ళను దేవదాసీలుగా పిలిచేవాళ్ళు. ఈ దేవదాసి వ్యవస్థ చాళుక్యకాలంనుండే ఉన్నట్లు తెలుస్తున్నది. కాలక్రమంలో దేవదాసీలు చిన్నచూపుకు గురయినారు. అనేక ఉద్యమాలు నిరసనల కారణంగా ఈ వ్యవస్థ లేకుండపోయింది.

## 10. గోలకొండ పట్టణము

1. **బురుజు :** కోటగోడయందుండు దిబ్బ. శత్రురక్షణ దృష్టితో ప్రత్యేకంగా చేపట్టిన నిర్మాణం. ఇక్కడి నుండి శత్రువుల కదలికలను గమనించవచ్చు. శత్రువులపై దాడిచేసే సందర్భంలో ఇక్కడ ఫిరంగులను పెట్టికాలుస్తారు.

SCERT, TELANGANA

2. **ఇబ్రాహీం కుతుబ్‌షా :** 1550–1580 సంవత్సరాల మధ్య గోలకొండ రాజ్యాన్ని పరిపాలించిన మాలిక్ ఇబ్రాహీం కుతుబ్‌షాహీ రాజు. జనవ్యవహారంలో 'మల్కీభరాం'గా ప్రసిద్ధుడు. పరిపాలనాదక్షుడు. తెలుగు భాష పట్ల మమకారాన్ని ప్రకటించాడు. తెలుగు కావ్యాన్ని అంకితం పొందిన తొలి ముస్లింరాజు ఇతడే. గోలకొండ రాజ్యంలో ఉద్యోగి సారంగు తమ్మయ తన తపతీ సంవరణోపాఖ్యానాన్ని ఇబ్రాహీం కుతుబ్‌షాకు అంకితం ఇచ్చాడు. ఈ రాజు 1578లో పురానా పూల్‌ను నిర్మించాడు.

3. **కులీకుతుబ్‌షా :** 1580–1612 సంవత్సరాల మధ్య గోలకొండ రాజ్యాన్ని పరిపాలించిన కులీకుతుబ్‌షా హైదరాబాద్ నగర నిర్మాత. చక్కని కవి. హైదరాబాద్ ప్రాంతానికి ప్రత్యేకమైన 'దక్కనీ ఉర్దూ'ను ప్రోత్సహించాడు. ఆ మాండలికంలో దాదాపు 1800 పుటల కవిత్వాన్ని రచించాడు. తెలుగులోనూ కవిత్వాన్ని రచించినట్లు చెబుతారు, అవి లభ్యంకాలేదు.

4. **మేనా :** పెళ్ళి ఊరేగింపు వాహనాలలో ఒకటి, ఇది పల్లకి వలెనే ఉంటుంది కానీ, పల్లకి అంత సున్నితమైనదికాదు. మోటారు వాహనాలులేని రోజుల్లో వధూవరులను ఇందులో కూర్చుండ బెట్టి మనుషులు మోసేవారు.

5. **హొన్ను :** గోలకొండ కుతుబ్‌షాహి రాజ్యంలో ప్రధానమైన నాణెం హొన్ను. ఇది బంగారు నాణెం. విదేశీయులు దీన్నే పెగోడా అనేవారు.

## 11. భిక్ష

1. **మాధుకరము :** మధుకరవృత్తి. అంటే తుమ్మెదలు పూలలోపలి తేనెను గ్రహించినట్లు గృహస్థుల ఇండ్లనుండి భిక్షను గ్రహించడం.

## 12. భూమిక

1. **హైదరాబాద్ రాజ్యం :** 1724లో అసఫ్‌జాహీ వంశీయుడైన నిజాం ఉల్‌ముల్క్ ఈ రాజ్య స్థాపకుడు. ఇతడు మొగలాయీ చక్రవర్తులకు అత్యంత విశ్వాసపాత్రుడు. హైదరాబాద్ రాజ్యాన్నే 'హైదరాబాద్ సంస్థానం' అనే పేరుతో వ్యవహరించేవారు. ఏడుగురు నిజాం వంశీయులు ఈ రాజ్యాన్ని పరిపాలించారు. రాజ్యంలో ప్రస్తుత తెలంగాణతోపాటు నేటి కర్ణాటకలోని మూడు, మహారాష్ట్రలోని ఐదు జిల్లాలు కలిసి ఉండేవి.

2. **తెలంగాణ రైతాంగపోరాటం :** వందలాది ఎకరాలు కలిగిన భూస్వాములు, వారికి అండదండలు అందించిన నిజాం ప్రభుత్వంపై రైతులు చేసిన పోరాటం ఇది. చారిత్రాత్మకమైన ఈ పోరాటం 1946–51 సంవత్సరాల మధ్య కొనసాగింది. భూమికోసం – భుక్తి కోసం – బానిసత్వ విముక్తికోసం పేదరైతులు చేసిన ఈ సాయుధ పోరాటం ఎంతో మందికి స్ఫూర్తినిచ్చింది.

3. **దేవిడి :** నిజాం పాలనా కాలంలో నిర్మించిన పెద్ద పెద్ద భవనాలను 'దేవిడీ'లు అనే పేరుతో పిలిచేవారు. ఇవి పెద్ద భవంతులు. వీటిలో సంస్థానాలకు చెందిన సంపన్నులు నివసించేవారు. హైదరాబాద్ పాతనగరంతోపాటు తెలంగాణలోని పలు పట్టణాలలోనూ పాతబడిన దేవిడీలు కనబడతాయి.

4. **పాన్‌దాన్ :** తాంబూలాన్ని వేసుకునేవారు తమలపాకులతోపాటు సున్నం, కాచు, పోకలు, ఇతర సుగంధ ద్రవ్యాలను ఒక చిన్న పెట్టెలో సర్దిపెట్టుకునేవారు. దానిని 'పాన్‌దాన్' అనే పేరుతో వ్యవహరించేవారు. ఇది ఉర్దూపదం.

5. **కోహినూర్ :** కుతుబ్‌షాహిల ఖజానాలో ఉండేది ఈ కోహినూర్ వజ్రం. ఈ వజ్రం బరువు 750 ఇంగ్లీషు కారెట్లుగా నిర్ధారించారు. కోహినూర్ వజ్రం ప్రపంచంలోని వజ్రాల చరిత్రలోనే అత్యంత విలువైనది, విశిష్టమైనది.

SCERT, TELANGANA

# విద్యార్థులు సాధించవలసిన సామర్థ్యాలు, అభ్యసన ఫలితాలు

## I. అవగాహన – ప్రతిస్పందన

- పాఠాల ద్వారా కలిగిన అనుభూతులను, అనుభవాలను స్పష్టంగా వివరించగలగాలి.
- ఏదైనా విషయాన్ని తగిన ఉదాహరణలతో సమర్థిస్తూ మాట్లాడగలగాలి. ఇతరుల భావాన్ని తన భాషలో చెప్పగలగాలి.
- పద్యాలను భావస్ఫోరకంగా చదువగలగాలి, ప్రతిపదార్థాలు రాయగలగాలి.
- వివిధ విషయాల గురించి మాట్లాడటానికి చర్చల్లో పాల్గొనగలగాలి.
- విషయం ఆధారంగా పట్టికలను పూరించగలగాలి.
- తన అనుభవాలనుండి నచ్చిన / నచ్చని అంశాల గురించి సామాజిక సమస్యలపై అభిప్రాయాలను తెలుపగలగాలి.
- ఇచ్చిన కవితాపంక్తులు / పద్యాలను చదివి అంతరార్థాన్ని రాయగలగాలి.
- వివిధ విషయాల / అంశాల మధ్య ఉన్న పోలికలను తెలుపుతూ మాట్లాడగలగాలి.
- పాఠాల్లోని ముఖ్యభాగాలను / ఇచ్చిన పంక్తులను / పదాలను గుర్తించగలగాలి.
- శీర్షికలను పెట్టగలగాలి. వివిధ ప్రక్రియల భేదం తెలుసుకొని వ్యాకరణాంశాలపై చర్చించగలగాలి.
- ఇచ్చిన అంశం ఆధారంగా ఉపన్యాసాన్ని ఇవ్వగలగాలి. ప్రసారమాధ్యమాల కార్యక్రమాల భాషను సమీక్షించగలగాలి.
- పాఠ్యాంశాలలోని కీలకాంశాలను గుర్తించి రాయగలగాలి.
- పరిచిత, అపరిచిత గద్యాలను / పద్యాలను చదివి ప్రశ్నలకు సమాధానాలను గుర్తించడం, ప్రశ్నలు తయారుచేయడం, కీలకాంశపదాలను గుర్తించడం లాంటివి చేయగలగాలి.

## II. వ్యక్తీకరణ – సృజనాత్మకత

- ఇచ్చిన అంశాన్ని సరైన కారణాలతో సమర్థిస్తూ లేదా విభేదిస్తూ రాయగలగాలి.
- పాఠ్యభాగ సారాంశాన్ని సొంతమాటల్లో రాయగలగాలి.
- కవి / రచయితల భావనలను, రచనాశైలిని, సూక్ష్మభేదాలను ప్రక్రియల మధ్య వివరించగలగాలి. విశ్లేషించగలగాలి. అభినందిస్తూ రాయగలగాలి.
- పాఠ్యాంశాలలోని పాత్రల ఆంతర్యాలను, స్వభావాలను వివరిస్తూ రాయగలగాలి.
- పాఠాల ద్వారా తాను గ్రహించిన అంశాలను వివరించగలగాలి.
- ప్రసార మాధ్యమాల్లోని విషయాన్ని విశ్లేషిస్తూ / విమర్శిస్తూ రాయగలగాలి.
- ఇచ్చిన అంశంపై, పరిసరాలపై, హస్తకళ, వాస్తుకళ, వ్యవసాయంపై తన అభిప్రాయాలను వివరిస్తూ రాయగలగాలి. సృజనాత్మక రచనలు చేయగలగాలి.
- ఆత్మకథ, వ్యాసం, లేఖ, నినాదాలు, సూక్తులు, వచనకవిత, కరపత్రం, అభినందన వ్యాసం, సంపాదకీయవ్యాసం ప్రక్రియలు రాయగలగాలి.

## III. భాషాంశాలు

- ఇచ్చిన పదాల ద్వారా సొంతవాక్యాలు రాయగలగాలి.
- పదాలకు అర్థాలు, నానార్థాలు, పర్యాయపదాలు, వ్యుత్పత్త్యర్థాలు రాయగలగాలి.
- ప్రకృతులకు వికృతులు, వికృతులకు ప్రకృతులు రాయగలగాలి.
- సంశ్లిష్ట, సంయుక్త, కర్తరి, కర్మణి, ప్రత్యక్ష, పరోక్ష వాక్యాలను రాయగలగాలి, మార్పులు చేయగలగాలి.
- వృద్ధి, త్రిక, రుగాగమ సంధులను గుర్తించి రాయగలగాలి.
- సీసం, ఆటవెలది ఛందోరీతులను గుర్తించి తెలుపగలగాలి.
- కర్మధారయ, బహువ్రీహి సమాసాలను గుర్తించి రాయగలగాలి.
- అతిశయోక్తి, స్వభావోక్తి అలంకారాలను గుర్తించగలగాలి.

## IV. ప్రాజెక్టుపనులు

- పరామర్శ (రిఫరెన్సు) పుస్తకాలు చదువడం, ఇతరుల ద్వారా సమాచారాన్ని సేకరించడం, పరిశీలనలు మొదలైనవాటి ద్వారా సేకరించిన సమాచారాన్ని నివేదిక రూపంలో ప్రదర్శించగలగాలి.

SCERT TELANGANA

# ఉపాధ్యాయులకు సూచనలు

- ఉపాధ్యాయుల పనిభారాన్ని, పనిదినాలను దృష్టిలో పెట్టుకొని ఆచరణకు వీలుగా పాఠ్యాంశాల సంఖ్యను తగ్గించి రూపొందించిన వాచకం ఇది. ఒక నెలలోని పనిదినాలను దృష్టిలో పెట్టుకొని మాసవారీగా పాఠాలను కేటాయించారు.
- **'ముందుమాట, పాఠ్యపుస్తకం ద్వారా సాధించాల్సిన సామర్థ్యా'లను** తప్పనిసరిగా చదువాలి. **'విద్యార్థులకు సూచన'లను** ముందుగా మీరు చదువండి. వాటిని మీ పిల్లలతో చదివించండి. వారికి అవి అర్థమైనాయో లేదో పరిశీలించండి.
- ఈ వాచకాన్ని 180 కాలాంశాలను దృష్టిలో పెట్టుకొని రూపొందించారు. వీటిలో 168 కాలాంశాలు పాఠ్యాంశాల బోధనకు, మిగతా కాలాంశాలను ఉపవాచకంలోని అంశాలను చర్చించడానికి వినియోగించాలి.
- సగటున ఒక్కొక్క పాఠానికి 14 కాలాంశాలు అవసరమవుతాయి.
- వీటిలో **'చదువండి - ఆలోచించండి, నేపథ్యం / ఉద్దేశం, కవిపరిచయం, విద్యార్థులకు సూచనల్లో'** ఇచ్చిన అర్థసంగ్రహణ కృత్యాలకు కలిపి రెండు కాలాంశాలను వినియోగించుకోవాలి.
- పాఠ్యాంశ విషయంపై చర్చించి అవగాహన కల్పించేందుకు పాఠంలోని విషయం నిడివిని బట్టి రెండు నుండి నాలుగు కాలాంశాల వరకు కేటాయించుకోవాలి. ఇందుకనుగుణంగా పాఠాన్ని విభజించి రోమన్ అంకెల్లో సూచించారు.
- **'ఇవిచేయండి'**లో ఇచ్చిన అభ్యాసాలకు మిగతా 7 కాలాంశాలను వినియోగించాలి, 'అవగాహన-ప్రతిస్పందన' అభ్యాసాలకు 2 కాలాంశాలు, 'వ్యక్తీకరణ-సృజనాత్మకత'కు 2 కాలాంశాలు, భాషాంశాలలో ఇచ్చిన 'పదజాలం, వ్యాకరణాంశా'లకు కలిపి 2 కాలాంశాలు, 'ప్రాజక్టుపని'ని ప్రదర్శింపజేసి చర్చించడానికి 1 కాలాంశాన్ని కేటాయించుకోవాలి.
- పాఠం ప్రారంభంలో ఇచ్చిన **'చదువండి - ఆలోచించి చెప్పండి'** అనే అంశాలు ఉన్ముఖీకరణకు సంబంధించినవి. వీటిని పూర్తి తరగతి కృత్యంగా నిర్వహించాలి.
- పాఠ్యాంశం ఉద్దేశం / నేపథ్యం, పాఠ్యభాగ వివరాలు, కవిపరిచయంలోని అంశాలను పిల్లలతో చదివించి చర్చించాలి.
- **'విద్యార్థులకు సూచనలు'**లోని అర్థ సంగ్రహణ కృత్యాలను వ్యక్తిగత కృత్యాలుగా నిర్వహించాలి. ఇందుకోసం తరగతి గదిలో తప్పనిసరిగా నిఘంటువులను అందుబాటులో ఉంచాలి.
- పాఠంలోని విషయం పట్ల పిల్లలకు అవగాహన కల్పించేటందుకు చర్చాపద్ధతి, ప్రశ్నోత్తర పద్ధతి, కథాకథనం, ప్రదర్శనా పద్ధతి, నాటకీకరణ వంటి పద్ధతులను ఆయా పాఠాల స్వభావాన్ని బట్టి ఉపయోగించాలి. పాఠం మధ్యలో **'ఆలోచించండి-చెప్పండి'** అనే పేరుతో గడిలో ప్రశ్నలున్నాయి. వీటిని పాఠం బోధించే సమయంలో అడుగాలి. ఆలోచించి జవాబులు చెప్పమనాలి.
- పాఠం బోధించడమంటే విషయాన్ని వివరించడం మాత్రమే కాదు. దాంట్లోని విలువలను, కవి హృదయాన్ని, అంతరార్థాన్ని పిల్లలు అర్థం చేసుకునేటట్లు చూడాలి. ఇందుకోసం ఆలోచింపజేసే ప్రశ్నలు అడుగాలి. పదబంధాలు, జాతీయాలు, ఆలోచనాత్మక, సందేశాత్మక వాక్యాలపట్ల చర్చద్వారా, ప్రశ్నించడం ద్వారా పిల్లలే అవగాహన పొందేటట్లు చేయాలి. పిల్లల అభిప్రాయాలను చెప్పించడం, సమకాలీన అంశాలతో అన్వయించడం, బహుకోణాల్లో విశ్లేషించడంవంటివి జరుగాలి.
- 'ఇవిచేయండి'లోని అభ్యాసాలు పిల్లల భాషా సామర్థ్యాలను పెంపొందించడానికి ఉద్దేశించినవి. వీటిని పిల్లలే సొంతంగా రాసేటట్లు చూడాలి.
- **'వ్యక్తీకరణ-సృజనాత్మకత'** అభ్యాసంలోని ప్రశ్నలు స్వీయరచన, సృజనాత్మకత, ప్రశంస సామర్థ్యాలకు సంబంధించినవి. వీటిలో లఘు సమాధాన ప్రశ్నలను పాఠం బోధించేటప్పుడే ఇంటి పనిగా ఇవ్వాలి. వ్యాసరూప సమాధాన ప్రశ్నలకు జవాబులు రాయడానికి పూర్తి తరగతి గదిలో చర్చ నిర్వహించాలి. ఆ తర్వాత వ్యక్తిగతంగా రాయించాలి. వాటిని చదివించాలి. పిల్లలు రాసిన అంశాలను భావాత్మకంగా వాక్యాలు, పదాలు, అక్షరదోషాలపరంగా సరిచేయాలి.
- సృజనాత్మకత/ప్రశంసకు సంబంధించిన ప్రశ్నలకు పిల్లలు సమాధానాలు రాయడానికి తగిన ఉదాహరణలిచ్చి అవగాహన కల్పించాలి. జట్లలో రాయుమనాలి. వీటిని ప్రదర్శింపజేసి చర్చద్వారా సరిదిద్దాలి. ఆ తరువాత వీటిని వ్యక్తిగతంగా రాయుమనాలి. ప్రాజెక్టు పనులను కూడా ఇదేవిధంగా నిర్వహించాలి.

SCERT TELANGANA

- ఉపాధ్యాయులు వార్షిక, పాఠ్య ప్రణాళికలు రూపొందించుకోవాలి.
- వార్షిక ప్రణాళికలో కింది అంశాలుంటాయి.

  1) తరగతి 2) సబ్జెక్టు (విషయం) 3) అవసరమైన కాలాంశాల సంఖ్య

  4) విద్యాసంవత్సరం పూర్తయ్యేసరికి సాధించాల్సిన సామర్థ్యాలు

  5) మాసవారీగా పాఠాల విభజన

| మాసం పేరు | బోధించే పాఠం | అవసరమైన కాలాంశాలు | అవసరమైన వనరులు / సామగ్రి | నిర్వహించాల్సిన కార్యక్రమాలు, సి.సి.ఇ. |
|---|---|---|---|---|
| | | | | |

  6) ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు 7) ప్రధానోపాధ్యాయుని సలహాలు సూచనలు

- ఒక పాఠాన్ని దృష్టిలో పెట్టుకుని పాఠ్యప్రణాళికను కింది విధంగా రూపొందించుకోవాలి.

  1) పాఠం పేరు 2) అవసరమైన కాలాంశాల సంఖ్య 3) పాఠం ద్వారా సాధించాల్సిన సామర్థ్యాలు

  4) కాలాంశాల వారీగా విభజన

| కాలాంశం సంఖ్య | బోధనాంశం | బోధన వ్యూహం | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| | | | | |

  5) ఉపాధ్యాయుడి తయారీ, అదనపు సమాచారసేకరణ 6) ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు

- ప్రతికాలాంశంలో భాషాబోధనను కింది సోపానాల ప్రకారం నిర్వహించాలి. అవి–

  **I. ఉపోద్ఘాతం** : పలకరింపు, ఉన్ముఖీకరణ, శీర్షికా ప్రకటన, ఉద్దేశం, కవిపరిచయం లేదా పలకరింపు, పునశ్చరణ.

  **II. పాఠ్యాంశబోధన చర్చ – అవగాహన** : విద్యార్థుల ప్రకాశ పఠనం, ఉపాధ్యాయుల ఆదర్శ పఠనం, మౌనపఠనం, అర్థసంగ్రహణం, పాఠ్యాంశ విషయంపై చర్చ – అవగాహన, సామర్థ్యాల సాధన.

  **III.** సామర్థ్యాల సాధన కోసం 'ఇవి చేయండి' లో అభ్యాసాలు చేయించాలి.

- పిల్లలు రాసిన సృజనాత్మక అంశాలను సంకలనం చేసి తరగతి గదిలో ప్రదర్శించాలి.
- **క్యూఆర్ కోడ్ వినియోగం** – పాఠ్యాంశాలలోని విషయాలను ప్రభావవంతంగా, అర్థం చేసుకోవడానికి, భాషాసామర్థ్యాల మీద పట్టు సాధించడానికి వీలుగా ఈ పుస్తకంలో **QR (Quick Response)** కోడ్‌లను చేర్చి బలోపేతం చేసారు. **QR** కోడ్‌లో అనుసంధానించిన విషయాలను స్మార్ట్ ఫోన్‌లో చూడవచ్చు లేదా **LCD** ప్రొజెక్టర్ / కె–యాన్ ప్రొజెక్టర్ ద్వారా తెరపై ప్రదర్శించవచ్చు. **QR** కోడ్‌లలో ఉన్న సమాచారం చాలా వరకు వీడియోలు, యానిమేషన్స్ మరియు స్లైడ్‌ల రూపంలో ఉంటుంది.
- ఈ అదనపు సమాచారాన్ని **QR** కోడ్ వినియోగం ద్వారా విద్యార్థులకు అందించి వారి భాషాసామర్థ్యాలను పెంపొందించవచ్చు.
- ప్రతి పాఠంలో రెండు **QR** కోడ్‌లు ఉంటాయి. పాఠం ప్రారంభంలోని **QR** కోడ్‌ను వీక్షించడం ద్వారా పాఠ్యాంశ విషయం పట్ల అవగాహన ఏర్పడుతుంది. అలాగే సామర్థ్యాల సాధనకనువైన సూచనలు లభిస్తాయి. రెండవ **QR** కోడ్ **'ఇవి చేయండి'** అనే శీర్షిక వద్ద ఉంటుంది. వీటిలో అదనపు ప్రశ్నలు, కృత్యపత్రాల వంటివి ఉంటాయి. వీటి ద్వారా విద్యార్థులకు అభ్యసన ఫలితాలకు అనుగుణంగా అభ్యాసం కల్పించవచ్చు. కాబట్టి ఈ **QR** కోడ్‌లను విద్యార్థులు కూడా వినియోగించేలా చేయాలి. తద్వారా ఆసక్తికరమైన ఆహ్లాదకరమైన బోధనాభ్యసన ప్రక్రియలను నిర్వహించవచ్చు.

SCERT, TELANGANA

# విద్యార్థులకు సూచనలు

విద్యార్థులూ!

- మీరందరూ ధారాళంగా చదువగలగాలి. తెలిసిన దాని గురించి సొంతంగా రాయగలగాలి. మీకు చదువడం, రాయడం రాకుంటే మీ ఉపాధ్యాయుని సాయంతో నేర్చుకోవాలి.
- మీరు నేర్చుకోవలసిన అంశాలను దృష్టిలో పెట్టుకొని మీకోసమే తెలుగుపుస్తకాన్ని రూపొందించారు. ఈ పుస్తకంలో మీరు సాధించవలసిన సామర్థ్యాల గురించి ఒక పేజీలో ఇచ్చారు. విద్యా సంవత్సరం పూర్తయ్యేసరికి వీటిని మీరు చేయగలగాలి. వాటిని చదువాలి.
- ప్రతి పాఠం మొదట్లో బొమ్మ / పేరా / సంఘటన / పద్యం... ఇలా ఏదైనా ఉంటుంది. వాటి గురించి మాట్లాడండి. ప్రశ్నలకు జవాబులు చెప్పాలి. దీనివల్ల మీకు పాఠం ఉద్దేశం, నేపథ్యం, ఇతివృత్తం గురించి అర్థమౌతుంది.
- 'విద్యార్థులకు సూచనలు' అనే గడిలోని సూచనలు చదివి, అర్థం చేసుకొని పదాల అర్థాలు తెలుసుకోవాలి.
- తరగతి గదిలో చర్చలు జరుగుతున్నప్పుడు, జట్టుపనులు నిర్వహిస్తున్నప్పుడు మీరు పాల్గొనాలి. మాట్లాడాలి. అవసరమైతే ప్రశ్నించాలి.
- పాఠం చివరలో 'ఇవి చేయండి' అనే పేరుతో అభ్యాసాలున్నాయి. వీటిని మీరు సొంతంగా చేయాలి. ప్రశ్నలకు మీరే ఆలోచించి సొంతంగా జవాబులు రాయాలి. ఎట్టి పరిస్థితుల్లో గైడ్లు, స్టడీ మెటీరియల్, ప్రశ్నల బ్యాంకులు మొదలైన వాటిలో చూసి రాయవద్దు. ఒకవేళ అట్లా రాస్తే ఫార్మేటివ్ (నిర్మాణాత్మక) మూల్యాంకనంలో మీకు మార్కులు ఇవ్వరు.
- సృజనాత్మక అంశాలను ఎట్లా రాయాలో తరగతి గదిలో మీ ఉపాధ్యాయుడిని అడిగి తెలుసుకోవాలి. మీరు తరగతి గదిలో రాసి చూపాలి. దీనిపైన చర్చ జరిగిన తరువాతనే మీ నోటు పుస్తకాలలో రాయాలి.
- పాఠంలోని ప్రాజెక్టుపనులు, సృజనాత్మకతకు సంబంధించిన ప్రశ్నలను మీరు మీ మిత్రుల సహాయంతో చేయవచ్చు. వీటిని ఎలా చేయాలో మీ ఉపాధ్యాయుడిని అడిగి తెలుసుకోండి. వీటిని చేసిన తరువాత మీరు ఎలా చేశారు? ఏం చేశారు? ఏం నేర్చుకున్నారు? మొదలైన వాటి గురించి మీరే సొంతంగా చెప్పగలగాలి.
- అభ్యాసాలను మీరే సొంతంగా చేయండి. చేయలేని వాటి గురించి మాత్రమే ఉపాధ్యాయుడిని అడిగి తెలుసుకోవాలి.
- అభ్యాసాలలో ఇచ్చిన వ్యాకరణాంశాలు మీకు అర్థంకావడానికి మొదట ఉదాహరణలు ఇచ్చారు. వాటి ఆధారంగా మీకు అర్థం అయ్యేలా సూత్రాన్ని ఇచ్చారు. కాబట్టి ఉదాహరణలను జాగ్రత్తగా పరిశీలించి వాటిని విశ్లేషించి సూత్రాన్ని తెలుసుకోవాలి.
- ఉపవాచకం పాఠాలను మీరే సొంతంగా చదువాలి. వాటి గురించి మాట్లాడాలి. చర్చించాలి. విశ్లేషించాలి.
- పాఠాలకు సంబంధించిన ఇతర పుస్తకాలను పాఠశాల గ్రంథాలయానికి పోయి అడిగి తీసుకొని చదువాలి.
- మీరు తప్పనిసరిగా నిఘంటువును ఉపయోగించుకోవడం అలవాటు చేసుకోవాలి. వార్తాపత్రికలు, మ్యాగజైన్లు, కథలపుస్తకాలు మొదలైనవి చదువడం అలవాటు చేసుకోవాలి.
- కొన్ని పాఠాలలో నాటకీకరణ చేయడం, ఏకపాత్రాభినయం చేయడం, గేయాలను రాగంతో పాడడం, అభినయం, పద్యాలను కంఠస్థం చేయడం వంటివి ఉన్నాయి. వీటిని మీరు తప్పనిసరిగా సాధన చేయాలి.
- మీరు తప్పనిసరిగా వ్యాసాలు, లేఖలు, నినాదాలు, కరపత్రం, సంభాషణ, పోస్టరు తయారీ వంటివి రాయగలగాలి. అవసరమైతే మీ ఉపాధ్యాయుడిని అడిగి తెలుసుకోవాలి. తోటివారి సహాయంతో చేయాలి.
- సృజనాత్మకతకు సంబంధించిన అంశాలను మీరు రాసిన తరువాత ఒక పుస్తకరూపంలో సంకలనం చేసి తరగతి గదిలో ప్రదర్శించాలి.

SCERT TELANGANA

# రూపకల్పనలో పాల్గొన్నవారు

**సువర్ణ వినాయక్,** కో–ఆర్డినేటర్,
ఎస్.సి.ఇ.ఆర్.టి. తెలంగాణ, హైదరాబాద్.

**పల్లి మాధవి,** భాషోపాధ్యాయిని,
భారతీయ విద్యాభవన్, ఆత్మకూరి రామారావు పాఠశాల,
జూబ్లిహిల్స్, హైదరాబాద్.

**తల్లావజ్ఝల మహేశ్‌బాబు,** ఉపన్యాసకుడు,
జిల్లా విద్యా శిక్షణ సంస్థ, నిజామాబాద్.

**నంది శ్రీనివాస్,** ఎస్.ఎ. (తెలుగు),
ప్ర.ఉ.పా., సుభాష్‌నగర్, కరీంనగర్ జిల్లా.

**వి. చెన్నయ్య,** ఎస్.ఎ. (తెలుగు),
జి.ప.ఉ.పా., జగద్గిరి నగర్, రంగారెడ్డి జిల్లా.

**అవుసుల భానుప్రకాశ్,** ఎస్.ఎ. (తెలుగు),
జి.ప.ఉ.పా., లోనికలాన్, మెదక్ జిల్లా.

**డా॥ ఆకునూరు విద్యాదేవి,** ఎస్.ఎ. (తెలుగు),
జి.ప.ఉ.పా., నారాయణగిరి, వరంగల్ జిల్లా.

**పల్లెర్ల రామమోహన రావు,** ఎస్.ఎ. (తెలుగు),
జి.ప.ఉ.పా., వేముల, మహబూబ్‌నగర్ జిల్లా.

**వొజ్జల శరత్ బాబు,** భాషోపాధ్యాయుడు,
ప్ర.ఉ.పా., సీతాఫల్‌మండి, హైదరాబాద్.

**ధూళిపాళ అచ్యుతరామయ్య,** ఎస్.ఎ. (తెలుగు),
జి.ప.ఉ.పా., మర్యాల, నల్గొండ జిల్లా.

**ఎల్.ఎం.ప్రసాద్,** భాషోపాధ్యాయుడు,
ప్ర.ఉ.పాఠశాల, హిమాయత్ నగర్,
సి.పి.ఎల్., అంబర్‌పేట, హైదరాబాద్.

**కందాడై రంగరాజు,** ఎస్.ఎ. (తెలుగు),
జి.ప.ఉ.పా., రంగాపురం, రంగారెడ్డి జిల్లా.

**మెంగవరం పవన్‌కుమార్,** ఎస్.ఎ. (తెలుగు),
జి.ప.ఉ.పా., అంబారీపేట, దోమకొండ,
నిజామాబాద్ జిల్లా.

**కొండు జనార్దన్,** ఎస్.ఎ. (తెలుగు),
జి.ప.సె.పా., మంచిర్యాల, అదిలాబాద్ జిల్లా.

---

**డి.టి.పి., లే ఔటు & డిజైనింగ్ : ప్రతిమ పాతూరి,** హైదరాబాద్.

SCERT, TELANGANA

# పాఠ్యపుస్తక సమీక్ష మరియు అభివృద్ధి కమిటీ సభ్యులు

## విశ్వవిద్యాలయ స్థాయి

**ఆచార్య రవ్వా శ్రీహరి,** పూర్వ ఉపకులపతి, ద్రవిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

**ఆచార్య ఎన్. గోపి,** పూర్వ ఉపకులపతి, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

**ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య,** విశ్రాంత ఆచార్యుడు, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్ జిల్లా.

**ఆచార్య ఎస్. వి. రామారావు,** విశ్రాంత ఆచార్యుడు, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

**ఆచార్య బన్న అయిలయ్య,** తెలుగుశాఖ, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్ జిల్లా.

**డా॥ ఎస్. రఘు,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

**డా॥ ఎన్. రజని,** తెలుగు విభాగాధిపతి, డా॥ బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

**డా॥ జి. బాలశ్రీనివాస మూర్తి,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్ జిల్లా.

## విద్యావేత్తలు, విషయనిపుణులు

**డా॥ చుక్కా రామయ్య,** విద్యావేత్త, హైదరాబాద్.

**డా॥ దహగాం సాంబమూర్తి,** విశ్రాంత ప్రధానాచార్యుడు, ఉపాధ్యాయ విద్యా కళాశాల వరంగల్.

**డా॥ నందిని సిధారెడ్డి,** విశ్రాంత ఉపన్యాసకుడు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిద్ధిపేట, మెదక్ జిల్లా.

**డా॥ నలిమెల భాస్కర్,** విశ్రాంత ఉపన్యాసకుడు, ఎస్.ఆర్.ఆర్. డిగ్రీ కళాశాల, కరీంనగర్ జిల్లా.

**డా॥ సుంకిరెడ్డి నారాయణరెడ్డి,** విశ్రాంత ప్రధానాచార్యుడు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చండూరు, నల్లగొండ జిల్లా.

**డా॥ ముదిగంటి సుజాతారెడ్డి,** విశ్రాంత అసోసియేట్ ప్రొఫెసర్, ఆర్.బి.వి.ఆర్.ఆర్. కళాశాల, హైదరాబాద్.

**వేణు సంకోజు,** విశ్రాంత ఉపన్యాసకుడు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, నల్లగొండ జిల్లా.

**సంగిశెట్టి శ్రీనివాస్,** అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జోగిపేట, మెదక్ జిల్లా.

**దేశపతి శ్రీనివాస్,** ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటి, ముఖ్యమంత్రి కార్యాలయం, హైదరాబాద్, తెలంగాణ.

**డా॥ ఎన్. ఉపేందర్ రెడ్డి,** సలహాదారు, విద్యా సంస్కరణలు, పాఠశాల విద్యాశాఖ, హైదరాబాద్, తెలంగాణ.

SCERT, TELANGANA

**కె. కృష్ణమోహన్ రావు,** ప్రొఫెసర్, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాద్, తెలంగాణ.

**దీపిక,** ఉపన్యాసకురాలు, విద్యా ప్రణాళిక విభాగం, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాద్, తెలంగాణ.

**సువర్ణ వినాయక్,** కో–ఆర్డినేటర్, విద్యా ప్రణాళిక విభాగం, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాద్, తెలంగాణ.

**కె.రాజేందర్ రెడ్డి,** కో–ఆర్డినేటర్, విద్యా ప్రణాళిక విభాగం, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాద్, తెలంగాణ.

**తల్లావజ్ఝల మహేశ్‌బాబు,** ఉపన్యాసకుడు, జిల్లా విద్యా శిక్షణ సంస్థ, నిజామాబాద్.

## క్షేత్ర స్థాయి

**పల్లెర్ల రామమోహన రావు,** ఎస్.ఎ. (తెలుగు), జి.ప.ఉ.పా., వేముల, మహబూబ్‌నగర్ జిల్లా.

**వి. చెన్నయ్య,** ఎస్.ఎ. (తెలుగు), జి.ప.ఉ.పా., జగద్గిరి నగర్, రంగారెడ్డి జిల్లా.

**వొజ్జల శరత్‌బాబు,** భాషోపాధ్యాయుడు, ప్ర.ఉ.పా., సీతాఫల్‌మండి, హైదరాబాద్.

**అవుసుల భానుప్రకాశ్,** ఎస్.ఎ. (తెలుగు), జి.ప.ఉ.పా., లోనికలాన్, మెదక్ జిల్లా.

**కందాడై రంగరాజు,** ఎస్.ఎ. (తెలుగు), జి.ప.ఉ.పాఠశాల, రంగాపురం, రంగారెడ్డి జిల్లా.

**ఎల్.ఎం.ప్రసాద్,** భాషోపాధ్యాయుడు, ప్ర.ఉ.పా., హిమాయత్‌నగర్, సి.పి.ఎల్., అంబర్‌పేట, హైదరాబాద్.

**పల్లి మాధవి,** భాషోపాధ్యాయిని, భారతీయ విద్యాభవన్, ఆత్మకూరి రామారావు పాఠశాల, జూబ్లిహిల్స్, హైదరాబాద్.

SCERT, TELANGANA

## సంపాదకమండలి


**ఆచార్య రవ్వా శ్రీహరి,**
పూర్వ ఉపకులపతి,
ద్రవిడ విశ్వవిద్యాలయం,
కుప్పం.

**ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య,**
విశ్రాంత ఆచార్యుడు,
కాకతీయ విశ్వవిద్యాలయం,
వరంగల్ జిల్లా.

**డా॥ ఎస్. రఘు,**
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ,
ఉస్మానియా విశ్వవిద్యాలయం,
హైదరాబాద్.

**డా॥ దహగాం సాంబమూర్తి,**
విశ్రాంత ప్రధానాచార్యుడు,
ఉపాధ్యాయ విద్యా కళాశాల,
వరంగల్.

**డా॥ నందిని సిధారెడ్డి,**
విశ్రాంత ఉపన్యాసకుడు,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిద్ధిపేట,
మెదక్ జిల్లా.

**దేశపతి శ్రీనివాస్,**
ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటి,
ముఖ్యమంత్రి కార్యాలయం,
హైదరాబాద్, తెలంగాణ.


SCERT, TELANGANA

## సమన్వయం, విషయనిపుణులు


**సువర్ణ వినాయక్,**
కో-ఆర్డినేటర్,
ఎస్.సి.ఇ.ఆర్.టి.,
హైదరాబాద్, తెలంగాణ.

**డా॥ నన్నూరు ఉపేందర్ రెడ్డి,**
సలహాదారు, విద్యాసంస్కరణలు,
పాఠశాల విద్యాశాఖ,
హైదరాబాద్, తెలంగాణ.

## చిత్రాలు, ముఖచిత్రం

**కూరెళ్ల శ్రీనివాస్,**
ప్రధానోపాధ్యాయుడు,
జి.ప.ఉ.పా. కుర్మేడు,
నల్లగొండ జిల్లా.

## పాఠ్యపుస్తక ప్రచురణ సమితి

**ఎస్. జగన్నాథ రెడ్డి**
సంచాలకులు,
రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ,
తెలంగాణ, హైదరాబాద్.

**కె. కృష్ణమోహన్ రావు**
ప్రొఫెసర్, విద్యాప్రణాళిక,
పాఠ్యపుస్తక విభాగం,
రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ,
తెలంగాణ, హైదరాబాద్.

**బి. సుధాకర్**
సంచాలకులు,
ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయం
తెలంగాణ, హైదరాబాద్.

SCERT, TELANGANA

క్యు.ఆర్. కోడ్
బృందం

C9Y8A6

# తెలంగాణ

కదనాన శత్రువుల కుత్తుకల నవలీల
నుత్తరించిన బలోన్మత్తులేలిన భూమి
వీరులకు కాణాచిరా ... తెలగాణ
ధీరులకు మొగసాలరా!

✤ అబల యని దేశమును కబళింప తలపడిన
పరరాజులకు స్త్రీల పటుశౌర్యమును జూపి
రాజ్యతంత్రము నడిపెరా ... తెలగాణ
రాణి రుద్రమదేవిరా!

✤ కల్పనాతీతమౌ కమనీయ శిల్పమును
వేయి కంబాలలో వెలయించి మించినది
అడుగడుగు శిల్పాలతో ... తెలగాణ
అందాలు విరజిమ్మెరా!

✤ కులవర్ణ సంకీర్ణ కలహాల నిర్జించి
బోధిసత్త్వుని ధర్మబోధనల నేర్పింది
శ్రీగిరి చైత్యమ్మురా ... తెలగాణ
చైతన్యమును చాటెరా!

✤ శ్రీవైష్ణవుల భక్తి చిందు గీతాలతో
బసవన్న శివతత్త్వ పారవశ్యములోన
ఉగ్రూతలూగిందిరా ... తెలగాణ
వెల్లువై పొంగిందిరా!

✤ కవితలో విక్రాంతి కాహళిని పూరించి
కమ్మ తెనుగున తేటకావ్యాలు విరచించె
పాల్కురికి ఆనాడెరా ... తెలగాణ
ప్రగతి బాటలు దీర్చెరా!

✤ భాషా వధూ నయన బాష్పతతి నణగింప
రాజసమ్మాన వైరాగ్యమును ప్రకటించి
కృషికుడై జీవించెరా ... తెలగాణ
'కృష్ణకవి' పోతన్నరా!

✤ భూగర్భమున నిధులు పొంగిపారెడు నదులు
శృంగార వనతతుల బంగారముల పంట
నా తల్లి తెలగాణరా... వెలలేని
నందనోద్యానమ్మురా!

**– రావెళ్ళ వేంకట రామారావు**

(కార్మిక, కర్షక, దళిత, బడుగు బలహీనవర్గాల స్థితిగతుల నెరిగిన కవి రావెళ్ళ వేంకటరామారావు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం గోకినేపల్లి గ్రామంలో 1924 జనవరి 21న జన్మించాడు. పేదలకోసం కలాన్ని పట్టుకుని నైజాంపై గళం విప్పిన ధీరుడాయన. పెద్దగా చదువుకోలేకపోయినా తల్లిదండ్రుల సాంగత్యం నుంచి అలవడిన జ్ఞానంతోనే ఆశుకవిత్వం చెప్పాడు. నిస్వార్థ జీవనానికి నిలువెత్తు అద్దం రావెళ్ళ.


SCERT, TELANGANA